
భారతి



సాహిత్య మాసపత్రిక

ఏప్రిల్ 1961

వెల ఒక రూపాయి

భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

FILE COPY

ఏప్రిల్ 1961

Abid Road,

సంపుటము 38 : : సంచిక 4

విడిపత్రిక వెల ఒక రూపాయి



దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు
వీరి 23 వ పుణ్యావర్ధంతి చైత్ర శుద్ధ ౧౨ మంగళవారం, మార్చి 28, 1961 జరిగినది.

విషయానుక్రమణిక

ఏప్రిల్ 1961

'వసుధైక గీతం'	శ్రీ బాలగంగాధర తిలక్	1
రాయలకాలపు రాజమకుటం	శ్రీ శ్రీపాద గోపాలకృష్ణమూర్తి	2
సాదృశ్యాలు	"సత్యశ్రీ"	5
చిన్నయసూరి లక్ష్యశుద్ధి	శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరి	20
నైవేద్యము	శ్రీ శంకరంబాడి సుందరాచార్య	25
న్యాయమూర్తి వేంకట సుబ్బారావు	శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి	26
అమృతమతి	శ్రీ టి. రాఘవేంద్రరావు	32
ఆర్యుల తొలి నివాసం భారత దేశమే	శ్రీ ఎస్. వి. శేషగిరిరావు	35
ముగింపు దొరికింది!	శ్రీ ఆర్. ఎం. చిదంబరం	38
అపరిష్కృతమైన యోగదర్శనము	శ్రీ ఆర్థర్ కోస్లర్	52
సమర్పణము	శ్రీ బెళ్లూరి శ్రీనివాసమూర్తి	63
ఆశ్చర్యచూడామణిలో రస మేది?	శ్రీ నీలకంఠశాస్త్రి కౌండన్య	64
అభిషేకః	శ్రీ దురిశేటి వెంకటరామాచార్యులు	70
బాలవ్యాకరణము-పుట్టుపూర్వోత్తరాలు	శ్రీ నిడదవోలు వేంకటరావు	72
కేయూరబాహుచరిత్రము	శ్రీ బులుసు వేంకటరమణయ్య	76
పావులూరి గణితము: త్రైరాశికము	శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య	81
వీరమాత	శ్రీ చిటిప్రోలు కృష్ణమూర్తి	83
అనంతుని మధురానుభూతి	శ్రీ డి. గోపాలకృష్ణ	85
కలగూరగంప		89
గ్రంథ విమర్శనము		93

మే సంచికలో

శ్రీ విక్రాల రామచంద్రాచార్యుల ప్రతిభ	శ్రీ విక్రాల శేషాచార్యులు
ముక్త్యాల పరిసరాల వీరశిలలు	శ్రీ వేటూరి శంకరశాస్త్రి
రామః సత్య పరాక్రమః	శ్రీ ఆదిభట్ల వేంకటరమణ
కన్నడ గురుజాడ కైలాసం	శ్రీ టి. రాఘవేంద్రరావు

'వసుధైక గీతం'

శ్రీ బాలగంగాధర తిలక్

భూమధ్యరేఖ నాగుండెలోంచి పోతోంది
భ్రుకుటి లోపల నక్షత్రగోళం తిరుగుతోంది
ఈ వేళ నన్నానవాలు పట్టలేవు నువ్వు
సూర్యుడిని చూడు, నా తలమీద పువ్వు!

అట్లాంటిక్ కల్లోలతరంగాల మేను వాల్చింది నేను
పసిఫిక్ లోతులలో రత్నాల్ని వెదకి తీసింది నేను
ఉత్తరధ్రువాన ఒకపాదం, దక్షిణ ధ్రువాన మరోపాదం
సర్వంసహా చక్రవర్తిపదవి సంపాదించుకున్నాను నేను!

సంకుచితమైన జాతిమతాల సరిహద్దుల్ని చెరపివేస్తున్నాను నేడు
అకుంఠితమైన మానవీయపతాక నెగురవేస్తున్నాను చూడు
చరిత్రల రక్తజలధికి స్నేహసేతువును నిర్మిస్తున్నాను రండి
కవివచస్సవితృకాంతిపూర మిది స్వేచ్ఛగా జలకమాడండి.

మధ్యధరాసముద్రతీర ఖర్జూరతరుచ్ఛాయ మధ్యాహ్న వేళ
నీ స్నిగ్ధకపోల తల్పాన ముద్దిడిన ప్రియసఖుణ్ణి నేను
మౌంట్ వెసూవియస్ ఆగ్నేయ దర్పోజ్జ్వల జ్వాల
వెలిగించి దిక్భిత్తికలు ప్రకంపింప పాడింది నేను.


అమెరికన్ పాల్ రాబ్సన్ సంగీత గీతాన జాలిగా
ఆఫ్రికా అంధకారాటవుల సింహగర్జానిర్ఘోషగా
కైలాస హిమగళము విడివచ్చు శాంతిసందేశమ్ముగా
పలికింది నేను మానవాళికి అభయహస్త మిచ్చింది నేను.

ఎంత కన్నీరు మున్నీరుగా కురిశాను మీకోసమై
ఎంత మిన్నేరు పన్నీరుగా దింపాను మీకోసమై
వర్తమానం నేడు సుందరాభిసారికవోలె నిలచి హేలగా
ఆగామికాల గంభీరస్వామికంఠాన వేయబోయే మాలగా
నిలిచింది నేను. పిలిచింది నేను. దశదిశల కలిపింది నేను.

రాయలకాలపు రాజముకుటం

శ్రీ శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

తాడిపత్రి రామలింగేశ్వరాలయము ప్రాకారములో మూడు గోపురాలున్నాయి. ఆ గోపురాలలో ఉత్తరపు గోపురము లోపైపున, ఈ కొసనీ ఆ కొసనీ నమస్కారము చేస్తూన్న విగ్రహాలు రెండు ఉన్నాయి. పటములో చూడండి. వీరి దుస్తులూ, ఉష్ణీషాలూ, నమస్కార ముద్రా చూస్తే వీరు దేవతలు కారు, గోపుర నిర్మాణానికి సంబంధించిన వ్యక్తులు అనిపిస్తుంది. ముందు వైపు వంగిన టోపీగల వ్యక్తికి అలంకారభరము లేదు. అతడు ఈ గోపురమూ, దీనికి ఎదురుగా దక్షిణము వైపున్న గోపురమూ నిర్మించిన శిల్పి. ఈతడు ధరించిన కుళ్లాయి ఆనాడు – అనగా విజయనగర సామ్రాజ్య కాలములో – శిల్పులు ధరించిన కుళ్లాయి. లేపాక్షి వర్ణచిత్రములలో వీరభద్రుని అర్చించ వచ్చిన విరుపణ్ణ వీరణ్ణలు పొడవాటి టోపీలు ధరించారు. అవి తలదగ్గరా, పైకొసనీ గుండ్రంగానే వుంటాయిగాని పైకి పోయిన కొద్దీ సన్నమౌతాయి. విరుపణ్ణ వీరణ్ణలు అచ్యుత రాయల కాలములో రౌద్రమునాటిని నాయంకరముగా పొంది పాలిస్తూండిన నాయకులు. అనగా గవర్నరులు. వారు ధరించిన కుళ్ళాయిలు నాయకులవి. సోమపాలెము చెన్నకేశవాలయద్వారము పక్కన గల చావడిలో గోడకు పెద్దినాయడూ, ఇతర నాయకులూ శిల్పించబడ్డారు. వీరి కుళ్ళాయిలూ నాయకులవే.



విజయనగర కాలపు శిల్పి


అయితే శిల్పిమాట చెపుతూ నాయకుల సంగతేల? అంటారు పాఠకులు. లేపాక్షి వర్ణచిత్రములో విరుపణ్ణ వీరణ్ణలూ వారి పుత్రులు ఇరువురూ, తరువాత విలక్షణము గల ఉష్ణీషాలు ధరించిన వ్యక్తు లిరువురూ ఉన్నారు. వీరెవరు? అని అడిగితే స్థానికులు "చిత్రకారుడూ. శిల్పి" అన్నారు. రెండోవాడి కుళ్లాయి తాడిపత్రి శిల్పి కుళ్లాయివలెనే ఉన్నది. అది వర్ణచిత్రమూ, ఇది శిలాశిల్పమూను! రెండింటిలోనూ అదే రూపముతో ఉన్నది. కనుక తాడిపత్రి గోపురము మీది వ్యక్తి కుళ్లాయి శిల్పికుళ్లాయే. అతడు శిల్పియే.

లేపాక్షిలోని వరుసలో శిల్పికి ముందు, అర్ధగోళాకారముగా చుట్టిన పాగాపైన చిన్న బొడిపివలె కుచ్చు కలిగిన కుళ్లాయి ధరించిన వ్యక్తి చిత్రకారుడట. ఆ గుడిలోనే ఇంకొకచోట శ్వేతవర్ణ భైరవుని ప్రక్క చేతులు జోడించిన వ్యక్తీ ఇలాటి కుళ్లాయే ధరించాడు. అతడు ఆ భైరవ చిత్రాన్ని రచించిన చిత్రకారుడై యుంటాడు. చిప్పగిరి చెన్నకేశవాలయ వర్ణచిత్రాలలో ఇలాటి కుళ్లాయిగల వాడే చిత్రకారుడున్నాడు. కనుక ఇతడు చిత్రకారుడే, ఇతనిది చిత్రకారుని యుష్ణీషమే.

తాడిపత్రి గోపురముమీది రెండో వ్యక్తి ఎవరు? సాళువ తిమ్మరుసు, ఆయన ధరించినది మహాప్రధాని ఉష్ణీషము. సాక్ష్యమో అంటారా? ఇదిగో మనవి


చేస్తున్నాను. దక్షిణ హిందూదేశ శాసనములు నాలుగో సంపుటములో తాడిపత్రి రామలింగేశ్వరాలయ శాసనములలో ఏడో రాయిమీదదని ఒక శాసనమున్నది. అదియిది: "స్వస్తిశ్రీ శకవరుషంబులు 1431 అగు...శుక్ర వారానను శ్రీ వీర నరసింహ్వరాయలు విజయనగరమందు పృథివీ రాజ్యం శేస్తుండగాను తత్పాద పద్మారాధకుండైన శ్రీ మన్మహా ప్రధాన సాళుళ తింమ్మయ్యంగారు తాడిపరతి రామేశ్వర దేవరకు దంఢంపెటి సమర్పించిన క్రమ మెట్లంనను నెలదలపాడు అనేటి గ్రామానకు వీర నరసింహపురమనే ప్రతినామం పెటి... ఆదేవునికి నేము భోగమంటపమునను కటించి గోపుర ప్రాకారాది నింమ్మాణమునను శేఇంపుచునను ఆదేవునికి ధారవోశి యిస్తిమి.. ఈ గ్రామం తాడిపరతి రామేశ్వర దేవునికి ఆచంద్రార్క స్థాయిగాను చెల్లగలది||" దీనినిబట్టి తాడిపత్రి రామేశ్వరదేవుని ఆలయానికి గోపురప్రాకారాదులు నిర్మాణము చేయించ నారంభించినవారు సాళువతింమ్మయ్యంగారు అనగా సాళువ తిమ్మరుసు అని తేలుతున్నది. అయితే పైవిగ్రహ మాయనదే కావలయును గదా? ఈగోపురాలు పూర్తిగా నిర్మించబడలేదు. కారణము వీరనరసింహరాయల మరణమూ కృష్ణరాయల సింహాసనారోహణమూ కావలెను.

'తాడిపత్రి కైఫీయతు'లోని కథ వేరుగా ఉన్నది. "విద్యానగరపట్నమందు ప్రౌఢదేవరాయల వారు రాజ్యభారంచేస్తూవున్న కాలమందు ఈ రాజ్యానకు పెమ్మసాని తిమ్మానాయణ్ని మొకరరుచేసి పంపించినందున ... ఆ తిమ్మానాయుడు... యాడకి అనే గ్రామమందు జాగా చేసుకొని ప్రభుత్వం చేస్తూ యాడకిలోనే కాలము అయెను. ఈయన కొమారుడు రామలింగానాయుడు ఈ తాళ్లపత్రె అనే గ్రామము ... యింకా విస్తారంగా కట్టించి...పరశురాముల వారిచేత ప్రతిష్ఠిత మయిన శ్రీ రామేశ్వరలింగము అంతర్ధానంగా వుండినందున...స్వప్నంలో నిజరూపము చూపినందున... రాయలవారికి యీ వర్తమానము వ్రాయించి పంపి రాయలవారి అజ్ఞప్రకారము...దేవాలయము యేర్పర్చి నూతనంగా కట్టించినారు. పశ్చిమము వుత్తరము గోపురాలు దక్షిణ మహాద్వారము గోపురమున్ను కట్టించినారు" అంటున్నది కైఫీయతు. కైఫీయతుకు ఆధారము జనశ్రుతియే. పెన్నానది గట్టును కోసి వేయకుండా జగతినీ రామలింగేశ్వర అలయమునూ మాత్రము రామలింగనాయడు కట్టించియుండును. రామలింగ నాయని తండ్రి కొమారుడూ ఈ ప్రాంతములోనే ఉండి నీటి వసరులూ, చింతల వెంకటేశ్వరాలయమూ కట్టించి ఉండుటచేత రామలింగేశ్వరాలయ గోపురాలు కట్టిన కీర్తికూడా వారి కుటుంబానికే ఇచ్చిఉంటారు జనసామాన్యము. నేడు రామలింగేశ్వ



కృష్ణరాయల ప్రధాని సాళ్వ తిమ్మరుసు

రాలయాని కున్నవి మూడు గోపురాలు. కైఫీయతు ఈ మూడింటినీ రామలింగ నాయడే కట్టిపించె నంటున్నది. పశ్చిమగోపుర లోద్వారముపక్కన వరాహమూ ఖడ్గమూ చంద్రవంకా సూర్యుడూ అన్న విజయనగర రాజవంశమువారి లాంఛనములు అర్ధశిల్పములుగా ఉన్నవి. దీనిమీద అచ్యుదేత దేవరాయల కాలము నాటి శాసనము కూడా ఉన్నది. కనుక ఈ గోపురము అచ్యుతరాయలు కట్టింపించి ఉండవచ్చును. తక్కినవి రెండూ అతిసుందర శిల్పశోభితములు. ప్రౌఢరాయల కాలానికి ఇంత సుందర శిల్పమెక్కడిదీ? కనుక



తిరుమలమీది కృష్ణరాయల విగ్రహం

ఈ రెండు గోపురాలూ సాళువ తిమ్మరుసే కట్టించె ననిన్నీ జనశ్రుతికంటె శాసనసాక్ష్యము బలీయమైన దనిన్నీ నమ్ముతున్నాను. కైఫీయతులో తిమ్మరుసు శాసనము సంగతి ఉన్నది. కైఫీయతు వ్రాసినవారు ఆ శాసనమును పూర్తిగా చదివి జిజ్ఞాస చెయ్యలేదు.

చుక్కలూరు చెన్నకేశవాలయము లోపలి అర్ధశిల్పాల వరుసలో నాయకులు ఉష్ణీషము తీసినారు కాని ఆయన కుమారులు ధరించినారు, శిల్పివున్నాడు శిల్పి కుళ్లాయితో!

మంత్రి, నాయకుడు, చిత్రకారుడు, శిల్పి ఉష్ణీషములతో దొరికినారు. అన్నమయ్య గాయకుడు. సాళ్వ నరసింహరాయలిచ్చిన "హొంబట్టు కుళ్లాయి" నే కాబోలు ధరించి ఆయనా ఆయన కుమారుడు పెద తిరుమలయ్యా రాగి రేకుల మీదా, తిరుమలలోని సంకీర్తన భాండార వాతాయనానికి రెండువైపులా, దర్శనమిస్తున్నారు.

అయితే రాజమకుటము మాటయేమిటి? తిరుమలలో కృష్ణరాయలు, హంపి తులాతోరణము ఉత్తరపుకంబము దిగువన కృష్ణరాయలు, చిదంబరము ఉత్తరపు గోపురములోని కృష్ణరాయలు, తిరుమలలో వెంకటపతి రాయలూ, తిరుమల రాయలూ రాజమకుటాలు ధరించారు. కృష్ణరాయల మకుటానికి రెండు నిలువు పట్టెలున్నాయి. తిరుమలలోనూ, చిదంబరంలోనూ కూడా. వెంకటపతి రాయల మకుటానికి లేవు. కృష్ణరాయలు ధరించినదే రాజమకుటము.

సాదృశ్యాలు

"సత్యశ్రీ"

వెన్నుమీద బలంగా ఎవరో చరచినట్టై ఉలిక్కి పడిలేచి కూర్చుండి పోయాను ప్రక్కమీద—

ఎందుకో శరీరం అంతా వణికిపోతూన్నట్టు వుంది. గుండెలు వేగంగా కొట్టుకుంటూన్నాయి. ఒళ్లంతా చెమటపట్టి శరీరంలోనుంచి వెచ్చటి పొగలు గ్రమ్మినట్టైంది.

అలానే మంచంమీద రెండుకాళ్ళు కూర్చుని గదిలో చుట్టూకలయ చూచాను. గదిలో ఎవరూ కనిపించ లేదు. మరేవిధమైన సవ్వడి వినిపించలేదు. గదిలో వెల్లాడే లైటు ప్రశాంతంగా వెలుగుతోంది.

ఎందుకిలా ఉలిక్కిపడి లేచాను?

ఎవరూ కనిపించరే...!

ఈ విచిత్రమైన సంఘటనకు నాలో నాకే నవ్వొచ్చింది. చంటికుర్రడిలా ఉలిక్కిపడి లేచానేమిటి...? అయితే అది సామాన్యమైన ఝుడుపులా లేదు. ఎవరో భయంకరమైన రాక్షసుడు తన యినుపహస్తాలతో చరిచి లేపినట్టైంది. శరీరంలోని సత్తువంతా పోయి ప్రాణం అతిగా నీరసించినట్టు అయింది.

మెల్లగా మంచం దిగి, బయట వరండాలో కెళ్లి చూచాను. గది బయటా ఏ వ్యక్తీ వున్నట్టు పొడచూప లేదు.

మేడక్రింది గదిలోనుంచి శాంత ప్రక్కలో పడుకున్న చంటివాడి ఏడుపు సన్నగా వినిపిస్తోన్నట్టు వినిపిస్తుంది. అమ్మ, శాంతా మేల్కొని ఏదో మాట్లాడుతూన్న శబ్దం వినిపిస్తూంది. మేడక్రింద మధ్య హాల్లో వున్న గోడ గడియారం రెండుగంటలు కొట్టిన చప్పుడు వినిపించింది.

మళ్ళీ గదిలోకి వచ్చేస్తాను.

నేను పడుకునే మంచందగ్గరున్న కిటికీలోనుంచి చూస్తే దూరంగా సముద్రం ఘోష పెడుతూ కనిపిస్తూంటుంది. ఆకాశంలోకి ఎక్కుతూన్న చంద్రుడు వెన్నెల కురిపిస్తూన్నాడు. తెల్లగా మిలమిలా పాలపొంగులా మెరిసే సముద్రం, నల్లగా మసకమసగ్గా, వంకర టింకరగా కనిపించేతీరం దానిపొడుగూనా పెరిగినకొబ్బ చెట్లు, ఏదో యింకా పిచ్చిపిచ్చిగా పెరిగిన పొదలు వింత వింత ఆకారంలో కనిపిస్తూన్నాయి. ఆ ప్రశాంత తలో ఆ వెన్నెల్లో కూడా ప్రకృతి చూట్టానికి ఏదో భయం భయంగా వుంది. కడలి తీరంలో, చెట్లనీడల్లో మసకమసక చీకట్లు పెన వేసుకుని, హోరుమనిఘోషించే సముద్రతరంగాల సవ్వడిలో కలిసి ఘోరంగా నృత్యం చేస్తున్నట్టు వుంది.

నాలో క్షణంక్రితం సంభవించిన సంఘటన తాలూకు చిహ్నాలు యింకా పోలేదు. ఆ వణుకు దశ యింకా పోలేదు. మళ్లీ నిద్రపోదా మనుకున్నా యింతలో నిద్రపట్టేలా కనిపించలేదు.

తలగడ క్రిందవున్న సిగరెట్టుటిన్ను, అగిపెట్టె తీశాను. కిటికీదగ్గరకు వచ్చి సిగరెట్టు వెలిగించ బోయాను.

కిటికిలోనుంచి గాలి ఒక్కసారిగా వీచింది. ఆ వీచడంలోనూ ఎవరో నోటితో బలంగా వూదినట్టై వెలిగించిన అగ్గిపుల్ల టప్ మని ఆరిపోయింది.

నేను తెల్లబోయాను.

హృదయం ఝల్లుమంది.

ఎందుకోశరీరంఅంతా గగుర్పాటు కలిగినట్టయింది. ఇది జరిగిన మరుక్షణంలోనే గదిలో లైటు కూడా ఎవరో స్విచ్ ఆఫ్ చేసినట్టు టక్ మని శబ్దమై ఆరి పోయింది...!

గదిఅంతా అంధకారం. కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించడంలేదు.

లైటుఎందుకారిపోయింది?ఎలా ఆరిపోయింది.... ఎవరో స్విచ్ ఆఫ్ చేసినట్టు టక్ మని శబ్దమయిందే...? ఒకవేళ కరంట్ ఆఫ్ అయితే ఆశబ్ద మెందుకొస్తుంది?

నాకేమీ అర్థం కాలేదు.

మళ్లో రెండు మూడుసార్లు అగ్గిపుల్ల గీశాను గాని వెలగలేదు. ఎన్ని పుల్లలు గీసినా వెలగలేదు.

ఎందుకో గుండెలు వేగంగా కొట్టుకోడం మొదలు పెట్టాయి. ఏదో వింతగా వున్నట్టు కనిపించింది.

ధైర్యంచేసి, చీకట్లోనే తడుముకుంటూ సోఫాలను వాటిని తప్పించుకుని వెళ్లి గోడకున్న స్విచ్ మీద చెయ్యి వెయ్యగానే షాక్ తగిలినట్టై ఉలిక్కిపడ్డాను.

స్విచ్ నిజంగానే ఆఫ్ చేసి వుంది!

యిది ఎలా సంభవించింది...గదిలో ఎవరూ కనిపించరే...?

మళ్లీ స్విచ్ ఆన్ చేశాను—

ఈసారి గదిలో లైటు వెలగడానికి బదులు, గది బయట వరండాలో వున్న లైటు వెలిగింది...!

నేను తెల్లబోయాను.

శరీరంలోనుంచి పొగలు క్రమ్మినట్టైంది. ఏదో భయం భయంగా వుంది.

స్విచ్ వెయ్యకుండానే బయట లైటు ఎలా వెలిగింది...?

నాకు అమితమైన ఆశ్చర్యం కలిగింది. ఎవరిలా చేస్తూంది? ఎవరూ కనిపించరే...?

ఆ లైటును మళ్లీ ఆఫ్ చేశాను. మళ్లీ గదిలో లైటు వెలిగింది. ఇది మాత్రం వెలగలేదు.

నాకాశ్చర్యం వేసింది. ఎవరో అదృశ్య వ్యక్తి యిలా చేస్తుండాలి. లేకపోతే ఏమిటీ చిత్రం? ఎవరైనా దొంగలా? దొంగలయితే యింత హంగామా ఎందుకు చేస్తారు? మరెవరు...?

ఎంత ఆలోచించినా ఏమీ అర్థంకాలేదు. ఉన్న ధైర్యం కాస్తా సన్నగిల్లి పోతూన్నట్టువుంది. క్రిందకు దిగి వెళ్ళిపోదామా అనిపించింది. కాని మళ్లీ ఎందుకో పిరికి పందలా, చంటి కుర్రడిలా ఝడుసుకుని దిగి వెళ్ళిపోవడం చిన్నతన మనిపించింది. ఏమయిన కానిమ్మని మళ్ళీగదిలోకి వెళ్ళాను.

నాగదిలో లైటు ప్రశాంతంగా వెలుగుతోంది. ఇందాక ఆఫ్ చేసి వున్న స్విచ్, యిప్పుడు ఆన్ చేసి వుంది. అయితే గదిలో ఏ విధమైన సవ్వడి గాని లేదు, ఏ వ్యక్తి గాని కనిపించలేదు.

నేను గదిలోకి వెళ్లిన రెండుమూడు క్షణాలకి గదితలుపులు కీచుమని శబ్దం చేస్తూ మూసుకుపోయాయి.

నేను అదిరిపడ్డాను. వెనక్కి తిరిగి వెళ్ళి ఎంత లాగినా రాలేదు తలుపులు...!

గదిలో ఏదో హోరుమనే శబ్దం బయలుదేరింది. కిటికీ రెక్కలు టపటపమని కొట్టుకోడం మొదలు పెట్టాయి. గదిలో లైటు ఆరిపోయి ఆగి ఆగి వెలగడం మొదలు పెట్టింది...!

నాగదిలో ఒకటే గోల...! చెవులు చిల్లులు పడేలా ఒకటే రొద! నక్కలు పిల్లలు కుక్కలు కలసి ఏడ్చినట్టు, దెయ్యాలు రాక్షసులు కలసి నవ్వినట్టు ఒకటే రొద!

తలుపు ఎంత లాగినా రాదే! ఇప్పుడు బయటకు పోవడం ఎలా?

నేనేదో తెలియని ఘోర విపత్తులో చిక్కన్నానా... ఏవో అదృశ్య శక్తులు నన్నిలా భయపెడుతున్నాయా? ఏవో పైశాచిక చర్యకు లోనయ్యానా? ఏదైనా కలగంటున్నానా! యిది వాస్తవంగా జరుగుతోందా?

ఏమో! ఏమీ అర్థంకాదే...!

ఇంతలోనే ఆగి ఆగి వెలిగే లైటు ఒక్కసారిగా 'టప్' మని చిట్లిపోయి శాశ్వతంగా ఆరిపోయింది. కిటికీలు మూసుకుపోయాయి. గది అంతా అంధకారం! నేనెక్కడున్నానో నాకే అర్థం కావడంలేదు.

నా చేతిలో సిగరెట్టుటిన్నూ, అగ్గిపెట్టె ఎవరో విసురుగా లాక్కున్నట్టయి మాయమయ్యాయి నా చేతిలో నుంచీ...!

కొన్ని క్షణాలకి అగ్గిపుల్లగీసిన చప్పుడై అగ్గిపుల్ల గాలిలో వెలిగి సిగరెట్టును ముట్టించింది.

సిగరెట్టుగాలిలో వెలుగుతోంది. నాకంటికి ఆ అంధకారంలో సిగరెట్టు చివరనున్న నిప్పురవ్వ తప్ప మరేమీ కనిపించడంలేదు. పొగమాత్రం గదంతా వ్యాపించిన వాసన గొడుతోంది.

నేను ఏ సహాయం కోసమైనా గట్టిగా కేక వేద్దామన్నా కేక రావడంలేదు. ఎంత ప్రయత్నించినా అది గొంతులోనే ఆగిపోతూన్నట్టు వుంది. నరాలన్నీ స్వాధీనంలో లేనట్టయింది... చైతన్య రహితంగా అలాగే తలుపుకు చేరబడి వుండిపోయాను—

ఆ గాఢాంధకారంలో రానురాను ఏదో అస్పష్టమైన ఆకారం కనిపించడం మొదలుపెట్టింది...దానిలోనుంచి ఒక బొంగురు గొంతు వినిపించింది.

"...శ్రీ...నీ...! శ్రీ నీ...!! నన్ను గుర్తుపట్టలేదు...? నా కంఠం తెలియడం లేదూ...?"

వదులు వదులుగా బిగించిన తీగ మీద కొడితే అయ్యే శబ్దంలా వుందా కంఠం...అందులో ఎప్పుడో విన్నది. పరిచయమైన కంఠస్వరం తాలూకు శబ్దాలు మిళితమైనట్టు వుంది...

ఎవరది...? నాకు సరిగా గుర్తు రాలేదు.

ఇంతలోనే ఆ ఆకారం స్పష్టమైంది.

నేను అదిరిపడ్డాను...! నోట మాటకూడా సరిగా రాలేదు.

శంతన్...!! శంతన్‌రావుది...!-వీడు అచ్చం అలానే వున్నాడు! ఏనాటి శంతన్‌రావు...? ఇది ఎలా సంభవించింది...? ఇప్పుడు నేను చూస్తున్నదీ అనుభవిస్తూంది నిజమా? కలా...?

అజానుబాహుడైన చెయ్యెత్తు విగ్రహం...బలంగా మెలికలు తిరిగిన కండలు, ముఖం నిండా స్ఫోటకపు మచ్చలతో, ప్రతీ ఒక్క మచ్చలోనూ క్రౌర్యం ఉట్టిపడేటట్టు కనిపించే గంభీరమైన ముఖం-కుడి కంటికి దగ్గరలో మొదలయి చెంప వరకు వ్యాపించినగాయం తాలూకు పొడుగాటి మచ్చ. ఎర్రగా జీరలు తేలి ఎప్పుడూ సీరియస్‌గా వుండే కళ్ళు. ఆ పెద్ద పెద్ద పాదాలు...అచ్చం శంతన్‌రావులానే వుంది ఆకారం. మూర్తీభవించినట్టుగా శంతన్‌రావే...!

అయిదేళ్ళ క్రితం వూరు వదలి పోయాడు. మళ్ళీ యిప్పటివరకూ తిరిగి రాలేదు. ఆ మధ్య చనిపోయాడని కూడా అనుకున్నారు! మరెలా వచ్చాడు? శంతన్‌రావు చనిపోయి భూతం అయి వచ్చాడా?

నేను ఆ ఆకారంవేపు స్తబ్ధుణ్ణయి చూస్తూ అలానే వుండిపోయాను.

ఆ ఆకారం మళ్ళీ మాట్లాడింది !

"మాడు శ్రీనీ...! నిన్ను చూడాలని ఎన్నాళ్ళీనుంచో అనుకుంటూన్నాను. అప్పుడు...ఆ రాత్రి! అదే నిన్ను ఆఖరిసారి చూడ్డం కదూ? నువ్వంటే నాకే మాత్రం కోపం లేదు శ్రీని...!! రా...! దగ్గరగా రా! నీకు కొడుకు పుట్టాడు కదు? ఒకసారి చూచిపోదామని వచ్చాను...!"

వాడు అట్టహాసంగా నవ్వేసరికి గుండెల్లో ఉరిమినట్టయింది. నా గదంతా మారుమ్రోగింది. రెండడుగులు ముందుకు వేశాడు.

"రా! దగ్గరగా రా శ్రీనీ! మనం కులాసాగా మాట్లాడుకుని ఎన్నాళ్ళయిందో కదూ? రా...శ్రీని! ఒక్కసారి మిత్రుణ్ణి బిగిగా కౌగలించుకోనీ శ్రీనీ...!"

అంటూ మరో రెండడుగులు ముందుకు వేసి నన్నందుకోబోయాడు. నేను తప్పించుకోడానికి ప్రయత్నించి విఫలుణ్ణయిపోయాను.

వాడు నన్ను గట్టిగా పట్టుకున్నాడు. వాడి కౌగిల్లో ఉక్కిరి బిక్కిరవుతుంది. కండరాలు మెలివేసి పిండినట్టవుతుంది. ఊపిరాడటం లేదు.

నేను చనిపోతున్నానా? ఈ రాక్షసుడు నాపీక నులిమి చంపడానికి ప్రయత్నిస్తూన్నాడా? అప్పటి పగ ఈ రూపంలో తీర్చుకుంటూన్నాడా?

సహాయంకోసం గట్టిగా కేకలు వేస్తూనే వున్నాను. అవి నా గొంతునుండి బయటకు రావడంలేదు. నోరు పెగలడం లేదు.

శంతన్‌రావు పెద్దగా నవ్వాడు.

ఆ నవ్వుకి నా గది పెద్ద శబ్దంచేస్తూ బ్రద్దలై తుత్తునియలైనట్లయింది. పెద్ద సుడిగాలి లేచి నన్ను బలంగా ఆకాశంలోకి విసరినట్లయింది! గాలిలో ఎటో ఎక్కడికో తేలిపోతూన్నట్టు వుంది.

హోరున ఘోషించే సముద్రాలు...కట్టలు తెంచుకు పొర్లి పొంగే నదులు,పర్వతాలు, కొండలు, కోనలు అన్నీ నా కాళ్ళ క్రిందుగా పరుగెత్తుతున్నాయి. కళ్ళు గిర గిరా తిరిగిపోతూన్నాయి. స్పృహ తప్పిపోతూన్నట్లు వుంది. అలానే గాలిలో స్పృహతప్పి పడిపోయాను.

కొన్ని క్షణాలకు ఎవరో నేల మీదకు విసరివేసినట్లయి కళ్ళు తెరిచాను. నేను నేల మీద వున్నాను. నా గది లేదు. అంతా కొత్త ప్రదేశం. మహారణ్య మధ్యంలో, పాడుపడిపోయిన పట్టణంలా వుంది అది.

కూలిపోయిన భవంతులు, ఎటు చూచినా పెద్ద పెద్ద కూలిపోయిన భవంతులు, గోతులుపడి శిథిలమైన రోడ్ల మీద కూలిపోయిన భవంతుల తాలూకు గోడ పిల్లలు, యిటుక ముక్కలు, పెంకు ముక్కలు, ఎండిపోయి, కాలిపోయి నేలకు వరిగిన వృక్షాలు...అంతా నిర్మానుష్యంగా వుందా ప్రదేశం!

నే నెక్కడున్నాను! నన్నెందు కిక్కడకు తీసుకొచ్చాడు? శంతన్ మళ్ళీ కనిపించడేం?

ఈ పట్టణం అంతా కూలిపోయి నాశనమైందా? వరదపాలై శిథిలమైందా? అసలి దే పట్టణమో? మహారణ్య మధ్యంలో ఎలా వెలసిందో? ఒక్క మనిషీ కనిపించడే? ఒక పిట్ట కూడా పలకదేం! చిన్న ఆకు కూడా కదలదేం?

నేను కలలో నడిచినట్టే నడుస్తూన్నాను ఆ వీధుల్లో! అక్కడక్కడ యింకా శిథిలమైన భవంతుల గోడలు యిటుకలు నేల మీద రాలుతూ శబ్దం చేస్తూనే వున్నాయి. అక్కడక్కడ భూకంపం వచ్చినట్టు భూమి చలించి, బీటలు తేలి, భవంతులు లోనికి కూలి పోతున్నాయి! పెంకులు ప్రేలి చెల్లాచెదురై ఆకాశం లోకి ఎగిరి నేల మీద పడుతూన్నాయి.

నేను జీవచ్ఛవంలా అలా నే రోడ్డుమీద నడుస్తూ న్నాను. ఏదో తెలియని శక్తి నన్ను అలా నడిపిస్తూంది. అలా ముందుకు త్రోసుకుపోతోంది!

"శ్రీనీ! యిటు-యిటు శ్రీనీ!! యిటు తిరుగు!" నా భుజంమీద ఎవరో చెయ్యివేసి ప్రక్కకి త్రిప్పిన ట్టయింది.

అటు వైపుకి నడిచాను. తిన్నగా ఒక భవంతి లోనికి నడిచాను. ఆ శిథిలమైన భవంతి పైనుంచి ఇటుకలు, పెంకులు అప్పుడప్పుడూ రాలుతూన్నాయి.

వరండాలోకి రాగానే ఎవరో చంటికుర్రాడు పడినట్టు వినిపించింది. ఊరికే గుక్క త్రిప్పుకోకుండా ఏడుపు వినిపిస్తూంది గదిలోనుంచి. గదులు ప్రతిధ్వ నిస్తూన్నాయి. ఊరికే ఒకటే ఏడుపు !

ఎక్కడ? ఎక్కడా ఏడ్చేది?

ఎక్కడా ఏమీ కనిపించదేం? ఎవరు ఆ ఏడ్చేది?

వరండాలో కొచ్చినా ఆ శబ్దం తగ్గలేదు. దానితోపాటుగా యింకా ఏవేవో వింత వింత శబ్దాలు భయంకరంగా వినిపించడం మొదలుపెట్టాయి. ఒకటే గోల. చెవులు చిల్లులు పడేలా ఒకటే రొద.

వరండాపైన వున్న మేడ మీద ఎవరో అటూ యిటూ పరుగెత్తుతున్న శబ్దం కాలి మువ్వల పట్టీలు కదలిన శబ్దం వినిపిస్తూంది. వెక్కి వెక్కి ఏడుస్తూన్న శబ్దమూ వినిపిస్తూంది.

ఎక్కడి దా శబ్దం? ఎవరా ఏడ్చేది?

ఇంతలోనే ఆ మేడ మెట్లమీదనుంచి ఒక కూజా బిందె దొర్లుకుంటూ వచ్చి వరండాలో పడ్డది. క్రింద పడగానే అది ముక్కలు ముక్కలై చెదరిపోయింది. ఎక్కడనుండో పూలతో నిండిన వెండి పూసజ్జ విసురుగా వచ్చి నా పాదాల ముందు పడ్డది. దానిలో పూలన్నీ చెల్లాచెదరయి విరజిమ్మబడ్డాయి.

నా గుండె ఝల్లుమంది. హృదయంలో ఎవరో బలంగా పొడిచినట్టయింది.

"ఎక్కడి దిది? ఇక్కడికెలా వచ్చింది? దీన్నెవరు తెచ్చారు యిక్కడకు? ఇది శాంత, పూజకు పూలు కోసుకొనేది!

దాన్ని తీసి చేత్తో పట్టుకుని త్వర త్వరగా మెట్లెక్కి మేడపైకి వచ్చాను.

పైన పొడుగాటి హాలు వుంది. కనుచూపు మేర వరకు పొడుగ్గా కనిపిస్తుందా హాలు. రెండు ప్రక్కలా శిథిలమైన గదులు వున్నాయి.

ఆ గదిలోనుంచి ఎవరో స్త్రీ ఏడుస్తూన్నట్టు వినిపిస్తుంది. వెక్కి వెక్కి ఏడుస్తున్నట్టు వినిపిస్తూంది సన్నగా ...కాలి అందెల చప్పుడు నా ముందునుంచి నడుస్తూన్నట్టు వినిపిస్తూంది......

కనుచూపు మేరలో ఎవరో స్త్రీ ఆకారం అస్పష్టంగా కనిపిస్తున్నట్టు కనిపించింది. తల విర బోసుకుని వుంది.

అలావుందే ఆమె? అస లెవ రామె?

వడి వడిగా అక్కడకు పరుగెత్తాను.

ఎవరది...?

ఉలిక్కి పడ్డాను.

శాంత...! నా శాంత!

ఇక్కడి కెందు కొచ్చింది? ఎలా వచ్చింది ఇలా వుందే...?

ఆతురతగా వెళ్ళి చెయ్యపట్టుకోబోయాను- కానీ నా చేతులకేమీ తగలలేదు. మళ్లీ అక్కడేమీ కనిపించలేదు. అంతర్ధానమైంది! ఆ అందెల మ్రోత పరుగెత్తి మరో గదిలో కెళ్ళినట్టయింది. ఆ గదిలోకి పరుగెత్తాను.

శాంత అక్కడే నిలబడి వుంది. నాకేసి చూస్తోంది. అలా చూస్తూందేం? కళ్లు అలా కళావిహీ

నంగా మారిపోయారేం? నిగనిగా మెరిసే బంగారు చెక్కిళ్లు అలా వాడిపోయే వున్నాయేం? పెదాలు అలా కంపించి పోతూన్నాయేం? కన్నీరు అలా కారుతోందేం?

శాంతను ఎవరిక్కడకు తీసుకొచ్చారు?

శంతన్‌రావు తీసుకొచ్చాడా? ఘాతుకుడనిపించాడేం? ఆతురతగా వెళ్లి శాంతను గట్టిగా పట్టుకున్నాను.

గట్టిగా, శిలలా తగిలింది !

పలుకదేం శాంత? ఇలా శిల అయిపోయిందేం? ఇది కలా? భ్రమా? వాస్తవమా? ఏమీ అర్థంకాదేం?

దాన్ని గట్టిగా వూపాను. అది గచ్చు మీద పడి పింగాణి బొమ్మ పగిలినట్టు శబ్దమై పగిలిపోయింది.

దీనితోపాటుగానే పెద్ద అట్టహాసం వినిపించింది. ఆ వరండా అంతా మారుమ్రోగింది.

శంతన్... ! శంతన్‌రావు మళ్ళీ కనిపించాడు ! మిత్రద్రోహి! వాడు నావంకే చూచి నవ్వుతూన్నాడు; నాకేసే చూసి హేళనగా నవ్వుతూన్నాడు. నా హృదయం మండిపోయింది. కోపం ముంచుకొచ్చింది. అక్కడే నా ప్రక్కనే శిథిలమై పడివున్న కిటికీ వూచ లాగి, రెండు చేతులతోనూ పట్టుకుని బలంగా వాడి మీదకు విసిరాను.

కాని వాడు అంతర్థానమయ్యాడు.

నేను ఆ విసురుకు ఆగలేక పట్టు తప్పిపోయి, ఆ మేడమీదనుంచి క్రిందకు పడ్డాను. ఆ పడటంలో నా తల ఒక బండరాతిమీద పడి తునాతునకలైంది.

ఉలిక్కిపడి లేచి కూర్చుండిపోయాను.

బాగా తేరుకున్న తరువాత చుట్టూ కలయ చూచాను.

నేను నాగదిలో మంచంమ్మీదనే వున్నాను...! అక్కడి పాడుబడ్డ పట్టణం లేదు. ఆ శిథిలమైన భవంతులూ లేవు...శంతన్ లేడు...! అంతా శూన్యం...!!

అప్పటికి బాగా తెల్లవారినట్టుంది. రంగుటద్దాల వెంటిలేటర్సులోనుంచి, రంగు రంగుల కాంతి నా గదిలో పడుతోంది.

అప్పుడే గది తలుపు త్రోసుకుని అమ్మ ప్రవేశించింది లోపలకి.

"ఏం శ్రీనివాసరావు-ఈవేళ యింతసేపు నిద్రపోయావేం...?" అంది అమ్మ నవ్వుతూ.

నేను మరికొన్ని క్షణాలకుగాని వాస్తవిక ప్రపంచంలో పడలేదు- యిప్పుడు జరిగింది కలా...? ఎంత ఘోరమైన కల...?

నాలో యింకా ఆ కల తాలూకూ దృశ్యాలు చెదరిపోలేదు. ఇంకా కళ్లకు కట్టినట్టే కనిపిస్తున్నాయి. అవే నాముందు యింక జరుగుతున్నట్టు వుంది.

నేను యింకా వెర్రిగాచూడ్డం అమ్మ కనిపెట్టినట్టుంది.

"అలా వెర్రిగా చూస్తూన్నావేం శ్రీని...! నిద్రలోకూడా ఉలిక్కిపడి లేచావు- ఏదయినా పీడకల కన్నావా...?" అంది అమ్మ దగ్గరకు వస్తూ.

పీడకల? ఎంత ఘోరమైన కల...? ఆమెకేం తెలుసు నే నిప్పుడెంత ఘోరమయిన పీడ కల గన్నానో...?

నేనేమీ మాటాడకుండా మంచం మ్మీదనుంచి దిగాను.

ముందు క్రిందకెళ్ళి శాంతను చూడాలి. శాంతను చూచేవరకు నా మనస్సెందుకో ఆందోళనగా వుంది. నా మనస్సెందుకో బాధగా వుంది.

మెట్లు దిగుతూ అన్నాను :

"శాంత కెలాగుంది? జ్వరం జారిందా?"

అమ్మకూడా నా వెనకాలే మెట్లు దిగుతూంది.

"ఏం జారడమో ! ఒక రాత్రికడ హెచ్చింది కొద్దిగా! రాత్రల్లా ఏవో కలవరింతలు ! ఊరికే ఉలిక్కిపడేది...చంటివాడయితే ఒకటే ఏడుపు—అసలు నిన్ను లేపుదామనుకున్నాను...మళ్లా నిద్రలో వుంటావని లేపలేదు." అంటూ అమ్మ మెట్లు దిగి వెళ్ళిపోయింది— నేను ఆతురతగా శాంత గదిలోకి వెళ్లాను.

శాంత యింకా పడుకున్నట్టే వుంది. పచ్చటి శరీరం రక్తహీనమై తెల్లగా పాలిపోయినట్టు కనిపిస్తూంది. చంటివాడు ప్రక్కలో తెల్లగుడ్డల్లో కలసిపోయి పిండిబొమ్మలా కనిపిస్తున్నాడు. వాడి వయస్సు ఇవ్వాల్టికి పదిహేను రోజులు మాత్రమే.

నేను వెళ్ళగానే శాంత లేచింది మంచం మ్మీదనుంచి. కళ్ళు చాలా నిస్సత్తువుగా గోచరిస్తున్నాయి. పాలిపోయిన ముఖం మీద చిరునవ్వు మొలిచింది.

"ఈవేళ యింత ప్రొద్దెక్కిందేం?" అంది శాంత పేలవంగా నవ్వుతూ. నాకెందుకో నవ్వు రాలేదు.

రాత్రి కలలో దృశ్యాలే సద్యోస్తున్నాయి శాంతను చూస్తూంటే—అస లిటువంటి పాడు కల యెందు కొచ్చింది ?

"ఎలా వుంది శాంతా ? జ్వరం జారిందా ?" అంటూ ప్రక్కలో కూర్చుని వంటిమీద చెయ్యి వేసి చూచాను. అప్పటికి జ్వరం ఏమీ లేదు.

ఏదో ఊహిస్తూ—శాంత కళ్ళల్లోకి పూరికే చూస్తూంటే తెల్లబోయింది శాంత. ఎందుకో అలా చూడా లనిపించింది నాకు.

"ఏం? అలా చూస్తున్నారే ! కొత్తగా కనిపిస్తున్నానా ఈ రోజు!" పాలిపోయిన చెక్కిళ్ళు చొట్టలు పడేలా నవ్వింది శాంత.

వెంటనే కోలుకొని దృష్టిని మరల్చాను.

"ఏమీ లేదు-ఊరికినే !" అంటూ బయటకొచ్చే శాను ముఖం కడుక్కుందుకు.

భోజనం అయిన తరువాత పది గంటలకు ఆఫీసు కెళ్ళాను. ఆఫీసులో కూడా నా మనస్సు సరిగా లేదు. కలత కలతగా వుంది. రాత్రి కలలో నేను చూచిన దృశ్యాలు మర్చిపోలేకుండా వున్నాను. పదేపదే అవే దృశ్యాలు నాకళ్ళముందు తిరిగేవి. ఏకాగితం తిరగేస్తూన్నా, ఏ ఫైలు చూస్తూన్నా అందులో శంతన్ రావు కనిపించేవాడు. అవే దృశ్యాలు......ఆ పాడుపడిన పట్టణం...శిథిలమైన భవంతులు...ఆ ఆర్తనాదాలు... ఆ పైశాచిక చర్యలు... అవే కనిపిస్తూండేవి.

అస లిటువంటి కల ఎందుకొచ్చింది ? ఈ పాడు కల అర్థమేమిటి ? అసలు శంతన్ రావు ఏమయినట్టు ? బ్రతికే వున్నాడా? లేక చని పోయాడన్న పుకారు నిజమేనా ?

ఏనాటి శంతన్ రావు—? అయిదేళ్ళక్రితం వూరు వదలిపోయిన శంతన్ రావు మళ్ళీ తిరిగి రాలేదు. ఏమయ్యాడు? ఎటుపోయాడు? అస లింతకీ వాడు వూరు వదలి ఎందుకు పోయాడు?

చిన్నప్పుడు వీధిబళ్లో అక్షరాలు దిద్దుకుంటున్న దగ్గిరనుంచి మొన్న మొన్నటివరకూ నేను వాణ్ణి బాగా ఎరుగుదును. నాతోపాటుగా కాలేజీలో చేరి ఒక సంవత్సరం మాత్రం చదివి ప్రిన్సిపాల్ తో పోట్లాట పెట్టుకుని చదువుకి తిలోదకాలు వదులుకున్నాడు.

శంతన్ రావు నిజంగా చెడ్యోత్తు మనిషి. చూట్టానికి మనిషి గంభీరంగా వుండేవాడు. ముఖంనిండా స్ఫోటకపు మచ్చ లుండేవి. ఎప్పుడూ ఏదో క్రూరంగా ఆలోచిస్తూన్నట్టు వుండేది వాడి ముఖం. వాడి పనుల్లో ఆలోచనల్లో అలా క్రూరత్వం, నీచత్వం గోచరించేది. కొందరు వ్యక్తులుపుట్టి ఉత్త పాపకార్యాలు చెయ్యడానికే జీనిస్తూన్నట్టు అనిపిస్తుంది వాణ్ని చూస్తుంటే.

కానీ నాకు వాడి విషయంలో బాగా ఆశ్చర్యం కలిగించింది, నా మనస్సును అతిగా బాధపరచింది ఒకనాటి సంఘటన: బహుశ అదే వాడు పరారీ అవడానికి కారణమైందేమోనని అనుకుంటూవుంటాను, అప్పుడప్పుడు.

ఒకనాటి శీతాకాలపు రాత్రి మేడమీద గదిలో పన్నెండుగంటలవరకూ చదువుకుంటూనే వున్నాను. అప్పటికి నేనింకా కాలేజీ వదలలేదు. కాస్త విశ్రాంతి కోసమని చదువు ఆపుచేసి గదిబయట వరండాలో అటూ యిటూ తిరగడం మొదలుపెట్టాను. అక్కడ నుంచి చూస్తే దూరంగా సముద్రం కనిపిస్తూంటుంది. బయట ప్రకృతి అంతా ప్రశాంతంగా వుంది. అర విచ్చిన బీరపువ్వులా వెన్నెల కాస్తూంది. రోడ్డుమీద చెట్లనీడల్లో తప్ప అంతటా వెన్నెల పూత పూసినట్టు వుంది. రోడ్లమీద జనసంచారం ఏమీ లేదు. ఆ ప్రదేశం వూరికి చివర అవడంవల్ల, అక్కడ ఎక్కువగా సంసారాలు చేసే యిళ్ళకన్నా ఆఫీసులు అవి వుండటంవల్ల జనసంచారం 9 గంటలకే సన్నగిల్లి పోతుంది. 10 గంటలు దాటితే సర్వసాధారణంగా ఎవరూ కనిపించరు రోడ్డు మీద. అయిదు నిమిషాలవరకూ అక్కడే అటూ యిటూ తిరిగి మళ్లీ గదిలోకొచ్చి చదువుకి ఉపక్రమించాను. పుస్తకం తెరచానో లేదో ఎక్కడనుంచో సన్నగా కెవ్వుమని స్త్రీ కంఠస్వరం వినిపించగానే ఉలిక్కిపడ్డాను. వెంటనే మరో రెండు మూడుక్షణాల్లో అదే స్వరం మళ్ళీ వినిపించింది. వెంటనే పుస్తకం మూసి మళ్లీ వరండాలోకొచ్చి నిలబడి చూచాను, మరేమయినా వినిపిస్తుందేమోనని. మళ్లీ ఆకేక వినిపించింది. పెనుగులాడుతున్నట్టు. ఇంకా ఏవో అస్పష్టంగా తడబడుతున్న మాటలు వినిపించాయి.

గుండెలు ఝల్లుమన్నాయి.

అది సమీపంలోనే ఉన్న శివాలయం ప్రాంతం నుంచి వస్తున్నట్టు వినిపిస్తోంది. మా ఘంటికి ఫర్లాంగు

దూరంవుంది శివాలయం. దానితో కలిసే ఆ ఆలయం అర్చకుడు ఉండే యిల్లుకూడా వుంది. దాని చుట్టూ పచ్చగన్నేరుచెట్లు గుబురుగా పెరిగివుండడంవల్ల అక్కడేమి జరిగేదీ కనిపించడంలేదు. కేకలుమాత్రం అక్కడ నుంచే వస్తున్నాయి.

అక్కడేదో ఏదో అఘాయిత్యం జరుగుతుంటుందని ఊహించాను. నాలోని ఉడుకురక్తం పొంగింది. ఆ శివాలయాన్ని, ఆ యింటిని తలచుకోగానే ఏదో గుర్తొచ్చినట్టయి ఇక అక్కడ ఒక క్షణంకూడా ఆలస్యం చెయ్యకుండా బీరువాలోని టార్చిలైటు తీసుకుని మేడ దిగి రోడ్డుమీద కొచ్చాను.

ఇంకా మరో నలుగుర్ని సహాయంకోసం పిలుద్దామన్నా ఇళ్ళు దూరం కావడంవల్ల వాళ్ళు లేచి వచ్చేసరికి ఆలస్యమవుతుందనే ఉద్దేశంతో మరేదయినా ప్రమాదం కలిగే పరిస్థితి కనిపిస్తే అక్కడనుంచే గట్టిగా కేకలు వెయ్యవచ్చని, ఒక్కణ్ణే అక్కడకు బయలుదేరాను.

నేను శివాలయ సమీపంలోకి చేరుకునేలోపులోనే ఒకామె కేకలేస్తూ కంగారుగా రోడ్డుకడ్డంగా పరుగెత్తుకొచ్చింది. ఆమె వెనకాలే విసురుగా వచ్చే బాణంలా ఒక వ్యక్తి పరుగెత్తుకొచ్చాడు ఆమెను పట్టుకోడాని కనుకుంటా.

నన్ను చూడగానే ఆమె భయంతో నా వెనక్కాల కొచ్చేసింది. ఆ విసురుగా వచ్చే వ్యక్తి ఉలిక్కిపడి ఆగిపోయాడు ఎటూ కదల్లేక. ఆమెను నేను వెంటనే గుర్తుపట్టాను. అయితే అతను చెట్టు నీడలో వుండటంవల్ల వెంటనే గుర్తుపట్టలేకపోయాను. వెంటనే టార్చిలైటు అతని ముఖంమ్మీదవేసి నిర్ఘాంతపోయాను—!

"శంతన్...!"

లైటు వెయ్యగానే ముఖం కనిపించకుండా దాచుకుని వెనక్కి పరుగెత్తడానికి ప్రయత్నించే వాడల్లా నా కంఠస్వరం విని, కాళ్లకు సంకెళ్లు పడ్డట్టు నిలబడిపోయాడు తలవంచుకుని. నేను అమితంగా ఆశ్చర్యపోయింది ఏమిటంటే ఆ వ్యక్తి శంతన్ అయి వుంటాడని నేను ఏనాడూ ఊహించి వుండలేదు.

శంతన్ దగ్గరగా వెళ్లాను. వాడు ఊరికేవణికిపోతున్నాడు. తల అంతా రేగి, జుట్టు ముఖంమ్మీద పడి కళ్లను, ముఖాన్ని సగంవరకు కప్పి అతివికృతంగా కనిపిస్తున్నాడు. చొక్కా అక్కడక్కడా చిరిగివుంది. ముఖంమీద, గోటితోగిల్లిన గాయాల్లో నుంచి రక్తంచిందుతూంది. కుడికంటికి దెబ్బతగలటం వల్లేమో, బాగా లావుగా వాచి, సగం మూసుకుపోయి వూరికే నీరు కారుతోంది! ముంజేతిమీద కొరికిన గాయంతాలూకు కండ పైకితేలి ఎర్రగా కనిపిస్తూంది....

ఆమెకూడా ఊరికే ఆపాదమస్తకం కంపించిపోతోంది. చేతిగాజులు చిట్లి అక్కడక్కడ చీరుకుపోయి రక్తం చిమ్ముతూన్నాయి. వూరికే ఏడవడం వల్లేమో ముఖం అంతా వాచివుంది.

శంతన్మాత్రం తల ఎత్తలేదు. భూమిలోకి వంచుకుని నిలబడిపోయాడు.

ఆక్షణంలో వాణ్ణి ఏమి చెయ్యాలో, ఏమనాలో కూడా అర్థంకాలేదు. శంతన్ ఎంత దుర్మార్గుడైనా యిటువంటి అఘాయిత్యం, మీదు మిక్కిలి మిత్రద్రోహం తలపెడతాడని కలలోకూడా అనుకోలేదు.

"ఏమిటి శంతన్...! ఏమిటీ పని...!"

వాడి తల వెంట్రుకలు పట్టి పైకిలేపి వాడి ముఖంలోకి చూస్తూ అడిగాను. కాని సమాధానం శూన్యం. తల మళ్లీ భూమిలోకి వ్రంగిపోయింది."

"ఇంత మిత్రద్రోహం...! ఇంత దారుణం...! ఆమె ఎవరో, ముందుముందు ఎవరికి సహధర్మచారిణి కాబోతుందో నీకు తెలియంది కాదు! నిలో యిటువంటి దుర్మార్గం వుందని కల్లోకూడా అనుకోలేదు!"

నేను ఎన్ని అన్నా వాడు సమాధానం చెప్పేలా లేడు. ఆస్థితి మించిపోయింది. కోపం, అభిమానం, అవమానం మిళితమై వాడిముఖంలో నుంచి ఒక్కుమ్మడిగా వెదజిమ్ముతున్నాయి. "ఈ సమయంలో నాకు అడ్డుపడింది నువ్వు కాబట్టి బ్రతికి పోయావు...!" అన్నట్టు వున్నాయి వాడిచూపులు.

అయితే ఆ సమయంలో నలుగుర్నీ లేపి వాడి పరువు తీసి నానా చీవాట్లుపెట్టి రచ్చ కీడ్చించడం నా కిష్టంలేదు. మరోనాలుగు చీవాట్లుపెట్టి యిటువంటి దారుణాలు మరెప్పుడూ తలపెట్టకని చెప్పి మర్యాదగా యింటికెళ్లి పొమ్మన్నాను.

వా డేమనుకున్నాడో ఏమో వంచిన తల ఎత్తకుండానే గిరుక్కున తిరిగి చరచరా వెళ్ళిపోయాడు. వెళ్ళిపోయేటప్పుడుమాత్రం దెబ్బతిని పగపట్టినపాములా మాత్రం ఒకసారి చూచి వెళ్ళిపోయాడు.

వాడు నావిషయంలో యిలా ప్రవర్తించడం యిదే మొదటిసారి! వాడిలో యిటువంటి వుద్దేశ్యం, పశుత్వం ఎందుకు ఉద్భవించాయో నా కర్థంకాలేదు. అప్పుడు అర్థమయింది నేను కాక మరెవరయినా అయి వుంటే పీకనులిమి దారుణంగా హత్యచేసేవాడేమో కూడా!

ఆమె మాత్రం యింకా వణుకుతునేవుంది. ఆ ఆందోళన యింకా పూర్తిగా తగ్గలేదు. చేతుల్లో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తునే వుంది.

ఆమెను వూరడించి ధైర్యం చెప్పాను.

ఆమె ద్వారా ఇతర వివరాలు తెలుసుకుంటే తేలిన వివరాలు ఏమిటంటే, యింట్లో వుంది ఆమె. మరో చిన్నపిల్ల తప్ప ఎవరూ లేరని. ఆమె తండ్రి పొరుగూరుకు వెళ్ళాడని నాకు యిదివరకే తెలుసు. అతను వెళ్ళేటప్పుడు కూడా నాతో చెప్పి వెళ్ళాడు. అయితే తల్లి లేకుండా పిల్లల్ని ఒక్కళ్ళనే యింట్లో వదలి వెళ్ళాల్సిన అవసరము ఏం కలిగిందో నాకర్థం కాలేదు.

"మరి మీ అమ్మగారు కూడా వెళ్ళారా మీ నాన్నతో?" అన్నాను.

"లేదు, యివాళ మధ్యాహ్నమే బాబాయి వచ్చాడు, పిన్నికి మరీ ఎక్కువగా వుందంటూ తీసుకెళ్ళాడు. అమ్మ మళ్ళీ రాత్రికే వస్తానంటూ వెళ్ళింది ...యింతవరకూ రాలేదు.

నేను విషయం గ్రహించాను.

"పోనీ మీరు ఒంటరిగా పడుకోపోతే మా యింటి కెందుకు రాలేదు...కనీసం ఈ విషయం నాకు తెలిసినా తోడుగా ఎవరినైనా పంపేవాణ్ని!"

ఆమె ఏమీ మాట్లాడలేదు. ఆమెను యింకా ఏ విధమైన ప్రశ్నలు వేసి బాధపెట్టదలచలేదు. వెంటనే వాళ్ళ యింటికెళ్ళి నిద్రపోతూన్న చంటిపిల్లను లేపకుని భుజంమ్మీద వేసుకుని యింటికి తీసుకొచ్చాను యిద్దర్నీ.

అమ్మను లేపి విషయాన్ని కొంచం మార్చి చెప్పాను. ఎవరో దొంగలు మెడలో హారం తెంపడానికి ప్రయత్నించారని కేకలు వినిపిస్తే నేను వెళ్ళి విడిపించానని, వాళ్ళు కనిపించకుండా పారిపోయారని కల్పించి చెప్పాను...ఇప్పుడు జరిగిన సంఘటన గాని, అందులో వ్యక్తిని గాని ఏ పరిస్థితులలోనూ బయటపెట్టవద్దని ఆమెదగ్గర వాగ్దానం తీసుకున్నాను...!

అమ్మ చాలా నొచ్చుకుంది. వాళ్లెవళ్లో దొరికినట్టయితే ఉరి తీయుద్దునంది. ఒంటరిగా వదలి వెళ్లినందుకు వాళ్ల అమ్మను నిందించింది. వాళ్లను అమ్మ తన గదిలోకి తీసుకుపోయి పడుకోబెట్టింది. నేను మేడ మీదకు వచ్చేశాను—

అంతే! అదే కనిపించడం శంతన్‌రావు. అప్పటి నుండి ఇప్పటివరకు వాడు మళ్లీ ఈ పరిసరాలలోనే కనిపించలేదు.

ఎందుకు వెళ్ళిపోయాడు శంతన్. వాడి అభిమానం దెబ్బతిన్నదా? తిరిగి నాకు, శాంతకు ముఖం చూపించడానికి బిడియపడ్డాడా? వాడిలో వున్న రాక్షసతత్వంరేగి వాణ్ని అలాబుద్ధిహీనంగా ప్రవర్తింప చేసిందా? ఆమె నాకు కాబోయే సహధర్మచారిణి అని తెలిసికూడా, ఎందు కంత సాహసం చెయ్యబోయాడు?

ఏమో—ఏది ఎట్లాగున్నా ఆమెమాత్రం శాశ్వతంగా మా యింట్లోనే ఉండిపోయింది ... ఆమె శాంత.

అయితే శంతన్ ఏమయినట్లు...?

బ్రతికివున్నాడా? చనిపోయాడా...అస లెక్కడకుపోయాడో?

రాత్రి కలలో మళ్లీ శంతన్‌రావును చూడగానే నాలో గత స్మృతులు ఊరికే తిరగనారంభించాయి. వాడినుంచి మనస్సు ఎంత మళ్లిద్దామన్నా అలా చెయ్యలేకపోతున్నాను. అవే దృశ్యాలు ... ఆ పాడుబడ్డ పట్టణం! ఆభవంతులు...అందులో శాంత! ఎంత మర్చిపోదామన్నా సాధ్యంకాకుండావుంది. ఏదో బలవత్తరమైన శక్తి అటువైపుకే నన్ను త్రిప్పుకుంటూంది. పదే పదే గుర్తుకు తెస్తూ నా గుండెను పిండివేస్తుంది.

శంతన్ చనిపోయి నిజంగా భూతం అయ్యాడా? ఇది తలచుకోగానే నా వళ్ళు ఝల్లుమనేది. ఏదో ఊహించరాని ఆలోచనలు నా దృష్టిపథంలో తిరిగేవి. ప్రతీ ఊహాలో ఏదో అపశకునం గోచరించేది.

ఏకాంతంగా కూర్చుంటే ఇటువంటి ఆలోచనలే లేసుతుంటాయి. అందుకని ఎవరయినా మిత్రులతో కాలక్షేప తప్పం మరేమీ మార్గం కనిపించలేదు...

మధ్యదారిలో వకీలు మణి శేఖరం కనిపించాడు. వాడితోపాటుగా శర్మ కూడా ఉన్నాడు—

"ఏం శ్రీనీ! ఎక్కడికో బయలుదేరావు!" అన్నాడు మణి.

"అదే ఆలోచిస్తున్నాను!"

"దానికి ఆలోచనేమిటి యింత పట్టణంవుంది.!" అంటూ నవ్వాడు శర్మ.

"అలా సముద్రం కేసిపోదాం." అన్నాను నేను. ఇద్దరూ నవ్వారు.

"పాడు సముద్రం—అక్కడేముందని హోరు మంటూ రొద తప్ప మన క్లబ్బులో ఈవేళ మంచి ప్రోగ్రాం వుంది. ప్రొఫెసర్ నారాయణగారి మ్యాజిక్ ప్రోగ్రాం...! అక్కడకు పోదాం పద...!"

ఎక్కడో అక్కడ నాకు కాలక్షేపం, కాలం గడవడం ముఖ్యం. అందుకని వాళ్ళు చెప్పినదానికేమీ అడ్డుచెప్పలేదు. ప్రొఫెసర్ నారాయణగారి మ్యాజిక్ ప్రోగ్రాం నాకేమీ కొత్తకాదు. ఒకసారి చదివేసిన చెత్త పుస్తకాన్ని విధిలేక మళ్ళీ చదువుతున్నట్టు వుంటుంది ఆయన ప్రోగ్రాం చూస్తూంటే.

క్లబ్బులో ఒక పెద్దహాల్లో మ్యాజిక్ ప్రదర్శనం జరుగుతోంది. వీడో పేకముక్కలగారడీ, టోపీలో నుంచి పావురాళ్ళను తీయడం, కళ్ళకు గంతలుకట్టుకుని బోర్డుమీద వేసిన అంకెలు కూడి లెక్క చెయ్యడం...యిలా ఏవేవో జరుగుతున్నాయి. ఆయనచేసిన వేచేస్తూన్నా ఎప్పుడూ చూచేవాళ్ళే విరగబడి చప్పట్లు కొడుతూన్నారు. కొందరుమాత్రం గదులలో పింగ్‌పాంగ్, చెస్, పేకలో పడిపోయారు. ఆరుబయట పెద్దపెద్దలైట్లు అమర్చిన కోర్టులో టెన్నిస్ ఆడుతున్నారు కొందరు. రేడియోగ్రాంచుట్టూ సోఫాలలో పడుకుని తియ్యని సంగీతంవింటూ సిగరెట్లు తగలేస్తున్నారు కొందరు— యివేవీ పట్టించుకోకుండా కాంటీన్‌లో ఆమ్లెట్లు మెక్కుతున్నారు కొందరు.

"—వాట్...! మిస్టర్ శ్రీనివాసరావు! నీకు పుత్రోదయ మయిందటగా!" చెప్పావుకావు—కంగ్రాట్యులేషన్సు...! పార్టీ ఎప్పుడు...?"

అనుకోకుండా అయిన ఈ 'శబ్దా'నికి నేను కంగారుపడ్డాను. ఎదురుగా చూస్తే, మిస్. సౌదామిని నిలబడివుంది నవ్వుతూ! బొద్దుగా బలిసిన చేతివేళ్ళకు హేండ్‌బాగ్ బెల్టును వయ్యారంగా చుట్టుకుంటూంది.

అంతమందిలోనూ అట్టహాసంగా అడిగినందుకు నేను సిగ్గుపడ్డాను. అప్పుడే కొందరు చేతిరుమాళ్ళు నోటికి అడ్డుపెట్టుకున్నారు.

ఆవిడ కాలేజీలో ట్యూటర్ చేస్తూంది. ఆడవాళ్ళతోకంటే మగవాళ్ళతోటే ఎక్కువ చనువుగా వుంటుంది. ఎంచేతనో ముప్పయిఏళ్ళు వచ్చినా పెళ్లి చేసుకోలేదు. తెల్లగా, బొద్దుగా అరటిదువ్వలా క్రిందికి మీదకి ఒకేపరిమాణంలో వుంటుంది.

వెంటనే ఏం సమాధానం చెప్పాలో తెలీక నవ్వి ఊరుకున్నాను. ఇంతలోనే పింగ్‌పాంగ్ ఆడే గదిలో నుంచి రఘు బయటపడ్డాడు. నన్ను చూచి ఆమె అడిగిన ప్రశ్న ఎక్కడనుంచి విన్నాడో ఏమో,

"పుత్రోదయం మయింది వాడికికాదు మేడం! వాడిసతీమణికి" అంటూ చిన్న 'జోక్' విసరాడు రఘు,

ఆమె ముఖం వెల వెలాపోయింది.

"ఏమో. మీరు డాక్టర్లు కాబట్టి మీకావిషయం బాగా తెలుస్తుంది! మాకేం తెలుసు లెండి!" అంటూ గమ్మత్తుగా నవ్వి, చేతిలో నాజూగ్గా పట్టుకున్న ఉల్లి పొరలాంటి రుమాలుతో ముఖంమీద పట్టిన చెమటను అద్దుకుంటూ అక్కడనుంచి చరచరా నడచి వెళ్ళిపోయింది ఆమె.

రఘు నవ్వాడు ఆమె వెళుతూన్నవైపుకే చూస్తూ.

రఘు నాకున్న మిత్రుల్లోకల్లా అతి సన్నిహితుడు, ముఖ్యుడు, పెద్ద డాక్టరు, పట్టాపుచ్చుకుని స్వంతంగా వైద్యం నిర్వహిస్తున్నాడు.

ఆమె క్లబ్బుదాటి వెళ్ళినతరువాత అన్నాడు రఘు.

"పిల్లలంటే అంత మోజుగా వున్నప్పుడు నిక్షేపంలా పెళ్లి చేసుకోగూడదూ? ఇంటినిండా కావల్సినంతమంది పిల్లలు పారాడుతుంటారు!"

"పోనీ నువ్వాపుణ్యం ఎందుకు కట్టుకోగూడదు. మీ రిద్దరూ జంటగా తగవులాడుకోవచ్చు ఎప్పుడూ?" అన్నాను నవ్వుతూ.

వాడు అట్టహాసంగా మాత్రం నవ్వి, మౌనంగా లెంపలు వేసుకుని, నా భుజంమీద చెయ్యివేసి అలా కేంటిన్‌హాలు వైపుకి తీసుకెళ్ళాడు.

కేంటిన్‌లో టేబుల్‌కి ఎదురుగా కూర్చున్నాం యిద్దరం. వాడు వేటికో ఆర్డరు యిచ్చాడు.

"మా శాంత కెలావుంది! బహుశ ఈపాటికి జ్వరం జారే వుంటుంది. నువ్వు ఆఫీసు కెళ్ళినప్పుడు యింటికొచ్చి చూచి యింజక్షను యిచ్చాను...మరేం ప్రమాదం లేదు !"

నేనేమీ మాట్లాడలేదు. శాంతమాట ఎత్తగానే ఎందుకో నా ఒళ్లు అప్రయత్నంగా ఝల్లుమంది. గుండె దడదడలాడింది. రాత్రి కలే గుర్తొచ్చింది. దాన్ని గురించి రఘుతో సంప్రతించాలనుకున్నాను. కానీ మళ్లీ అనవసరం అనిపించింది.

శాంత అన్నా, నేనన్నా అమితమైన అభిమానం, ప్రేమా వాడికి. కేంటిన్‌లో పని అవగానే గార్డెన్‌లోకి వెళ్లాము.

అక్కడ ఓ మూల సన్నజాజి పందిరిక్రింద కుర్చీలు, టేబులు వేసుకుని ప్రొఫెసర్ రాజశేఖరంగారు, రిటైర్డు తహసిల్‌దారు రమణమూర్తి, కాలేజీలో తెలుగు పండితులు అవధానిగారు, మొదలయినవాళ్లంతా పేకాటలోపడ్డారు. సన్నజాజి పందిరిలో అమర్చిన లైటు పున్నమిచంద్రుడిలా వెలుగుతోంది. చల్లని వెలుగు వాళ్లమీద చిమ్ముతోంది. వాళ్లకు ప్రక్కనే వేరే కుర్చీలో పోలీసు యినస్పెక్టరు రావుగారు కూర్చుని ఏదో డిటెక్టివులకి సంబంధించిన జర్నల్ తిరగేస్తూ మునిగివున్నాడు!

మేమిద్దరం అక్కడకు వెళ్లగానే ఆప్యాయంగా ఆహ్వానించారు అంతా. నన్ను కూడా ఒక చెయ్యి కలపమన్నారు రాజశేఖరంగారు. నాకు ఆటరాదు కొబట్టి నాబదులు తనే ఆడుతానన్నాడు రఘు.

వాళ్లు ఆటలోపడ్డారు, నేను, పోలీసు యినస్పెక్టరు రావుగారు కబుర్లలో పడ్డాము వాళ్లకి దూరంగా కూర్చుని.

సన్నజాజి పందిరిమీద నుంచి కమ్మని వాసన హాయి గొలుపుతోంది. రేడియోగ్రామ్‌నుంచి సన్నగా సంగీతం వినిపిస్తూంది. కేంటిన్‌లో వేస్తూన్న ఆమ్లెట్లు, కేకులతాలూకు వాసన ఘుమ్మంటూ కొడుతోంది.

రావుగారు తను నేరస్థుల్ని పట్టుకోడంలో చూపిన సాహసాలుగురించి చెప్పుకు పోతూన్నారు. వరుసగా. నేను పరధ్యాన్నంగా వింటూ కూర్చుండిపోయాను. నామనస్సు పరిపరి విధాలుగా పోతూంది. హృదయం ఎందుకో వుండీవుండి ఝల్లుమనేది. ఏదో అపశకునం గోచరించేది. తిరిగి మళ్లీ యింటికిపోవాలనిపించేది...శాంత కెలాగుందో.. ?

ఉన్నట్టువుండి యింతలోనే వర్షం ప్రారంభించింది. టపటపమని చినుకులు రాలుతోంటే వాటికంటే వేగంగా, గార్డెన్సులోనుంచి క్లబ్బులోకి పరుగెత్తుతూన్నారు.

రాజశేఖరం యిత్యాదులు పేకముక్కలు మాత్రం ఏరుకుని కుర్చీలు అవి అక్కడే వదలి మళ్లీ క్లబ్బులోకి పరుగెత్తాడు. వాళ్లతో కలసి మేమూ లోపలికొచ్చేశాము.

అక్కడ వర్ష హుహోరుతోపాటు, రణగొణ ధ్వని ఎక్కువయింది. గార్డెన్సులోవాళ్లు, టెన్నిస్ ఆడేవాళ్లు అంతా లోపల కొచ్చేశారు.

వర్షం, గాలి ఎక్కువై గంట సేపటివరకూ ఏకధాటిగా కురిసి, తగ్గిపోయి, ముసురులోకి దిగి చిన్న చిన్న తుంపర పడటం మొదలు పెట్టింది.

రాత్రి తొమ్మిదైంది. ఈ వర్షం ముసురులోకి పంపింది కొబట్టి ఎలాగూ యిప్పటిలో వదిలేలా లేదు. "ఇక యింటికి పోదాం" అన్నాను రఘు.

"కారు తెచ్చానుగా! నిన్ను యింటి దగ్గర దింపి శాంతను మరోసారి చూచి నేను యింటి కెళతాను" అన్నాడు రఘు.

సరే అని, అక్కడి మిత్రులతో చెప్పి బయలుదేరాము.

కారు, సిమెంటు రోడ్డుమీద మెత్తగా నడుస్తూంది; అక్కడక్కడ పల్లంలోనిలిచిన నీటిని చీల్చుకుంటూ పోతూంది...బజారుకి యిరుప్రక్కలా వున్న షాపుల్లోని రంగురంగుల లైట్లకాంతి వెనక్కు పరుగెత్తుతోంది. స్టీరింగ్ దగ్గర రఘు కూర్చున్నాడు. వాడిప్రక్కనే నేను కూర్చున్నాను. వాడు అద్దాలలోనుంచి దీక్షగా రోడ్డుకేసి చూస్తూన్నాడు.

వాణ్ణి యిందాకటినుంచి ఒక విషయం అడగాలనుకుంటున్నాను. అయితే వాడు ఏకాంతంగా చిక్కే అవకాశం యిప్పుడు చిక్కింది.

"చూడు రఘు !" అన్నాను నెమ్మదిగా.

రోడ్డు పైపుకే దీక్షగా చూస్తూంటే వాడల్లా నాకేసి తిరిగాడు ఏమిటన్నట్టు.

"శంతన్‌రావు జాడ నీకేమయినా తెలిసిందా...? "వాడెక్కడున్నట్టు!" సందర్భం లేకుండా యిటువంటి ప్రశ్న ఎందుకు వేశానో వాడికర్థం కాలేదు.

"ఇప్పుడా విషయం దేనికి...! వాడెందుకు గుర్తొచ్చాడు? వాడి విషయం ఏమన్నా తెలిసిందా..?" అన్నాడు రఘు నాకేసి చూస్తూ.

"లేదు - ఆ మధ్య వాడు ఎక్కడో ఒక పల్లెటూళ్లో పాడుబడ్డ శివాలయపు అరుగుమీద పడుకుని చనిపోయినట్టు విన్నాను...! కొందరు వెళ్లి చూచినాడు కాదనికూడా వాదించారు కదూ..? అసలు వాడేమయ్యాడో..?"

రఘు నవ్వాడు.

"వాడికి ఒక పల్లెటూళ్ళో, అందులో శివాలయంలో చనిపోయే యోగం పడుతుందంటావా శ్రీని! అటువంటి పవిత్రస్థలంలో ప్రాణాలు వదిలే పుణ్యం వాడికి పట్టదు. అటువంటి వాడికి ఏ వేశ్యావాటికలోనో, లేక ఏ పోలీసు ఆఫీసరు చేతిలోనో, చివరకు ఉరికంబం మీదనో రాసిపెట్టి వుంది చావు— వాణ్ణి గురించి నీకు తెలియంది కాదుగా!"

నేనేమీ మాటాడలేదు.

రఘు యింకా చెప్పుకు పోతున్నాడు.

"వాడు వూరు వదలిపోయిన దగ్గరనుంచి వాడి తండ్రి పరువు, ఈవూరు పరువు కొస్త చక్కబడ్డాయి కదూ?" అని కొన్ని క్షణాలు ఆగి మళ్ళీ అన్నాడు రఘు. "అయినా ఇప్పుడు అసందర్భంగా వాడెందుకు గుర్తొచ్చాడు నీకు?" అని నా ముఖంలోనికి చూచాడు.

"ఏమీలేదు, రాత్రి, వాడు భూతమయినట్టు ఒక విచిత్రమయిన కల వచ్చింది. అందుకు అడుగుతున్నాను" అన్నాను. దాన్నంతా వివరించకుండగా నే—

రఘు మళ్లీ అట్టహాసంగా నవ్వాడు.

"మంచికల! అటువంటి వాళ్లు చనిపోయినా, బ్రతికివున్నా పిశాచాల్లాంటి వాళ్ళే!" అన్నాడు.

శంతన్ అంటే వాడికీ పడదు. వాడు వూళ్ళో వున్నప్పుడుకూడా, రఘుకు మిత్రుడే అయినా వాణ్ణి చాలా అసహ్యించుకునేవాడు.

కారు రోడ్డు మలుపు తిరిగింది. తిరగడంలో ఎదురుగా రోడ్డుమీద నడచివచ్చే ఒక వ్యక్తి ముఖంమీద కారు లైటుపడి వెంటనే మాయమయింది. అతని ముఖంమీద మళ్ళీ చీకటి కప్పివేసింది. మా కారు ప్రక్కనుంచే దూసుకుపోయింది.

ఆ వ్యక్తిని చూడగానే గుండెలు ఝల్లుమన్నాయి. అతని ముఖంమీద లైటు పడగానే ఎవరో గుర్తుకొచ్చినట్టయింది. రాత్రి నేను కలలో చూచిన వ్యక్తి! పోలిక అలానే వుంది! యెవరై వుంటారు!

శంతన్ రావా...? శంతన్ తిరిగి వూరు కొచ్చాడా...?

ఏమో!!

వెనుకకు తిరిగి, అద్దంలోనుంచి చూచాను గాని, ఆ జనంలో మళ్ళీ కనిపించలేదు. రఘుని కారాపమందామనుకున్నాను గాని మళ్ళీ అది అవివేకమనిపించింది. ఏదో ఒక భయాన్ని...అవే సన్నివేశాల్ని మనస్సులో పెట్టుకుని పదే పదే తలంచుకుంటూంటే శూన్యంలో కూడా ఆ దృశ్యాలే కళ్ళకు కట్టినట్టు కనిపిస్తూ భ్రమింపజేస్తుంటాయేమో!

కారు ఒకే స్థాయిలో నడుస్తూంది. నే నింకేమీ మాటాడలేదు. అద్దంలో నుంచి బయటకు చూస్తుంటే చిన్న చిన్నగా పడే తుంపర ఆకాశంనుంచి వజ్రపు పొడి రాలుతున్నట్లు వుంది కారులైట్ల కాంతిలో.

కారుయింటికి చేరేవరకూ ఎవరమూ మాట్లాడలేదు. రోడ్డుమీద కారుఆపుచేసి లోపల కొచ్చాము యిద్దరం. వచ్చీరావడమే శాంతగదిలోకి వెళ్ళాము. ప్రొద్దుటికీ యిప్పటికి శాంత ఎంతో నీరసించి పోయినట్టు కనిపించింది నాకు. ఇట్లా అయిపోయిందే? ఎందుకింత నీరసించి పోయింది శాంత? మరీ తెల్లగా పాలిపోయి మంచానికి అతికించిన తెల్ల కాగితపు బొమ్మలావుంది శాంత. ప్రక్కలో చంటివాడు గుడ్డల్లో కలసిపోయి సరిగా కనిపించడంలేదు.

"ఎలా వుంది పిన్నీ శాంతకు?" అన్నాడు రఘు, అక్కడేకూర్చుని ఓవల్ కలుపుతూన్న అమ్మతో.

"మధ్యాహ్నం నువ్వువచ్చినప్పటిలానే వుంది రఘు! గుండెల్లో నొప్పి యింకా అలానే వుంది ఏమీ తగ్గలేదు—"

రఘు సైతస్కోపుతో చూచాడు.

"ఏంపరవాలేదు-అంతా బాగానే వుంది! అదంతా బలహీనత వల్లే. మరేం ఫరవాలేదు!"

"మరో యింజక్షన్ యివ్వకూడదు రఘు! అన్నాను నేను మనస్సు ఆగక.

రఘు నవ్వాడు నా ఆదుర్దా కనిపెట్టి.

"ఎందుకు? ఎప్పుడు ఏది అవసరమో నాకు తెలుసు. కావాలంటే నీ కిస్తాను నీ ఆదుర్దా తగ్గటానికి."

అమ్మతో పాటు శాంతా నవ్వింది ఆమాటకు. ఏమో! ఆనవ్వులో జిగిలేదు; కళలేదు. అతినిస్సత్తువగా నవ్వింది శాంత. మునుపు శాంతనవ్వితే మణులు దొరికే కొండలోయల్లో మణులమీద ప్రవహించే కొండ వాగులా గల గలా అతిసున్నితంగా సాగిపోయేది, యిప్పుడా జిగి ఏది?

"చంటివాడు కూడా ఏమీ బాగోలేడు రఘు!'' చూడు! రాత్రినుంచి పూరికే ఒకటే ఏడుపు!" అంటూ చంటివాడి ఒంటిమీద బట్టతీసి చూపించింది అమ్మ. ఎండిపోయిన శాంత రొమ్ములమధ్య తెల్లని పిండి బొమ్మలా అతుక్కుపోయి వున్నాడు వాడు.

రఘు చూచి ఏమీ ఫరవాలేదన్నాడు.

కొంతసేపు మాటాడినమీదట రఘు యింటి కెళతానన్నాడు. భోజనం చేసి వెళ్లమంది అమ్మ. భోజనం అయిన తరువాత కాసేపు మాట్లాడి వాణ్ణి రోడ్డుదాకా పంపి, కారెక్కించి తిరిగి వచ్చేశాను మేడమీద గదిలోకి.

వర్షం ఇంకా కొద్దిగా కురుస్తూనేవుంది. మబ్బులు మాత్రం ఎక్కుతున్నాయి. నేను మేడ ఎక్కి గదిలోకి వచ్చేటప్పుడు హాల్లో గడియారం 12 గంటలు కొట్టడం వినిపించింది. ఆరాత్రి, తెల్లవారిన తరువాత మళ్లీ గదిలోకి రావడం యిదే మొదటిసారి.

గదిలో అడుగుపెట్టగానే మళ్ళీ రాత్రి కలలో దృశ్యాలే తిరగ నారంభించాయి. కిటికీలు కొట్టుకోడం హోరుమనేధ్వని చెవులు చిల్లులుపడేలా ఒకటే రొద!

అవే, ఆ దృశ్యాలే జ్ఞప్తికొచ్చేవి.

క్రిందకుదిగి వెళ్లిపోయి వేరేగదిలో పడుకుంటే బాగుంటుందేమో ననిపించింది. తరువాత, అలా చెయ్యడం మానసిక బలహీనత అనిపించింది. ఏదో అసందర్భంగా వచ్చిన కలను తలంచుకుంటూ పిరికివాడిలా చంటి కుర్రాడిలా మానసిక ఆందోళన చెందుతూ గదిలోనుంచి పారిపోయి వేరేచోట పడుకోడం అవివేక మనిపించింది.

బయట వర్షం యింకా పూర్తిగా తగ్గలేదు. కొద్ది కొద్దిగా పడుతూనే వుంది. సముద్రం దగ్గరఅవడం వల్ల హోరుమంటూ సముద్రపు గాలి ఈడ్చికొడుతూంది. చలికి చేతులు వంకరలు తిరుగుతున్నాయి. ఆకాశం అంతా మేఘావృతమై బయట అంధకారంగా వుంది. గాలి ఎక్కువ అవడంవల్ల తలుపులు కిటికీలు మూసివేశాను. బయట మెరిసినప్పుడల్లా వెంటిలేటర్సులో నుంచి వెలుతురు గదిలోకి వస్తూంది.

ప్రక్కమీద పడుకున్నానేగాని నిద్రరావడం లేదు. ఏవో పాడు ఆలోచనలు మనస్సును కలతచెందిస్తున్నాయి. ఏవో అపశకునాలు క్షణం క్షణం గుర్తుకొస్తున్నాయి. మనస్సంతా శాంతమీదకి పోతూంది... ముందు ముందు శాంత కెలాగుంటుందో...అసలు శాంత నాకు దక్కుతుందా?... ఏమో!

ఈ ఆలోచనలు రాగానే గుండె ఝల్లుమంటుంది. క్రిందగదిలోనుంచి గాలిహోరుతో కలసి చంటివాడి ఏడుపు వినిపిస్తూంది సన్నగా. అప్పుడప్పుడు దిగంతాల్లో ఉరుములు వినిపిస్తున్నాయి. మూసివున్న తలుపు సందుల్ని తెలుపుచేస్తున్నాయి మెరుపులు.

అలానే కొన్ని క్షణాలవరకు మనస్సులోకి ఏవిధమైన ఆలోచన రాకుండా గట్టిగా కళ్లుమూసుకు పడుకున్నాను. అలా ఎంతసేపు ఉన్నానో తెలీదు–

అప్పుడప్పుడే మసక మసగ్గా నిద్రపడుతుంది. యింతలోనే బయటితలుపు ఎవరో కొట్టిన చప్పుడైంది. ఉలిక్కిపడి లేచాను. అయినా అది నా భ్రమేనేమో అని రెండుక్షణాలు అలానే ప్రక్కమీద కూర్చుండిపోయాను. కాని మళ్లీ తలుపుకొట్టిన చప్పుడు వినిపించింది. ఎవరో అర్థంకాలేదు. చేతిగడియారం చూస్తే వంటిగంట అయింది.

"బహుశ అమ్మేమో? శాంతకెలాగుందో!"

ఈ ఊహ తట్టగానే వెంటనే వెళ్లి తలుపు తీశాను– తలుపుతియ్యగానే ఎవరో ఒక కొత్త వ్యక్తి బాణంలా లోపలకి దూసుకొచ్చి, మళ్లీ వెంటనే తలుపు గడియ వేశాడు! నేను స్తబ్ధుణ్ణయ్యాను. నోట మాట రాలేదు.

గదిలో వెలిగే లైటుకాంతిలో ఆవ్యక్తిని పరీక్షగా చూచాను. ఒళ్లంతా ఝల్లుమంది? శరీరం చెమటపోసింది.

అతనే! ఇందాక నేను కారులోవస్తూ చూచిన వ్యక్తి! రాత్రి కలలో నే చూచిన వ్యక్తి పోలికే వుంది......! అచ్చం శంతన్ రావే!

"నిజంగా శంతరావా...! మళ్ళీ ఏదైనా పైశాచికచర్యా...?" నేను తెల్లబోవటం ఆ వ్యక్తి కనిపెట్టాడు; పేలవంగా నవ్వాడు.

"ఏం శ్రీనీ...! అలా తెల్లబోతావేం...? గుర్తుపట్టలేదూ? నేనూ...శంతనరావును...! అవును. గుర్తుదొరకకుండా మారిపోయాను కదూ......? రా...! కూర్చో...! నీతో ఒక్క ముక్క మాట్లాడి పోదామని వచ్చాను...! మళ్లీ అయిదేళ్ళకి కలుసుకున్నాం కదూ...!"

అంటూ నాముఖంలోకి చూచి నీరసంగా నవ్వాడు.

ఆనవ్వులో జీవం లేదు;బీభత్సం లేదు. ఆమాటల్లో కరుకుతనం, కఠోరతా లేవు...ఎంతో పశ్చాత్తాపంగా అతి దైన్యంగా కనిపించాయి.

నేనేమీ సమాధానం చెప్పలేక అలానే చూస్తూ వుండిపోయాను. శరీరంలో మాంసం అంతా హరించుకు పోయి చర్మం ఎముకలకి అతుక్కుపోయివుంది. ఆ ముఖంలో క్రౌర్యం, గంభీరత లేవు. కళ్ళు, దౌడలు లోతుకు పోయాయి. కుడి కన్ను పూర్తిగా లోతుకు పీక్కుపోయి నీళ్లు కారుతోంది. బహుశ ఆరాత్రి తగిలిన దెబ్బకు ప్రతిఫలమేమో! పూర్తిగా పోయినట్టు వుంది. తలంతా పెరిగిపోయి రేగిపోయివుంది. బాగా మాసి, తడిసివున్న బట్టలు వాసనకొడుతున్నాయి. జుట్టులోనుంచి ముఖంమీదకు నీళ్లుకారుతూన్నాయి.

అప్పటి సన్నివేశం నాకంతా అయోమయంగా వున్నది. అది జరిగేది ప్రత్యక్షంగానా, మళ్లీ కలలోనా అనే అనుమానంకూడా కలుగుతోంది. నేను మాటా మంతీ లేకుండా శిలాప్రతిమలా అలానే అతను అనేది వింటూవుండిపోయాను—

"మాట్లాడవేం శ్రీనీ...! నామీద నీకున్న విహ్యాభావం యింకా పోలేదా...పోదు శ్రీనీ—పోదు—కానీ యిప్పుడు నీ ఎదుట నిలబడ్డది ఆనాటి శంతనకాదు శ్రీనీ...శంతనరావు ఆనాటితో నే పూర్తిగా మారిపోయాడు...చివరిసారి నిన్ను కలుసుకుందామని...ఆనాటిరాత్రి చెప్పకోలేని క్షమాపణ యిప్పుడు చెప్పకుని పోదామని వచ్చాను...! అలా చెయ్యందే నేను ఎక్కడా ప్రశాంతంగా వుండలేను...ఒక్కసారి వీ కల్మషమూ లేకుండా ఈమిత్రుణ్ని క్షమించానను శ్రీని...i నామనస్సు శాంతిస్తుంది...! నేను తిరిగి పోతాను...అందుకే వచ్చాను యింత దూరం...!"

ఉద్రేక పూరితంగా చెప్పకుపోతూన్నాడు. ఒక్కసారిగా నా రెండు పాదాలను కౌగలించుకుని బావురు మన్నాడు...

అప్పటిస్థితిలో నేనేమనాలి...!ఏం చెయ్యాలి.?

అతన్ని, చూస్తూంటే నా మన్సులో జాలిపుట్టుకొచ్చింది. యిక మనస్సు ఉండబట్టలేక లేవదీసి సోఫాలో కూర్చోబెట్టాను—

అతను ఊరికే ఏడుస్తూన్నాడు. కళ్లన్నీ ఎర్రబడి నీళ్లు కారుతున్నాయి.

శంతన్...! ఎంతగా మారిపోయాడు శంతన్...? వాడిలో ఎంత పరివర్తన వచ్చింది...? ఎందు కిలా చిత్రంగా మారిపోయాడు...?

"శంతన్!" అన్నాను ఆప్యాయంగా.

ఈ పిలుపు వినగానే, స్వాతివానకు నోళ్లు తెరచుకుని సాగరంమీద తేలే ముత్యపు చిప్పలమీద స్వాతిచినకులు పడగానే ఘనీకరించి అతిశయంతో తిరిగి సాగరగర్భంలోకి పోయే ముత్యపుచిప్పలా అయింది శంతన్హృదయం.

నా కళ్లల్లోకి అతిదయనీయబాష్ప నయనాలతో చూచాడు.

"పోనీ శంతన్...! ఎప్పుడో జరిగినదానికి యిప్పుడు వ్యధ ఎందుకు...? అంతా మర్చిపో! నేనూ మర్చిపోయాను....

అయితే నువ్వుయింతకాలం ఎక్కడున్నావు? అసలెందుకు వెళ్ళిపోయావు?" అన్నాను.

"నన్నడక్కు శ్రీని! అది నన్నడక్కు."

"ఆ రాత్రినుంచే నువ్వు కనిపించలేదు. మళ్ళీ మాకు ముఖం చూపించే ధైర్యంలేక, బిడియం, అభిమానం అడ్డొచ్చి పరారి అయ్యవా?అయితేయిన్నాళ్లా? కానీ ఆనాటి సంఘటన నాకు శాంతకు తప్పమరెవరికి తెలీదు శంతన్. నిన్ను ఆనాడే క్షమించాను శంతన్!"

"నాకు తెలుసు శ్రీనీ! నీలో ఆ సహనం వుంది. అసహనమే మల్లానీకు, ఈ పరిసరాలకు దూరంచేసింది.

అయితే ఆఖరిసారిగా నీకు కనిపించి నీతో క్షమాపణ చెప్పేవరకు నామనస్సు వుండలేదు. అందుకనే యిటు వచ్చాను. నాపని అయింది. నేను యిక వెళ్లిపోతాను. శ్రీని!" అంటూ లేవడానికి ప్రయత్నించాడు.

నేను వారించాను. అప్పుడే "ఎక్కడికి వెడతావు శంతన్?"

నవ్వాడు శంతన్.

"ఎక్కడి కేముంది శ్రీనీ! కైలాసానికి!" అంటూ పేలవంగా నవ్వాడు.

"అంటే?"

మళ్ళీ నవ్వాడు శంతన్ "అంటె ఏముంది! నేను యిదివరకు చేసిన పాపాలకి పరిహారంగా తీర్థయాత్రలు చెయ్యాలనిపించింది. అలా చేశానా పాపం కొంత పోతుందని నా ఆశ. నాలాంటి పాపాత్ములు, పేరుకున్న పాపంతో కలుషితంతో శే చచ్చిపోతే తప్పకుండా పిశాచమయి పుడయను శ్రీనీ!—వద్దు...వద్దు ఆ పాడుబ్రతుకు నాకు యింక వద్దు—నేను బ్రతికుండగానే పిశాచంలా ప్రవర్తించాను. చనిపోయికూడ పిశాచంగా మారదలచ లేదు...అందుకని వెళుతున్నాను శ్రీనీ"

"నెమ్మదిగా వెళ్ళొచ్చు! మీ యింటికెళ్లావా? మీ వాళ్లు నీ కోసం కలవరిస్తున్నారు!"

"వద్దుశ్రీ...నీ నేనెవర్నీ కలువదలచలేదు...నీ గురించే యిక్కడకు వచ్చాను! నేను వెళతాను, నేను పూర్తిగా మారిపోయాను. ఈ ప్రపంచంలో వీణ్ణి క్షమించేది నువ్వు ఒక్కడివే అని నాకు తోచింది. అందుకని తుదిసారిగా నీ దగ్గరకు నిన్ను చూచిపోదామని వచ్చాను. నా పని అయిపోయింది. నేను వెళ్ళిపోవాలి. నన్ను వారించకు!"

"ఇంత రాత్రిలో ఎక్కడికి. పోనీ రేపు వెళ్దువు గాని!" అన్నాను. అయినా వాడు వినిపించుకోలేదు.

"ఇప్పుడే వెళ్ళాలి! ఈ రాత్రి ట్రైనుకే పోవాలి. మళ్లీ ప్రొద్దున్న ఎనిమిదయితేగాని ట్రయిను లేదు. నేనెవరికీ కనిపించలేదు. అందుకనే యిందాక రాత్రి ట్రయినుకే ఈవూరొచ్చాను! నన్ను మన్నించు నేను వెళుతున్నాను!" అంటూ లేచాడు.

లేస్తూనే చిరిగిపోయిన ఫాంటు జేబులోనుంచి ఏదో చిన్న కాగితపు పొట్లాంతీసి నా చేతిలో పెట్టాడు.

"దీన్ని రేపు ఉదయం నువ్వుప్రక్కమీదనుంచి లేవగానే విప్పిచూడు. అంతవరకూ దాన్ని విప్పవద్దని వేడుకుంటున్నాను. తెల్లవారిం తరువాతే విప్పిచూడు. నీకు అంతా అర్థమవుతుంది! అంటూ ఆ పొట్లాం నా చేతిలో పెట్టి చరచరా మెట్లుదిగి వెళ్లిపోవడం మొదలు పెట్టాడు.

వాడి వింతప్రవర్తన నాకర్థం కాలేదు. ఈ పొట్లాంలో ఏముందో! దీన్ని తెల్లవారినతరువాత విప్పిచూడటంలో అర్థమేమిటో! వాడు మెట్లన్నీ దిగి యింటిముందున్న గార్డెన్సులోకి వచ్చాడు. నేను వాణ్ణి అనుసరిస్తూనే వచ్చాను క్రిందకు.

ఇంకా చినుకులు తగ్గలేదు. అప్పుడప్పుడు కొద్దిగా మెరుస్తూంది. తోట దాటి గేటుదగ్గరకు వచ్చే సరికి, తోటకి ఎడమవైపున శాంత పడుకున్న గది కిటికీనుంచి చంటివాడి ఏడుపు వినిపించింది.

అది వినగానే వాడు ఠక్కున ఆగాడు.

నా ముఖంలోకి చూచాడు.

"ఏం శ్రీనీ! కొడుకా! ఎన్నోవాడు?" వాడలా అడిగినందుకు మనస్సెందుకో బాధనిపించింది.

"మొదటివాడే! పదహారు రోజులైంది వాడు పుట్టి!" వాడు దృష్టి ఆ కిటికీవైపుకి పోనిచ్చి కొన్ని క్షణాలు చూస్తూ వుండిపోయాడు—కిటికీకి వున్న నీలి తెరలోనుంచి లోపలలైటు కాంతి బయటకు చిమ్ముతూంది. వాడింకా ఏడుస్తూనే వున్నాడు.

శంతన్ నిట్టూర్చాడు.

"అదృష్టవంతుడివి శ్రీనీ! వాణ్ణి కూడా నీలానే తయారుచెయ్యి! భగవంతుడు వాడికి దీర్ఘాయుస్సు యిస్తాడు!" అని కొన్ని క్షణాలు వుండి అన్నాడు: "మాడు శ్రీనీ! వాణ్ణి చూచే అదృష్టానికి నోచుకోలేదు!" అంటూ నిట్టూర్చాడు.

"రేపు వుండగూడదూ చూపిస్తాను!" అన్నాను.

వాడెందుకో ఉలిక్కిపడ్డాడు.

"వద్దు-వద్దు శ్రీనీ! ఈ పాపిష్ఠి ముఖం శాంతకు చూపలేను! చూపను కూడా! వూరికినే అన్నాను!" అంటూ గేటు దాటి రోడ్డుమీద కొచ్చాడు.

బయట ఎక్కడో కుక్కలు మొరుగుతున్నాయి. వీధిలో దీపాలు ప్రశాంతంగా వెలుగుతున్నాయి. చిరు

జల్లు పడుతూనే వుంది ఇంకా. వాడు రెండు చేతులు పైకెత్తి నమస్కరించాడు.

"సువ్విళ వుండిపో శ్రీనీ! నేను నీ దగ్గర కొచ్చినట్టు ఎవ్వరికీ తెలియనివ్వకు! ఈ మిత్రుణ్ణి మర్చిపోకు. నాకు వేళయింది శలవు!" అంటూ వెనక్కి తిరిగి, మళ్లీ యిటువైపయినా చూడకుండా చర చర నడచి వెళ్లిపోయాడు శంతన్.

కనుచూపు మేరవరకు అక్కడే నిలబడి వాణ్ణి చూస్తూండిపోయాను నేను. రానురాను వాడుదూరమై రోడ్డు మలుపు తిరిగి అంతర్ధానమయ్యాడు!

నాకు ఈ సంఘటన చిత్రంగా వుంది. మళ్ళీ శంతన్ ఈ రూపంలో తారసిల్లుతా డనుకోలేదు. మునుపటి శంతన్‌కి-నేను రాత్రి కలలో చూచిన శంతన్‌కి-యిప్పుడు చూచిన శంతన్‌కి ఎంత తేడా వుంది?

కొన్ని క్షణాలు అక్కడే నిలబడి మళ్ళీ నా గదిలోకి వచ్చేశాను.

గదిలోకి వచ్చినా యిప్పుడు సన్నివేశాలే కనిపిస్తున్నాయి - గదిలో వాడు వచ్చిన జాడ. తడి కాళ్లతో వచ్చిన అడుగుజాడలు అలానే వున్నాయి. వాడు కూర్చున్న సోఫాలో తడి యింకా అలానే ప్రత్యేకంగా కనిపిస్తూంది. ఇంకా శంతన్ అక్కడే కూర్చుని మాట్లాడుతూన్నట్టే వుంది. కొందరి కొందరి జీవితాల్ని కొన్ని సంఘటనలు అలా, అంత గాఢంగా మార్చివేస్తాయేమో!

వాడు యిచ్చిన పొట్లాం యింకా అలానే నా చేతిలోనే వుంది. అందులో ఏముందో అన్న ఆతురత ఎక్కువయింది. అయినా దాన్ని తెల్లవారిన తరువాత విప్పి చూడటానికి నిశ్చయించుకున్నాను. దాన్ని తలగడ క్రింద పెట్టి అలానే పడుకుండిపోయాను ఏవో తలపోస్తూ.

ఎప్పుడు నిద్ర పట్టిందో ఏమోగాని లేచేసరికి కిటికీల్లోంచి ఎండ గదిలోకి పడుతూంది. అప్పటికి బాగా తెల్లవారిపోయింది. రోడ్లమీద కారు హారన్ల చప్పుడు వినిపిస్తూంది.

ప్రక్కమీదనుంచి లేవగానే రాత్రి సన్నివేశాలే గుర్తుకొచ్చాయి. శంతన్ వచ్చినజాడ గదిలో కనిపిస్తూంది; గదిలో అడుగు జాడలు. ఆ సోఫా తడి యింకా ఆరిపోలేదు.

వెంటనే మంచం దగ్గరకు వెళ్ళి అక్కడవుంచిన పొట్లాం విప్పాను. తీరా చూస్తే ఆ పొట్లాంలో ఏమీ లేదు. మడిచివున్న చిన్న కాగితం ముక్క వుంది. అందులో ఏదో రాసి వుంది.

ప్రియమైన శ్రీని...!

నీకు చెప్పకునేది ఏదో రాత్రే చెప్పానున్నాను. అయితే మరో కోరిక ఒకటి వున్నది. అది అప్పుడు చెప్పడానికి వీలుండదు కాబట్టి ఈ ఉత్తరంలో రాస్తున్నాను...

ఆ రాత్రి నేను ఏ పవిత్రమైన స్థలంలో ఒక పవిత్రమూర్తిమీద అఘాయిత్యం తలపెట్టానో ఆ పవిత్రమైన ఆలయం ప్రాంగణంలో, ఆ జువ్విచెట్టు క్రింద నా శవం వుంటుంది...! దానిమీద ఒక్క బొట్టయినా పడదని నాకు తెలుసు. నిన్ను ముఖ్యంగా అర్థించేది ఏమిటంటే నువ్వు మాత్రం నా శవంమీద రెండు కన్నీటిబొట్లు రాల్చు!...ఆ నమ్మకం నాకుంది నువ్వు అలా చేస్తే నా ఆత్మ శాంతిస్తుంది...అలా కాని నాడు నేను దిక్కులేని చావు చచ్చినవాణ్ణవుతాను అలా చావడం నా కిష్టంలేదు...ఎందుకంటే అలా దిక్కులేని చావు చచ్చిన వాళ్లంతా పిశాచాలవుతారని నా నమ్మకం...! అందుకని నేను అలా మారకూడదు...! మారను—

నేను నిన్ను చివరిసారిగా అర్థించేది అదే శ్రీనీ! నా శవంమీద పవిత్రమైన నీ కన్నీటిబొట్లు రెండు రాల్చు...! అది చాలు. నాకు మరి జన్మవుండదు...లే! ఆ శివాలయం దగ్గరకు రా...! రా శ్రీనీ!—

ఇట్లు,
నీ మిత్రుడు
శంతన్.

ఆ ఉత్తరం ముగియగానే భూమి కంపించినట్టయింది. ఇక అక్కడ ఆలస్యం చెయ్యకుండా తలుపు తోసుకుని మెట్లు దిగాను. అమ్మ కూడా ఆదుర్దాగా నా కెదురయింది మెట్లమీద.

"ఇది విన్నావా శ్రీని...! మన శివాలయం దగ్గర జువ్విచెట్టు క్రింద ఎవరిదో శవం వుందట...! అది అచ్చం...మన అవధానిగారి కొడుకు శంతన్‌రావులానే వుందట...! పాపం వాడు పరారీ అయి అయిదేళ్లయింది కదూ...? అందరూ అక్కడికిపోతూన్నారు చూట్టానికి!" అంది అమ్మ.

నాకు అమ్మమాటలు వినిపించుకో బుద్ధి కాలేదు. నేను ఆదుర్దాగా ఆలయం వైపుకి పరుగెత్తుతోంటే అమ్మకి ఏమీ అర్థంగాక అలానే నిలబడి చూస్తూ వుండిపోయింది!

చిన్నయసూరి లక్ష్యశుద్ధి

శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరి

శాస్త్రము లన్నింటను శబ్దశాస్త్రము ప్రధానమని ప్రాచీన భారతీయుల సిద్ధాంతము. ఏమి చదివినను జదువక పోయినను తుద కింత వ్యాకరణమైనను జదువవయ్యా నీవు తరింతు వన్నంత ధోరణిలో ప్రాచ్యసంప్రదాయ మున్నది. ఇది పాణి నీయప్రభావమును బట్టియే లోకములో పుట్టియుండ వచ్చును.

అసలు గీర్వాణములో సూత్రవాఙ్మయమునకు పేరు ప్రతిష్ఠలు పెద్దవి కలవు. అట్టిది ఏ వాఙ్మయమందును లేదని యభిజ్ఞు లందురు. సర్వవిషయములను సూత్రీక రించి బోధించుటలో ప్రాచీనులు మంచి మెలకువను గని పెట్టిరి. సూత్రీకరణములోని విశిష్టత, విశిష్య పాణినిసూత్ర ములకే చెల్లను.

సూత్రలక్షణము

'సంజ్ఞాచ పరిభాషా చ విధి ర్నియమ ఏవచ,
అతిదేశోఽధికార శ్చ షడ్విధం సూత్రలక్షణమ్.'

ఈ యాఱువిధములను అక్షరాల అవలంబముగాఁ జేసికొని సంస్కృత వాఙ్మయములో శబ్దశాస్త్రము బ్రహ్మాండముగా పెరిఁగిపోయినది. సూత్రములు, వార్త్తికములు, భాష్యములు, వ్యాఖ్యలు, అన్న పేరుతో ఆ శాస్త్రము చిలవలు పలవలుగా పెరిఁగి పెద్దదయ్యెను. దేశ్యభాషలలో వ్యాకరణమున కింత ప్రాభవము లేకపోయినను, తెలుగు భాష ముప్పాతిక మువ్వీసము తత్సమాకారము వహించుటజేసియు—తెలుగు కావ్యములన్నియు సంస్కృత సంప్రదాయములో నడచియుండుట జేసియు, తెలుగునకు సంస్కృత వ్యాకరణము విధిగా జదువవలసినంత యక్కఱ యేర్పడెను. ఈ దృష్టితో ఇతరశాస్త్రములతో పాటు పాణినీయమును సాంగోపాంగముగ అధ్యయనము చేసిన శాస్త్రవేత్తలలో చిన్నయసూరి ఒకడు.

ఇప్పటికి నూఱేండ్లనాటి కథ. అచ్చుపుస్తకములా లేవు. గ్రంథ ప్రచారమా కానరాదు. పాఠశాలలు, కళాశాలలు సర్వ జనమున కందుపాటు కావు. గురుకులములో జేరి వినయ విధేయతలతో గురుశుశ్రూష కావించుచు అభిమానమున్న శాస్త్రమును అధ్యయనము చేసెడివారు. ఆ రోజులలో తెలు గులో కవిత్రయమువారి రచనలు, ప్రబంధకవుల వాఙ్మయము తాటాకులలో మాత్రమే దొరికెడివి. తెలుగులో వ్యాకరణము ఒక 'శాస్త్రముగా' అప్పటికి గుదురలేదు. ఇందొక విచిత్ర మేమనగా, అప్పుడు తెలుగులో విద్వాంసులగువారు సంస్కృత ములో గూడ ఆరితేఱినవారే. పైగా, తెలుగునకు సంస్కృ తము 'తల్లి'యన్న పెద్ద మమకారము, మోజు ఉన్న రోజు లాయె. దానికి దోడుగ 'శాస్త్ర'మన్నది గీర్వాణములోనే యుండవలయు నన్నంత 'గీర్వాణము' సైతము కద్దు. కావు ననే తెలుగునకు వ్యాకరణమును సంస్కృత భాషలోనే కారి కలుగా సృష్టించి వ్యాఖ్యానములు సైతము—ఆ భాషలోనే సంతరించి యిచ్చిరి. ఆంధ్ర వ్యాకరణ శాస్త్ర సృష్టిలో ఇది మొదటి మెట్టు. రెండవది తెలుగు వ్యాకరణమును పద్య భాగములో బోధించుట. తెలుగులో వ్యాకరణము ఈ ధోర ణిలో గాసటబీసటగా నుండి, అందఱ కందుపాటుగా లేకుండిన నాడు, చిన్నయ్య, బయలుదేరి 'చిన్నయసూరి' ఆయెను.

ఆతడు కూడ ముమ్మొదట పూర్వసంప్రదాయమునే పాటించుచు తెలుగు వ్యాకరణమును సంస్కృతభాషలోనే సంతరించెను. కాని, లోకవృత్త మెఱిగినవాడు కావున, తెలుగు వ్యాకరణమును తెలుగు భాషలోనే—అందును వచనములోనే బోధింపవలెనన్న త్రోవకు వచ్చెను. ఆ త్రోవలో సాగిన అత్య ద్భుత శాస్త్ర గ్రంథమే 'బాలవ్యాకరణము.'

ప్రాచీన లక్షణ గ్రంథములను బరిశీలించి లక్ష్యములు పెక్కింటిని బలుమారులు చదివి సమన్వయము చేసికొని ఒక ప్రణాళిక నిర్ణయించుకొని ఈ రూపముగా రచించితినని సూరి, బాలవ్యాకరణపీఠికలో జెప్పుకొనెను. ఈ సందర్భ ములో ఆతడు చెప్పిన ఈ పద్యమును జూడుడు :—

'అనయము లలితోక్తులతో
నొనరుపడం గూర్చి లక్ష్యయోజన మొప్పం
గను బాల వ్యాకరణం
బనగా లక్షణ మొనర్తు నాంధ్రంబునకున్.'

ఆ గ్రంథము వ్రాసిన రోజులలో ఆతడొక పెద్ద కళా శాలలో పెద్ద పండితోద్యోగములో పనిచేయు చుండెడివాడు. గౌణముగా తెలుగు చదువుచున్న—ఆ తెలుగుపిల్లలకు, విదేశ్య భాషలో మోజు కుదిరి కాలమంతయు దానికే కర్చుపెట్ట వలసి వచ్చుచున్న—ఆనాటి విద్యా ప్రణాళికలో, అనుబంధ ముగా నంజుకొనుచున్నట్లు మాచూడవలసి యున్నట్లు సాగు చున్న, ఈ తెలుగు చదువులలో విశిష్య, వ్యాకరణము బోధింప వలెనన్న, వ్యాకరణము చదువవలెనన్న ఆ వాతావరణము ఎట్లుండి యుండునో విద్యాశాలలలో కళాశాలలలో దెలియనివారు లేరు. మొదలు, వ్యాకరణము—ఒక — యుప్పుబుట్ట. చదువులలో అది లేనిది జరుగనిమాట నిజమైనను అచ్చముగా దానితో గాలక్షేపము చేయవలెనన్న ఓర్పు నేర్పులు మిక్కిలిగా నుండి

తీరవలెను. ఈ పరిస్థితిని గమనించి చెన్నపురిలోని చిన్నయ్య, కటువైన ఈ తెలుగు వ్యాకరణమును 'లలితోక్తులతో' లక్ష్యములను గూర్చి తెలుగు లక్షణ మొనర్తునని పలికెను. అది యాతని దృక్పథమే కాదు; ఒకానొక శపథము కూడ. ఈ రచనలోని శాస్త్రమందలి లోతుపాతులమాట యటుంచి 'లలితోక్తులతో లక్ష్య యోజన' మన్న దళము ఎంత వట్టు సార్థకమాయెనో రవ్వంత పరిశీలించుటయే ఈ వ్యాసములోని పరమార్థము.

బాలవ్యాకరణములోని లక్ష్యములను బట్టి పరిశీలింపగా ఆతని శపథమును ఆఱు విధములుగా అన్వయించి అభివర్ణింప వచ్చును. అవి యివి :—

1. ఉపదేశముద్ర
2. పూర్వగాథా కథనము
3. వైష్ణవ ప్రపత్తి
4. వినోద ప్రసంగము
5. లౌకిక ప్రజ్ఞ
6. ఛందోగర్భిత వచన రచన

1

ఆతడు చదువులు చెప్పెడి కళాశాలలో బాలురు, బాలికలు ఉభయులు కలరు. వారి వంకకు దిరిగి 'వినుడు బాలకులు వినుడు బాలకులారా !' * అని బాలురను బిలిచి, వేఱొక వంక గూరుచున్న బాలికలను 'వచ్చితిరి కాంతలు' అని ముద్దుగా బలుకరించును. బిడియపడెదరేమో యన్న సంశయముతో బాలికలను విడిచి 'అన్నలార మిమ్ము నడిగెద నొకమాట' యని బాలురనే ప్రశ్నించును.

తన క్లాసులో గూరుచున్న బాలురను జూచుకొని 'అతడు శ్రీమంతుడు—ఇతడు గుణవంతుడు, వాని వంశము శ్రీమంతము—వీని వంశము గుణవంతము' అని పేరు పేరున వ్రేలితో జూపుచు సంబరపడుచు బోధించుచున్నట్లు, మన కా సన్నివేశము స్ఫురించుచుండును. వారిలో నొకనిని బిలిచి బాబూ ! 'భవద్గుణంబు—త్వదాశ్రయంబు' అని హెచ్చరించును. నీ ప్రవర్తనమును బట్టియే నీ గుణము లుండును. నీవు గుణవంతుడవని పేరు పడయవలె నన్న నీలోనే యున్నది కాని ఒకరు తెచ్చి యిచ్చునది కాదయ్యా—అని ఆ మాటలలో ఒక ఉపదేశముద్ర గర్భితము కావలెను. వెంటనే 'మత్పుణ్యము—లనద్రూపము' అనుటలో ఒక హెచ్చరికగా 'మీవంటి మంచి పిల్లలకు బోధించుటజేసి నా శ్రమ సార్థకమగును గాన, అది నా పుణ్యమన్న భావము స్ఫురింపవలెను.

'భవిష్యత్కాలము ధూర్వహము'—ఈ లక్ష్యములో ఒక ధ్వని. తెలుగు దేశములో భవిష్యత్కాల మెట్లుండునో ? భాషా విషయకముగా అలజడులు పుట్టవచ్చును. గ్రాంధిక వ్యావహారిక సమస్యలు తలలెత్తవచ్చును. కంటికే గాని కర్ణములకు గోచరింపని 'ఈ అరసున్నల' మేళము మన కేలయని నిరసించు కుఱ్ఱకారు సుకుమారులు—ఇప్పటికే యుద్భవించిరి. ఈ ప్రబుద్ధులు ముందు ముందు 'హ్రస్వము మీది ఖండ బిందువును బూర్ణ బిందువును (శూన్యము) చేసెదరేమో యన్న భయము సూరికి స్ఫురించెనేమో !

శాస్త్రీయముగా 'భాషాభేదములను' జెప్పుకొని వచ్చుచు 'కటికంఠుడు—ప్రాణ గొడ్డము' వంటి వైరి సమాసములను గూర్చి ఈ బాలుర కెట్లు బోధింపవలెనా ! యని సూరి బాధపడి 'ఆర్య వ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు' అని పలికి, పెద్దలయెడ జూపవలసిన గురుభావమును బాలురకు బోధించెను.

'సత్యము సర్వ శ్రేయము, అది లేనిచో సర్వ ధర్మములు వ్యర్థములు'

'ధనంబుచేత సౌఖ్యంబు గలుగు. విద్యచేత యశంబు లుగ ౦'

'లోభంబు కంటె నితరంబు దోషంబు లేదు. మానహాని కంటె మరణము మేలు'

'జ్ఞానము వలన ముక్తుండగు'
'మోక్షమున నిచ్ఛ గలదు'
'విద్యాశాలి యగు పురుషుని సకల జనులు సమ్మానింతురు'
'భూతదయాళు రగు మహాత్ములకు శ్రేయంబు కలుగును'

ఇవి యన్నియు వ్యాకరణ సూత్రముల కిచ్చిన ధర్మ సూత్రములైన లక్ష్యములు. సత్యము వంటి ధర్మము లేదట. విద్యాధనములలోని భేదమును గుర్తింపవలెనట. లోభము వట్టి దుర్గుణమట. ప్రతి మానవుడు ఆత్మగౌరవమును గాపాడుకోవలెనట. మోక్షేచ్ఛకు జ్ఞానము మూలమట. విద్యావంతుని సర్వ జనులు గౌరవింతురట. భూతదయాపరులై మెలగుట శ్రేయోదాయకమట. ఇట్టిది ఆతని లక్ష్యశుద్ధిలోని లక్ష్యసిద్ధిగల ధర్మప్రబోధము. 'కారక భాగము' లో—అట్టి ధర్మ రహస్యమును సూక్ష్మముగా బోధించిన ఘట్ట మిదిగో :—

'పాపంబు వలన నేవగించె'
'అధ్యయనంబు వలన డస్సె'
'పాడివలనం బరాకు వడియె'
'భోగంబులవలన విరమించె'
'శోకంబు వలన వారించె'

ఇందలి రహస్యమేమి ? వ్యాకరణము మాట దేవు డెఱుగును. ఏవగించుకొనవలసిన పాపకార్యముల జోలికి బాబూ ! నీ వెన్నడును బోరాదు. పయి పయి చదువులు చదువక అలసిపోవునట్లు చక్కగా జదువుకో. ధర్మాచరణములో ఎన్నడును బరాకు పనికిరాదు. చోరులవలన హాని కలుగకుండ బక్కవారిని గనిపెట్టియుండుము. అనుభవించిన కొలది భోగములు—ఎంత

* ఇట్టి ముక్క లన్నియు సూరి యిచ్చిన బాలవ్యాకరణ లక్ష్యములు.

వారి నైనను గ్రిందికి గుంజివైచును గాన భోగముల నుండి మనస్సును మరలించుకోవలెను. లాతివారి దుఃఖమును మాన్పుట కయి ప్రయత్నింపవలెను. ఇది యిచ్చటి యుపదేశసారము.

2

ఈ వ్యాకరణ పాఠములలో సూత్రప్రాయమ్మైన చిన్ని చిన్ని పలుకులలో పూర్వ గాథలు బోధింపవలెనని సూరి దీక్ష కాబోలు ! ఇదిగో రామాయణ గాథ :—

'ఆ ఋషీశ్వరుండు వచ్చెనా ఫలించు కార్యముల్'
'రాముని కంటె నన్యుండు ధానుష్కుండు లేడు'
'విశ్వామిత్రుడు రామునకు మిథిలం గానిపించె'
'రాముడు విల్లందినం ద్రిలోకంబు లాకులంబులగు'
'జనకుడు రామునకుం గన్య నిచ్చెను'
'రాముడు పట్టిన ప్రతిన వారింపం దరంబుగాదు'
'రాముడు వాని నొక్క కోలం గూలనేసె'
'లంకం గలకలంబు పుట్టె'
'రాముడు రావణుం బరిమార్చి సీతయుం దాను సౌమిత్రి సహితంబుగ బుష్పకారూఢుండయి సాకేతంబున కేతెంచె'

'సుగుణాభిరాముడు రామునకు జోహారు వొనర్చెద'

పుత్రకామ్యేష్టి కి బూర్వము ఋష్యశృంగుడు అయోధ్యకు రావలసి యున్నది. కార్యము ఫలించుట యనగా శ్రీరామ జననము. శ్రీరాముడు గొప్ప ధానుష్కుడట. అతడు విశ్వామిత్రునితో మిథిలకు బోయెను. అచ్చట శివధనుర్భంగ మను పందెము. పందెములో గెలుపు. తత్ఫలితము సీతాకళ్యాణము. నడుమ వచ్చిన పరశురాముని గూర్చి ప్రతిన చెల్లించుట. ఆపై —అయోధ్యలో శ్రీరాముడు 'రాజు నాజ్ఞను విధాతృ నానతిగ' బాటించి అడవులకై పోవలెనని పట్టిన ప్రతిన వారింప దరము గానిది గదా ! ఆవల వాలి కథ. వాలి వధవార్త విన్న లంకలో గలకలము పుట్టెనట. రావణ సంహారము చేసి శ్రీరాముడు సీతా లక్ష్మణులతో పుష్పకారూఢుడయి సాకేతంబున కేతెంచెను. ఈ కథ సంగ్రహముగా వినిపించి 'సుగుణాభిరాముడగు రామునకు జోహారు వొనర్చె'నని పలుకుటలో— ఈ యధ్యాపకుడగు 'సూరి', నవనవలాడు పిల్లల లేత యెడందలలో రామ కథామృతమును జిలికి భక్తి బీజమును బ్రోది సేయుట ఒక విశేషము.

ఇదిగో భాగవత కథ :—

'సర్వంబునం దీశ్వరు డుండును. సర్వం బీశ్వరునియం దుండును.'
'కృష్ణుండు తల్లివలన దాగె.'
'రామకృష్ణులు సాందీపునితోడ వేదంబులం జదివిరి.'
'జరాసంధుడు రాజులచేత గప్పంబు గొనియె'
'కృష్ణుం డర్జునునకు విశ్వరూపంబుం జూపెను.'

ఈశ్వరుని సర్వాంతర్యామిత్వము వంటి తాత్త్విక దృష్టి ఈ వ్యాకరణ శాస్త్రమునకు అనుబంధముగా నుండవలెనేమో ! ఆవల రామకృష్ణుల బాల్యక్రీడలా ? ఆ పై విద్యాభ్యాసమా ! 'హరివంశ కథ' వినిపించిన పిదప 'గీతా' ప్రసక్తియు.

3

చాత్తాద వైష్ణవ వంశ్యుడైన చిన్నయసూరికి 'వైష్ణవ ప్రపత్తి' కుదురుటలో వింత యేముండును ? ఈ శాస్త్రములో యథావకాశముగ పిల్లలకు హరిభక్తి నూరి పోయవలయును.

'హరి నను గృప గాంచెడును.'
'హరి నను గృప గాంచుతను.'
'ఆర్తిహరుడగు నిను గొల్తు నంబుజాక్ష.''
'నంద తనయుండు కృష్ణుండు నాకు దిక్కు.'
'దేవకీపుత్త్రు హరిని నుతింతు నెపుడు.'
'శుభవిధాయుల రామకృష్ణుల భజింతు.'
'భువన వంద్యను రుక్మిణి బొగడుచుందు.'
'అతులుడయి యప్రమేయుడౌ హరిని గొలుతు.'
'ఆద్యు డప్రమేయుడు నగు హరిని గొలుతు.'
'ఆద్యుడు నమేయగుణుడునౌ హరిని గొలుతు.'
'ఆద్యుడయి యప్రమేయుడై యఖిల సేవ్యుడై యొసంగెడు దేవుని నభినుతింతు.'

అట్లని, సూరి—అన్యదైవతము నేమైన ఈసడించెనా ? లేదు. సంబోధనములో ప్లుతమును జెప్పుచు 'ఓ విష్ణూ3' అని పిలిచి, దాని ప్రక్కగా 'ఓ శంభూ 3' అని గౌరవించెను.

'వా రిద్దఱు రుక్మిణీ సత్యభామ' లట.
'వీరు ముగ్వురు శ్రీ భూ నీళ' లట.

ఈ తీరుగ—పురాణ దైవతములను విద్యార్థులకు జూపించినచో ఆ దృశ్యము—ఆ లేతహృదయములలో హత్తుకొని ఎప్పుడేని యొకప్పుడు స్మృతిపథమునకు వచ్చితీరునని సూరి సిద్ధాంతము.

4

అచ్చముగా శాస్త్రీయ విషయములను బోధించునప్పుడు స్ఫటికము వోలె స్వచ్ఛమ్మైన ఆ లేత డెందములలో వినువు కలుగునేమో యన్న భావముతో—ఆ క్లిష్టమ్మైన ఘట్టములోనె ఇంపైన సన్నివేశములు సృష్టించి ఒక చక్కని కావ్యాంశములను సూచించుట సూరికి నైజమయ్యెను. అందును లోకవృత్త మిమిడియుండి పాఠకులకు గొంత వినోదము గూర్పవచ్చును.

'జడంబు ద్వితీయకుం బ్రథమ బహుళంబుగా నగు.' ఈ సూత్రములో గర్భితమైన వినోదము మాత్రము విందము. జడంబు—అనగా ప్రపంచములో ఒక 'జడుడు'—ఉన్నాడట. అతని 'ద్వితీయ' తఱచుగా 'ప్రథమ' యట. 'ద్వితీయ' యనగా భార్య. 'ప్రథమ' యనగా—ప్రధానురాలు. దేనిలో ? సంసార రంగములో. అతడు వట్టి జడుడు గావున—ఆ సంసారములో ఆ బిడదే పైచేయి. అనగా—అతడు అస్వతంత్రుడు; ఆమె స్వతంత్ర. సంసారము దిద్దుకొను భారమంతయు ఆమెదే కావున ఆమె కాతడన్న నిర్లక్ష్యమే గాక విసువు సైతము కలుగవచ్చును. ఆ విసువును బోగొట్టవలెనని పాప మాతడు పదింబదిగ ఆరాటపడుచు ఆమె కేదో రీతిని ప్రీతిని గలిగింపవలెనని ప్రయత్నించి 'వాడు పూవులు దెచ్చె' నట. ససేమిరా యని ఆ పూవులు మాని 'ఆకె సొమ్ములు దాల్చె' నట. పరాభూతుడై 'వా డిల్లు వెడలె' నట. మగనిమీది యలక్ష్యముచే అతడు తెచ్చిన పూవు లంటుకొనక ఇంటిలోనున్న సొమ్ములనే ఒంటికి బెట్టుకొన్నదట. చేతగాని ఒకానొక మగవాని సంసార వైఖరిని సూరి, ఈ రీతిని స్ఫురింప జేసెను.

ఇంకొక్క వినోదము. వైష్ణవ సంప్రదాయములో ఆచార్యుడు తన శిష్యుని 'వర్ధతాం శ్రీః' అని మంగళాశాసన పూర్వకముగా బలుకరించినాడట. ఆ సంప్రదాయమును బట్టి 'దాసోఽహమని' ప్రణామ మాచరింపక, ఆ సంప్రదాయ మెఱుగని యా శిష్యుడు కేవలము 'తుభ్యం నమః' అని మాత్రమే పల్కెనట. అప్పు డాచార్యులవారు దాని కేవగించుకొని 'కింతత్—కస్త్వమ్' అని గదిమెనట. 'అదేమిటోయి ? నీ వెవడవు ? వైష్ణవుడవు గదా !' అని హెచ్చరింపగా—అతడప్పుడు మనస్సునకు దెచ్చుకొని 'దాసో హమ్మని' తప్పు దిద్దుకొనెనట. అపైని ఆచార్యులు 'తత్ కర్తవ్యమ్' అని మన్నించెనట. ఇది వైష్ణవ గురుశిష్యుల ప్రసంగములోని యొక ముచ్చటగా అన్వయించి పాఠకులు వినోద పడవచ్చును.

5

ప్రాయికముగా శాస్త్ర పండితులు శుద్ధ ఛాందసులుగా నుందురని ప్రతీతి. సూరి వైఖరి దీని కపవాద సూత్రము. ఆనాటి నాగరకత, సభ్యత బాగుముగా దెలిసికొని జీర్ణించికొని రాజధానీ నగరములో పేరుపొందిన మహా పండితుడు చిన్నయసూరి.

'చే' దర్థమును జెప్పుచు 'వానలు గురిసినం బంటలు పండును.' 'జాబిలి తోతెంచుడుం గువలయంబులు వికసిల్లె' ఇత్యాదిగ లోక కళ్యాణము గావించు పలుకులే పలుకును. 'కులాలుడు కుండలు వాను' నట. కుండలు వానుట కుమ్మరి ధర్మమనియు, ఎన్ని వృత్తు లీ దేశములో ఇతరాక్రాంతము లైనను కుంభకార వృత్తికి మాత్రము మార్పులు రాలేదుసుమా ! యన్న లౌక్యమును బాలురకు బోధించెను.

'జ్వలన జ్వాలంబు లుప్పరం బెగయును.' పై కెగయుట అగ్నికి నైజము. దీపము నెటు వంచినను దాని కొనమీదికే చూచుట నిత్యము బాలురు చూచు ప్రపంచ జ్ఞానమే అన్వయించి చూపును.

పూర్వ లాక్షణికులు ఉపేక్షించిన 'ఆచ్ఛిక పద ప్రక్రియను' 'ఆచ్ఛిక క్రియా స్వరూప స్వభావములను' దండిగా సూరి వివరించి యుండెను. ఇంత విపులముగా విశదముగా ఇతఃపూర్వము ఎవరు తెలుగు పదముల ప్రక్రియ చూపలేదనియు దానే ఈ ఘట్టములో గట్టితనము చూపితిననియు ఒక భావన కలిగి, 'కృష్ణుం డర్జునునకు విశ్వరూపంబుం జూపె' నని యుదాహరించెను. విహ్వలచిత్తుడైన అర్జును డొక విద్యార్థి. గజిబిజిగా నున్న ఒకానొక యంశమును బోధింపవలెనన్న కృష్ణునివంటి అధ్యాపకుడు కావలెను. ఆచ్ఛికపద విశ్వరూపమును బాలురకై ఈ ప్రకరణములో జక్కగా జూపితినని అతని ధీమా.

'ద్రుత ప్రకృతికముల మీది పరుషములు సరళము లగు' నట. ద్రుత ప్రకృతికమునకు సన్నిహితమైన పరుషము సరళ మగుటలో సాహచర్య ఫలితము కాబోలు ! పారుష్యము పోయి సారళ్య మబ్బుట సహవాస ఫలితములలో ఒకటి గదా ? ఆపై—ఇందలి లక్ష్యములలో కావ్యదృష్టికి జెందిన యొక ముచ్చటయు స్ఫురించును. అది సాయంసంధ్య. కమల బాంధవు డస్తమింపగా—కలువల ఱేడు ఉదయింపవలెను. ఉదయించినది కలువల ఱేడు కావున వెంటనే,

'పూచెను గలువలు'—ఆపై
'తోచెను జుక్కలు' క్రమక్రమముగ
'నెగడెను దమములు' సమయమును బట్టి
'మొగిడెను బద్మము.'

ప్రొద్దు క్రుంకిన పిదప—చీకట్లు క్రమ్మిన యట్టి వేళ జార చోరాదుల టక్కు టమారములు చెలరేగి,

'చేసెను డక్కు' లయ్యెనట.

కువలయ వికాసము, నక్షత్రోదయము, తమః ప్రసారము, జారచోర విహారము, పద్మ ముకుళనము, ఇవి యన్నియు సాయంకాల ధర్మములై వింత సొబగు గూర్చుచున్నవి.

6

సూరి, కావించు సూత్ర రచనలో, సూత్రార్థ వివరణములో, లక్ష్య ప్రదర్శనములో పద్యభాగము నడక యిమిడి కావ్యత్వమును జ్ఞప్తికి దెచ్చును. అది బుద్ధిపూర్వకమో, ఆనుషంగికమో మనము చెప్పలేనంత ధోరణిలో ఆ 'నడక' కానవచ్చును. ఈ లక్షణ గ్రంథమునకు 'లక్ష్య గ్రంథముగా' భావింపదగిన నీతి చంద్రికలో—ఈ 'ఛందోగర్భిత వచన రచనము' హెచ్చుగా గానవచ్చుచుండును. అతని నోట వచ్చు పదములు

తాళ లయాన్వితములై కదనుద్రొక్కుచు—పద్యపాదములుగా బరిఢవిల్లుచుండును.

> 'ఆ ఋశష్వీరుండు వచ్చెనా ఫలించు గార్యముల్'
> (సుగంధి వృత్తము)
>
> 'ముక్కంటి—కడలిరా—చూలి—నలువ.'
> 'సుగుణాభి—రాముడు—రామునకు—జోహారు.'
> మాన—హాని—కంటె—మరణము—మేలు' (రా)
>
> 'మూడు జ—గములు ము—జ్జగములు—మూడు లోకములు ము—ల్లోకముల్.'
>
> 'అన్న — దమ్ములు — తల్లి — దండ్రులు — వూరు —వల్లెలు.'
>
> 'ఊష్మరే — ఫలంబులకు — ద్విత్వంబు — గలుగదు.'
> 'నంద తనయుండు కృష్ణుండు నాకు దిక్కు.'
> 'దేవకీపుత్త్రు హరిని నుతింతు నెపుడు.'
> 'శుభవిధాయుల రామకృష్ణుల భజింతు.'
>
> 'భువనవంద్యను రుక్మిణి బొగడుచుండు.'
> 'అన్నలార ! మిమ్ము నడిగెద నొకమాట.'
> 'ఆర్తిహరుడగు నిను గొల్తు నంబుజాక్ష.' ఇత్యాది.
>
> 'శ్రీలతకుం బ్రాకయు వృష
> శైలంబున వెలసి తనదు చాయ కెలయు ధ
> న్యాళి దగ మాన్పి కోర్కులు
> చాలంగా నొసగు కల్పసాలము గొలుతున్.'

అని మంగళముతో నుపక్రమించి, 'పంకజాక్షాయ నాథాయ వేంకటేశాయ మంగళ'మ్మని శుభాంతముగా — తన వ్యాకరణ శాస్త్రమును ముగించుకొన్న ఈ పరమ వైష్ణవ పండితుని 'లక్ష్యశుద్ధి' లో ధర్మము, నీతి, భక్తి, ప్రసక్తి, వినయము, విధేయత, గాంభీర్యము మున్నగు దొడ్డ గుణములెన్నియో గర్భితములై 'లక్ష్యసిద్ధిని' బడసినవని చెప్పవచ్చును.

అపర చిన్నయసూరియు, అస్మద్గురువర్యులు నగు బ్రహ్మశ్రీ దువ్వూరి వేంకటరమణ శాస్త్రుల వారే ఇందలి సర్వ భావములకు ఉపజ్ఞాతలు.

ఓం తత్ సత్ సుఖజీవిత సేవ
కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారిగారి
"మేల్ మాయిల్ మందు"



ప్రపంచములో ప్రఖ్యాతిగాంచిన మేహ, కుష్టురోగ నివారిణి-
మేహ కుష్ఠవ్యాధివల్ల కష్టపడువారలకు పునర్జన్మమిచ్చు అద్భుత
సంజీవి-మేహరోగ నివారణ నూనె, లేహ్యము.

నల్లమేహ, ఎఱ్ఱమేహ, పొడలు, మేహరణములు, తిముర్లు, మతిమాంద్యము, కుష్ఠములు, పిత్తకారితము, సూతకవ్యాధులు, వాతము, గుల్మము, తెలుపు, ఉష్ణం, గ్రంధి, కాళ్లచేతులు మంటలు, రక్తబలహీనం, గజ్జి, దురద, వీర్యనష్టం, మూలవ్యాధి, మలబద్ధకము మొదలైన అన్ని విధముల దుర్ పీడు వ్యాధులను అతి సులభముగా పోగొట్టును.
40 రోజులు (1 మండలము) నూనె, లేహ్యము 7-0-0 తపాల్ ఖర్చు వేఱు; వివరములకు కేట్లాగులో చూడవచ్చును.

శ్రీ పరమాత్మ తైలము (స్నానమునకు శ్రేష్ఠమైనది)
కండ్లు మంట, కనుచూపు తక్కువ, మెదడు ఉష్ణం, ముక్కులో రక్తము కారుట, కామాల, దగ్గు, గసదగ్గు, శ్వాసకోశమునందు గలుగు అన్ని వ్యాధులను నివర్తిచేసి రక్తశుద్ధిని కలిగించి దేహమునకు సుఖము నిచ్చును.

★

నేరులో రాగోరువారు గమనించవలసినది:
జనుల సౌకర్యమును అనుసరించి ప్రతి ఆదివారము - గురువారము ఉ॥ 9 మొదలు సా॥ 6 వరకు "విరించిపురం" రైల్వేస్టేషనుకు దాపున బస్సు స్టాండులో మా "లక్ష్మీ విలాసం"లో వచ్చేసి వుందుము. నేరులో రాగోరువారు పై తరుణమును ప్రయోజనకరంగా చేసుకోవచ్చును.

K. T. కృష్ణమూర్తి ఆచ్చారి & సన్సు, 5/22, మేల్ మాయిల్ పోస్టు (N. A. Dt.)

నైవేద్యము

శ్రీ శంకరంబాడి సుందరాచార్య

నల్లరాతికి కలతల యిల్లు కట్టి, జారు కన్నీటి ధారల జలకమార్చి, వేడినిట్టూర్పు సెగలలో వేల్చి, మనసు ముందు పెట్టితి నైవేద్యమున కటంచు.

అధరపుటములు కదలించి మధురమంచు
ఆరగించెను నా స్వామి; ఆరగించి,
కడుపునిండక పోయిన కారణమున
కండ లూడ్చెను నాలోన కత్తిదూసి.

ఎముకలొక కొన్ని మిగులగా నేర్చి పేర్చి
నరములను సూత్రములు చేసి సరులు కూర్చి
పచ్చినెత్తుటి పళ్లెమ్ము పట్టిపాడి
అమరుడై యుండు మో స్వామి యంటి నంత.

నిలువు మాసినదే కాని, కలత యేమొ
వెలియనే లేదు, గాలిలో కలవరించె;
కడుపునిండిన వానిని కదలనీక
కట్టివైచెను పెనగుచు కాళ్ళచుట్టు.

పేదగుండియ పేలగా పీల్చినట్టి
వేడినెత్తురు కడుపులో వేదన లిడ
మండుగొంతుక తడుపగా మంచినీళ్ళ
కరవులో పడి యాతడు కలగినాడు.

కనకపీఠము ముంగల కప్పురంపు
ప్రభలు వెలుగంద, అగరుధూపముల నెత్తి
మంచి పన్నీట పాదాలు ముంచికడుగ
పిలుచుచుండియు కలవాడు వెలికిరాడు.

ఏడులోకాల కనుసన్న నేలువాడు
ఇరుకు చీకటిగుడిలోన మరగినాడు
నాకు లేనట్టి దేవుడు లోకములకు
లేడు, లేడింక, పిలిచినా, రాడు రాడు.

న్యాయమూర్తి వెంకటసుబ్బారావు

శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి

ఉవ్వెత్తుగ లేచు కెరటాలతో చెలరేగు కడలికి సమీపమున నున్నది మదరాసులోని ఉన్నత న్యాయస్థానము. ఇందు వాద ప్రతి వాదములు విజృంభించును. రెండు దృశ్యములు ఉద్వేగ సంకుల ప్రాకృత జీవితమునకు దృష్టాంతములు. హైకోర్టు పైనున్నది లైటుహౌస్. ప్రాకృతకాంక్ష నంధకరించి, పారమార్థిక జీవితము గడపు మహనీయుడు మహోన్నత దీప స్తంభమును బోలువాడు. సంసార సింధువున నల్లాడువారి కీతడు మహోజ్జ్వల మార్గమును జూపును.



ఈ దృశ్యమందలి అంతరార్థమును గ్రహించినపుడు వెంకట సుబ్బారావు జీవితమున కిది సంక్షేప వ్యాఖ్యానమని గుర్తింతుము. పెక్కేళ్లీతడు హైకోర్టులో న్యాయవాదిగా, న్యాయమూర్తిగా కృషిచేసెను. హైకోర్టు తరువాతి ఘట్టము సేవా సదనము. ఇందుండి సర్వదిశలందు ప్రసరించిన సముజ్జ్వల కాంతులు దుస్థితి వీచికలలో నల్లాడు అభాగలకు మేలిబాట జూపి, వారి జీవనమందలి చీకటులను పంచ బంగాళ మొనరించును. న్యాయమూర్తియై యుండిన వెంకట సుబ్బారావు ప్రజా సేవకుడై అర్ధాంగి సహితుడై అనేకుల జీవితములను ఆలోక సందీపితము లొనరించెను. ఆత్మజీవన పథమున యాత్రికుడైన మహాపురుషు డాతడు.

బడిచదువు ముగించి 1895లో నీతడు మద్రాసుక్రైస్తవ కళాశాలలో ఎఫ్. ఎ. తరగతిలో ప్రవేశించెను. అద్భుతమైన యంత్రబలముగల దేవాలయమువంటి దీ విద్యామందిరము. ఇందలి విద్యార్థులు పల్వురు కాలక్రమమున మహాపురుషులైరి. రాధాకృష్ణ, రామలింగారెడ్డి, అల్లాడి ప్రభృతు లిందు చదివిన వారే! ఇందలి వైజ్ఞానిక వాతావరణమున వెంకట సుబ్బారావు ప్రతిభ క్రమ వికాసము నందినది.

సహపాఠులలో శ్రీ వి. రాధాకృష్ణయ్య ఈతనికి సన్నిహితుడై యుండెను. ఒకే కొమ్మమీది పూలజంటవలె వీరి శక్తులు శోభిల్లినవి. డామన్ పిథియస్‌లవలె పెక్కేళ్లు వీరు మసలిరి. క్రైస్తవ కళాశాలలో చదువు ముగించి వెంకట సుబ్బారావు లా కలేజీలో చేరెను. 1903 జూలైలో మదరాసు హైకోర్టులో ఈతడు వకీలుగా ప్రవేశించెను. 1921 నవంబరు వరకు ఈతడు న్యాయవాదిగా నుండి, అనంతరము న్యాయమూర్తి పీఠము నలంకరించెను.

సీనియర్ అటార్నీలలో నొకడైన శ్రీ సుబ్బయ్యసెట్టి ఈతని మామగారు. మామగారి ప్రబోధ దృష్టాంతము లీతనికి మేలుబంతులై యుండును. శ్రీ సి. పి. రామస్వామి బావమరది శ్రీ సి. వి. కుమారస్వామిశాస్త్రి ఈతని గురువు.

అభియోగ విచారణమున రెండు శాఖలు కలవు. విషయ సమీక్ష ప్రాథమిక శాఖలోనిది. విషయ పరిశీలన మొనరించిన పిదప సముచిత న్యాయశాస్త్ర సూత్రమును ప్రయోగించు విధానము విశేషించి రెండవ శాఖలో పరిఢవిల్లును. ఒరిజినల్, అప్పెలేట్ భాగము లనబరగు వీనిలో ప్రత్యేక ప్రజ్ఞలు వ్యక్తమగును.

మొదటి భాగమున క్రాసు పరీక్షకు విశేషావకాశము కలదు. మానసికతత్త్వ విచారణమున కిందు పని కలదు. ప్రాథమిక ఘట్టమున చాలకాలము తన ప్రాక్టీసును వెంకటసుబ్బారావు సాగించెను. వర్తకమునకు సంబంధించిన కేసు లీతనికి విశేషముగా లభించేవి.

అతడు ప్రాక్టీసు ఆరంభించిన దినములలో న్యాయవాదవృత్తి జగతియందు విశేష గౌరవ భూయిష్ఠమై యుండేది. హిందూ మహమ్మదీయ న్యాయ శాస్త్రములకు ఆధునిక యుగమున రోమన్ జ్యూరిస్ ప్రూడిన్స్, ఆంగ్ల రాజ్యాంగవిధానములు ప్రతీచీ న్యాయశాస్త్ర విధులు తోడైనవి. కోర్టులో వాద ప్రతి

వాదములు ఇప్పటివలె ఆంగ్లములోనే సాగుచుండెను. తుది అప్పీళ్లు ప్రీవీ కౌన్సిల్‌కు పోయేవి. ఉమేశచంద్ర వందోపాధ్యాయుడు (డబ్ల్యూ. సి. ముఖర్జీ మొదటి కాంగ్రెసుఅధ్యక్షుడు) ఆరు నెలలు కలకత్తా హైకోర్టులోను, ఆరు నెలలు ప్రీవీ కౌన్సిలులోను ప్రాక్టీసు చేసేవాడు. అతడొక ఆంగ్ల యువతిని వివాహమాడినాడు. అతనికి ఆంగ్ల సంప్రదాయముపై ప్రీతి మెండు. ఇంగ్లండులోనే లా చదివి బారిస్టరులై మన దేశమున న్యాయవాదవృత్తి నవలంబించువారికి పాశ్చాత్యప్రథపై నెంత మక్కువ యుండేదో చెప్పనక్కరలేదు. ఏథెన్స్ రోముల సంస్కృతి యూరపు సంస్కృతిపై తన ప్రచారమును విస్తరింపజేసింది. గభీర వైదుష్యము, సాహిత్య ప్రజ్ఞ, వచఃకౌశలము న్యాయవాది కుండితీరవలెనను వ్యూహ ఆ దినములలో తన పాణింధమమును ప్రయోగించినది. వీరు స్వాతంత్ర్యప్రియులు. కావున రాజకీయవేత్తలై సింహనాదమొనరించుచు, నిరంకుశత్వముతో భీషణ సమరము సలుపువారు. కొందరు కోర్టులో ప్రాక్టీసు చేయకపోయినను, తమ న్యాయశాస్త్ర, తర్కశాస్త్ర) సాహిత్య శక్తులను పురస్కరించుకొని మహామేధావులై కళోపాసకులై, స్వీయ పాండితీ చరితార్థత నందుచు, సహజ వ్యక్తిత్వ విజృంభణమున విశేషానందము నందువారు. ప్రాచీన న్యాయ శాస్త్రవేత్తలును, మహా వక్తలును వీరి కారాధ్య దైవతములై యుండువారు. మూడవజార్జి కాలములోను, విక్టోరియా రాణి కాలములోను ఈ మహా విద్వాంసులు న్యాయ శాస్త్రమున స్వర్ణయుగమును సృజించి మొదటి ఎలిజబెత్ కాలములోని ఆంగ్ల స్వర్ణయుగప్రభావమునకు దానిని సహపాఠి జేసిరి. వారి వచః కౌశలమున కలరి వాగ్దేవి మహోద్వేగముతో ఆకాలమున తన వీణా తంత్రులను ప్రయోగించెను; పొంతనున్న నెమలి వయారముగ నృత్య మొనరించినది; మంద గమనము విడచి మరాళ మెగసినది.

గ్రీసులోని సుప్రసిద్ధవక్త డెమొస్తనీస్(383—322 బి సి.) లాయరుగానుండి పెద్ద కేసులను మాత్రమే చేబట్టువాడు. ఆతని కంఠస్వరము ననుసరించి కడలిమీది పెక్కు కెరటాలు పెక్కునోళ్లతో భీషణస్వర మొనరించుచు వియత్తలమును చుంబింపనారంభించినవి. ఆతని ప్రభావము ఇటలీలోని సిసేరోపై, ఇంగ్లాండులోని ఎడ్మండ్ బర్కుపై పడినది.వీరిని మించిన వక్తలు జగతిలో నింకను పుట్టలేదు. న్యాయశాస్త్రమును పఠించిన గెటే స్కాటులు న్యాయవాదవృత్తి నవలంబింపకపోయినప్పటికీ, పరిణతి నందిన తమ యాంతరంగిక శక్తులను విస్తృత సారస్వత క్షేత్రములందు వ్యక్తీకరించిరి. కడచిన శతాబ్దమందును, ప్రస్తుత శతాబ్దారంభమందును ఇంగ్లండులో ప్రజ్ఞాధురీణులైన లాయరు లుండేవారు. సర్ జాన్ సైమన్ భారతీయులకు సుపరిచితుడే! సాంద్రగహనముపోలు అభియోగాంశములనుండి తృటిలో కారణకార్య సూత్రమునకు లొంగు స్పష్టాంశము కనుగొని కేసులా కుప్పను పెల్లగించి కయిసేతపై కంసాలి సుత్తి దెబ్బ వేసినట్లు చరచి సత్యమును చేబూని న్యాయమూర్తి కందించు కౌశల మాతనికుండేది. బర్కెన్‌హెడ్ ప్రభృతు లెట్టివారో తెలుపుట కిందు చోటు లేదు.

ఆంగ్ల సంప్రదాయమును తు. చ. తప్పక అనుసరించిన న్యాయవాదులు వంగదేశీయులు. దశాబ్దులకుమున్ను వీరొనరించిన సింహరవము నేడును కలకత్తా హైకోర్టులో మారు మ్రోగుచున్నది! న్యాయవాదులలో సార్వభౌముడు రాష్‌బిహారీ ఘోష్ “నీ నెంరాబడిని మూటితో గుణించిన నా రాబడి మొత్తము తేలు”నని కర్జన్ ప్రభువుతో తెలిపినవా డీతడు. ఈతనియొద్ద అప్రెంటిస్‌గానుండిన మహామేధావి ఆషుతోషు ముఖర్జీ. ఇక చిత్తరంజనదాసు ?వప్పుతో కాలువేసిన జడ్జీల నెందరినో లేవనెత్తి వారికి న్యాయ శాస్త్ర సూత్రములను విప్పి చెప్పి అనేక పర్యాయము లీతడు బ్రిటిష్ సింహముతో ఢీకొనినాడు. మదరాసు హైకోరు నుండి తరలి కలకత్తా హైకోర్టులో ప్రాక్టీసు ఆరంభించిన నార్టర్ శక్తికీతని శక్తి తీసిపోలేదు. ఏడేళ్లు బి. యల్. లో పల్టీ కొట్టిన తారకనాథపాలిట్, బి. సి. చటర్జీ, జె. ఎన్. రాయులును తమ వృత్తిలో గామాలైరి. కోటి రూకలు సంపాదించిన సర్కార్ సివిల్ కేసులు చేబట్టి నేరిమితో రూకలు చేబట్టువాడు. ఇతడు వక్తకాడు. రచయితయునుకాడు. కాని అదృష్టవంతుడు.

బొంబాయి హైకోర్టులో ఇందరు వక్తలులేరు. ఎం.ఆర్. జయకరు మేలివక్తయైన న్యాయవాది. ఫెడరల్ కోర్టులో, ప్రీవీకవున్సిల్‌లో న్యాయమూర్తి. పిదప పూనా విశ్వకళా పరిషత్తులో ఉపాధ్యక్షుడు. అతని తరువాత గణింపదగినవాడు బులాభాయ్ దేశాయ్. నాగపూరులోని అభయంకర్ భయరహితుడై అరచువాడు. హిస్సార్‌లో ప్రాక్టీసు ఆరంభించిన లాలాజీ కొలది సంవత్సరములే ప్రాక్టీసు చేసెను. అలహాబాదు హైకోర్టులోని మోతీలాల్ నెహ్రూ తేజ్ బహదూర్ సప్రూలు మహావక్తలు కారు; మంచి డిబేటరులు.

ఇక మన మద్రాస్ న్యాయవాదులు? వీరికిని బెంగాలీ లాయర్లకును చాల భేద మున్నది. వంగీయు లుద్వేగభరితహృదయులు. సహజముగ మహావక్తలు. వీరి హృదయశక్తి మహత్తరమైనది. తమిళులకు మేధాశక్తి మెండు. శబ్దములతో వియత్తలమును చరచినట్లుండు వక్తృత్వమును వీ రెరుగరు.

తన సాహితీకౌశలముతో నెదుటివారిని మంత్రముగ్ధులను చేయుశక్తి శ్రీ సి. పి. రామస్వామి అయ్యరుకు కలదు. బెసెంట్ నారాయణయ్యరు కేసులో బెసెంట్ నోడించి, ఆమె మెప్పుపడసి ఆమె సహచరుడైనా డీతడు.నిర్దుష్టమైనఉచ్చారణలో అద్వితీయుడైన మహావక్త రైట్ ఆనరబుల్ శ్రీనివాసశాస్త్రి. ఇతడు న్యాయవాది కాడు. ఝంఝానిలమున కీడైనవేగముతో నుపన్యసింపజాలువాడు సత్యమూర్తి. కాని న్యాయవాదవృత్తియందు ఈతడు శ్రద్ధ వహింపలేదు. మహా మేధావులైన భాష్యం అయ్యంగారు, సుబ్రహ్మణ్యఅయ్యరు, ముత్తుఅయ్యరుల న్యాయశాస్త్ర వైదుష్యము ఇంగ్లీషువారిచే సైతము తల లూపించినది. న్యాయమూర్తులై వీ రొసగిన తీర్పులు ప్రీవీకౌన్సిల్ జడ్జీల మెప్పునందినది. శివస్వామిఅయ్యరు చల్లగా మెల్లగా మాట్లాడు న్యాయవాది. సుందరఅయ్యరు, కె. శ్రీనివాసఅయ్యంగారులు కేసు నెగ్గించుకొనజాలు ప్రజ్ఞగలవారు. కృష్ణస్వామిఅయ్యర్ మంచివక్త. రామేశం

మంచి జ్ఞాపకశక్తి గలవాడు. అల్లాడి కేసులాను దిగ్ర్మింగిన మహాభోక్త. ఎస్. శ్రీనివాసఅయ్యంగార్ కలహింపకలిగిన మేధావి. న్యాయెంట్ (గేంట్, వి. వి. శ్రీనివాసఅయ్యంగారు, టి. ఆర్. రామచంద్రయ్యర్, టి. ఆర్. వేంకటరామశాస్త్రి ప్రభృతులు తమ వృత్తిలో అతిరథులు.

వెంకట సుబ్బారావు వ్యక్తిత్వము వేరు. తన వృత్తి యెడల ఈతనికి ప్రీతి మెండు. రాజకీయ సాహిత్యోద్యమముల నీతడు తొంగిచూడలేదు. మహావక్త కావలెనను లక్ష్యము ఈతని దృష్టిలో నున్నట్లు తోచదు. ఈతడు వలచినది న్యాయము. ఆరాధించినది ధర్మము. సత్యాన్వేషణము, సత్యారాధనము, సత్య నిర్వచనము ఈతని లక్ష్యములు. నిరంతర పరిశ్రమ ఈతని ఏడుగడ. స్వాతంత్ర్యేచ్ఛ ఈతని మనుగడను తనిపిన సత్యనారాయణ ప్రసాదము. ఫుల్ బెంచ్ మీది ఇతర జడ్జీలు, కొమ్ములు తిరిగిన న్యాయమూర్తులొక్కతాటిపై నిలిచినప్పుడు, తన దృక్పథము వేరైనప్పుడు చల్లగ నీతడు తన త్రోవను త్రొక్కువాడు. వ్యక్తి సౌమ్యుడు. వజ్రాదపి గట్టిదై ఒక్కొక్కపుడు కుసుమాదపి మృదులమైన హృదయము గలిగి వేరొకప్పుడు న్యాయ నిర్వచన మొనరించు ధీరు డీతడు. ఈతని 'ససేమిరా' లో సత్యపురశ్చరణ ముండెడిది. తర్కశాస్త్రప్రజ్ఞకు, న్యాయశాస్త్ర ప్రత్యేక ప్రక్రియను జోడించి, వలచిన సిద్ధాంతమునకు తగు సాక్ష్యమును సృష్టించి 'ధూమధామము'చేసి గణాచారివలె గంతువేసి కేసు నెగ్గించుకొను లాయర్లున్నారు. వీరొడ్డిన వలలో పడు న్యాయమూర్తులును ఉన్నారు. వీరికిని వెంకట సుబ్బారావుకును చుట్టపు జూపులు లేవు. కేసు చిన్నదైనను, పెద్దదైనను, ఆర్థికమైన విలువ హెచ్చైనలలో నున్నను, కోటి రూకలం దున్నను, సత్యము ఆకళింతకందువరకు,ధర్మపిపాసతీరువరకు గడియారముపై చూపు నిలుపక, తన పీఠమునుండి ఎదుటి న్యాయవాది నీతడు నిలుపువాడు.

ఒక్కొక్కపుడు ఒక ప్రత్యేకపు కేసులో తనకు తెలియని విషయమేమైననున్నయెడల కొలది దినములు కేసును నడువనిచ్చి, దానికి సంబంధించిన గ్రంథముల నీతడు గృహమున పఠించువాడు. ఒకానొక కేసు విచారణలో న్యాయవాది "ప్రభూ! తమరు జిల్లా మునసబు పద్ధతి నవలంబించుచున్నారేమి?" అని ప్రశ్నింపగా, "న్యాయము నిర్వహించుటకై గ్రామ మునసబు పద్ధతినైనను నేను నిర్వహిస్తా"నని ఆతడు ప్రత్యుత్తర మిచ్చెను. గర్వమెరుగని న్యాయమూర్తి ఆతడు. కొన్ని సమయములందు సమక్షమందలి న్యాయవాది శాఖాచంక్రమణ మొనరించుచు, వ్యర్థమైన శబ్ద విజృంభణ మొనరించుచున్నను, శాంతిని సడల నీయక, ఓరిమికి జలాంజలి ఈయక చెవులొగ్గి ఇరుపక్షముల వాదములను శ్రద్ధగా వినుట ఈతని యభ్యాసము. చురుకుతన మెరుగక న్యాయముమీది మక్కువ నెక్కువగా జూపిన జస్టిస్ బేక్ వెల్, కొంత తలబిరుసుతనమును వ్యక్తీకరించెడి జస్టిస్ ఫిలిప్స్ సమక్షమున సంయుతము సహజమైన స్పష్టీకరణముతో వాదనలోని నేరిమిని చూపి పిదప వారితో కలిసి బెంచిపై నధివసించి తన వ్యక్తిత్వమును తాను వ్యక్తీకరించుకొనినవా డీతడు. అభియోగ నిర్వహణమందలి క్రమవిస్తరణ విభాగము (Examination-in-chief, Cross-examination, Reexamination) అందు విస్తృతమగు విషయ పరంపరలోని ప్రధాన భావములను దృష్టియందిడికొని, సముచిత ధర్మశాస్త్ర నిబంధనల ప్రయోగము నెరిగి, సన్నిహిత భావసామ్యముగల వెనుకటి కేసులు విచారణీయాభియోగమున కెట్లు వర్తించునో వివరించుచు, హేతు సంబద్ధమైన సిద్ధాంతములను వ్యక్తీకరించుట న్యాయమూర్తి పీఠమున నీతడు నిర్వర్తించు కర్జ మయ్యెను.

ఈతని ఆత్మవిశ్వాసము అద్భుతమైనది. తన సమీక్షవలన తలయెత్తిన సిద్ధాంతము తక్షణబలము చేకూర్చునదికాక, ప్రతికూలమైన వూహకు అవకాశ మిచ్చు ప్రీవీకౌన్సిల్ తీర్పు గోచరించుచున్నను, అనుకూలముగ దోహదమొసగు ప్రీవీకౌన్సిల్ తీర్మానము తలసూపవచ్చునని ఒకప్పు డీతడు విశ్వసించెను. న్యాయశాస్త్ర సమ్మత జాత్యధికార సమీక్ష నొక శిశువు విషయమున జేయునపు డీత డట్టి స్వాతంత్ర్యమును, ధృతిని వ్యక్తీకరించెను. ప్రీవీ కౌన్సిల్‌కు చెందిన జూడిషియల్ కమిటీలోని సభ్యుడైన సర్ జాన్ వాలిస్ ఈతని సిద్ధాంతమును బలపరచెను. హైకోర్టు వరకు కేసులను సాగించి, నష్ట కష్టముల పాలబడక పల్లెలందే వానిని పరిష్కరించుకొనుట మేలని రాను రాను ఈతడు తెలుపువాడు.

సమకాలికులం దీతని శక్తిసామర్థ్యములను దూర దృష్టిగల సచివుడు పానగల్‌రాజా గుర్తించియే 1921 నవంబరు మాసములో ఈతనిని, ఈతనితో దేవదాసును హైకోర్టుజడ్జీలుగా (ఇరువురు బ్రాహ్మణేతరులకు ప్రత్యేకపు తావు లుండుట గమనించి) నియమించెను. ఒరిజనల్ సైడ్ వకీలు గద్దె నెట్లెక్కజాలునని కొందరు గుసగుసలాడిరి. నిరంతర పరిశ్రమలో అజేయుడైన వెంకట సుబ్బారావు తనకంతకుమున్ను అంతగా పరిచితములుకాని న్యాయశాస్త్రములను హృదయంగమము చేసికొని, నిర్దుష్టముగ తన కర్తవ్యమును నిర్వహించి, ప్రజ్ఞాధురీణులైన సర్ వి. ఎం. కౌట్సు ట్రాటర్, సర్ సి. వి. కుమారస్వామిశాస్త్రుల ప్రశంస నంది 18 ఏళ్ళు జడ్జియైయుండిన ముత్తుస్వామిఅయ్యరు తరువాత మరే న్యాయమూర్తి ఆక్రమింపనంత కాలము పదునేడేళ్ళు తన పీఠము నలంకరించెను. న్యాయవాదిగా నున్నప్పుడు తన జూనియరులను ప్రోత్సహించినట్లు న్యాయమూర్తిగా నున్నపుడు సత్యకాములైన న్యాయవాదుల నతడు ప్రోత్సహించెను.

రెండు పర్యాయము లాతడు ప్రధాన న్యాయమూర్తిగా నుండెను. తరువాత పర్మనెంట్ చీఫ్ జస్టిస్‌గా నుండవలసిన సమయమున ఆత డన్యాయమునకు గురి అయ్యెను. లైయొనెల్ లీచ్ మెడలో పూలదండ పడినది. ఆ పదవి ఆతనికి దక్కెను. కృష్ణదాసని పిలువబడిన శ్రీ సదాశివఅయ్యరు స్థానము నాతని పిదప అలంకరించిన ఆతనివలె ఇతడు ఆదర్శ న్యాయమూర్తి అయ్యెను. వెంకట సుబ్బారావు న్యాయ పరిశీలన కర్తవ్యమును బహు

పీఠముల (Quasi-judicia Tribunal) నలంకరించెను. సర్ విక్టర్ మఱ్రే కనుట్స్‌ట్రాటర్ అధ్యక్షత నేర్పడిన ఎలెక్షన్ కమిటీలో నీతడు సభ్యుడు. 1935 లో అతడు సరిహద్దులను నిర్ణయించుట కేర్పడిన కమిటీ (Delimition Committee) లోను, సర్ బారీ హమ్మండ్ అధ్వర్యమున నేర్పడిన ఫ్రేన్‌చైజు కమిటీలోను సభ్యుడై, సమస్త దేశమందు పర్యటించెను. 1936 లో సర్ బిరుద మాతనిని వరించెను.

అనంతరము నైజాముయొక్క బీరారు ఏజెంటుగా 1939 జూలై నెలలో నియోగింపబడెను. కొంతకాలము నాగపూర్‌లోను, కొంతకాలము హైదరాబాద్‌లోను వసించి ఆ రీతి కర్తవ్యమున కంతకుమున్ను అలవాటు పడకపోయినను, విశేషశ్రద్ధవలన అవలీలగా దాని నాకళింతకు దెచ్చుకొని నేరిమితో నాతడు తన ధర్మమును నెరపెను. ఈ పదవి నీతడు 1942 లో పరిత్యజించెను.

పదవులను పరిత్యజించిన పిదప ఈతని జీవితము ఘనమైన పరిమితి నందెను. నలువురు మహోవ్యక్తుల ప్రబోధ దృష్టాంతము లిందుకు తోడుపడెను. మొదటి వ్యక్తి ఈతని అర్ధాంగలక్ష్మి శ్రీమతి ఆండాళమ్మ. రెండవ వ్యక్తి శ్రీ రమాదేవి. శ్రీ రమణ మహర్షి, భక్తివిలాసతీర్థులు తక్కినవారు.

పూర్వజన్మ సుకృతమువలన ఎవ్వరికైన (ముఖ్యముగ మహాపురుషునకు) అనుకూలమైన ఇల్లాలు లభించును. సతీ పతుల హృదయములందు ఏకైక భావపూర ముప్పొంగినపుడే వారి జీవనములు గంగాయమునల కలయికవలె పునీతములై యుండును. లోకారాధ్యుడైన శ్రీ రామానుజస్వామి ఆశ్రమస్వీకార మొనరించుటకు మున్ను మనసుకు వచ్చిన పత్నిని పడయలేకపోయెను. సోక్రటీస్ సతి గయ్యాళి. మిల్టన్ కవి భార్య ఆతనికి తగిన యిల్లాలు కాదు.

ద్వితీయ వివాహమున వెంకట సుబ్బారావుకు లభించిన అర్ధాంగలక్ష్మి ఆదర్శ గృహలక్ష్మి. ఈమె హృదయము కారుణ్య శరధి. స్త్రీ జనసముద్ధరణమునకై, అభాగినీబృంద పునరుద్ధరణమునకై ఈమె కంకణము గట్టికొనెను. ఈమె దృఢవ్రతమున తలయెత్తినది సేవా సదనము. ధర్మపత్ని త్రొక్కిన తెన్నులో వెంకట సుబ్బారావు కాలుంచెను. తాను సంపాదించిన విత్తమందు శేషించిన మొత్తమును సేవా సదనమునకు సమర్పించెను.

ఈ సంస్థ నాతని సతీమణి 1928 లో స్థాపించెను. తలిదండ్రులులేని అభాగినులు, ఏ దిక్కులేక అల్లాడువారును, ఇందు ప్రవేశమునందిరి. మదరాసులో దాని ప్రధానకేంద్రము షేట్‌పట్‌లో కలదు. త్యాగరాయనగర్‌లో నొక శాఖయును, తాంబరములో వేరొక శాఖయును నెలకొనినవి. ఈ తావులందు రెండు ఉన్నత పాఠశాలలును, పారిశ్రామిక పాఠశాలలును స్థాపింపబడినవి. వీనిలో సుమారు రెండువేలమంది బిడ్డలు విద్యాభ్యాసము చేయుచున్నారు. వీరిలో పలువురకు ఉచితవ్యవస్థ కలదు. శ్రీ ఆండాళమ్మ తన శక్తులను, సమయమును ఈ సంస్థల పురోభివృద్ధికై వినియోగించుచుండెను. భవనముల నిర్మాణమునకై సుమారు లక్షరూకలు వెచ్చింపబడెను. విద్య నభ్యసించు శిశువులు 'అమ్మా' అని అదరానురాగములతో శ్రీ ఆండాళమ్మను పిలుతురు. బ్రిటిష్ ప్రభుత్వము మన దేశములో నిలిచిన దినములలో సయితము ఆమె నిర్వహించు సేవా ధర్మమును పాలకులు వేనోళ్ళ ప్రశంసించి 'కేయిజర్ ఇ హింద్' రజతపతక బహూకృతితో ఈ తల్లిని గౌరవించిరి. ఇప్పటి ప్రభుత్వము మూడేళ్ళకుమున్ను పద్మభూషణముతో నీమెను సత్కరించెను. బిడ్డలులేని శ్రీ శారదాదేవీ రామకృష్ణ పరమహంసలు అసంఖ్యాకులకు జనయిత్రీజనకులైనట్లు శ్రీ ఆండాళమ్మా వెంకట సుబ్బారావులు దీనబంధువులై పల్వురకు తల్లిదండ్రులై, పరమపూజ్యులై యొప్పిరి. మానవలోకములో ఈ రీతి జననీజనకు లెంద రుందురు? ఈ విధముగా కడుపు ఫలించిన భాగ్య మెందరికి చేకూరును? దిక్కుమినులు సయితము ఈ పగిది అమ్మ అయ్యలకు ప్రణమిల్లి అనిర్వచనీయానందము నందవా? అంతరంగమందలి సచ్చిదానందములు ఆత్మప్రకాశమునకై గ్రుక్కిళ్ళు మ్రింగవా? నిభృతహృదయమందలి అమృత సింధువును ప్రసనమాత పంచిపెట్టదా? చంద్రికా సంయోగమున స్మితముఖియగు కుముద్వతి కవికుమారునకు సౌందర్య భిక్ష పెట్టునట్లు కనకమరీచి సంస్పర్శవలన పులకితగాత్రియగు శతపత్రసుందరి "నీదాన"నని ప్రణయపరిష్వంగము నర్థించు భాస్వద్రోచికి స్వీయహృదయము నర్పించునట్లు కృపాసింధులైన మానవాంతరంగము అంజలి ఘటించు భువనప్రకరమునకు "జ్యేరు కొను"మని ప్రమోదదానమును ప్రసాదించదా? ఆత్మార్పణమున, స్వీయబలిదానమువలన, ఆత్మత్యాగమున మహనీయు లందు మహత్తర పరితోషమును వేయినోళ్ళ శేషుండైన వర్ణింపజాలునా? జగతీహృదయమందలి ఆరాటమును పోద్రోలి సమక్షమున నిర్వాణపథమును నిలుపుటకై ఘోరతపస్సున స్వీయజీవనమును జొనిపిన శాక్యముని అంతరంగమున నెంత ప్రమోదము నంద లేదు? సమ్మెట దెబ్బలబలమువలన వాడిమేకులు కీలుకీలున లోతు గోతులు త్రవ్వినపుడు వేడి నెత్తురు వెడలి ఏరులై పుడమిపై ప్రసవించినపుడు "తండ్రీ! వా రేమొనరించుచున్నారో యెరుగరు. వారిని కావు"మని కరుణ సంభరిత రుద్ధస్వరముతో నిష్ఠురులైన శత్రువుల సముద్ధరణకై పొగిలి, స్వీయజీవితముపై మణిస్థగిత మకుటమును నిలుపుకొనిన జీవి యెట్టివాడు? సమస్త సృష్టి త్యాగఫలమే కదా! షెల్లీకవి సమస్త దిశలందు అనురాగసంశ్లేషము నవలోకింపలేదా? (Vide; Shelly's Love's Philosophy) విరాడ్పురుషుడు సమస్తవిశ్వమునకు ఆత్మార్పణమయ్యెనని జ్యోతిర్మయమైన మనవైదికవాఙ్మయము తెలుపుటలేదా? పురుషసూక్తమందలి అంతరార్థమేమి? 'యో మామ్ పశ్యతి సర్వత్ర' "సర్వభూతత్వ మాత్మానాం" "విద్యా వినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని" మున్నగుశ్లోకములతో భగవద్గీత ఘోషించు మహా మంత్రము లేమి? పశువులకు సయితము సేవ సలిపిన శ్రీ కృష్ణుడు స్వీయప్రబోధ దృష్టాంతముల నెట్లు వ్యక్తీకరించెనో యెరుగమా? శిబిదధీచుల త్యాగములోని గభీరార్థము మన కవగతమే కదా! పవిత్ర దంపతులకై ఆత్మజీవితమును బలిదానముగా సమర్పించిన సిడ్నీ కార్టన్ ఎట్టిమహా

త్ముఁడో ఆంగ్ల సాహితి (Vide - "Tale of Two cities" by Charles Dickens) ఘోషించుట లేదా?

1950 లో శ్రీ వేంకట సుబ్బారావు జీవితగగనముపై ఘనతరమైన కాంతి గోచరించెను. మంగుళూరునుండి విచ్చేసిన శ్రీ రమాదేవి ఈతని సమక్షమున సాక్షాత్కరించిన మంగళ ముహూర్తమున ఈతని హృదయమందలి భక్తిసింధువు నింగిమీది నిండు చందురుని స్పృశింపనెంచు మహోదధివలె ఉప్పొంగినది. న్యాయవాదియై, న్యాయమూర్తియై నిశిత పరిశీలనమునకు తీవ్ర సమీక్షకు అలవాటు పడిన మహావ్యక్తి భక్తుడగుట సామాన్య విషయము కాదు.

ఆధునిక యుగము సైన్సు యుగము. ప్రత్యక్ష ప్రమాణమును, సమగ్రమైన సాక్ష్యమును, నిండు రుజువును కాంక్షించు కాల మిది. నేటి విద్వాంసులలో పల్వురకు శరణ్యమైనది తర్కశాస్త్రము. కారణకార్యసూత్రమున కవ్వల నున్న దానిని వీరు విశ్వసింపరు. దివ్యదృష్టికాని, అంతర్దృష్టి సమక్షమున సాక్షాత్కరించు అతిలోక దృశ్యముగాని, ఆధునికుల కవగతముకాదు. మంత్రద్రష్టలును, అతీంద్రియద్రష్టలును, దివ్యానుభూతినందిన సంయమీంద్రులును నవయుగ దిగ్వలయమున నంతగా గోచరించుట లేదు. మహాపురుషసంపర్కము విశేష పూర్వజన్మసుకృతమువలన గాని లభింపదు. శ్రీ శంకర భగవత్పాదుల 'వివేక చూడామణి' ఈ భావమును వేనోళుల జాటుచుండుట లేదా? పరమహంస సంస్పర్శవలన నరేంద్రనాథుడు శ్రీ వివేకానందస్వామి అయ్యెను. శ్రీ రమాదేవీ ప్రబోధము వలన వేంకట సుబ్బారావు భక్తవతంసుడాయెను. అతని జీవితమే భజనమందిర మాయెను. మదరాసులో త్యాగరాయనగరమందలి తిరుమలైపిళ్లై వీధిలోని 36 వ నెంబరు "వ్రజ" యను ధామము నిక్కంపు "వ్రజధామమే" యైనది. దీని ప్రాంగణమున నొక భజనమందిరము నిర్మింపబడినది. శ్రీ రమాదేవి భక్తులును, అంతేవాసులును ఇందు భజనచేయుచుండుటవలన పల్వురు యాత్రికుల నిది ఆకర్షించుచున్నది.

శ్రీ రమణమహర్షి ప్రభావము కూడ ఈతనిపై ప్రసరించెను. ఆర్యావర్తమందలి శ్రీ రామకృష్ణ పరమహంస శ్రీ శివానంద స్వాములవలె దక్షిణాపథమున శ్రీ రమణ మహర్షి శ్రీ రామదాస స్వాములు ప్రపంచదృష్టి నాకర్షించిన మహాత్ములు. ప్రతీచీ యాత్రికులు సయితము వీరి యాశ్రమ వాతావరణ మందలి భావబ్రహ్మాండములను తమ యాకళింతయందు జేర్చుకొని పునీతులైరి. హైకోర్టునుండి దిగివచ్చిన న్యాయమూర్తి వెంకట సుబ్బారావు జరీపాగాను నేల దింపి, మేలి వలువలను వదలి భక్తుని ఉడుపులను దాల్చి జిజ్ఞాసువై, తాత్త్వికవిభూతికై తపించెను. శ్రీ చైతన్యమఠాధ్యక్షులైన శ్రీ భక్తవిలాసతీర్థులు కూడ వీరికి గురువైరి. వైష్ణవ దృక్పథము ననుసరించి నారాయణ సాక్షాత్కారము నెట్లు౦దవలెనో,భగవంతుని విభూతిని గుర్తించు టెట్లో ఈతడు గ్రహింపసాగెను. గభీరతాత్త్వికచింత చేయునపుడు, జటిలములై గోచరించిన సమస్యలను పరిష్కరించుకొనవలెనను నిశ్చయముతో క్లిష్టతాత్త్విక భావములను స్పష్టముగ గ్రహింపవలెనను సంకల్పముతో శ్రీ భక్తి విలాసతీర్థుల సమక్షమునకు బాలకుడైన అంతే వాసివలెపోయి, వెంకట సుబ్బారావు హృదయమును విప్పి, తన సంశయములను వ్యక్తపరిచి, బహుళ ప్రశ్నలవలన వానిని దీర్చుకొని సంతృప్తినందువాడు.

1953 లో మదరాసు సేవాసదనము ముప్పదవ వార్షిక మహోత్సవ సమయమున తాత్త్విక చక్రవర్తియైన శ్రీ రాధాకృష్ణ పండితు నాహ్వానించి ఆ మహనీయుని ఉపదేశము నంది అతడును అతని అర్ధాంగలక్ష్మియును పరమానందభరితులైరి.

ఈ మహనీయుల ప్రబోధ దృష్టాంతములు శ్రీ వేంకట సుబ్బారావు కృషికి విశేషశక్తిని చేకూర్చినవి; వ్యక్తిత్వ విస్తరణకు భావశబలతను ప్రసాదించినవి.

వ్యక్తిత్వ వికాసము అద్భుత పరిణతిని, ఈశ్వర విభూతీ వ్యాప్తిని దృష్టాంతీకరించునది. దేవాలయమందలి మహిమ యంత్రశక్తియందు కలదు; మహామంత్రమందలి మాహాత్మ్యము బీజాక్షరమున నున్నది; మహోన్నత వటమహీరుహముయొక్క ప్రాణము చిన్ని గింజనుండి వృద్ధి నందును. ఏశుభంకరముహూర్తమందో ఏ తీవ్రానుభూతివలననో, ఏ మహోజ్జ్వల దృష్టాంతావలోకనమువలననో, ఈశ్వరకటాక్షమువలననో మనుష్యాంతరంగమున తళ్కొత్తిన భావవిద్యుల్లత సమస్త జీవితమందును ప్రసరించును. ఆ మంగళ ముహూర్తమందే వ్యక్తిత్వము యావత్తూ అద్భుత పరివర్తనమునందును. కర్మసిద్ధాంతము ననుసరించి కోటి కోటి జన్మలందు సముచిత సంస్కారము నందజాలు జీవి పూర్వోక్త ముహూర్తమున బడసిన మానవజన్మ సోపానమునుండి మీది మెట్టుపై కాలుంచి దేవత్వసిద్ధి నంది, తానే నటరాజై భువన మోహన నృత్య మొనరించును. ఆహా! మనుష్యజీవన మెంత మహత్తరమైనదో గుర్తించితిరా?"అహంబ్రహ్మాస్మి" "తత్త్వమసి" అను మహావాక్యలు గంభీర భావబంధురములు కావా? నేలమీది చిన్ని పూవును సుదూర వియత్తలమందలి నక్షత్రమును అక్కసెల్లెండ్రని గుర్తించినపుడు విశ్వకుటుంబ మెంత విస్తీర్ణము కలదో, అందలి ప్రణయ ప్రభావ మెంత వ్యాప్తి కలదో గ్రహింపలేమా? అద్భుతప్రజ్ఞాకవితమైన మనుష్యజీవిత మెట్టి విస్తృత విభూతీ ప్రదీప్త విశ్వ కుటుంబమున పరిఢవిల్లునో యూహించితిరా? బ్రతుకుపై పాడు పులుగులవలె ఘోరారిష్టములు వ్రాలునపుడు "హతవిధీ" "మాల దైవమా" అని అంగలార్చుచుందుము. గుండెలోని ప్రాణమున కెనయైన స్వర్ణమాణిక్యవల్లి దుర్విధి చేతిలోని నిశితలవిత్రమువలన పుటుక్కున తెగి ఎందో యెగసి పోయెనని యూపిల్లుచుందుము. కడలిలోని సుడిగుండములందు వినబడు ఆభీలనిస్వనము సాగరసంగీతమున గలిసిపోవునట్లు, ఘోరారిష్టముల వికటాట్టహాసము నవగ్రహగాన మాధుర్యమున విశ్వసంగీత ప్రదర్శనమున లీనమైపోవును. పుష్పము సౌరభదానమువలన ఆనందమును మనుష్యాంతరంగమున సృజించు లీల,

ప్రసూన సమీపమందలి వాడిముల్లు గుండెలో గ్రుచ్చుకొని, తీవ్ర యాతనా సంస్కారమున నెంతో ప్రజ్ఞానదానమును ప్రసాదించునుగదా! ముముక్షువు కాంక్షించు మోక్షము ప్రజ్ఞానానంద సంయుక్త శక్తి సముద్భవమైన మేలిఫలమే కదా! మానవుడు దేవుడగుటకు ముద్దులును, గ్రుద్దులును కూడ అక్కరైనవే కదా! ఇట్లని యెరిగిన భగవంతుడు ఒకపరి సుఖపరిష్వంగమున తనిపి, వేరొకమారు గభీర దుఃఖజలధియందు పడద్రోసి, ఒకమారు వీపు దువ్వి వేరొకమారు చెంపపై చరచి, ఒక పర్యాయము మృష్టాన్నము నోటనుంచి, వేరొకతూరి చేదురసము కంఠమున పోసి మనుష్యజీవనము నెట్లు పెంపొందించుచున్నాడో! నవ్వులును, నిట్టూర్పులును జీవితపాత్రమున అనవరతము కలియుచుండుట కన్నున్నవారు గుర్తింతురు. సుఖదుఃఖములు జీవనస్తన్యమున వెలారు ఏకైకదుగ్ధమే కదా! ఐహికజీవితవక్షస్థలమున కిరువైపులందు పరిఢవిల్లు పాలిండ్లు అరిష్టానందములు. వీని యనుభూతి సామాన్య మానవున కెట్లవసరమైనదో మాంధాతబోలు మన్నీనికిని అట్లే అవశ్యకమైనది. ఈ యనుభూతిలోని విభూతిని మనన మొనరించుకొనుచు సాధకుడు ఒడుదుడుకులందు గుండెకు ఘనతరమైన దిటవు జేకూర్చుచు, సద్భావ సంస్పర్శవలన కన్నులనుండి వెలారు బాష్పాంబువును అమృతధారగా పరివర్తన మొనరించుచు, ఈశ్వరధామముదెస ముందంజ వేయుచుండును. సాధకు డొక్కనాటితో సృష్టియగు మట్టిబొమ్మ కాదు; భవపరంపరయందు సమ్యజ్ఞానక్రమానుభూతి సముద్భవపరిణతి నందిన అద్భుతజీవి యాతడు.

మనుష్యుడు నిరుపేదరైత్తై, ఎవ్వరికంట బడకుండ ఏ పొలమందో అల్లాడవచ్చును. లేదా మహా మేధావియై, రంగస్థలమున అద్భుతవచఃకౌశలమును ప్రదర్శింపవచ్చును. అతులైశ్వర్య సంపన్నుడైన నృపశేఖరుడు కావచ్చును; లేదా త్యగస్థిమాత్రావశిష్టశరీరుడైన బిచ్చకాడై ప్రపంచవీధులం దల్లాడి తిరిపెమెత్తవచ్చును. తన కీర్తిచంద్రికలతో దిక్కామినులను దనుపవచ్చును; లేదా పేరుప్రతిష్ఠల నెరుగక ఏ మూలనో జీవితము గడపవచ్చును. సాధకుడుకాక పూర్వము మానవుడేమైన కావచ్చును. ఎన్ని రీతుల హెచ్చులొచ్చులందో, మిగ్రుపల్లములందో, వానిజీవితము దొరలవచ్చును. సాధకుడైన పిదప "అతడు రారాజా? రాజవీధి భిక్షుకుడా?" అని ప్రశ్నించువారెవరు? బుద్ధిమంతుడైన మనుష్యుడు పరమార్థసిద్ధికి, ఇహ జీవిత చరితార్థతకు చెరుపుదెచ్చు బ్రతుకులో, ఐహికార్థసంపాదనలో, కొరగాని పేరు ప్రతిష్ఠల ప్రాకులాటలో, పదవుల పెనగులాటలో కాలహరణము చేయడు? మానవుడు కాంక్షింపవలసినది జగతిలో మెప్పుకాక జగదీశుని మెప్పు సుడీ. కీర్తికి వేరు పేరు ఆమెప్పు. ఈ మెప్పు అన్నివేళల జ్ఞానముపై ఆధారపడియుండదు. ఈశ్వరుని మెప్పు అనంతజ్ఞానముపై అధారపడి సర్వతోముఖసముద్ధరణకు తోడుపడునది. కావున బుద్ధిమంతులు జీవన పరమావధి నెరిగి, మృషావిజృంభణ బంధుర జీవనము గడపక, సత్వరముగ సాధనపథమందు ప్రవేశింతురు.

న్యాయవాదులెందరో సంచులు మూట గట్టుకొని వాని నొక మూల బడవైచి ప్రపంచ రంగస్థలమునుండి నిష్క్రమించిరి. న్యాయమూర్తులెందరో పుట్టిరి. ఎందరో గిట్టిరి. వీరి వూసు ఎందరికి, ఎవ్వరికి అక్కరైనది? పతితజన సముద్ధరణకై, దీనజన పునరుద్ధరణమునకై నడుముగట్టువారు మానవ లోకమున నెందరుందురు? న్యాయవాదియై, న్యాయమూర్తియై యుండిన వెంకటసుబ్బారావుకు కొంత ప్రత్యేకవ్యక్తిత్వముండుట విక్కమే! సేవాసదన సంరక్షకుడై, ధర్మ నిర్వహణదక్షుడైన వెంకటసుబ్బారావుబోలువా రెందరో యుండరు.

1953 లో సేవాసదన రజతోత్సవము జరిగినపుడు శ్రీ ఆండాళమ్మ వెంకట సుబ్బారావులు విశేషముగ గౌరవింపబడిరి. వేంకట సుబ్బారావు 83 వ జన్మ దినోత్సవ సందర్భమున సుప్రసిద్ధ న్యాయవాదులును, రచయితలును, ప్రేమప్రసూనాంజలితో ప్రశంస ప్రభాకలిత గ్రంథము నాతనికి బహూకృతిగా సమర్పించిరి. దుర దృష్టవశాత్తానే డాత డస్తమించెను. కాని సతీసహితుడై, ఆతడు స్థాపించిన సేవాసదనము సుస్థిరమై నిలుచునని, అందలి జ్యోతి దిర్ధిర దిరుగు విద్యుద్దీపమువలె సర్వదిశలందు మహోజ్జ్వలకాంతులను ప్రసరింపజేయుచు, మనుష్యజీవనమందలి అజ్ఞానాంధకారమును, అరిష్టసంతమసమును మాపుచేసి అసంఖ్యాకుల జీవనముల నాలోకసందీపితము లొనరించునని విశ్వసించుచున్నాను.

అమృతమతి

శ్రీ టి. రాఘవేంద్రరావు

పాత్రలు :

యశోధరుడు - చక్రవర్తి
అమృతమతి - యశోధరుని దేవేరి
చిత్ర - అంతఃపుర పరిచారిక
అనంగుడు - తోటమాలి

[యశోధరచక్రవర్తి సౌధానికి కొంత దూరంలో ఉద్యానవనం. వనంలో ఓ మూల అనంగమోహనుడి కుటీరం. సాయంత్రం, పూలచెట్ల దగ్గర కుటీరం ముందున్న అరుగుమీద కూచుని సంధ్య అందాన్ని చూస్తూ వివశుడై ఉంటాడు అనంగుడు. చిత్ర వస్తున్నందుకు గుర్తుగా పాద మంజీరశింజితం వినవస్తుంది.]

అనంగుడు : చిత్రా, నా సురుచిర సుందర స్వప్నబాలా, నీ రాకను తెలిపే మంజుల మంజీర శింజితాలను అలాగే కాసేపు విననివ్వు. అద్భుతమైన గానం వినవస్తోంది నీ పాద నూపురరవంలో.

చిత్ర : నిరంతర గానలోలుడివి. వేణుగానంతో శ్రోతల్ని మంత్ర రుద్ధ భుజంగాలకు మల్లే ముగ్ధులను చేయగల మహత్తర శక్తి ఉంది నీలో. నీవు ఇంద్రజాలికుడివి.

అనం : నీ కళ్లలోని ఇంద్ర ధనుస్సులు సృష్టించే ఇంద్రజాలం కన్న నా పాటలో మహత్తుముందీ ?

[పుష్పాపచయం చేస్తూ చిత్ర తోటలో తిరుగుతుంది. ఆమె వెనకాల దిగులుగా వెళ్తాడు అనంగుడు.]

అనం : సంధ్య అందాన్ని, నీ సౌందర్యాన్ని ప్రతి సాయంత్రం చూడటానికి అలవాటు పడ్డాను. నీవు రాని రోజు నా హృదయం విషాదభరితం అవుతుంది. ఏదో అనిర్వచనీయమైన దిగులూ, బాధా, అసంతృప్తి.

చిత్ర : (విచారంతో) ఏముంది నాలో. నాకోసం ఎందు కంత దిగులు అనంగా ! అంతఃపురంలో సామాన్య పరిచారికను. నాపాద నూపురరవంలో సంగీతధ్వనుల్ని సృష్టించగల శక్తి లేదు. నేనేం రాజనర్తకినా ?

అనం : (ఆవేశంతో) చిత్రా నీ అంగ భంగిమలలో, కదలికలో నిసర్గమైన లయ ఉంది. నీ సౌందర్యం అతిలోకం. దురదృష్టవశాత్తూ రాజసౌధంలో పరిచారిక వయ్యావు.

చిత్ర : (చిరునవ్వుతో) నీ మాటలు వింటూంటే నా కెంతో ఆనందంగా ఉంది.

అనం : నిన్ను చూస్తే, తాకితే, నీ మాటలు వింటే కలిగే ఆవేశంతో నా వూరుపులో నవజీవ శక్తిని నింపి వేణుగానం చేస్తాను. నిన్న రాత్రి లోకాన్ని వెన్నెల వెలుగుతో వెలిగించింది. నువ్వు జ్ఞాపకానికి వచ్చావు. నా హృదయం బాధతో కుమిలింది. దిగాలుగా వేణుగానం చేస్తో కూర్చున్నాను.

చిత్ర : (కన్నీటితో) లోక సమ్మోహనకరమయింది నీ వేణుగానం. నిన్న రాత్రి సౌధోపరి భాగంనుంచి నీ పాట విన్నాను. నీ అద్భుత వేణు గానం నా శ్రవణ కుహరాల్లో ప్రవేశించి హృదయాన్ని చొచ్చి మాధుర్యంతో నింపివేసింది. నా కళా స్థానాలను తాకి గిలిగింతలు పెట్టింది. నీ దగ్గరకు పరుగెత్తి రావాలనిపించింది. రాణివాసపు భయంకరమయిన కట్టుబాట్లు నన్నడ్డగించాయి. కుమిలి కుమిలి ఏడ్చాను నాలో నేను.

[అనంగుడు చిత్ర కోసిన పువ్వుల్ని దోసిళ్లతో తీసుకుని అరుగుమీద కుప్పగా పోసి చదికిలపడి చిత్ర వేపు చూస్తాడు.]

చిత్ర : (దండ గుచ్చుతూ) అనంగా నీవు పరిచయమై . . . .

అనం : రెండు నెలలు కావస్తోంది.

చిత్ర : ఇంతలో మనిద్దరికీ యెంత సాన్నిహిత్యం ఏర్పడిందో చూశావా ? ఏమిటో ఎంత బ్రతిమలాడినా నీ గత చరిత్ర యేమీ చెప్పవు కదా ?

అనం : గతాన్ని మరచి వర్తమానంలో జీవించడం నా వ్రతం. చిత్రా ! నువ్వెంత సౌందర్యమయమైన వాస్తవానివి. నీ సమక్షంలో గతాన్ని, ఆగతాన్ని గురించి ఆలోచించడం యెంత అసందర్భమైన విషయమో నాకు తెలుసు.

చిత్ర : అనంగా నిన్నో విషయం అడగాలి.

అనం : ఊఁ !

చిత్ర : నీ వేణుగానం విని యెవరైనా రాచకన్య వస్తే నన్ను విస్మరిస్తా వనుకుంటాను.

అనం : అనురక్తుల హృదయాల్లో అనవసర భయాలు, సందేహాలు నిరంతరం ఉత్పన్న మవుతాయి. ప్రేమిస్తున్న వ్యక్తుల అసాధారణ ప్రణయాని కిది తార్కాణ. నా పట్ల నీ హృదయం గాఢానురాగ పూరితం. అందుకే నీ కీ పిచ్చి సందేహాలు.

చిత్ర : నీ వియోగం ఒక్క క్షణం కూడ సహించలేక పోతున్నాను. జీవితకాలమంతా నీ సమీపవర్తినై నీకు సేవ చేస్తూ గడపాలని ఉంది. కానీ, తీరని కోరిక.

అనం : ఎంత అందమైన తలంపు. గానానికి ఆవేశం, ఉద్వేగం కావాలి. కళాకారుడి హృదయంలో అది రేపే కల్లోల

కళాసృష్టికి మూల కారణం అవుతుంది. ఆ అనంతమైన ఆవేశం నీవల్ల లభ్యమవుతోంది. నా గానంలోని ప్రాశస్త్యానికి కారణం నీవు.

చిత్ర : ఆవేశం క్షణికం. క్షణికావేశాన్ని కలుగజేసే నేను నీతో శాశ్వతబంధానికి తగనేమో అనిపిస్తోంది.

అనం : కానీ, నాకు నిరంతరావేశం కావాలి. శలభంలా గానాగ్నిలో మాడిపోయినా సరే. ఇద్దరం లోకాన్ని ధిక్కరించి అనంతవిశ్వంలోని రహస్య సౌందర్య ప్రదేశాలకు వెళ్లిపోదాం.

[అనంగుడు లేచి సంధ్య కేసి చూస్తూ నుంచుంటాడు. చిత్ర తను గుచ్చిన దండను అనంగుని మెడలో వేస్తుంది. అనంగుని ఎడమచేతి కైవారంలో చిత్ర నడుము యిమిడిపోతుంది.]

అనం : ఓహో ! యవ్వనలక్ష్మి తన శృంగారాన్ని నీలో పూర్తి చేసుకుంది. (ఉదయిస్తున్న చంద్రరేఖ కేసి చూస్తో) నీ స్నిగ్ధ ప్రకాశమాన ఫాల భాగాన్ని చూసి చంద్ర రేఖ సిగ్గుపడుతోంది.

చిత్ర : నీ మామూలు మాటల్లో యేదో తీయని సంగీతం వినవస్తోంది. నేను ధన్యను.

అనం : చిత్రా ! అనంత విశ్వసౌందర్యానికి నీవు ప్రతీకానివి. నీ గులాబిరంగు బుగ్గల ముందు సంధ్యారుణిమ వెల వెల పోతోంది. కుచభారంచేత వంగి, ఆచ్ఛాదనలేని నీ స్నిగ్ధ భుజద్వయం సూర్యాస్తమయ సమయంలో యెర్రనైన పడమటి కొండల్ని జ్ఞప్తి కెలయిస్తోంది. అమూల్యమైన పెన్నిధివి నీవు నాకు.

[చిత్ర అనంగుని కౌగిలిని వదిలించుకుని అంతఃపురం వేపు వెళ్తుంది. దిగులుగా ఆమెకేసి చూస్తో నుంచుంటాడు అనంగుడు.]

2

[ఒకనాటి అర్ధరాత్రి. అమృతమతి సౌధం. సౌధ కుడ్య భాగాలను అలంకరించటానికి చిత్రకారులు పంపిన చిత్రాలను పరిశీలిస్తో సౌధాంతర్భాగంలో సుఖాసీనయై ఉంటుంది అమృతమతి, యశోధర చక్రవర్తి పట్టపురాణి. చిత్ర ఒక్కొక్కటే అందిస్తూవుంది.]

అమృతమతి : చిత్రా, యీ సుందర చిత్రం చూశావా ? దూరాన శిథిలాలయం. ఆలయంవేపు వెళ్తున్న అభిసారిక అంగ సౌష్ఠవాన్ని అద్భుతంగా చిత్రించాడీ చిత్రకారుడు ఎవరో ?

చిత్ర : దేవిగారి అభిమానాన్ని క్షణ మాత్రంలో చూరగొన్న ఆ యువ చిత్రకారుడు ఇందీవరాక్షుడు.

అమృ : అహో ! చిత్రరచనా సందర్భంలో అతని యువ హృదయంలో మెదలిన స్త్రీ యెవరో ధన్యురాలు.

చిత్ర : దేవీ ! అందుకే సర్వ కళా ప్రపంచం మీకు జోహారు లర్పిస్తోంది. శిల్పులు, గాయకులు, చిత్రకారులూ మిమ్ము స్తుతించని రోజు లేదు. యశోధర చక్రవర్తి రాజ్యంలో సర్వ కళలూ విలసిల్లటానికి కారణం మీరు. అది లోకం గుర్తించింది.

అమృ : (పరిశీలిస్తున్న చిత్రాన్ని చిత్రకు అందిస్తూ నిట్టూర్పుతో) ఎందుకో అనంతమైన తపన. విశ్వగతిమైన అనంత సౌందర్యాన్ని నాదిగా చేసుకోవాలనే జ్వలిస్తున్న యిచ్ఛ నన్ను కదిలిస్తోంది. ఈ తృష్ణ నా రుధిరంలోని ఉష్ణోగ్రతకు కారణమై తీవ్రమైన అశాంతికి లోనవుతోంది. కళాతృష్ణలేని సామాన్యం జీవితాలే హాయి.

చిత్ర : మీరు చిత్రించిన చిత్రాలు అద్భుత సౌందర్యంతో విరాజిల్లుతున్నాయి. ప్రదర్శించకుండా దాచేస్తున్నారు. ఎందుకో ?

అమృ : సామాన్య చిత్రా లవి. ప్రదర్శనకు తగవు. పరిపూర్ణత సాధించాలనే తీవ్రమైన కోర్కెతో పోరాడుతున్నాను. నిజానికి పరిపూర్ణత్వ సిద్ధి కళా ప్రపంచంలో అసాధ్యం అని తెలుసు. అయినా ఏదో వెర్రి అన్వేషణ.

చిత్ర : నిరంతరాలోచనలతో, నిద్రలేమివల్ల బాగా అలసిపోయారు. కళాప్రసక్తి ఏ రూపంలో వచ్చినా తదేక దీక్షతో నిమగ్నులయి పోతారు. (కిటికీలోంచి బయటకు చూస్తూ) అబ్బ ! ఎంత రాత్రి గడిచింది.

అమృ : (తల్పంమీద యిబ్బందిగా పడుకుంటోంది) వెళ్ళు చిత్రా ! వెళ్లి పడుకో.

3

[అంతఃపుర సమీపాన కావలివాళ్లు పారా తిరుగుతున్న అలికిడి. నలుదిక్కులా వెన్నెల వ్యాపించి క్షీరసాగరంలా ఉంది. నిశ్శబ్దం విశ్వాన్ని పరిపాలిస్తోంది. ఎక్కడ్నుంచో వేణుగానం అస్పష్టంగా, క్రమంగా స్పష్టంగా వినవస్తోంది. మధురంగా, గంభీరంగా యెలుగెత్తి ప్రేయసిని పిలుస్తోన్న ప్రేమికుడి హృదయబాధ ద్యోతక మవుతుంది. చిత్ర నెమ్మదిగా సౌధోపరి భాగానికి వెళ్లి వేణుగానం వింటూ నుంచుంటుంది.]

అమృ : (చిత్రను సమీపిస్తూ) ఎక్కడి దీ వేణుగానం ? వినే వాళ్ల గుండెల్ని చీల్చేలా ఉంది. అనంతమైన బాధను గుండెలో దాచుకుని విషాదరాగ భరితంచేసి వేణుగానం వినిపిస్తున్నాడు. ఏ వియోగానలం కాలుస్తున్నదో అతన్ని !

చిత్ర : (తల వంచుకుంటుంది సజలనయనాలతో.)

అమృ : మధురగానశ్రవణంవల్ల కలిగేది ఆనందమని కొందరి యూహ. కానీ దుఃఖమే మిగుల్తోంది. గానం విన్నంత సేపూ హృదయంలో తెలియని ఏ మధుర ప్రపంచపు సరిహద్దుల్లోనో విహరిస్తుంది. గానం ఆగిపోయాక యీ లోకపు శూన్యం, మాలిన్యం నిలుచోనివ్వక

హృదయాన్ని చీలుస్తాయి. ఈ వైవిధ్యం, వైపరీత్యం మహాకవి కవిత్వంలా వ్యాఖ్యానాని కందదు.

చిత్ర : దేవీ ! తమ రింతగా స్తుతించే గానం మన ఉద్యానవన పాలకుడిది.

అమృ : ఓహో ! యశోధర చక్రవర్తి రాజ్యంలో తోటమాటలు సైతం యింతటివారా ? చిత్రా, అతని పేరు ?

చిత్ర : అనంగమోహనుడు.

అమృ : కొత్తపేరు. నే నిదివరకు వినలేదు.

చిత్ర : ఇటీవలనే ఉద్యానవన పాలకుడుగా చేరాడు. ఏ దేశమో తెలియదు. వృక్షశాస్త్ర పరిజ్ఞానంతో ప్రభువును మెప్పించి కొలువులో కుదిరాడు.

[వేణుగానం క్రమంగా హెచ్చు స్థాయిలో వినిపిస్తోంది. క్షణకాలం రిచ్చవడి అమృతమతి ఆనందంతో, తృప్తితో శిరఃకంపనం చేస్తోంది.]

అమృ : చిత్రా, యిప్పు డతని గానం స్వయంగా, సమక్షంలో వినాలి.

చిత్ర : ఈ అద్దమరేయి.

అమృ : ఔను. బహుకాలంగా సంగీతం వినలేదు. చక్రవర్తికి రాజ్యంలో చెలరేగిన విప్లవాన్ని అణచటంతో సరిపోతోంది. వినోదాలు వారికి నచ్చవు.

చిత్ర : (ఆశ్చర్యంతో) అనంగమోహను డిప్పుడిక్కడి కెలా వస్తాడమ్మా ! అంతఃపుర మర్యాదలు అర్ధరాత్రి అతిక్రమించడమే ?

అమృ : అక్కర్లేదు. మనమే అక్కడికి వెళ్దాం.

చిత్ర : ఏమిటమ్మా ! అర్ధరాత్రివేళ ఉద్యానవనానికా ? దారుణ పరిణామాలకు దారితీసే . . . .

అమృ : చిత్రా ? రహస్యమార్గం ద్వారా శివాలయానికి, అక్కడ్నుంచి ఉద్యానవనానికి.

చిత్ర : అమ్మా !

[రహస్యమార్గం ద్వారా ఉద్యానవనానికి వెళ్తారు అమృతమతీ, చిత్రా. పర్ణశాల ముందు కూచున్న అనంగుని దగ్గరకు వెళ్తుంది చిత్ర. అమృతమతి అనంగునికి కనపడకుండా నిలుచుంటుంది.]

ఆనం : (వెన్నెల్లో చిత్రను గుర్తించి) వచ్చావా చిత్రా ! వెన్నెల్లో అవతరించిన వనలక్ష్మిలా. ఎలా వదిలి వచ్చావ్ అంతఃపురాన్ని? (ఆవేశంతో చిత్ర దగ్గరకు వెళ్తాడు.)

చిత్ర : (దిగ్భ్రమచెంది) అనంగా !

అనంగ : ఓహో ! అద్భుతమైన నీ తనూద్యుతిని చూసి వెన్నెల వెలవెలపోతోంది. నక్షత్రాలు నీ సౌందర్యానికి తల వంచుకుంటున్నాయి. (చిత్ర దగ్గరకు వెళ్ళి ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటాడు. అమృతమతి ప్రవేశిస్తుంది. చిత్ర తల వంచుకుంటుంది. అనంగుడు ప్రాన్పడిపోతాడు. అవనతశిరస్కు డౌతాడు.)

అమృ : అంతఃపుర స్త్రీని వేణుగానంచేత ఆకర్షించి హృదయాన్ని దోబరుచుకుంటున్న వారికి తగిన శిక్ష విధించాలి. చిత్రా ఈ అకార్యకరణానికి . . .

చిత్ర : (తల వంచుకుని) క్షమించండి.

అనంగ : దేవీ ! చిత్ర నిర్దోషి. నేను శిక్షార్హుణ్ణి. నన్ను శిక్షించండి.

అమృ : అయితే మాకు మరో గంట వేణుగానం వినిపించటమే ప్రస్తుతం నీకు విధిస్తున్న శిక్ష.

అనం : ధన్యుణ్ణి.

4

[అమృతమతి చిరునవ్వుతో చిత్ర పరచిన పూలసెజ్జమీద కూచుంటుంది. ఆమె పాదాల ప్రోల చిత్ర కూచుని ప్రేమతో అనంగునివేపు చూస్తోంది. గంటసేపు వేణుగానం విని అంతఃపురానికి బయలుదేరి వెళ్తారు. అమృతమతి శయనగృహంలో యశోధర చక్రవర్తి కూచుని ఆమెకోసం యెదురు చూస్తుంటాడు. రహస్యమార్గం ద్వారా అమృతమతి లోపలకు ప్రవేశిస్తోంది.]

అమృ : ప్రభూ !

యశో : అర్ధరాత్రి దాటాక అమృతమతీదేవిగారు అంతఃపురాన్ని వదిలి వెళ్ళవలసిన అవసరం ?

అమృ : ప్రభూ !

యశో : మా మనస్సు శంకాకులం అవుతోంది. యశోధర చక్రవర్తి పట్టపురాణి ప్రవర్తన నేటికి సందేహాస్పదం.

అమృ : (యశోధర చక్రవర్తిని సమీపిస్తూ) ఇలా నా కళ్ళల్లోకి చూడండి. న న్ననుమానిస్తున్నారా ?

యశో : నేనే కాదు. అంతఃపురాన్ని అర్ధరాత్రి వదిలి వెళ్ళిన అమృతమతిని చూసిన ఎవరైనా అనుమానిస్తారు. ఇది మహాపరాధం. క్షంతవ్యం కాదు. రాజ్యరమాభద్రంకరకృషినిమగ్నుణ్ణయి పట్టమహిషిచేత వంచింపబడ్డాను.

అమృ : ప్రభూ ! అనవసర సందేహాలతో నా హృదయాన్ని చీలుస్తున్నారు; నన్ను నిలువునా చీలుస్తున్నారు.

యశో : పాతకీ !

అమృ : శివశివా ! ఆమాట అనకండి (కన్నీళ్ళతో యశోధర చక్రవర్తిని సమీపిస్తోంది.)

యశో : రహస్యమార్గంద్వారా శిథిలాలయానికి. ఏ సంకేతస్థలాలకో !

అమృ : వేణుగాన శ్రవణవాంఛ మహాపరాధమా ! కళారాధన దోషమా ? పొరబడుతున్నారు ప్రభూ.

యశో : అసూర్యంపశ్యయైన అంతఃపురకాంతకు తగనిపని చేసి క్షమాభిక్ష కోరడం కేవలం నటన. కళావ్యాజంతో అకార్యకరణానికి . . .

అమృ : ప్రభూ (మూర్ఛపోతుంది.)

(యశోధరచక్రవర్తి వెళ్ళిపోతాడు. శయనగృహంలో విషాదవాతావరణం అలుముకుంటుంది.)

ఆర్యుల తొలినివాసం భారతదేశమే

శ్రీ ఎస్. వి. శేషగిరిరావు

కడచిన సెప్టెంబరు 'భారతి' 'ఆర్యుల తొలి నివాసం భారత దేశం కాదా?' అనే నా వ్యాసాన్ని ప్రచురించింది. శ్రీ వి. కే. రంగా రావుగారు 'ఆర్యుల తొలి నివాసం భారత దేశమేనా?' అంటూ నా వ్యాసాన్ని విమర్శించేందుకు ప్రయత్నించారు. (భారతి 1961 జనవరి : కలగూర గంప.) వారికి సమాధానంగా ఈ వ్యాసం రూపొందించబడింది.

నేను ఏడు ప్రధాన అంశాలను నా వ్యాసంలో చర్చించాను. (1) ధ్రువచలన సిద్ధాంతం, (2) రామాయణ మహా భారతాలు—వాటి కాలాలు, (3) ఋగ్వేదంలోని ఆధారాలు, (4) వైదిక వాఙ్మయంలో అనార్యులమీది వర్ణనలు, (5) ఆర్యశబ్ద నిర్వచనం, (6) ఆత్మరక్షణకోసం ఆర్యులు సాగించిన పోరాటాలు, (7) ప్రాచీన సింధు నాగరికత. శ్రీ రంగారావుగారు తమ విమర్శలో 4—5—6 అంశాలను దాటవేశారు. వా రిచ్చిన ఒకే ఒక ఉపమానం కూడా అతకకుండా ఉన్నది.

(1) కొన్నివిషయాలను మనం కేవలం అసంభవాలని త్రోసి వేసినంతమాత్రాన సరిపోదు. ఉదాహరణకు యిదే ధ్రువచలనం వలన 10535 సంవత్సరాల తర్వాత ఋతు కాలాల్లో తీవ్రమైన మార్పులు రానున్నాయి. ఎండకాలము, చలికాలము, తారుమారు కానున్నాయి. భూమి ఒకే పరిధిలో తిరుగుతున్నా యిరుసును మార్చుకొంటున్నది.

(2) రామాయణం వ్రాయబడిన పిమ్మట రామాయణ గాథ జరుగకముందు మహా భారత యుద్ధం జరిగి ఉండకూడదా? అని శ్రీ రంగారావుగారు ప్రశ్నిస్తున్నారు. కాని ఏ వాల్మీకి అయితే రామాయణాన్ని సంకలనం చేశారో వారే సీతాదేవికి గర్భవతిగా నున్నపుడు ఆశ్రయ మిచ్చారు. వారి ఆశ్రమంలో లవకుశులు పుట్టి పెరిగారు. వారిచేత వాల్మీకి మహర్షి రామాయణాన్ని గానం చేయించారు. ఇవన్నీ వాల్మీకి శ్రీరాముని సమకాలికులని నిరూపించటం లేదా?

మహా భారతగాథ ప్రాచీన మైనదని నిరూపించేందుకు యింకా యిలా అన్నారు శ్రీ రావుగారు: "రాముడు దక్షిణాపథము౦దు తిరిగి చివరనున్న లంకలో రావణ సంహారం జరిపాడన్నది తెలిసిన విషయమే. మహాభారత నాగరికత యింకా గోసంపద స్థితిలోనే ఉన్నదని ఉత్తర దక్షిణ గో గ్రహణాలవలన, ఘోష యాత్రవలన విదితము." నా కీ వాదములో పటుత్వం కనిపించటంలేదు. మహా భారతంలో రాజసూయాన్ని గురించి గోగ్రహణాలకన్నా విపులంగా చర్చించబడింది. ఈ రాజసూయం సందర్భంలోనే, అర్జునుడు హిమగిరులను అధిగమించి మధ్య ఆసియాను కూడా జయించాడనీ, భీముడు బ్రహ్మదేశమును (నేటి బర్మాను) జయించి యితర పూర్వాంచల రాజ్యాలను నిర్జించాడనీ, స్పష్టంగా చెప్పబడింది. పశ్చిమ తీరంలోని ద్వారకావాసి శ్రీ కృష్ణుడు, అస్సాం కొండ చరియలమధ్య నక్కి ఉన్న ప్రాగ్జ్యోతిషాన్ని నరకుని చెరనుంచి విడిపించాడనీ ఉంది. కురుక్షేత్ర సంగ్రామసీమకు సుదూర ప్రాంతాలనుంచి ఎందరో రాజులు తమ సైనిక గణాలను తరలించుకొని వచ్చారని స్పష్టం చేయబడింది. అందుచేత రామాయణకాలంనాటికి దూర ప్రాంతాలకు వెళ్లి యుద్ధం చేయగల్గిన శక్తి కలదని, అది మహా భారత చరిత్ర నాటికి లేదని చెప్పటానికి ప్రయత్నించటం వాస్తవాన్ని కప్పి పెట్టటమే.

ఇక గోగ్రహణాల విషయం:—గో బ్రాహ్మణ జన రక్షణ తమ కర్తవ్యమని ఆనాటి పాలకులు విశ్వసించారు. గోవులను తమ మానబిందువులుగా (Points of Honour) పరిగణించారు. వాటికి అవమానం జరిగితే నాటి క్షత్రియులు సహించలేక పోయేవారు. సరిగ్గా యిదే సున్నిత భావాన్ని (Sentiment) తగవు తెచ్చుకొనేందుకుగా దుర్యోధనుడు రెచ్చగొట్టాడు. శ్రీరాముని పూర్వజుడైన దిలీపుని జీవితంలోమాత్రం ఇలాంటి ఘట్టం లేదా? జమదగ్ని—విశ్వామిత్రుల ఉదంతం మాత్రం దేన్ని నిరూపిస్తుంది?

పచ్చిక బీళ్ళను వెదుకుతూ, పశువుల మందల చాటున వలస వచ్చిన ర్యులు తూర్పునుంచి రాలేదు కదా? పడమటినుంచి వచ్చిన వీరు శ్యామలమైన సప్త నదీ పరీవాహ ప్రదేశాలను వదలి తూర్పున ఎక్కడికో వెళ్ళవలసిన అవసరం నాకు కనుపించటం లేదు. ఆర్యులు పశ్చిమ దిక్కునుంచి వచ్చిఉన్నట్లయితే నాగరికతలు, సామ్రాజ్యాలు పశ్చిమాన్నే మొదట వికసించి ఉండాలి. "కావచ్చు"లు ఆధారంగా మనం సిద్ధాంతాలను నిర్వచించలేము. అసలీ కావ్యాలు చారిత్రక సత్యాలను నిరూపించే యితిహాసాలు కావని శ్రీ రంగారావుగారు తిరస్కరించారు. కాని ఇవి రెండూ చారిత్రక సత్యా లనేవిషయాన్ని ఈనాటి చరిత్రకారులందరూ ఒప్పుకుంటున్నారు.[1] వ్యాస విస్తరణ భీతిచేత ఈ అంశాన్ని వదలి వేస్తున్నాను.

---

1. మార్క్సిస్ట్ చరిత్రకారుడు శ్రీ డాంగే మహా భారత యుద్ధం రామాయణం తరువాత జరిగిందని అంగీకరించాడు. (India from primtive Communism to slavary.) శ్రీ వి. డి. పుసల్కర్ మిగిలిన చరిత్రకారుల అభిప్రాయాలను సమీక్షిస్తూ యిదే అభిప్రాయాన్ని ధ్రువపరచారు. (The Vedic Age Cha. XIV, Bharatiya Vidya Bhavan series)

(3) ఆర్యులు ఎక్కడఉంటే ఆ ప్రదేశాలను వర్ణించా రనేది ఆధారంలేని మాట. ఏ నదులకైనా వారి వర్ణనలు సరి పోతాయనటం సరికాదు.

హిమాలయాలను వర్ణించటంతోపాటు వారు ముజవంత, [2]త్రికీట, క్రౌంచ, మైనాక మొదలైన శిఖరాలను స్పష్టంగా పేర్కొన్నారు.[3] వేదాలలో 35 నదులకు సంబంధించిన వర్ణన లున్నాయి. వీటిలో 25 ఋగ్వేదంలోనే ఉన్నాయి. ఋ. వే. నదీ స్తుతిలో (X—75) మనకు లభించే వివరాలు :

గంగ

యమున (దీని తీరంమీదనే సుదాసుకు విజయం లభించింది.)

దృషద్వతి (చితగంగ)

గోమతి

సరయు (దీని తీరంమీద చిత్రరథుడు, అర్ణి పరాజయం పొందారట)

సుతుద్రు (సట్లెజ్)

విపాస్ (బియాస్)

పరుష్ణి (రావి)

అసిక్ని (చీనాబ్)

వితస్త (జీలం)

మరువరద్వన్ (కాశ్మీర్ లోనిది)

కుభ (కాబూలు నది)

ఇంకా ఎన్నో ప్రధానమైన నదులు, వాటి ఉపనదులు పేర్కొనబడ్డాయి. వేదాలలో అడుగడుగునా నేటి భారతస్వరూపమే కనిపిస్తుంది. వారు ప్రతి పుణ్య కార్య సందర్భంలోను మేరువుకు దక్షిణంగాగల తమ మాతృశ్రీని వర్ణించి జపించి తరించి పోయేవారు.

ఇతర చోట్లకు వలస వెళ్ళిన ప్రజలు తమ జన్మ భూములను మరచిపోలేదు. భారతదేశంలోని పార్శీలు దాదాపు ఎనిమిది శతాబ్దులుగా తమ దేశాన్ని మరచిపోలేదు. 4 ప్రాచీన ఈజిప్టు, ఫొనీషియన్‌లు తమ తాత ముత్తాతల సీమలను సరిగ్గా గుర్తించలేకపోయినా, శతాబ్దాలపాటుగా వాటిని గూర్చి విలపిస్తూనే వచ్చారు. ఆర్యులు ఇతరచోట్లనుంచి వచ్చామని ఒక్కచోట కూడా చెప్పలేదు. ఒకవేళ వారు ఎక్కడినించో వచ్చిఉన్నా ఒకజాతి స్థిరపడిపోయి తమ పూర్వజుల జన్మస్థానాలను పూర్తిగా ఎంతకాలం అవసరమో అంతకాలం వేదాలు రచించబడే నాటికే గతించిపోయి ఉండాలి. వేదాల ప్రాచీనతనే మనం నిర్ణయించలేకుండాఉన్నస్థితిలో, అంతకుపూర్వం ఎన్నో వేల సంవత్సరాలక్రితం కొద్దిమంది వ్యక్తులు చేసిన సంచారాన్ని ఎలా నిరూపించగలం? ద్రావిడులనబడే వారు కూడా మధ్యధరా సముద్రతీరంనుంచి భారత దేశానికి వలస వచ్చారని పాశ్చాత్య భాషాశాస్త్రజ్ఞులు వాదిస్తున్నారు. వీరంతా ఎక్కడనుంచి వచ్చారో అక్కడే మానవోత్పత్తి జరిగిందా? ఆధారాలేమిటి? ఆర్యుల, ద్రావిడుల వలసలకు పూర్వం భారతదేశం వాసయోగ్యం కాదా?

(7) మహెంజొదారో హరప్పాలలో గోసంపద కంత ప్రాముఖ్యము లేదన్నారు శ్రీ రంగారావుగారు తమ వాదాన్ని ప్రతిపాదిస్తూ. ప్రజల సాంఘికజీవనం, నాగరికత వేదాలలో ఒక వాఙ్మయరూపంలో మనకు లభిస్తున్నవి. అందుచేత గో సంపదను గురించీ యింకా అనేక యితర విషయాలను గురించి మనకు స్పష్టంగా కొన్ని వివరాలు తెలుస్తున్నాయి. కాని మహెంజొదారో విషయంలో మనం త్రవ్వకాలమీద ఆధారపడాలి. ఇప్పటివరకూ ఏ అధారమూ దొరకలేదని, అందుచేత అక్కడ గో సంపద లేదని మనం కొట్టివేయటం సాహసమే అవుతుంది. ఆ త్రవ్వకాలలో ఉప్పు మనకు కనిపించలేదు కాబట్టి ఆనాటి వారికి ఉప్పు వాడకం తెలియదని మనం అనగలమా?

సరే! కాని వాస్తవ విషయం మాత్రం మహెంజొదారో హరప్పాలలో దొరికిన అనేక నాణేములమీద ఆవు—ఎద్దు వీటి బొమ్మలున్నాయి. ఆనాడు కూడా గోసంతతి అంటే ఘనంగా చూచేవారని దీనివల్ల తెలుస్తోంది. 5 అలాగే గుర్రానికి సంబంధించిన అస్థి పంజరాలు కూడా దొరికాయి. అశ్వాన్ని గురించి ఎన్నో చోట్ల వేదాలలో ప్రస్తావన వచ్చింది.

ఆసియా ఆఫ్రికాలలో లింగార్చన ఉన్న మాట నిజం. ఇంకా జపాన్, మధ్య అమెరికా మొదలగుచోట్ల విష్ణు పూజ జరిగినట్లుగా కొన్ని ఆధారా లున్నాయి. దీనికి కారణం ఈ ప్రదేశాలన్నిటిమీద భారతీయ సంస్కృతి ప్రభావం పడటమే. ప్రపంచాన్ని ఆర్యావర్తంగా మార్చటం తమ అదర్శమని వారు స్పష్టంగా పేర్కొన్నారు. 6 ఎవరికైనా విజ్ఞానం కావాలంటే భారతీయ మేధావుల పాదపీఠి దగ్గర చేరితే కాని లభ్యంకాదని సగర్వంగా ప్రకటించారు. 7

సింధు నాగరికత అనేది ఆర్యుల ప్రధాన స్థానాలకు కొంచెం దూరంగా వికసించింది. అదీగాక అనేకసార్లు సింధూనది తన దిశలను మార్చుకొన్నది. దీనివలన సాంస్కృతిక వికాసానికి అవరోధాలు ఏర్పడ్డాయి. అందుచేత అతిస్వల్పంగా ఏవైనా కొన్ని భేదాలుంటే ఉండవచ్చుకాని ప్రధానంగా యిది ఆర్య నాగరికతే.

---

2. వేదాలు పుట్టడానికిముందు, పూర్వ రంగంగా యజ్ఞాలనేవి ఏర్పడ్డాయి. వీటికి మూల పురుషుడైన సోముడు ఉత్తర పంజాబులోని 'ముజవంత' ప్రాంతపు వాడని చెప్పబడింది. ఇక్కడే యజ్ఞ వ్యవస్థకు నాందీపూజ జరిగింది. (శ్రీ పి. వి. కానే : History of Dharma sastra II Part I. PP 11 to 16)

3. 1959 సెప్టెంబరులో చైనా వాదాన్ని నిరాకరిస్తూ, భారత ప్రభుత్వం ఒక శ్వేతపత్రాన్ని ప్రకటించింది. వేదకాలంనుంచీ భారతీయ జీవనంలో హిమాలయాలకు గల స్థానమేమిటో అందులో విపులంగా చర్చించబడింది.

4. శ్రీ కె. ఎమ్. మున్షి.

5. P 174, The Vedic Age.

6. కృణ్వన్తో విశ్వ మార్యమ్—మేధాతిథి

7. ఏతద్దేశ ప్రసూతస్య సకాశా దగ్ర జన్మనః,

స్వంస్వం చరిత్రం శిక్షేరన్ పృథివ్యాం సర్వమానవాః— మనువు.

ఆర్యుల తొలినివాసం భారతదేశమే

కార్బన్ టెస్ట్‌ను గురించి శ్రీ రంగారావుగారు ప్రస్తావించారు. మహాభారతంలో ఆనాటి నక్షత్రాల గ్రహాల స్థానాలు Coordinates.) నిర్ణయించబడి ఉన్నాయి. ఇవి ఆధారంగా మనం ఎందుకు లెక్కగట్టి మహాభారతకాలాన్ని నిర్ణయించకూడదు? ఇదేమీ అశాస్త్రీయమైన పద్ధతి కాదే? వేదకాలంనాటికే ఆర్యులకు ఖగోళశాస్త్రం బాగా తెలుసు. మనకు ఎన్నో రుజువు లున్నాయి. రాశి చక్రాన్ని (Zodaic), సౌరసంవత్సర దినాలను (Solar-year), భూ పరిభ్రమణపు నాభులను (Focii, centre) దీర్ఘతమస్సు వర్ణిస్తాడు. అత్రి మహర్షి ఒక పెద్ద సూర్య గ్రహణాన్ని కొలిచాడనీ, దానికి సంబంధించిన విశేషాలు యింకో చోట యివ్వబడ్డాయి. ఇంకోచోట పాల పుంతకు సంబంధించిన వర్ణన కనిపిస్తుంది. జ్యేష్ఠకు సూర్యునికి గల వ్యత్యాసాన్ని యింకోచోట చూడవచ్చు. 8

ఇక హిట్టైట్ భాష విషయం. ఈ భాషలోని శాసనాలనుబట్టి ఇది క్రీ. పూ. 1500 నాటిదని చరిత్రకారులు నిర్ణయించారు. కాపిడోసియా హిట్టైట్ల తొలి నివాసం కాదు. క్రీ. పూ. 1950 లో హిట్టైట్లు దానిమీదికి దాడి చేశారు. ఆనాటికే భారతదేశంలో నాగరికత ఒక స్థాయికి చేరింది. అదీగాక హెట్టైట్ భాష శాసనాలలోనే ఋగ్వేద దేవతలకు సంబంధించిన ప్రస్తావనలూ, ప్రార్థనలూ ఉన్నాయి. (9) ఈ వివరాలనుబట్టి హిట్టైట్ నాగరికతకన్న వేద నాగరికత ప్రాచీనమైనదని తెలియటంలేదా? భారతదేశనుంచి సంస్కృతీ ప్రవాహం పరవళ్ళు త్రొక్కుతూ వెళ్ళి మెసపొటేమియాను తాకిందని రుజువుకావటం లేదా?

ఇండో ఆర్యను గ్రూపుభాషలలో లిథూనియన్ చాలా ప్రాచీనమైనది. కాబట్టి లిథూనియా ఆర్యుల తొలినివాసం కావచ్చునని కొందరి అభిప్రాయం. ఒక భాష అతి ప్రాచీనమైనదిగా నిలిచిపోవటానికిగాని, అలా కనిపించటానికిగాని రెండు కారణాలుంటాయి. ఆ భాషను మాట్లాడేవారు నాగరికతలో ప్రగతిని సాధించకుండా ఉన్నట్లయితే, అది ప్రాచీనమైనదనే భ్రమను కల్గిస్తుంది. ఆటవిక ప్రజల భాషలు యిలాంటివే. లేక ఆ భాష మాట్లాడేవారికి యితర జాతులతో సంబంధాలు శతాబ్దాలుగా లేకపోయినా ఆ భాష ప్రాచీనమైనదిగా నిలిచిపోతుంది. ఈ రెండు కారణాలవల్ల లిథూనియన్ ప్రాచీనమైనదిగా నిలిచిపోయింది. 10 అంతేకాని అది వైదిక సంసృృతంకన్న ప్రాచీనమైనదేమీ కాదు.

భాషల మధ్య కనిపించే కొద్దిపాటి సంబంధాలు పాశ్చాత్యుల సిద్ధాంతాన్ని స్థిరీకరించలేవు. వైదిక సంస్కృతంలోని పదజాలంలో అత్యధికభాగం ఈనాటి భారతీయ భాషలలో అంతర్భాగంగా మారిపోయింది. ఎన్నో శతాబ్దులుగా యితర జాతులలో శత్రు మిత్ర సంబంధాలున్నా ఈ వైదిక భాషాశాఖల వికాసం ఏనాడూ కుంటుపడలేదు. కాని యూరపు ఆసియాలలో పూర్వ వైదిక భాషలోని పదజాలంలో చాలా కొద్ది మాత్రమే ఈనాటి భాషలలోకి దొర్లాయి. దీనికి కారణమేమై యుంటుంది? వైదిక సంస్కృతము భారత దేశంలో ఆర్యులు మొదట్లో రూపొందించుకొన్న భాష. ఆర్యులలో మిగిలిన దేశాల వారికి ఏర్పడిన సంబంధాల ననుసరించి కొన్ని పదాలు వారి భాషలో కలిశాయి. అంతవరకే.

తమ ఆధిపత్యాన్ని నిలుపుకొనుటకై ఆర్య నాగరికత ప్రాచీనమైనది కాదని పాశ్చాత్య లన్నారనేది పరమసత్యం. మనలను అణచేందుకు మన చరిత్రకు మసిపూసి ఉగ్గుపాలతో పట్టించేందుకు వారు తాపత్రయపడ్డారు. భారతదేశాన్ని భావదాస్యం క్రింద పాతిపెట్టేందుకు యిక్కడివారు చేసిన పనులను విమర్శించటం పరజాతి దూషణ కాదని శ్రీ రంగారావుగారికి మనవి చేస్తున్నాను. అది దురభిమానం ముమ్మాటికీ కాదు. పాలకుల మనస్తత్వం ఎలా ఉంటుందీ? ఎలా ఉందీ? 11అనేవే నేను నా రెండవ భాగంలో విశదం చేసిన విషయం.

ఇలాంటి చర్చల్లో ఆవేశాలకు తావు లేదని శ్రీ రంగారావుగారు వ్రాశారు. మంచిమాట! కాని ముందుగానే ఏవో భావాలకు, సిద్ధాంతాలకు అమ్ముడుపోయి చర్చించటం మాత్రం మంచిది కాదు. శాస్త్రశుద్ధమైన, తర్క సమ్మతమైన సిద్ధాంతంకోసం మనం కృషి చేయాలి.

---

8. ఋ. వే. I 164—48, X 124—9, VIII 59—5.

ఇంకా ఎన్నో చోట్ల మనకు ఆధారాలు దొరుకుతున్నాయి. (I, 24—10; I, 50—2; I 68—5; I 87—1; I 25—8......)

(9) రాధా కుముద ముఖర్జీ: Hindu Civiligation: P. 34.

10. శ్రీ కె. ఎం. మున్షీ.

సంస్కృత వాఙ్మయం లిథూనియన్ భాషకన్న 3000 సంవత్సరాలు ప్రాచీనమైనది (Issac Tayler ; Origin of the Aryans. Prof. Beam ; Article in JARS Vol- 5.)

11. ప్రముఖ చరిత్రకారుడుగా పేరు గడించుకొన్న వి. ఎ. స్మిత్ యిండియన్ సివిల్‌సర్వీస్‌కు సంబంధించినవాడు. అహంకారంతో అతడన్నమాటలను గమనిస్తే చరిత్రను ఎంతవరకు నిష్పాక్షికంగా వ్రాశాడో విదితమవుతుంది. స్మిత్ అంటాడు: Such was India and such it always has been till the British established a stable ordcr.

భారత చరిత్రను వ్రాసేందుకు ప్రయత్నించిన రెండవ ముఠా క్రైస్తవ మిషనరీలు. వీరిలో ముఖ్యుడు కాడ్‌వెల్. ఇంకా హెన్రీ హేరాస్ మొదలగు వారున్నారు. దాదాపు 48 ఉద్గ్రంథాలు రచించిన మాధవ విద్యారణ్యస్వామి, అసలు లేనే లేడని శ్రీ హెరాస్ వాదిస్తాడు.

ముగింపు దొరికింది!

శ్రీ ఆర్. ఎం. చిదంబరం

జ్ఞాపకశక్తనేది లేకుండా వుంటే బాగుండునని మనలో ప్రతి ఒకరు ఎప్పుడో ఒకప్పుడు అనుకోక తప్పదు. అది ఉండబట్టే గడచిన కాలపు సంఘటనలు ముళ్ళపొదల్లా మనఃఫలకం మీద కనిపించి చీకాకు పరుస్తాయి. ప్రశాంతంగా వుందామనుకున్న సమయంలో ఏవో బాధలు తలపుకొస్తాయి. ఏనాటి జీవితం ఆనాటితో అంతమై తెర వెనక్కి జారుకుంటే ఎంత బాగుండును!

కాని ఇదంతా వూహాలో నిలిచిపోతుంది. ఇందులో ఏ ఒక్కటీ నిజం కాజాలదు. ప్రకృతి సిద్ధంగా ఇది ఎలాగూ సాధ్యం కాదు. కనక, ఒమర్ ఖయ్యాం కృత్రిమంగా ఈ వేదాంతాన్ని సృష్టించుకుని, ఆచరించి, ఆనంద మనుభవిద్దామనుకున్నాడు. చివరి ఘడియల్లో తన్ను చూసి తనే అసహ్యించుకోడం తప్పలేదు.

ఈ రకం ఆలోచనల్తో కుస్తీపడుతూ, చేతిలో కాగితాలవంక చూడనే లేదు. రైలు వేగంగా పరుగెత్తుతూండటం వలన గాలి విసురు యెక్కువగా వుంది. చేతిలో వున్న కాగితాలు వరుసగా చదివితే వో కథ అగమవుతుంది. కాని దాని ముగింపు అర్థం కావటం లేదు. ఆ కథకూ, నా జీవితానికి సాన్నిహిత్యం వుంది గనక, ముగించటం వాస్తవికంగా వుండాలనే నా నిర్ణయం నేటివరకూ నిజం కాలేదు. పాసింజరు వేగం క్రమంగా తగ్గి ఓ స్టేషనులో ఆగింది. కిటికీలోంచి బయటకు చూశాను. 'రామాపురం' అన్న బోర్డు కనబడింది. ఛటుక్కున లేచి, సూట్ కేస్, హాండ్ బేగ్ తీసుకుని గబగబా రైలుదిగాను. బండి చక్రాలు తిరుగుతూ బరువుగా కదలిపోయింది.

జేబులోంచి టిక్కట్టుతీసి చూశాను. 'మద్రాసు' దాకా వెళ్ళవచ్చు. ఆఫీసు పనిమీద ఎల్లుండి ఓ లాయర్ని కలుసుకోవాలి. కాని ఏదో అర్థం కాని శక్తి నన్ను సగందారిలో దింపివేసింది. కథకు ముగింపు దొరుకుతుందన్న ఆశ కావచ్చు—లేక—మానసిక దౌర్బల్యం కావచ్చు - ఆ రెండూ కాకపోతే గోపితో నాకున్న పరిచయం కావచ్చు. ఏదెలా వున్నా నా ప్రయాణం ఖండించబడింది.

చేతి గడియారం చూసుకున్నా. అయిదున్నరైంది. స్టేషనులో జనం ఎవరూ లేరు. చుట్ట కాల్చుకుంటూ పరధ్యానంగా వున్న ఓ ముసలాడు—మల్లెపూలు అమ్ముడు పోనందుకు ఏడుపుముఖం పెట్టిన ఓ బుల్లి అమ్మాయి - 'ఇస్తే ఇవ్వండి. లేకపోతే మానేయండి' అన్నట్టు కుడిచేయి ముందుకు చాపి గేటుదగ్గర నిలబడ్డ స్టేషను మాస్టరు.

అక్కడికి రామాపురం మైలున్నర వుంటుంది. చేల గట్లమీదుగా నడక ప్రారంభించాను. అస్తమయ సూర్యుడు ఎవరిమీదో కోపగించుకుని ముఖం ఎరుపు చేసుకున్నాడు. వరిపొలాల్ని కాపలా కాస్తున్న వీరుల్లా తాటి చెట్ల వరుసలు— వంకరలు తిరిగిపోతున్న చిన్న చిన్న నీటి ప్రవాహాలూ—గబగబ అడుగులు ముందుకు పడ్డాయి. నా కెదురుగా వస్తున్న వ్యక్తి నన్ను చూసి ఆగి నమస్కరించాడు.

'నేను జ్ఞాపకం వున్నానా మేష్టారూ?' అనడిగాడు. ఓ నిమిషంపాటు ఆలోచించాక గుర్తుకు వచ్చింది. పదిహేనుసంవత్సరాలక్రితం అతను నా విద్యార్థి. చిరుగు చొక్కా - చింపిరి తల - దొంగ చూపులు. ఇవీ వాడి ప్రత్యేకత - ఈనాడు సిల్కు చొక్కా - బంగారు గొలుసు - చేతికి బంగారు వాచీ—

'ఏమోయ్ రమణా! .. బాగున్నావా? ఏం చేస్తున్నావ్?' అనడిగాను.

'ఏదో మీ దయవలన ఇలా వున్నాను. ఆనాడు మీ సలహావిని కష్టపడి చదివివుంటే, మంచి వుద్యోగం చేసేవాడిని - నాలుగూ తెలుసుకుని, ప్రపంచంతో కలిసి పోయేవాణ్ణి.' అంటూ నవ్వాడు. ఆ మాటలతను నిజంగా అంటున్నాడో, లేక చాలాకాలం తరువాత కనపడిన మేష్టార్ని కాస్త వుబ్బవేద్దామనంటున్నాడో తెలిసింది కాదు.

'అదంతా వట్టి భ్రమయ్యా!.. నేను డిగ్రీ పుచ్చుకుని సాధించిన దేమిటి? మీ తాత ముత్తాతల

నుండి వస్తున్న వృత్తిని చేపట్టావు. చాలు...అది సరేకాని–' అంటూ ఆగిపోయాను. ఆ ప్రశ్న అడగటానికి భయంవేసింది. విషాద వార్తలు విని ఆరగించుకునే ఓపిక లేదు. అంతకంటె అడక్కుండా వుంటేనే బాగుంటుంది. రవణ అడగమన్నట్టు చూశాడు.

'మరేం లేదు – పెళ్ళైందాని అడగాలనుకున్నా – అంతే – మరివస్తాను.' అంటూ ముందుకు కదలిపోయాను.

గోపి భవిష్యత్తును ఏ నాడో నిర్ణయించివేశాను. మరి అడగటానికెందుకింత భయం? నా అభిప్రాయాలు అన్నీ తారుమారౌతాయన్న అనుమానం కావచ్చు – మరో అరగంటలో రామాపురం చేరుకున్నా – ఈ పదిహేను సంవత్సరాలలో ఆవూరు చాలావరకూ మారిపోయింది. అక్కడక్కడా కొత్త మేడలు లేచాయి. విద్యుద్దీపాలు ఆనాడు లేవు. కాని, వీటితో నాకెలాంటి ప్రమేయమూ లేదు. తిన్నగా గోపి ఇల్లు చేరుకున్నా. హాల్లో ఎవరూ లేరు. గోపిజాడ ఎక్కడా కనిపించలేదు. పెరిగి పెద్దయ్యాక తీయించుకున్న ఫోటో కనిపిస్తుందేమోనని గోడలు వెదికాను. ఎవర్ని పిలవాలో, ఎలా సంబోధించాలో తెలియక తికమకలు పడుతున్న సమయంలో ఓ అమ్మాయి వచ్చింది.

'మాష్టారిగారున్నారా?...' అనడిగాను, ఆ అమ్మాయెవరైనది సరిగ్గా తెలియక పోయినా. గోపి చెల్లెలై వుంటుంది. ఆమెకు రెండేళ్ళ వయసున్నప్పుడు చూసిన గుర్తు. ఆమె సమాధానం చెప్పకుండా వయ్యారంగా లోపలికిపోయింది. మరో నిమిషానికి ఓ నడివయస్కురాలు వచ్చింది. ఓ చేతిలో సూట్‌కేస్, మరో చేతిలో హాండ్‌బాగ్ వున్న నన్ను చూసి ఆమె ఏమనుకుందో కాని, ఆశ్చర్యంతో కనురెప్పలు రెండుసార్లు కదిపింది. ఆమె గుర్తు పట్టకపోయినా నాకు తెలిసిపోయింది.

'నమస్కారం!.. జ్ఞాపకం వున్నానా?' అనడిగాను.

'మీరా మేష్టారూ?... కులాసాగా వున్నారా?... అమ్మాయ్? మేష్టారికి కాఫీ తీసుకురా. అలా కూర్చోండి' అంది ఆప్యాయంగా గోపి తల్లి. పది నిమిషాలపాటు ఏవో కబుర్లు చెప్పుకున్నాం. గోపి విషయం ఎవరూ ప్రస్తావించలేదు. కాఫీ తాగుతుండగా, గోపి నాన్న కూడా వచ్చాడు.

భోజనాలయ్యాక అరుబయట మంచం వాల్చుకుని పడుకున్నా. వెల్లకిలా పడుకుంటే నీలాకాశం కనపడింది. చందమామ భార్యల పోరు పడలేక శక్తికొద్దీ పరుగెడుతున్నాడు. కోట్లకొలది నక్షత్రాలు మిణుకు మిణుకు మన్నాయి. గోపి ఆ చుక్కల్లో కలిసిపోయుండొచ్చు. ఛీ!...అలా ఎన్నటికీ జరగదు. గోపి చనిపోవట మేమిటి? హిమాలయాలు కరిగిపోవటం? గంగ యింకిపోవటం – ఇద్దరు మనుష్యుల మనసులు ఏకం కావటం – ఇవి ఎలా అసంభవమో, అదీ అంతే. నిద్ర పట్టేందికాదు. లేచి నెమ్మదిగా నడక సాగించాను. ఏ అర్ధరాత్రో నేను కనపడకపోతే గాభరాపడి, ఏ దెయ్యమో, భూతమో ఎత్తుకుపోయిందని గోలపెడతారేమో! నా తెలివి తక్కువకు నవ్వుకుంటూ అడుగులు ముందుకు వేశాను. నిశ్శబ్దం వెయ్యి హస్తాలు చాచి శబ్దం నోరు నొక్కివేసింది. అప్పుడప్పుడు ఎక్కడో కుక్కలు అసంతృప్తిగా మొరుగుతున్నాయి. తన్మయత్వాన్ని వెదుక్కుంటున్న ఎవరో వ్యక్తి హాయిగా మురళీగానం వాయిస్తున్నాడు. అదే గానాన్ని పదులు, పాతికలు పెట్టి టిక్కట్లుకొని వింటారు. కాని ఇప్పుడెవరు వింటారు? సగంనిద్రలో వున్న చెట్లు – మత్తుగా తవులిస్తున్న పక్షిసంతతి – ఇవే ఆ పాటను వినాలి. పెద్ద గుడ్డముక్కను చిన్న చిన్న పీలికలుగా చించివేసినట్టు గాలి ప్రవాహాలు – ఇలాంటి రాత్రుల్లో గోపి, నేను ఎన్నో విషయాలు చర్చించుకున్నాం. తిన్నగా స్కూలుకు వచ్చి, పచ్చికలో కూర్చున్నా. స్కూలు ఊరికి దూరంగావుంది. జీవితాన్ని స్పృశించి అనుభవించడానికిదే సరైన స్థలం.

అవకాశం – అనుకూలత – ఈ రెండూ జతకాగానే జ్ఞాపకశక్తి పనిచేయనారంభించింది. అందుకే, అది వుండకపోవడం శ్రేయస్కరమని ముందే చెప్పాను. జేబులోవున్న కాగితాల కట్టతీసి చదవటం మొదలు పెట్టాను. అది ముగింపులేని కథ – దాని ముగింపు కోసమే ఈ పదిహేను సంవత్సరాలు ఆగాను.

* * *

బి. ఎస్ సి. డిగ్రీ పుచ్చుకోగానే, ఏవో ఆశలు, ఆశయాలు నన్ను చుట్టుముట్టాయి. ఉత్సాహంతో వుద్యోగంకోసం తిరిగి తిరిగి వుపాధ్యాయుడిగా రామాపురం వచ్చాను. అది పట్నంకాదు – సుమారు ఆరువందల ఇళ్ళుంటాయి. స్కూలు వూరికి అరమైలు దూరంలో వుంది. ఎలాగో తంటాలుపడి ఓ చిన్నగది

సంపాదించాను. అనాగరికత, మురికితనం, మూర్ఖత్వం- ఆ వాతావరణంలో కలిసివున్నా, నిరుద్యోగిగా బతికే కంటె, సహనంతో బతకటం మేలనుకున్నా.

అదే నా మొదటి అనుభవం - క్లాసులో అడుగు పెడుతుంటే కాళ్లు గాలిలో తేలిపోతున్నట్టనిపించాయి. నా కెదురుగా నలభైమంది విద్యార్థులు నన్ను ఏదో 'వింత జంతువు'ను చూసినట్టు చూడసాగారు. లెక్కల పాఠం మొదలైంది. కాలానికి, వేగానికి వున్న సంబంధం గురించి చెబుతూ 'గూడ్సు బండి - పాసింజరు బండి... ఈ రెండింటిలో ఏది త్వరగా పరుగెడుతుంది?' అనడిగాను. వేగాన్ని కనుక్కునేటప్పుడు కాలం స్థిరంగా వుండాలని బోధించాలని నా అభిప్రాయం. ఆ నలభైమంది గుడ్లప్పగించి చూశారు - ఒక్కరూ నోరు మెదపలేదు. రెట్టించి అడిగేసరికి ఓ అబ్బాయి నిలబడి 'గూడ్సుబండి...' అన్నాడు నవ్వుతూ. అతని సమాధానంలో స్ఫురించిన హేళన నన్ను చురుక్కున పొడిచింది. నిశ్శబ్దానికి, అణకువకు వెనకవున్న అంతరార్థం ఇదన్నమాట.

'ఓరి చవటపీనుగా!...నువ్వో కుంటివెధవనుకో. నీపక్కనున్న అబ్బాయితో సమానంగా పరుగెత్తగలవా?' అనడిగాను. ఎందుకో అతనిముఖం చిన్నబోయింది. తల కిందికి వంచేసుకున్నాడు. క్లాసంతా చక్కిలిగింతలు పెట్టినట్టు గొల్లుమన్నారు. కొందరు చప్పట్లు చరిచారు కూడా. నాకంతా అయోమయంగా కనపడింది. ఆ అబ్బాయి కళ్ళల్లోంచి రెండు నీటిబొట్లు రాలాయి. 'నువ్వు కుంటివెధవవు' అనగానే అతని లేత గుండె గడగడలాడిపోయింది. మనస్సు చివుక్కుమంది.

'ఎందుకురా ఏడుస్తావ్?...నిన్నెవరూ ఏమీ చెయ్యలేదుగా!' అన్నాను.

'ఆ గోపీ అంతే మాష్టారూ! వట్టి పిరికిపంద- ఉన్నమాటంటే ఉలుకెక్కువట.' అన్నారు ఎవరో వెనకనుండి.

'కూర్చో. ఎవరైనా మాట్లాడారంటే జాగ్రత!' అని గదమాయించి పాఠం చెప్పుకుపోయాను.

మొత్తానికి ఏదో అసంతృప్తి నన్ను ముంచివేసింది. ఒక్కరోజు గడవటం ముళ్ళమీద నడచినట్టుంది. ఇక ఏడాదిపాటు ఈ రథాన్ని లాగే దెలా? స్కూలు విడిచి పావుగంటైంది. పిల్లలంతా జట్లుజట్లుగా ఏనాడో వెళ్ళిపోయారు. సందడిగావున్న ఆ ప్రదేశం, వినాశం జరిగినతరువాత నిర్మానుష్యమైన మహానగరంలా తయారైంది. నెమ్మదిగా నడుస్తూ స్కూలు ఆవరణ దాటి బయటికొచ్చాను. నాకు పదిగజాల దూరంలో ఓ అబ్బాయి మోయలేక పెద్ద పుస్తకాలసంచీ మోస్తూ, కుంటుతూ నడుస్తున్నాడు. కాలికేమైనా గాయం తగిలిందేమో ననుకున్నా. కాని పరీక్షగా చూస్తే, ఓ కాలు పొట్టిది. అంగవైకల్యం వున్న వార్ని చూస్తే ఎందుకో జీవితంమీద వెగటు కలుగుతుంది. సర్వాంగాలు తీరుగా అమరివున్నా, మనస్పర్థలు - కొట్లాటలు - అసూయాద్వేషాలు - ఆశాభంగం - ఇలాంటి విషసర్పాలనుండి తప్పించుకునే శక్తిలేక సతమతమవుతున్నాం. ఇంక ఏ కన్నో, కాలో, చెయ్యో లేనపుడు ముందుకు నడవడం ఎలా? పోనీ, 'ఈరకం మనుష్యులు ఎందుకు జీవిస్తారు- ఆత్మహత్య చేసుకోకూడదా?' అనిపిస్తుంది. ఒకరిద్దరి నడిగితే 'జీవించాలన్న కోర్కె ఏ పరిస్థితుల్లోనయినా ఉండితీరుతుంది. ఉన్నవాడు లేనివాణ్ని చూసి జాలిపడతాడు కాని, లేనివాడు దాన్నిగురించి అసలు ఆలోచించడు' అన్నారు. రెండుకాళ్ళూ ఉంటే, ఆఅబ్బాయి కూడా చెంగుచెంగున ఈపాటికి ఇల్లు చేరుకుని, అమ్మ అందిచ్చే తాయిలం తిని, హాయిగా ఆడుకుందుకి పోయేవాడు. అతనికా అదృష్టం లేదు. అరుగుమీద నిలబడి తతిమ్మా పిల్లల్ని చూసి, తనకొడుకింకా రాలేదని దిగులుగా ఎదురుచూస్తున్న అతని తల్లిని తల్చుకునేసరికి మనసు చివుక్కుమంది. అడుగుల చప్పుడు వినిగామోలు ఆ అబ్బాయి వెనక్కి తిరిగిచూశాడు. గుండె గతుక్కుమంది. అది గోపి!...'నువ్వు కుంటివెధవనుకో!' అన్న నా మాటలు జ్ఞాపకంవచ్చాయి. అతనికళ్ళనుండి రాలిన రెండు నీటిబొట్లూ రెండుమహాసముద్రాలై చెవులదగ్గర ఘోష పెట్టాయి. లేనిలోపాన్ని ఆపాదించటం వేరు. అన్నదాన్ని వేలెత్తిచూపటం వేరు. గోపి నా కోసం ఆగుతాడనుకున్నా. కాని అతని వేగంలో ఎలాంటి మార్పూలేదు. గబగబవెళ్లి అతన్ని ఓదారుద్దామనుకున్నా. కాని, వుపాధ్యాయుడినన్న ఆత్మాభిమానం ఆపివేసింది. గోపిమీద ఓ రకమైన అభిమానం, అనురాగం ఏర్పడటం కనుక్కున్నా.

ఆ మర్నాడు గోపి బడికి రాలేదు. కారణాలు మనవూహానుబట్టి మారుతూంటాయి. గోపి బడికి రాకపో

వటానికి కారణం నిన్నటి సంఘటనేనని నేను నమ్మినా కొందరు నవ్వి పారేస్తారు.

'గోపి రాలేదా?' అనడిగాను.

'ఎవరండీ?'...నిన్నటి కుంటబ్బాయా?...' అన్నాడు ఓ విద్యార్థి—అతని కేసి కళ్లెర్రచేసి చూశాను.

'రాలేదండి'...ఒక వేళ వాళ్లమ్మ పిండి రుబ్బమందేమో!'

'కాదండి మాష్టారూ?...పులుసు, కూర వండమనుంటుంది.'

'వాళ్లకేం తెలియదండి. గోపి అమ్మ చీర వుతకమంటుంది—నామాట నిజమండి.'

అలా అడక్కుండానే రకరకాలైన సమాధానాలు వచ్చాయి. ఇదంతా నన్నేడిపించటానికి వేస్తున్న నాటకం కావచ్చు. లేక నిజం తాలూకు నీడ కావచ్చు. ఉదారహృదయంతో ముందుకు వచ్చి అడక్కుండా జవాబు చెప్పిన వారందరికీ వీపుమీద అక్షింతలు పడ్డాయి. ఆ సందిగ్ధ సమయంలో అంతకంటె తరుణోపాయం లేదు.

'ఈ మేష్టారికి, ఆ కుంటి గోపిమీద ఒక్క రోజులో ఎంత ప్రేమ వచ్చిపడిందో—' అన్నమాటలు ఆడపిల్లలవంతు.

ఏదైనా వస్తువును కాని, వ్యక్తిని కాని సంఘానికి, సంస్కారణకు దూరంగా వుంచమని నలుగురూ సలహాయిస్తే, దాన్ని ఆచరించేముందు 'అలా ఎందుకు చేయాలి?' అని కారణాలు వెదుకుతాం. అంటే, అందులో అసత్యం వుందనికాదు: ఆ వ్యక్తిని, లేదా వస్తువును ఎందుకు అసహ్యించుకోవాలో తెలుసుకుందామన్న ఆసక్తి. అదేవిధంగా నలుగురూ గోపిని ఎందుకు దూరంగా వుంచుతున్నారో కనుక్కోవాలన్న కుతూహలం నాలో ఎక్కువ కాసాగింది. కాని ఎలా తెలుసుకోడం? ఈ పిండి రుబ్బటం, పులుసువండటం ఇవన్నీ అకారణంగా పుట్టేవికావు. వీటికి తగినంత పునాది వుండి తీరుతుంది. ఎటొచ్చీ ఆ పునాదిని పదిమంది పది రకాలుగా వర్ణిస్తారు. అంటే—అంగ వైకల్యం వున్నంతమాత్రాన తలితండ్రులు కన్నబిడ్డను అసహ్యించుకుంటారని—బాధిస్తారని అనుకోను—అలా చేయరు సరికదా, నలుగురూ చూపలేని సానుభూతిని, అనురాగాన్ని వర్షిస్తారు.

ఆ సాయంత్రం స్కూలు వదిలాక, సబ్బు కొందామని బయలుదేరాను. బజారు మధ్యగా వెడుతుంటే ఎవరో చప్పట్లు చరచి పిలిచినట్లయి వెనక్కి తిరిగిచూశాను. గోపి కుంటుతూ, వీలైనంత వేగంగా వచ్చాడు.

'నమస్కారం మేష్టారూ! ఇలా వచ్చారే? అన్నాడు—చెప్పాను.

'ఇంతదూరం వచ్చారు. మాఇంటిక్కూడా రండి' అన్నాడు వినయంగా.

'దానికేం ? ...... ఊరువిడిచి పోయేవాడిని కాదుగా! మరోమాటు చూద్దాం,' అనేసి రెండడుగులు ముందుకు వేశాను. గోపి పరుగెత్తుకు వచ్చి, నా కడ్డంగా నిలబడ్డాడు.

'అలా కాదు మేష్టారూ!...మీరు వచ్చి తీరాల్సిందే!' అంటూ మొండి కేశాడు. అతని ముఖం చూశాను. స్వచ్ఛ జలంలా నిర్మలాకాశంలా—మంచుకొండలా—మలిన రహితంగా వుంది. దృష్టి కాళ్ళమీదకు వెళ్లేసరికి మనసు చీకటితో నిండిపోయింది. గోపి ఇల్లు చేరుకున్నాం. అమ్మను తీసుకురావటానికి లోపలికి వెళ్ళాడు. అది శ్రీమంతుల గృహం. హాలునిండా ఖరీదైన సోఫాలు, కిటికీలకు సిల్కు కర్టెన్లు, నిగనిగలాడుతున్న కుర్చీలు, టేబిలు, ఫ్లవర్ వేజ్‌లో కిలకిలానవ్వే పువ్వులు, నిశ్శబ్దాన్ని క్రమబద్ధంగా కొలుస్తున్న గడియారం—ప్రతివస్తువు డబ్బుతో మాట్లాడింది. గోపి అమ్మను పరిచయంచేశాడు. ఆమెను చూసి ఆశ్చర్యపోయాను. నేను వూహించుకున్న గోపితల్లికి, ఈమెకు ఎక్కడా పోలికలు లేవు. మాతృత్వం చిమ్ముతున్నకళ్లు, ప్రేమతో నవ్వే పెదవులు, బాధల్ని చూసి జాలిగా మారే ముఖం—ఇవి నేను వూహించుకున్న లక్షణాలు. అలాంటి స్త్రీకిమాత్రమే ఓకుంటబ్బాయి గుండెలో ఆశల్ని చిగురింపచేసే శక్తివుందని నావిశ్వాసం. నాకు ఎదురుగావున్న గోపితల్లి పొడుగాటిజడను మెడమీదుగా ముందుకు వదిలింది. వాయిలుచీర, జాకెట్టు, అర్ధచంద్రాకారపుబొట్టు, ఎడంచేతికి బంగారు వాచీ, వయసు పాతికేళ్ళ కెక్కువుండదు. కాలేజీ అమ్మాయి గుర్తొచ్చింది.

'గోపి బాగా చదువుతున్నాడాండీ?' అనడిగింది.

'నేను నిన్ననే స్కూలుకు వచ్చాను. ఇవేళ తను బడికిరాలేదు...బుద్ధిమంతుడే ననుకుంటాను...ఎలాగూ

ఒకటి రెండు నెలలుపోయాక కాని మనస్తత్వం అర్థం కాదు.'

'కాస్త జాగ్రత్తగా వుండండి. పైకి అలా వున్నాడే కాని, మీ చేత మొగ్గలు వేయిస్తాడు.'

నాకు అసహ్యం వేసింది. గోపిగుణగణాలు ఆమెకు తెలిసివుండొచ్చు. ఒక్కసారి నన్ను చూడటంతోనే, నా శక్తిసామర్థ్యాలు ఆమెకెలా తెలుస్తాయి? నాగురించి పూర్తిగా తెలుసుకోకుండా, మాఇద్దర్నీ త్రాసులో వేసి తూచి 'మీకంటె గోపి గొప్పవాడు' అనడం అసందర్భంగానూ, అనవసరంగానూ కనపడింది.

'గోపి ఇవేళ బడికిరాలే దేమండి?' అనడిగాను సంభాషణను మరోదెసగా తిప్పనెంచి.

'అదా?...వాడికి వంట్లో బాగా లేదు-జలుబు-కొద్దిగా జ్వరం—ఏమాత్రం అనారోగ్యంవున్నా నేను జాగ్రత్తపడతాను. రోగాలు ముదరబెట్టుకోటం నాకిష్టం లేదు.'

గోపిచేత కాఫీ పంపించి ఆమె అదృశ్యమైంది, గోపి తను చదువుకునేగది చూపించాడు. శుభ్రంగా వుంది. గోడమీద ముచ్చటగా కాలెండరు, చిన్నకుర్చీ, టేబిలు, అందంగా అమర్చబడ్డ పుస్తకాలు, డ్రాయింగు పుస్తకంనిండా చిత్రమైన బొమ్మలు, అవన్నీ అతని వూహాలోంచి వెలువడినవే. చంద్రమండలానికి రైల్లో మనుష్యులు వెడుతున్నట్టు - వెడల్పాటి యంత్రాలు కాళ్ళకుకట్టుకుని సముద్రంమీద సునాయాసంగా నడచిపోతున్నట్టు-తిండితినకుండా నెలకు ఓమాత్ర వేసుకునే మనుష్యులు. ఇలా రకరకాలైన బొమ్మలు. పరిపూర్ణత లేకపోయినా, కల్పనాశక్తి అనంతం. ఏదో అందని గమ్యస్థానాన్ని అందుకోవాలన్న ఆకాంక్ష ప్రతిగీత లోనూ కనిపించింది. పట్టుదలవున్న పిల్లలే పెరిగి పెద్దయ్యాక పెద్దవాళ్ళౌతారు. డ్రాయింగు పుస్తకం మూసివేస్తూ 'ఇతనికి బ్రహ్మాండమైన భవిష్యత్తు వుంది' అని నిర్ణయించుకున్నా. అరుగుమీద కొచ్చేసరికి గోపి నాన్న వచ్చాడు. పరిచయాలయ్యాక మరో పదినిమిషాలు వుండిపొమ్మన్నాడు. గోపినాన్నకు నల్భై సంవత్సరాలుంటాయి. జుట్టు అక్కడక్కడా నెరసింది. ముఖంమీదిచర్మం దగ్గరకు జరిగింది. కళ్ళు మాత్రం ఓసారి గంభీరంగానూ, మరోసారి దిగులుగానూ మారుతూవచ్చాయి. పావుగంటసేపు అనర్గళంగా మాట్లాడాడు. గోపి వంటికాలుగురించి అడగాలనుకుని భయంతో వూరుకున్నా.

'గోపివంట్లో బాగాలేదట. అతనివాళ స్కూలుకు రాలేదు' అన్నాను.

ఆయన ఆశ్చర్యపోయి భార్యతో ఏదోమాట్లాడి వచ్చాడు.

'అదేంకాదండి! దాని కింట్లో పనెక్కువగా వుందట. పనిమనిషికి దానికీ అసలు పడదు. అందుకని సాయానికి ఇంట్లో వుండమందట. అంతేకాని, వాడికే రోగమూలేదు' అన్నారు చెవిలో రహస్యంగా. ఈమాటు తెల్లమొహం వేయటం నావంతు.

* * *

తరువాత వారంరోజుల్లో ఇద్దరం ఆత్మీయుల మయ్యాం. తతిమ్మా విద్యార్థులకంటె గోపి నాహృదయానికి దగ్గరగావచ్చాడన్న అభిప్రాయాన్ని నేను దాచటానికి యత్నించలేదు. అతనికి తెలియని ప్రతి విషయమూ అడిగేవాడు. విసుక్కోకుండా వివరించేవాణ్ణి.

ఓనాడుదయం లేచేసరికి తలనొప్పి, జ్వరం 'మేం వచ్చాము'టూ కౌగలించుకున్నాయి. విదలించుకోలేక స్కూలుకు సెలవుచీటీ పంపించి పడుకున్నా. ఇంటియజమాని ఓసారి వచ్చి పలకరించిపోయాడు. సాయంత్రం గోపి వచ్చి మంచందగ్గరగా నేలమీద కూర్చున్నాడు.

'మేష్టారూ! జ్వరంగా వుందా?' అనడిగాడు.

'లేదోయ్! కాస్త తలనొప్పిగా వుంటే పడుకున్నా. అనారోగ్యమంటే నాకూ మహా చెడ్డభయం! ఏమిటి స్కూలు విశేషాలు.'

'ఏం లేవండి...మీరు అబద్ధం చెబుతున్నారు, ఇందాకా ఇంటాయ నడిగాను. వంద డిగ్రీల జ్వరం వుందన్నాడు. మందు తీసుకు రమ్మంటారా?'

అతని పుస్తకాల సంచివంక చూశాను. పది మణుగుల బరువుంటుంది. తన శరీరాన్ని మోయటానికే కాళ్ళకు శక్తి లేదు. ఈ సంచిని మోయటమెలా?

'రోగం లేనివాడికి మందు అనవసరం.'

గోపి నమస్కరించి వెళ్ళిపోయాడు. తప్పని సరిగా చూడ్డానికి వచ్చిన ట్టనిపించింది. గోపీకి నామీదుండే అభిమానాన్ని అనుమానించాను కూడా. మరో పది నిమిషాలకు డాక్టరుతో హాజరయ్యాడు.

ముగింపు దొరికింది!

'ఏమండోయ్ మాస్టరుగారూ! మా వూరికి చెడ్డ పేరు తేవాలని నిర్ణయించుకున్నారా? వచ్చీ రావటంతో జబ్బు పడి, ఎవరయినా అడిగితే రామాపురం జ్వరాలపురమని టాంటాం వేద్దా మనుకుంటున్నారా?.. ...... అదీకాక, నెలరోజులు ఆగి జబ్బు పడక పోయారా? అంత తొందర ఏమొచ్చింది? ఏం కొంప మునిగింది?' అన్నారు డాక్టరు సీతాపతి. ఆయన పేరు విన్నాను కాని, చూడటం ఇదే మొదటిసారి. పొట్టిగా లావుగా, చిలిపి కళ్ళలో వున్న ఆయన్ని చూస్తుంటే వో వంక భయం, మరో వంక గౌరవం ఏర్పడ్డాయి. ఆయన హాస్యంగా మాట్లాడుతున్నాడో, లేక నిజంగా విసుక్కున్నాడో తెలిసిందికాదు. లేచి కూర్చున్నా. అబ్బే నాకు జ్వరం లేదండి. ఏదో కాస్త తల నొప్పిగా వుంటే ముందుజాగ్రత్తకోసం బడికి వెళ్ళక విశ్రాంతి తీసుకుంటున్నా. అంతే!' అన్నాను నవ్వుతూ. సీతాపతి గారు ముక్కుమీద ఒక్క గుద్దు గుద్దేవారిలా ముందుకురికి హుంకరించి 'ఇదిగో అబ్బాయ్! నువ్వు ఎవరితో నయినా అబద్ధం ఆడవచ్చు. కోతలు కోయవచ్చు. కాని డాక్టర్ సీతాపతితో కాదు. నీ అంతరాంతరాల్లో ఏముందో కనుక్కునేశక్తి, శిక్షించే అధికారం నాకున్నాయి. పిల్లలముందు డబాయింపువంటి దనుకున్నావా? నీ మొహం చూస్తే తెలుస్తూంది. నీకు నూటొక్క డిగ్రీల జ్వరం ఉందని' అంటూ ఛటుక్కున చేయి అంది పుచ్చుకుని నాడి చూడబోయారు. ఆయన మాటలు నా కోపాన్ని రగుల్కొలిపాయి. ఎంత డాక్టరయినా నా ఆంతరంగిక జీవితాన్ని, భావాలను విమర్శించలేడు. ఆ హక్కు ఎవరికీ లేదు. చేయి వెనక్కి లాక్కున్నా.

'థాంక్స్! నన్ను మీరు చిన్న పిల్లాడికింద జమ కట్టి, చిత్తంవచ్చినట్టు మాటలాడా లనుకుంటే, అది పొరపాటు. నాకూ ఆత్మగౌరవ మంటూ వుంది. ఇక మీరు వెళ్ళవచ్చు' అన్నాను. పెద్ద సంఘర్షణ జరుగుతుందని, గోపి నన్ను అసహ్యించుకుంటాడని నాకు బాగా తెలుసు. కాని, నన్ను నేనే చిన్నచూపు చూసుకోటం ఆత్మద్రోహం. సీతాపతి పెంకు లెగిరేట్టు విరగబడినవ్వారు. 'ఐ లైక్ యు మాన్ - నువ్వు నాకు నచ్చావ్. పౌరుషం అంటే అలా వుండాలి. నానాటికి అది స్త్రీల సొత్తై పోతోంది. కాపాడవలసిందే. రోగమంటూ వచ్చాక అలక్ష్యం చేయకూడదు. ఎందుకంటావేమో! ఈ చుట్టుప్రక్కల అంటువ్యాధులెక్కువగా ఉన్నాయి. మనం జాగ్రత్త పడడం అవసరం' అంటూ నాడి పరిశీలించి ధర్మామీటరుతో జ్వరతీవ్రతను నిర్ణయించి మందు కోసం గోపిని రమ్మన్నారు. గోపి ధర్మామీటరు కడిగేందుకు నూతి వైపుకు వెళ్ళాడు.

'నన్ను క్షమించండి డాక్టరు గారూ! మీ ఉదారత్వం నా కర్థంకాలేదు. గోపిని ఎందు కనవసరంగా బాధించటం? నేనే ఎలాగో వస్తాను.'

ఆయన మళ్ళీ నవ్వాడు.

'అబ్బాయీ! నువ్వు వట్టి అమాయకుడివి. ఆ అబ్బాయి చురుకైనవాడు. మంచివాడు. నువ్వంటే వాడి కెందుకో అభిమానం కలిగింది. నీ కోసం ప్రాణదానం చేయమన్నా చేస్తాడు. కాలంటూ లేదు కాని, ఉంటే ప్రపంచాన్ని కాల్చి వచ్చేవాడు.'

నాకు ఆసక్తి హెచ్చింది.

'డాక్టరుగారూ!...ఎదుటివాడి హృదయంలో ఏమున్నది అర్థం చేసుకునే శక్తి వుం దన్నారు. అతనంటే నాకు జాలి, ప్రేమ - అతని భవిష్యత్తు తల్చుకున్నప్పుడల్లా గుండె గడగడలాడుతూంది ... అతని తలిదండ్రుల్ని గురించి...'

'అయ్యో మేష్టరుగారూ!...ఆగండి...ఆగండి.. అట్టే వాగొద్దు - జ్వరం ఎక్కువౌతుంది. ఆ కుటుంబ చరిత్రంతా నాకు తెలుసు. చెబ్తాను. సావకాశంగా విను.' అనేసరికి వుత్సాహం వుబుకుతూ వచ్చింది.

'ఇదిగోనండి మీ మీటరు' అంటూ గోపి వచ్చాడు. ఆయన మెడిసన్ చెస్టు తీసుకుని వెళ్ళటానికి సిద్ధమయ్యాడు.

'ఒరేయ్ గోపి!...మేష్టారిమీద అభిమానం, గౌరవం వుంటే చాలదోయ్! కార్యరూపంలో వుండాలి. ఈ గది చూడు. అయిదూ పై నాలుగు. ఈ సీమవెండి గిన్నెలో మజ్జిగ కాని ఎన్నాళ్ళయిందని అడుగు. కనీసం నాలుగురోజులు. ఈ గోడలనుండి మట్టి రాలుతూంది. ఇదేమన్నా అలనాటి పుష్పవర్షమా! గదంతా సాలిగూళ్ళు-బొద్దింకల రాకపోకలు. ఇలాంటి చీకటి గుహలో మీగురువును బంధించి, ఆత్మత్యాగం చేసుకుని, మీ అందరికీ విజ్ఞానం ప్రసాదించమంటే ఎలాగోయ్? ఇదుగో, కుంటబ్బాయ్! నిజం చెబుతున్నా. మీ మేష్టారు ఓ నాటి అర్థరాత్రి మూటా

ముల్లె సర్దుకుని, ఎవరితోనూ చెప్పకుండా, చెయ్యకుండా, వెనక పడ్డరోడ్డు ఎక్కడ కనిపిస్తుందోనని జట్కా గుర్రంలా కళ్ళ కిరుపైపులా చేటలు కట్టుకుని వుడాయిస్తారు—కబడ్దార్...'

మరి నేనేం చేయనండి?...ఈయింటి యజమాని నామాట వింటాడా? నేను చిన్నవాణ్ణి. మీరు కాస్త కదిలిస్తే!' అంటూ నసిగాడు గోపి. ఈ రంగస్థలనాటకం నాకేం అర్థం కాలేదు. ఈ వేలెడుకుర్రాడు, ఆకళ్ళ జోడు మనిషి నన్ను వేళాకోళం పట్టిస్తున్నారేమోనని అనుమానపడ్డాను.

'అది కాదోయ్ పిచ్చివాడా! వందమంది వసించే డాబా వుంది కదా మీకు? ఓ గది ఇవ్వలేరూ? మీ అమ్మనడుగు—'ఊ' అంటే సరే సరి. మర్చిపోయి మీ నాన్న నడిగావు కనక—ప్రయోజనం వుండదు. వస్తానయ్యా వెర్రిమేష్టరూ! కాస్త బుద్ధిగా, కుదురుగా వుండు. నాలిక తెమ్మంటోంది కదా అని పచ్చి మంచినీళ్ళు తాగావు కనక - నా ఫ్లాస్కుతో వేడి నీళ్ళు పంపుతాను. తిక్కతో ఆరుబయట తిరక్క పడుకో. మీదికొస్తే మందులేదు.' అనేసి రెండడుగులు ముందుకు వేశారు.

'మీ ఋణం...' అంటూ ఏదో ప్రారంభించాను.

'చాలు చాల్లేవయ్యా!...పుస్తకాల్లో చదివిన సోది కబుర్లు—' అంటూ ఆయన కదలిపోయాడు.

ఈ పావుగంటలో సీతాపతి గారికి, నాకూ మధ్య జరిగిన సంభాషణ తల్చుకుని నవ్వుకున్నా. ఈ ఆర్భాటం—చీవాట్లు—హాస్యం—వీటి వెనక ఆయనలో సరళ హృదయం వుందని స్పష్టమైంది. ఆలా ఆలోచిస్తూండగా గోపి మందు, ఫ్లాస్కు అసుకు వచ్చాడు.

'మేష్టారూ!...నేను గదికోసం అమ్మ నడుగుతాను. ఒకవేళ ఆమె కాదు, కూడదు అంటే...' అంటూ తడబడ్డాడు.

'మరేం ఫరవాలేదు—డాక్టరుగారు ఏదో అన్నారు లే—నీ మానాన నువ్వూరుకో—అడిగి లేదనిపించుకునేదానికన్నా, అడక్కపోవటం మంచిది.'

గోపి మాట్లాడకుండా తలవంచుకుపోయాడు.

గోపి కుటుంబచరిత్ర తెలుసుకోవాలన్న ఆకాంక్ష ఎక్కువ కాసాగింది. దేవలోకంనుండి దిగిన విలాస కన్యలా తల్లి—పనికిరాని విషయాలమీద ఉపన్యసించే తండ్రి, వీ రిద్దరిమధ్య గోపిజీవితం ఎలాంటి ఆకృతి పొందుతుంది?...గోపి వయసుకు, అతని తల్లి వయసుకు పది సంవత్సరాలకంటె వ్యత్యాసం వుండడాని కవకాశం లేదు. చేతి గడియారంవంక చూసుకుంటే ఎనిమిది కావస్తోంది. ఈ పాటికి సీతాపతి గారు ఇంటికి తిరిగివచ్చివుంటారు. నే నడిగితే ఆయన కాదనరు. తలుపు తాళంవేసుకుని తొందర తొందరగా బయలుదేరాను. జ్వరంవున్నా, అర్థంకాని శక్తి ఆవేశంలో ముందుకు నడిచింది. ఆకాశంవంక చూస్తే, మబ్బులు కమ్ముకున్నాయి. అక్కడక్కడ మెరుపులు మెరిశాయి. వర్షం వస్తుందేమోనని భయం వేసింది. అరగంటలో తిరిగిరావాలని నిర్ణయించుకుని ఆయన ఇల్లు చేరుకున్నా—ఏదో పుస్తకం చదువుకుంటున్నారు.

'రావయ్యా! అభ్యుదయమానవా!...జ్వరాన్ని కూడా ధిక్కరించి దయచేశావ్?' అన్నారు నవ్వుతూ. 'జబ్బుగా వున్నప్పుడు ఎందుకు వచ్చావ'ని దులిపేస్తే ఏం చేయటం?...'రోట్లో తలదూర్చాక' అన్న సామెతలా తప్పదు మరి.

'అది కాదండి!...చుట్టూ ఏదో అంటుజాడ్యాలున్నాయన్నారు కదా! ఇంజక్షనిస్తే బాగుంటుందని....'

'హరిశ్చంద్రా!...కట్టిపెట్టు నీ కల్లబొల్లి కబుర్లు! గోపిగురించి వివరాలు తెలుసుకుందామని వచ్చావు. నా ముందు అబద్ధాలు ఆడవద్దని ఇదే ఆఖరుసారిగా చెప్పటం—ఫైనల్ వార్నింగ్!'

నేను సిగ్గుతో తలవంచుకున్నా.

'గోపితల్లి చనిపోయి చాలా కాలమైందయ్యా!...అతను పుట్టిన రెండు సంవత్సరాలకు కన్నుమూసింది పాపం. ఇప్పుడున్నది సవితల్లి. అందుకే అతన్ని ఏడిపించుకు తింటోంది. మూర్తి చాలా మంచివాడు. కాలేజీలో ప్రొఫెసరు. పొద్దున్న సైకిలుమీద వెడితే రాత్రి ఇంటికొస్తాడు ఈ మధ్యకాలంలో ఏం జరిగేది అతనికి తెలియదు. గోపి పల్లెత్తుమాటైనా అనడు...ఇదీ ఒకందుకు మంచిది. రేపు పెళ్ళాం వస్తే గోపి తెల్లమొహం వేయక చక్కగా వంట చేయగలడు—పిల్లల్ని పెంచగలడు. సరైన తరిఫీదు—'

నేను ఆశ్చర్యంతో విన్నాను. సీతాపతి గారు ఏమీ జరగనట్టు వివరించినా, అందులోవున్న భయం

ర సత్యం నన్ను ఆలోచనలో పడేసింది. గోపిచుట్టూ వెయ్యి విషసర్పాల బుసలు.

'డాక్టరుగారూ! మరో చిన్న సందేహం!... ఈ కుంటికాలు పుట్టుకతో వచ్చిందా? లేక ఏదైనా ప్రమాదంలో చిక్కుకుని...'

ఆయన నాకేసి కళ్ళెఱ్ఱచేసి చూశారు. కోపంతో బలంగా బల్లగుద్దారు. గుండెలు పీచుపీచుమన్నాయి. జ్వరం రెండువందల డిగ్రీలు చేరుకున్నట్టయింది.

'నువ్వు రైలుప్రయాణాలు తరుచు చేస్తూంటావా?'

నా ప్రశ్నకు, దీనికీ వున్న సంబంధం?...... ఒకవేళ గోపి రైలుప్రమాదంలో చిక్కుకొని కాలు పోగొట్టుకున్నాడేమో!

'చేశానండి...' అన్నాను భయంతో.

'కూర్చోటానికి చోటిమ్మని బతిమాలుతూ కొందరు ప్రయాణీకులు వస్తూంటారు. దయతల్చి కాస్త చోటిస్తే ఇటు అటూ జరిగి విశాలంగా కూర్చుని, చివరకు మనల్ని ఓ మూలకు నెట్టేసి పడుకుంటారు— సూక్ష్మంగా చెప్పాలంటే, కూర్చోమంటే పడుకున్నాడు. నువ్వూ అలాంటివాడివే!

'ఏదో జ్వరంతో రాత్రిపూట వచ్చాడు.పాపం! అని కొంచెం తాయిలం పెడితే ఇంకా తెమ్మంటావు? వెళ్ళవయ్యా! నీపని చూసుకో!' ఇంక లాభంలేదని నమస్కరించి వచ్చేశాను.

అప్పటికే వర్షం మొదలైంది. సీతాపతిగారికీ విషయం తెలియదు. తెలిస్తే గొడుగుపట్టుకుని వచ్చి వుండేవారు. లేక ఆరాత్రి ఇంటోగదిలో పెట్టి తాళం వేసేవారు. అయిదు నిమిషాలు నడిచేసరికి వర్షం ఎక్కువైంది. ఇంక లాభంలేదని, ఓ ఇంటి అరుగెక్కి ఆశ్రయం పొందాను. చీకట్లో మధ్య మధ్య మెరపు తప్పించి మరి వెలుగు లేదు. జేబురుమాలుతో తడిసిన తల తుడుచుకుందుకు ప్రయత్నించాను.

'అదికాదే అమ్మా!...ఆ గదిలో జంతువులు కూడా వుండలేవు. పాపం! మన మేష్టారే కదా! ఇంత పెద్ద ఇల్లు మనకుంది—ఓ చిన్న గదిస్తే ఏంపోయింది? డాక్టరుగారుకూడా చెప్పారు.'

ఆశ్చర్యపోయాను. అది గోపికంఠం—ఇంట్లోంచి వినపడుతోంది.

నేను ఎక్కడున్నానో అర్థమైంది.

'ఏడిశావ్! నీ తలకాయ! ఇలాంటి పెత్తనాలు నెత్తినేసుకొచ్చావంటే పీక పిసికి పారేస్తాను. నీ కుంటికాలు వెధవమొహాని కిదొక్కటే తక్కువైంది. ఛీ!...'

అంతే! ఆతరువాత గోపి ఏడవటం—ఎవరో కొడుతున్న చప్పుడు. తలుపుతట్టి ఆమెను పిలిచి గట్టిగా చివాట్లు వేయాలనిపించింది. ఉద్రేకాన్ని అణచుకుని ఆ వర్షంలో తిరుగుముఖం పట్టాను.

వానలో తడవటంమూలాన ఆ మర్నాటికి జ్వరం ఎక్కువైంది. సాయంత్రం గోపివచ్చి నా స్థితి చూచి మరింత బాధపడ్డాడు. మోచేతిదగ్గర, కాలుమీద వాపులు కనిపించాయి.

'ఏమిటిదంతా?...' అనడిగాను.

'పొద్దున్న వీధిలో జారిపడ్డాను' అన్నాడు.

'అబద్ధం! నాకు గది కావాలనడిగినందుకు అమ్మ కొట్టింది. నాకు తెలుసు. దానికంతకూ మూలకారణం నేను. మళ్ళీ ఇలా చేశావంటే ఈవూరు వదలిపోతాను. నాకోసం మరొకరు బాధపడటం నేను సహించను— తెలిసిందా?' అని మందలించాను. గోపి తలవంచుకుని కాసేపు మౌనంగా నిలబడ్డాడు. అంతకంటె అతన్నెక్కువ చీవాట్లు వేయనక్కర్లేదు. మనసు వులిపొర కాగితంలాంటిది. చిరగటానికి ఎంతోసేపు పట్టదు. కాసేపు స్కూలు కబుర్లు చెప్పి వెళ్ళిపోయాడు. మరి కొంతసేపటికి సీతాపతిగారు వచ్చారు. బహుశ గోపి వెళ్ళి పంపివుంటాడు.

'నూటొక్కటి' అన్నారు టెంపరేచరు చూసి. గుడ్లప్పగించి చూస్తూ పడుకున్నా.

'చిన్నపిల్లలకైనా కాస్త ఇంగితజ్ఞానం వుంటుంది నీకదికూడా లేదు. ఒళ్ళు కాగిపోతుంటే వర్షంలో పోవాలి. నువ్వు మేష్టరుగా పనిచెయ్యటానికి ఎంతమాత్రం పనికిరావు' అని ఇంజక్షనిచ్చారు.

'క్షమించండి. ఏదో బుద్ధి గడ్డి తిని...' అంటూ ప్రాధేయపడ్డాను.

'కాదయ్యా! నీబుద్ధి హల్వా, గులాబ్ జాం తింటోంది' అని గట్టిగా నవ్వారు.

'కాస్త కారంకూడా మధ్యమధ్య వుండాలి. తీపి పదార్థాలు అదే పనిగా తింటే వెగటు కలుగుతుంది' అన్నాను తెగించి.

ఆయన తోలుసంచి సర్దుకుని వెళ్ళటానికి సిద్ధమయ్యారు.

'డాక్టరుగారూ! నిన్నటి నా ప్రశ్న?' అనడిగాను.

వెనక్కి తిరిగి ఏమన్నట్లు కుడికన్ను చిన్నదిచేసి, ఎడంకన్ను పెద్దదిచేసి చూశారు.

'ఓ! అదా!...అదొక రహస్యం కుశాగ్రబుద్ధీ! ఎవరి చెవినీ పడవేయకు. కుర్రాడు ఆరోగ్యంగా, అందంగా, నిండుగా వుండేవాడు. రెండోఏట తల్లి పోయింది. మూడో ఏట మేడమీదనుండి కిందపడ్డాడు. కాలు విరిగింది.'

'ఇందులో రహస్యం ఏముంది డాక్టర్!... మామూలుగా జరిగేదే!'

'కాదోయ్ మందబుద్ధీ! పూర్తిగా విను. అతను పొరపాటున కాలుజారి కిందపడలేదు. వెనక నుండిన సవితితల్లికిందకు తోసేసింది.'

ఆలస్యమైనట్టు, వ్యర్థ ప్రసంగం చేస్తున్నట్టు ఆయన చేతివాచీ చూసుకున్నాడు.

'కారణం!...'

'ఓయి అపరాధ పరిశోధ కాగ్రమా! నా బుంప తెంపుతున్నావు. లోకజ్ఞానం బొత్తిగా సున్న నీకు, అందంగా వున్న కుర్రాణ్ణి, తనబిడ్డ కానప్పుడు సవితి తల్లి ప్రేమించలేదు. అదీకాక, అతనంటే మూర్తికి ప్రాణం. ఒకనాడు కాకపోతే ఒకనాడు ఆమెకది ప్రతిబంధకం. అందుకని చంపేద్దామని తోసేసింది గామోలు! కాలు విరిగి వూరుకుంది' అనేసి గట్టిగా నవ్వటం మొదలు పెట్టారు.

'డాక్టరుగారూ!...ఆ కాలు బాగుచేయటం పడదా?'

'అసాధ్యం సర్జన్ జనరల్ గారూ! విరగ్గానే అతకటానికి ప్రయత్నించాం. చెన్నపట్నం తీసుకుపోయి తంటాలుపడ్డాం. బొంబాయిలో ప్లాస్టిక్ సర్జరీ పని చేస్తుందేమోనని చూశాం. లాభం లేకపోయింది. ఆ కుర్రాడు చనిపోయినా బాగుండును.'

'అలా గనకండి!...అంగ వైకల్యం వున్నంత మాత్రాన ఓ వ్యక్తికి ప్రపంచంలో స్థానం లేకుండా పోదు. నిజానికి, అలాంటి వారికే గొప్ప భవిష్యత్తు వుంటుంది. సర్వావయవాలూ తీరుగా వున్నవారికి జీవితంలో ఇబ్బందులు, ఆశలు, ఆదర్శాలు ఏవీ వుండవు. మందలో మేకలా-గుంపులో మనిషిలా-ఒకే గమ్యస్థానం వైపు-ఒకేదృష్టితో అటూ ఇటూ దూరాన రకరకాలైన పూలతోటలు-వింతలు-విచిత్రాలువున్నా చూడకుండా నడుస్తారు. గోపిలాంటి వారు ఎప్పుడూ తమ లోపాల్ని గురించి ఆలోచిస్తూ, అందరికంటె వెనకనడుస్తూ ఆ పువ్వుల్ని, వింతల్ని చూసి ఆనందిస్తారు. ఇతరులకు మార్గదర్శకులవుతారు. మిల్టన్, సర్ వాల్టర్ స్కాట్— అందరూ అలాంటివారే!'

'కవి పుంగవా! చాలించు. నీ కవిత్వం వేరె కాగితంమీదరాసి పంపించు. తీరిగ్గా చదివి సంతసిస్తా.' అనేసి గట్టిగా నవ్వారు. నేను కొద్దిగా సిగ్గుపడ్డాను.

'మాస్టర్ జీ... నేను ఇంతసేపు గోపి గురించి చెప్పినదంతా నిజమని నమ్ముతున్నారా?...అంతా వట్టిది. కల్పన. అసందర్భం అలా ఎక్కడైనా జరుగుతుందా? ఎంత సవితితల్లైనా అంతటి అఘాయిత్యానికి తలపెట్టదు. అందుచేత ఇప్పుడు విన్నదంతా మర్చిపోవటం మంచిది' అనేసి గబగబ వెళ్లిపోయారు.

తలా తోకా అర్థంకాలేదు. చేతిలో రూపాయి నోటు వుంచి అబ్బాయ్! అదివట్టి కాగితం ముక్క. అవతలకు విసిరేయ్! పనికిరానిది.' అన్నట్టుగా వుంది. ఆయన నమ్మవద్దని హెచ్చరించినా, నేనుమాత్రం విశ్వసించాను. కారణంలేనిదే కథ వెలువడదు.

జరిగింది భూతకాలం మాట. ఇక భవిష్యత్తు గురించి ఆలోచించాలి. గోపి బతికి వుండటం తల్లికిష్టం లేదు. తన ప్రయత్నంలో ఓసారి ఓడిపోతే, మరోసారి ప్రయత్నించదని నమ్మక మేమిటి?...అందుకే అతన్ని రాచిరంపాన పెడుతోంది గామోలు! వెలుగు నింపవలసినచోట చీకటి కుమ్మరిస్తోంది. నేను చేయగలిగిందేమీ లేదు కనక గోపి గురించి ఆలోచించకూడదనుకున్నా. మరో మూడు రోజులకు స్కూలుకు వెళ్లాను.

* * *

గది దొరకలేదన్న ప్రశ్న దానంతటదే సమాధానాన్ని వెతుక్కుంది. స్కూల్లోవున్న 'సామాను గది' ఖాళీచేసి నాకిచ్చారు. దాన్ని వాసయోగ్యంగా మార్చుకున్నా. చుట్టూ వరి పొలాలు, తోటలు దూరంగా పెద్దచెరువు, స్వచ్ఛమైనగాలి, ఒకరితో జోక్యం లేదు. స్వేచ్ఛ జెండా ఎత్తింది.

ఓనాడు రాత్రి ఏడుగంటలు-గదిలో కూర్చుని ఏదో రాసుకుంటున్నా. వెన్నెల భూమినంతా ఆక్రమించుకుంది. నిశ్శబ్దం ఎవర్నో జోకొడుతూంది. గోపి నెమ్మదిగా వచ్చినా ముందు కూర్చున్నాడు.

ముగింపు దొరికింది!

'ఏమోయ్! ఈ వేళప్పుడు వచ్చావ్? మీ అమ్మకో నాన్నకో తెలిస్తే నీకు అక్షింతలు తప్పవు.' అన్నాను నవ్వుతూ.

'మరేం లేదండి!...మా అమ్మ సబ్బుకొనుక్కురమ్మంది. గదిలో దీపం కనిపిస్తే వచ్చాను. మేష్టారూ! మీరు రాత్రిళ్ళు గది తలుపులు తెరచుకుని పడుకోకండి. ప్రమాదం. ఈ చుట్టుపక్కల పెద్ద పెద్ద నక్కల గుంపులున్నాయి. అవి మంచి నిషాలోవుంటాయి కనక మీదపడి కరుస్తాయి. ఒంటరిగా వున్నారు కనక మీరేం చేయలేరు.'

'అలాగా!...నాకిదంతా తెలియదు సుమా!' అన్నాను. గోపి ఏవో పుస్తకాలు చూస్తూ కాసేపు గడిపాడు.

'గోపి!...నువ్వు స్కూలు ఫైనలు ప్యాసయ్యాక ఏం చదువుతావ్?'

'పెద్ద పెద్ద చదువులు చదువుకుని గొప్పవాణ్ణవాలనుందండి. కాని ఓ కాలు లేదు. అందుకే అమ్మ, కుంటివెధవకు చదువెందుకు? గొడ్లను కాస్తాడు. పంపండి. అంటోంది.'

మనసు చివుక్కుమంది. అతని ముఖంలో వెలుగు నన్ను ఆలోచనలో పడేసింది.

'మీ అమ్మ ఏమన్నా సరే. నువ్వు చదివితీరాల్సిందే. ఇంతకూ నీకు ఏదెక్కువ ఇష్టం? హిస్టరీ-జాగ్రఫీ- సైన్సు- లెక్కలు.'

అది గోపికి క్లిష్టమైన సమస్యని నాకు తెలుసు. ఎందుకంటే, ప్రతి సబ్జక్టులోనూ మొదటిమార్కు అతనిదే! గోపి నాకేసి అమాయకంగా నవ్వాడు.

'గోపి!...అంత త్వరగా ఏ నిర్ణయానికి రాలేవు...లెక్కలా?' కాదని తలూపాడు.

'పోనీ ఇంగ్లీషు?' అతను నవ్వాడు.

'సైన్సు?'

'అవునండి...అందులో ప్రతిపాఠం చిత్రంగా వుంటుంది. మనకు తెలియనివి చాలావుంటాయి.' అన్నాడు.

అర్థమైపోయింది. విజ్ఞానశాస్త్రంలో అతని భవిష్యత్తు యిమిడివుంది. సరైనమార్గంలో అతన్ని నడిపిస్తే గొప్ప శాస్త్రవేత్తవుతాడు.

'గోపి!...నాకు తెలిసిపోయింది. రేపట్నుంచి సాయంత్రం నా దగ్గరకురా! నీకు సైన్సుపాఠాలు చెబుతాను. జాగ్రత్తగా అర్థంచేసుకో. మంచి రోజులు వస్తాయి.' అన్నాను వుత్సాహంగా. అతను 'ఏమౌతాడో, ఏమౌనని' భయపడుతున్న నా హృదయం ఒక్కసారిగా గంతులువేసింది.

'అలాగేనండి...' అని రెట్టించిన ఆనందంతో తల వూపాడు

రెండు నిమిషాలు గడిచాయి.

'మేష్టారూ! ఏమైనా కొత్త పుస్తకాలు కొనుక్కోవాలాండి?'

'ఓ పెద్ద నోటుపుస్తకం కొనుక్కో. రెండు-మూడు నెలలు పోయాక తతిమా పుస్తకాలు కొనొచ్చు.'

ఏదో ఆలోచిస్తూ గదిలో రెండు మూడుసార్లు తిరిగాడు. తన జీవితానికిక వెలుగులేదని భావించిన అతని మనసులో ఒక్క మెరపు మెరసింది. అచేతన వస్తువులో జీవం మెదలింది.

'ముందు ఏ పాఠం చెబుతారు మేష్టారు? విద్యుచ్ఛక్తి గురించి చెబుతారా? వద్దు...గ్రామఫోను—ఛీ! ఛీ! ఇప్పుడు ఎవరూ కొనటం లేదు. రేడియో గురించి చెప్పండి.'

'అదంతా నాకు తెలుసు.'

'మేష్టారూ! మీరు ఏం రాస్తున్నారు?

'ఏదో కథలే! ఏం? ఎందుకు?'

'మీకు కథలు రాయటం వచ్చునాండి? నాకు తెలియదు మేష్టారూ! నా గురించి ఓ కథ రాయరూ? ఏదైనా పత్రికకు పంపండి. చదివి అందరికీ చూపిస్తాను.'

'గోపీ! నీ గురించి కథ తప్పకుండా రాయగలను. కాని...కాని...దాని ముగింపు? ...ఏమని రాయమంటావ్? ప్రఖ్యాత శాస్త్రవేత్త అయ్యావని రాయనా?'

'ఓస్!....ఇంతేనా! నేను చనిపోయినట్టు రాయండి...అదే బాగుంటుంది. త్వరగా రాసేయండి.'

అతనికి సమాధానం చెప్పేలోగా ఎవరో విద్యార్థివచ్చి నమస్కరించి వినయంగా చేతులు కట్టుకుని, ఎదురుగా నిలబడ్డాడు.

'ఏమోయ్ రవణా!....ఇలా రాత్రప్పుడు వచ్చావ్?'

'మరేం లేదండి...మరి...మరి...' అంటూ నసిగాడు.

'ఫరవాలేదు—ధైర్యంగా చెప్పేయ్!' అని భుజం తట్టాను.

'మరేం లేదండి...పదో తారీఖులోగా జీతం కట్టాలి కదండి...ఇవేళ ఆరో తారీఖు. మూడు నెలల్నుండి జీతం కట్టడంలేదు. హెడ్మాష్టారు బడికి రావద్దని కచ్చితంగా చెప్పేశారు. మా అమ్మ, నాన్న బీదవారు. నాన్నకు వస్తుందనుకున్న డబ్బు రాలేదు. మీరు దయతలిచి ఓ పదిరూపాయలిస్తే వచ్చే నెల తీరుస్తాను.

అతని ముఖం చూస్తే జాలివేసింది. చింపిరితల. కటు తొడుక్కున్న చొక్కా. చిరుగుపంట్లాం. ఇలాంటి విద్యార్థులు మన దేశంలో వేలకొలదీవున్నారు. పాపం వీళ్లంతరూ ఎలా చదువుకుంటారు? విశాల మనస్తత్వం ఎలా అలవడుతుంది?...సాయంచేయాలనే వుంది. కాని వచ్చిన చిక్కేమిటంటే, నా దగ్గర రెండు రూపాయలున్నాయి.

'రవణా!...నువ్వు చెబితే నమ్మవు! నా దగ్గర రెండే రూపాయ లున్నాయి. ఎవర్నయినా అడిగి చూస్తాను. నీ అదృష్టం మరి. రేపు కనపడు.'

రవణ ఏదో అడగబోయి నమస్కరించి వెళ్ళిపోయాడు. మనసు విరిగింది. గోపికేసి చూశాను. అతనేదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

"గోపి! టైం తొమ్మిదికావస్తోంది ఇంటికి వెళ్లు. అమ్మ, నాన్న నీకోసం వెతుకుతుంటారు" గోపి వెళ్ళిపోయాడు.

ఆరాత్రి తలుపులు వేసి పడుకున్నా. గోపి అన్న మాటలు అక్షరాలా నిజం. పదిపదిహేను నక్కలు కిటికీలగుండా నాకేసిచూసి నవ్వాయి. ఒంటరిగా వున్నందున, నిజంగా భయంవేసింది కూడా. ఆ మర్నాడు సాయంత్రం రవణ నవ్వుతూ వచ్చాడు.

"మీరు చాలా మంచివారండి మేష్టారూ!... మా నాన్నతో కూడా చెప్పాను. మీ పదిరూపాయలు వచ్చే నెల తిరిగిచ్చేస్తానన్నాడు" అన్నాడు. నాకేం బోధపడలేదు. అతనికి నేను డబ్బివ్వలేదని నాకు బాగా తెలుసు.

'ఏమిటోయ్! వేళాకోళా లాడుతున్నావ్? నేను నీకు డబ్బివ్వట మేమిటి?...లేదని నిన్ననే చెప్పానుగా!' అన్నాను.

'అదేమిటండి!......మీ రిచ్చారని గోపి ఈ వుదయం ఇచ్చాడు.'

నా కర్థమైంది. మాట్లాడకుండా క్లాసుకు వెళ్లాను. ఆ రాత్రి గోపిని ఈ విషయమై అడిగాను.

'నేను చేసింది తప్పేనండి మేష్టారూ!...కాని అతన్ని చూస్తే నాకు ఏడుపొచ్చింది పాపం! మంచి బట్టలు లేవు. తలకు నూనె రాసుకోడు. నాలుగు మైళ్ళు నడచివస్తాడు రోజూ. మా నాన్న దగ్గర బోలెడు డబ్బుంది. కొంత తీసిస్తే తరిగిపోదండి. ఇప్పుడు నాకెంతో ఆనందంగా వుందండి...'

'ఈ సంగతి మీ అమ్మకు, నాన్నకు తెలుసా?'

'తెలియదండి' అన్నాడు బెదురుగా చూస్తూ.

'నువ్వు చేసినపని మంచిదో, చెడ్డదో తరువాత నిర్ణయిద్దాం. నువ్వు చేసినపని దొంగతనంతో సమానం. ఇక ముందెప్పుడూ చేయకు.' అని అప్పు తీసుకుని ఆ డబ్బు తిరిగిచ్చేశాను.

ఆనాటినుండి గోపి ఒక్కరోజు విడవకుండా వచ్చేవాడు. చెప్పిన ప్రతిపాఠం శ్రద్ధగా చదివేవాడు. బాటరీల సహాయంతో చిన్న బల్బు వెలిగించి చూపించాడు. ఇంటో తన గదిలో విద్యుద్దీపం వెలిగించాడు. గోపికి మార్కులు ఎక్కువ వస్తే తతిమా విద్యార్థులు నామీద అనుమానంతో అతని పేపరంతా జాగ్రత్తగా చూసేవారు. ప్రశ్నపత్రాలు ముందే అందజేస్తున్నానని అపనిందలు వేశారు. సూటిపోటిగా క్లాసులో ఏవేవో అనేవారు. కాని మనసు దృఢపర్చుకుని గోపి శ్రేయస్సుకోసం పాటుపడ్డాను. అలా అయిదు నెలలు గడిచాయి.

ఓనాడు రాత్రి వెంటనే రమ్మని డాక్టరుగారు కబురంపారు. అయన్ని అప్పుడప్పుడు కలుసుకోటం, గోపి గొప్పతనం గురించి ప్రస్తావించటం జరిగింది. ఆయన విని విననట్టు నవ్వి వూరుకునేవాడు. నిజానికి, ఆ పొద్దున్నే ఆయన్ని కలుసుకున్నాను. ఇంతలో ఏంకొంప మునిగిందోనని పరుగుత్తుకు వెళ్ళాను.

'రావయ్యా గురూత్తమా!...కబురంపి గంటన్నరైంది. ఇప్పటికైనా వచ్చావు. బాగుంది. ఇప్పుడు నీ తల, నాతల ఎగిరిపోయే ప్రమాదపరిస్థితి వచ్చింది.' అంటూ వుపోద్ఘాతం ముగించారు. ఓనిమిషం నిశ్శబ్దంగా వున్నాం.

'ఇవేళ మధ్యాహ్నం గోపితల్లి నాతో మంత్రాలోచనలు జరిపింది. దేనికో తెలుసా?...గోపి బతికి వుండటం తనకు ఇష్టంలేదట. అదీకాక నువ్వు చెప్పే వెర్రివేట్ల ఫలితంగా అతని తెలివి హద్దులు మీరి, నాన్న

గారి అనురాగాన్ని సంపాదించుకుంటున్నాడట— అందుచేత ఏదైనా ఇంజక్షనుకాని, మందుకాని ఇచ్చి చంపేయమంటోంది.'

నానోట మాట రాలేదు. భయపడుతూ వచ్చిన నిజం దగ్గరకు వచ్చినట్టయింది. నేను వేసుకున్న పథకాలన్నీ ఒక్కసారిగా నన్ను వెక్కిరించాయి.

'మీరేమన్నారు?...' అనడిగాను.

డాక్టరుగారి ముఖం ఎర్రబడింది. బల్లమీద గట్టిగా గుద్దారు.

'ఏమంటానయ్యా?.....ఒప్పుకున్నాననుకుంటున్నావా?...ఏమనిషన్నా ఒప్పుకుంటాడటయ్యా? చీవాట్లువేసి జడిపించి వచ్చాను. ఇకముందు గోపికేదైనా ప్రమాదం సంభవిస్తే ఆమెను జైలుకు పంపిస్తానన్నాను. కాని నిర్లక్ష్యంగా నవ్వేసి వూరుకుంది. దీన్నిబట్టి ఆలోచిస్తే ఆమె ఎలాగైనా గోపిని చంపేస్తుందేమోనని భయంగా వుంది—ఏంచేద్దామంటావ్?... చూస్తూ, చూస్తూ ఓ కుర్రాడిని వదలుకుంటామా? అందులోనూ బుద్ధిమంతుడు.'

జీవితానుభవం వున్న డాక్టరుగారికి తోచని వుపాయం నాకేం తోస్తుంది?

'గోపిని తీసుకుని మరోవూరు వెళ్ళమంటారా?'

'నువ్వు తెలివితక్కువ వాడివని ముందే తెలుసుకాని, ఇంత మరీ దిగజారిపోతావనుకోలేదు. నువ్వు తీసుకుపోతే తలిదండ్రులు వూరుకుంటారటయ్యా?... పోలీసుకు రిపోర్టుచేసి కొట్లో వుంచుతారు.'

నేను ఆలోచిస్తూ కూర్చున్నా.

'అంతా నేను ముందే నిర్ణయించాను. నీ బుద్ధిబలం పరీక్షిద్దామని అడిగాను. పట్నంలో వికలాంగులకు ఓ ఆశ్రమంవుంది. అందులో చేరుద్దాం ... కాని మూర్తిని ఒప్పించటంలో చిక్కంతా వుంది. అతను శ్రీమంతుడు. కనుక వినిపించుకోడు - ఏమైనా ప్రయత్నించటం మనవిధి. బయలుదేరు.' అన్నారు.

మేం వెళ్ళేసరికి మూర్తిగారు ఇంట్లోనే వున్నారు. సీతాపతిగారు తన చాకచక్యాన్నంతా వినియోగించి ఆయన మనసు మార్చారు. గోపి జీవితంలో ముందుకు రావాలంటే ఆ దొక్కటే మార్గమని ఆయన వాదించారు. మూర్తి ఒప్పుకున్నారు.

'ఒకవేళ ఆమె ఒప్పుకోకపోతే?' అనడిగాను తోవలో డాక్టరుగార్ని.

'అలా ఎన్నటికీ జరగదు. ఆమెకూ సంతోషంగానే వుంటుంది.' అన్నారు.

* * * *

అనుకున్నట్టు అంతా స్థిరపడింది.

సంగతి తెలుసుకున్నాక, గోపి వెళ్ళనంటూ ఏడ్చాడు. ఎన్ని బాధలున్నా అతనికావూరు, ప్రకృతి, అక్కడి మనుష్యులు నచ్చారు. వీడ్కోలివ్వటానికి బస్సుస్టాండుకు వెళ్ళాను. మూర్తికూడా వున్నారు. గోపి కిటికీవారగా కూర్చున్నాడు. చెంపలమీదుగా నీరుకారుతోంది.

'మేష్టారూ!...నిజం చెప్పండి! మీరు నన్ను గొప్పవాణ్ణి చేస్తానన్నారు. పుస్తకాలు అవీ కొనమన్నారు. నేను ఏతప్పూ చెయ్యలేదు. శ్రద్ధగా చదువుకుని, మీరు చెప్పినట్టు అన్నీ చేశాను. నన్నెందుకు ఆశ్రమానికి పంపిస్తున్నారు మేష్టారు? నేనంటే మీకసహ్యం కలుగుతోందా?'

అతికష్టంమీద ఏడుపు దిగమింగుకున్నాను. అతనికేమని సమాధానం చెప్పను? నిజాన్ని ఎలా వివరించను? అతని మాటల్లో చివరివాక్యం నన్ను చురుక్కున పొడిచింది. గోపి నన్ననుమానిస్తున్నాడు.

'గోపీ! నువ్వు లేనిపోనివన్నీ వూహించుకుని బాధపడుతున్నావు. ఆశ్రమంలో నాకంటె ఇక్కడివాళ్ళందరికంటె మంచివాళ్ళుంటారు. వారందరూ నీకు మార్గదర్శకులౌతారు.' అన్నాను ఎటో చూస్తూ.

'అబద్ధం మేష్టారూ!...మీలా నన్ను అర్థంచేసుకునేవారెవరూ లేరు. ఉండబోరు. నేను కుంటివాణ్ణి కనక నన్ను తరిమేస్తున్నారు. మేష్టారూ! నా కుంటికాలు బాగుపడేందుకు మార్గాలు లేవాండీ?'

గోపి ఈనాటివరకూ ఇలాంటి ప్రశ్న వేయలేదు.

'తప్పకుండా బాగుపడుతుంది. ఆపరేషన్ చేసి కొత్తకాలు పెడుతారు. దానితో నువ్వుకూడా మాలాగే తిరగగలవు. మాకు మల్లే జీవించగలవు. అయితే కొంతకాలం ఆగాలి-అనుకున్నట్టు ప్రతిదీ జరగదు. ఇదంతా ఆలోచించే మీ నాన్నగారు నిన్ను పట్నానికి పంపిస్తున్నారు. అక్కడి మనుష్యులు నీలాంటి వారిమనస్తత్వాలను బాగా అర్థం చేసుకున్నవారు. ఏం చేయవలసింది వారికి బాగా తెలుసు.'

బస్సు బయలుదేరటానికి ఇంక ఐదునిమిషాలుంది. డాక్టరుగారు వస్తారనుకున్నా. ఆయన రాలేదు. రోడ్డంట

పోతున్న కుంటి కుక్కమీద అల్లరిపిల్లలు రాళ్ళు రువ్వుతున్నారు. గోపి అదే దృశ్యాన్ని తదేక దృష్టితో చూస్తున్నాడు.

'మేష్టారూ!...ఆ కుక్కపాట్లు చూశారా?... నా గతి అంతే!' అన్నారు.

అతని కిష్టమైన పుస్తకాలు కొన్ని కొనుక్కొచ్చాను. అవన్నీ అందించాను. మా ఇద్దరిమధ్య ఇంతసేపట్నుంచి సంభాషణ జరుగుతున్నా మూర్తిగారు మౌనంగా వుండటం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆయన ముఖంపాలిపోయి కళావిహీనంగా వుంది. బస్సు బయలుదేరటానికి సిద్ధమైంది.

'గోపీ! జాగ్రత్తగా, బుద్ధిగా చదువుకో. అప్పుడప్పుడు నేను నిన్ను వచ్చి చూస్తూంటాను' అన్నాను. బస్సు కదిలించి. గోపి చేయి వూపాడు. ధూళి రేపుతూ కదిలిపోతున్న బస్సుకేసి చూస్తూ నిలబడ్డాను.

*　　　*　　　*

గోపి వెళ్ళిపోయినప్పట్నుంచి నాలో కూడా చిత్రమైన మార్పులు వచ్చాయి. మానవత్వంమీద మమకారం, విశ్వాసం నశించాయి. భవిష్యత్తును గురించి మనం ఆలోచించి, పథకాలు వేసుకోడం తెలివితక్కువనిపించింది. మనం శ్రమపడి, జీవితవిధానాన్ని నిర్ణయించటం, అనుకోకుండా వచ్చిపడే అవాంతరాలు అన్నింటినీ తారుమారు చేయటం-అంతకంటె 'జరిగేదేదో' జరుగుతుందని కళ్ళు మూసుకొని జీవించటం మేలనిపించింది. గోపి విషయంలో, నేననుకున్నట్టు అన్నీ జరిగినా, ఒక సంవత్సరంలో అతన్ని పైకి తీసుకురాలేను. ఏళ్ళకొలది పరిశ్రమ దాని కవసరం. ఏడాది గడిచాక ఆ వూరు విడిచి వెళ్ళటం తప్పదు. అతనికోసం నా జీవిత లక్ష్యాలను ఎలాగూ త్యాగం చేయలేను. అలాంటప్పుడు అతన్ని గురించి బాధపడటం కూడా పొరపాటేమో ననిపించింది. ఏదెలావున్నా, ఇవన్నీ ఆత్మతృప్తికోసం ఏర్పడిన కారణాలు.

మూడునెలలు గడిచాయి. జీవితం బాగుగా నడుస్తోంది. అప్పుడప్పుడు మూర్తిగార్ని, డాక్టరుగార్ని కలుసుకొని గోపిగురించి తెలుసుకుంటూనే వున్నాను. అతను చక్కగా చదువుకుంటున్నట్టు వుత్తరాలు వస్తున్నా యన్నారు.

ఓనాడు సాయంత్రం నాకేదో వుత్తరం వచ్చింది. దస్తూరీ చూడగానే అదెవరు రాసింది తెలిసిపోయింది. చించి చదువుకున్నా—"మేష్టారికి గోపి నమస్కారాలు—ఈ వుత్తరం రాసి మీ కాలాన్ని వృథా చేస్తున్నందుకు నన్ను క్షమిస్తారని ఆశిస్తున్నా. ఇక్కడంతా బాగానే వుంది.

ఉదయం నాలుగ్గంటలకు లేవాలి. తతిమా పిల్లలతోబాటు స్నానాలు చేయాలి. తరువాత ఏవో అర్థంకాని ప్రార్థనలు—ఏడింటికి పాఠాలు—ఆ చెప్పే మేష్టారుకి అందరిమీదా కోపం—మాలో కుంటివాళ్ళు సొట్టవాళ్ళు చాలామందున్నారు. కనీసం పదిమందికైనా దెబ్బలు తగులుతాయి. వచ్చిన మొదటిరోజునే నాకు దెబ్బలు తగిలాయి. ఆ పాఠాలు ఎవరికీ అర్థం కావు. ఏవేవో బోర్డుమీద రాస్తారు. మేం రాసుకోవాలి.

మధ్యాన్నం రొట్టెముక్క, అన్నం, కొంచెం పాలు ఇస్తారు. అన్నీ వాసనకొడతాయి మేష్టారూ! మొదటి మూడురోజులు తినలేకపోయాను. తరువాత ఆకలికొలదీ తినక తప్పదు. మాఇంట్లో తినే పప్పన్నం జ్ఞాపకానికొస్తోంది. సాయంత్రం ఏవేవో ఆటలు—తొమ్మిదయేసరికి పడుకోవాలి. ఇదీ మా కార్యక్రమం.

ఇలా రోజూ జరిగిపోతోంది. ఏమాత్రం వుత్సాహం లేదు. క్రొత్తవిషయాలు ఏవన్నా చెప్పమనడిగితే 'కుంటి వెధవలకు ఇంతకంటె ఎక్కువెందుకు? ఎలాగూ మీరంతా ముష్టెత్తుకునే వారేగా!' అంటారు. మీరిచ్చిన పుస్తకాలు చదువుతున్నాను. ఏమీ బోధపడటం లేదు, అడుగటానికి మీరు దగ్గరుంటే బాగుండు ననిపిస్తోంది.

మరో విచిత్రం మేష్టారూ! మాలో అందరికీ కాళ్ళూ, చేతులూ లేకపోయినా ఒకరిమీదొకరికి కోపాలు, అసూయలు, పగలు వున్నాయి. అవన్నీ ఇంకా ఎందుకో! నేను ఏదన్నా చెబితే అందరూ కలిసి వేళాకోళం పట్టిస్తున్నారు..."

ఇంక చదవలేక వుత్తరం మడిచేశాను. డాక్టరుగారికి ఉత్తరం చూపించాను.

'కొత్తకదటయ్యా! అలాగే వుంటుంది. అలవాటు పడితే అతనే సర్దుకుపోతాడు.' అన్నారు. ధైర్యంగా వుండమని, జాగ్రత్తగా చదువుకోమని అతనికి జవాబు రాశాను.

కాని గోపి వుత్తరాలు రాస్తూనే వున్నాడు. తిరిగి తనకు రామాపురం రావాలనుందని, నాదగ్గర

చదువుకోవాలని రాసేవాడు. అతన్ని తిరిగి తీసుకు రావటం కుదరదు. అలా రెండు నెలలు గడిచాక గోపి నన్ను వెంటనే రమ్మని ఉత్తరం రాశాడు. అతని అభిప్రాయాలు చదువుకుంటే, చిన్న గుండెలో క్రమ క్రమంగా చీకటి నిండుతోందని అర్థమైంది. ఒక వేళ అతను మనసు విరిగి ఆత్మహత్య చేసుకుంటే...... ఆదివారం బయలుదేరి వస్తున్నట్టు ఉత్తరం రాశాను. ఆదివారం ఉదయం బయలుదేరబోతుంటే వెంటనే బయలుదేరి రమ్మని అన్నయ్య దగ్గర్నుంచి టెలిగ్రాం వచ్చింది. ఏదో మంచి ఉద్యోగం స్థిరపరచినట్టు మాటా ముల్లె సర్దుకుని తక్షణం రమ్మని దాని సారాంశం.

తిన్నగా డాక్టరుగారి దగ్గరకు వెళ్లి సలహా అడిగాను.

'ఇదేం పెద్ద సమస్య కాదయ్యా!...నీ భవిష్యత్తు పాడుచేసుకోకు. గోపినిగురించి మేం జాగ్రత్తపడతాం. నువ్వు వుండి చేసేదేమీ లేదు. ఎలాగూ ఏడాదయ్యాక వెళ్లటం తప్పదు. కనుక హెడ్మాస్టారితో చెప్పి ఈ మధ్యాన్నం బండికే వెళ్లిపో. ఉత్తరాలు రాస్తూండు. ఈ ప్రాంతాలకు వస్తే మమ్మల్ని చూసిపో!'

ఆయనకు సాష్టాంగ నమస్కారం చేయాలనిపించింది. గోపి చివరిసారిగా రాసిన ఉత్తరంలో కూడా 'నాగురించి రాస్తున్న కథ ఎంతవరకూ వచ్చింది?' అనడిగాడు. అతని ఉత్తరాలన్నీ జాగ్రత్తగా పెట్టెలో వుంచాను.

మధ్యాన్నం రామాపురం విడిచి పెట్టాను.

* * *

కథ చదువుకోటం పూర్తయింది. ఈ పదిహేను సంవత్సరాలుగా దీన్ని ముగించలేకపోయాను. డాక్టరుగార్ని కలుసుకుంటేనే కాని, గోపి ఏమైంది తెలియదు. కాగితాలు జేబులో వుంచుకుని సీతాపతి గారిల్లు చేరుకున్నాను. ఆయన నిద్రపోటానికి చివరి మెట్టుమీదున్నారు. నన్ను చూడగానే ఆప్యాయంగా ఆదరించి కూర్చోబెట్టారు. ఈ పదిహేను సంవత్సరాలలో ఆయన ఎక్కువగా మారలేదు. జుట్టు నురి కొంచెం నెరిసిందేమో? కళ్ళుమాత్రం చిలిపిగా నవ్వుతున్నాయి.

'మాట నిలబెట్టుకున్నావయ్యా!...ఈ ప్రాంతాలకు వస్తే రమ్మన్నాను. వచ్చావ్!' ఫ్లాస్కులో వున్న కాఫీ కప్పులో పోశారు. ఈ దీర్ఘకాలంలో జరిగిన విశేషాలు మాటాడుకున్నాం.

'డాక్టరుగారూ!...గోపి. గురించి...' అని ఆగాను.

'అతను ఏమవుతాడని వూహించావ్?'

'ఈపాటికి యూనివర్సిటీ చదువు పూర్తై ఎక్కడో రిసెర్చి చేస్తూంటాడని అనుకుంటా.'

డాక్టరుగారు ఇదివరకులాగ్లే విరగబడి నవ్వలేదు. విషాదంగా నవ్వారు. నాకు భయం వేసింది.

'కాదయ్యా!...విషాదవార్తను మళ్ళ జ్ఞప్తికి తెచ్చావ్...నువ్వు వస్తానని అతనికి ఉత్తరం రాశావు. కాని వెళ్ళలేదు. ఆరోజంతా నీకోసం ఎదురు చూశాడట—తతిమా విద్యార్థులతో నువ్వు వస్తున్నట్టు చెప్పుకుని మురిసిపోయాడుట—ఆ సాయంత్రం చనిపోయాడు.'

దిగ్భ్రమతో చూస్తూ కూర్చున్నా.

'అంటే?...ఎలా చనిపోయాడు?'

'అతనికి విద్యుద్దీపాలంటే పిచ్చికదా!...నువ్వు కూడా ఏవేవో నూరిపోశావు. ఏదో ప్రయోగం చేద్దామని పొరపాటున తీగలు ముట్టుకున్నాడు. చనిపోయాడు.'

'ఈ వార్త నిజమేనా?" లేక వేళాకోళ మాడుతున్నారా?'

డాక్టరుగారు కోపంతో కళ్ళెర్ర చేసి బల్లమీద గట్టిగా గుద్దారు.

'డాక్టరు సీతాపతి ఎప్పుడైనా అబద్ధమాడాడా?' అని అరిచారు. ఆయనదగ్గిర సెలవు తీసుకుని బయటికొచ్చాను.

* * *

ముగింపు దొరికింది. కాని నేను ఆశించిన విధంగా కాదు. గోపి తను చనిపోయినట్టు కథను ముగించమని అప్పుడప్పుడు సూచించినా, అతను చనిపోతాడని నేనెన్నడూ అనుకోలేదు. గొప్ప వ్యక్తి అవుతాడని కలలు కన్నాను.

ఉన్నట్టుండి మరో సందేహం కూడా కలిగింది. నేను వస్తానన్న రోజునే గోపి చనిపోవటంలో అంతరార్థం ఏమిటి? అతను నిజంగా ప్రమాదవశాత్తూ మరణించాడా లేదా? ఒక వేళ మనసు విరిగి ఆత్మహత్య చేసుకున్నాడేమో!...అవును, అలా ఎందుకు కాకూడదు? కాని ఎందుకో గోపి అలాంటిపని చేయడని అంతరాత్మ ఓమూల ఘోషిస్తోంది. ఏమైనా గోపి చనిపోయాడన్న వార్త మాత్రం నిజం.

మర్నాడు బండిలో తిరుగుముఖం పడుతూ మరపురాని నాగోపిని, అతనితో నాకున్న స్వల్ప పరిచయాన్ని తల్చుకుని రెండు కన్నీటిబొట్లు రాల్చాను. అంతకంటె నేను చేయగలిగిన దేమీ లేదు – కథంటూ వ్రాసి ముగింపు కనుక్కున్నా.

కాని చదివేందుకు గోపి ఏడి? ఏమైనా అతనికి నే నిచ్చినమాట నిలబెట్టుకున్నా.

అపరిష్కృతమైన యోగదర్శనము

శ్రీ ఆర్థర్ కోస్లర్

క్రమలము—యాంత్రిక వ్యక్తి

యోగమను మాటకు కలయికయని యర్థము. పతంజలి యోగసూత్రములలో నిర్వచింపబడినట్లుగ సమస్త యోగసాధనలకు లక్ష్యము సాధకుని "సత్యాత్మ" విషయరహితమైన అచ్ఛ చైతన్యమునందు లయమైపోవుట. ఈ స్థితిని పొందినపుడు వ్యష్టి చైతన్యము విశ్వచైతన్యముతో కలసిపోవును. "అగ్ని సంభవములైన స్ఫులింగములాచోటికే నివర్తిల్లినట్లు",

యథా సుదీప్తా త్పావకా ద్విస్ఫులింగాః
సహస్రశః ప్రభవంతే సరూపాః,
తథాక్షరా ద్వివిధా స్సోమ్యభావాః
ప్రజాయంతే తత్ర చైవాపియంతి.
(ముండక—2—1—1)

లేదా "తామరమీద కదలాడు మంచుబొట్టు మిలమిలలాడు సముద్రమునకు జారినట్లు" జీవాత్మ విశ్వాత్మలో కరిగి పోవును. అప్పుడు యోగి నిస్సంగమైన ఏకాంతము ఏకసత్తానుభవముగా మారిపోవును. రెండు మాటలకును ధాతు వొక్కటే. ఆత్మయన్న సంస్కృత శబ్దమీ రెంటిని చెప్పును.

హఠయోగావిర్భావము

బహుశః క్రీస్తుపూర్వము రెండవ లేదా మూడవ శతాబ్దము నుండి ఉన్న పాతంజలయోగసూత్రములు అంతకుమును పెప్పుడో పుట్టిన ఆత్మానుభవతత్త్వ సిద్ధాంతముమీద, కొంత జటిలముగానున్నను, పూర్తిగా మనసులో గొనగల సిద్ధాంత గ్రంథము. ధ్యాన మార్గమున అనాది సత్యముల గూర్చిన యాత్రగా, పరతత్త్వముతోడి ప్రాభవ సంగమముగా యోగము రాజయోగ రూపమున మొదలైనట్లు కనబడుచున్నది. కాని క్రమ క్రమముగా కాయిక క్రియా ప్రధానమైన శిక్షగల హఠయోగము—బలవంతపు కలయికయని శబ్దార్థము—దాని నధిగమించినది. హఠయోగము కనీసము వేయి సంవత్సరములనుండి ఉంటున్నది. ఈ వేయి సంవత్సరములలోను దీనిలో మూలభూతములైన మార్పులేమియు వచ్చినట్లు కాన్పింపదు. ఈ యోగపద్ధతిమాత్రమే విడివిడి గురువులచేతనో ప్రభుత్వము గుర్తించిన యోగ విద్యాసంస్థలచేతనో బోధింపబడుచు, పాశ్చాత్యదేశములందు వ్యాప్తికి తేబడుచు, ఇప్పటికిని సాధనలో నున్నది. కాని పాశ్చాత్య దేశములలోని సానుభూతిపరులకు ఈ పద్ధతి కాధారమైన సిద్ధాంతమునకు సంబంధించినంతవరకు ఉచ్ఛేదము పొందిన పాఠములే దొరకుచున్నవి. వీటినిబట్టి చూడగా హఠయోగము ఒక సముచితాసనమును గ్రహించి శరీర చిత్తములను స్వస్థపరచుటకు, సహజ శ్వాసమునకు, తద్ద్వారమున ధ్యానోన్ముఖమైన మనస్సును కలిగించుటకు ఏర్పరుపబడిన మేల్తరమైన వ్యాయామ సాధన లనిపించును. ఈ దీని సిద్ధాంతములలో 'రహస్యము'గాని, 'తంత్రము' గాని ఏమియు లేదని సాధారణముగా చెప్పుట కూడ కద్దు.

నిజమునకు హిమాలయములలోని ఆశ్రమవాసి మొదలుకొని యోగ విద్యా సంస్థలో దినమున కొకగంట గడిపెడు బొంబాయిలోని భీమా కంపెనీ గుమాస్తావరకు భారతీయుడుగా పుట్టిన ప్రతి హఠయోగ సాధకుడును హఠయోగము అతిమానుష శక్తుల నిచ్చునదని ఎరుగును. ప్రతి ఆసనమునకు సాధనకు సాంకేతికార్థ మొక డున్నదని, ఆయుర్వేద వైద్య సిద్ధాంతములకు సంబంధించిన శారీరక ప్రయోజనమున్నదని, ఇదంతయు వైదేశికులతో చర్చింపదగిన విషయముగా భావింపరనియును ఎరుగును.

హఠయోగమును గూర్చిన ఈక్రింది సారాంశమునకు కొంతవరకు ప్రధానములైన ఆకర గ్రంథములు, కొంతవరకు హిందూ దేశములోని యోగ విద్యా సంస్థలు, పరిశోధన కేంద్రములు, సాధకులు తెల్పిన సంగతులు ఆధారము—ఈ విషయముమీద మొదటి ఆధికారిక గ్రంథముగా గన్పడునది హఠయోగ ప్రదీపిక. బహుశః 12 వ శతాబ్దిలో, అంతకు చాల ప్రాచీనమైన సంప్రదాయ మాధారముగా వ్రాయబడిన గ్రంథము. శివసంహిత, ఘేరండ సంహిత అను గ్రంథములు కొంచె మటుతర్వాతవి. ఈ మూడును ప్రధానములైన ఆకర గ్రంథములు. ఇవి ఇంగ్లీషులోనికి తర్జుమా అయినవికాని దొరకుట కొంత కష్టమే![1]

పతంజలి యోగమునకు చెప్పిన అష్టాంగములు : (1) యమ, (2) నియమములు (అహింస శౌచము అసంసర్గము ఆహార నియములువంటివి), (3) ఆసనములు, (4) ప్రాణాయామము, (5) ప్రత్యాహారము, (6) ధారణము, (7) ధ్యానము, (8) సమాధి: చిత్తమును పూర్తిగా ఆత్మలోలయింపజేయుట.

పలుతెగలవారు చెప్పెడి ఉచ్చావచ పద్ధతులచే దిక్కుతోచక, రాజయోగము సాధింపలేకపోయిన వారికి "సోపాన పంక్తి"గా

---

1. సింహ, పంచమ్ (అను. క) హఠయోగ ప్రదీపిక రెండవ ముద్రణము,అలహాబాద్, లలిత మోహనవను, ది పాణిని ఆఫీస్ వారిచే ప్రకటితము. 1932. విద్యార్ణవరాయ్ బహదూర్ శ్రీశ్ చంద్ర (అను. క.) శివసంహిత. 2 వ ముద్రణము అలహాబాదు సుధీంద్రనాథవసు, పాణిని ఆఫీసువారిచే ప్రకటితము. 1923. శ్రీశ్‌చంద్రవసు (అను. క.) ఘేరండ సంహిత, తత్త్వ వివేచక ప్రెస్, బొంబాయి 1895.

నుపకరించుటయే దీని ప్రయోజనమను ప్రతిజ్ఞతో హఠయోగ ప్రదీపిక మొదలగుచున్నది. ఈ సోపానపంక్తి కాయిక క్రియలు, పతంజలి చెప్పిన మూల పద్ధతిలో ఇవి తృతీయ చతుర్థాంగములు: ఆసన ప్రాణాయామములు. ఈరెండును సంగ్రహమైన సామాన్య విధిగా చర్చింపబడినవి. మొదటి దానిని గురించి ఆయన "స్థిర సుఖ మాసనమ్మ"ని మాత్రమే చెప్పినాడు. ప్రాణాయామును గురించి గూడ ఇట్లే క్లుప్తముగా పలికినాడు.

ఏమైనను హఠయోగ ప్రదీపికలో ఎనుబది నాల్గింటికి తక్కువ కాకుండ ఆసనములు చెప్పబడినవి. వీనిలో చాల వానికి మెలికలు త్రిప్పుట అక్కరించుట ఉండును. ప్రాణాయామ మీ వర్ణింపబోవునంత జుగుప్సావహ దీర్ఘముగా చేయబడినది. ఈ ఆసనములలో కొన్ని శీర్షాద్యాసనముల వంటివి—వ్యాయామ ప్రయోజనమున కుపకరించునవి. కొంత విస్తృతమైన వానికి వేరు ప్రయోజన మున్నది.

సాధకుడు వివిధ శుద్ధి పద్ధతులను సాధింప నేర్చినగాని అతనిని క్లిష్టములైన క్రియలను సాధింపబూనుకొననీయరు. వీనిలో ముఖ్యమైనది అన్నవాహికా శుద్ధి. మూడు ముఖ్య విధములుగా కడుపును శుద్ధి చేతురు : (1) గొంతుక్రోవిలోనికి ప్రేముకాడ జొనిపి వెనుకకుదీయుట, (బి) కడుపు పట్టినంత గోర్వెచ్చని నీరు త్రావి వాంతి చేయుట, (సి) నాలుగంగుళములు వెడల్పు ఇరువది రెండున్నర అడుగుల పొడవుగల గుడ్డపేలికను మ్రింగి పిదప బయటకు లాగుట. ఈ కడపటి పద్ధతి చాల ఫలకారిగా భావించి ఇప్పటికిని ఎక్కువగా—ఉదాహరణకు బొంబాయి శాంతాక్రుజ్ లోని ప్రభుత్వము గుర్తించిన యోగ విద్యా సంస్థలో—సాధన చేయుచున్నారు. పది నిముషముల పైచిలుకు కాలములో ఏడున్నర గజముల "సర్జికల్ గాజ్" మ్రింగుట నేర్చుకొనుటకు ఒకటి రెండు, నెలలకు పైబడి పట్టును. ఇది "కడుపులోని కండరముల మీద పూతగానున్న మురికిని శుద్ధి చేయు"నని తలతురు.

మత సంబంధములుగా పాటించు నియములలోను సాంఘికాచారములందును వ్యాపించిఉన్న హిందువుల అంత్రకోశ క్రియ మీది వ్యగ్రత అను విషయమును గురించి ఆరంభించి చెప్పవలెను. ఘేరండ సంహితనుండి ఉదాహరించుచున్నాను :

14. ధౌతి నాలుగు రకాలు. అవి శరీర మలములను పోగొట్టును...

వాతసార ధౌతి

16. నోరు కాకిముక్కువలె ముడిచి వాయుపానము చేసి మెల్లగా కడుపు దానితో నిండునట్లు చేయుము. లోపల దానిని తిరుగునట్లు చేయుము. తరువాత మెల్లగా దానిని అధోమార్గమున బయటకు నెట్టుము.

17. వాతసార పద్ధతి రహస్యమైనది. అది దేహశుద్ధికి కారణము. రోగముల నాశముచేసి జఠరాగ్ని నెక్కువ చేయును·

వారి సార ధౌతి

18. గొంతు క్రిందివరకు నిండునట్లు నోటిని నీటితో నింపుము. తరువాత ఆ నీటిని కడుపుగుండా ఒత్తిపంపి గుదద్వారమున బయటకు విడువుము.

19. ఈ పద్ధతిని చాల గుప్తముగా నుంచవలెను. ఇది దేహమును శుద్ధిచేయును. దీనిని జాగ్రత్తగా సాధన చేయుట వలన కాంతిగల దేహ మేర్పడును.

20. వారిసార ముత్కృష్ట ధౌతి. దీనిని సుఖముగా నడుపగలవాడు తన మలిన దేహమును శుద్ధిపరచి కాంతిమంతముగా చేసుకొనును.

అగ్నిసారము

21. జఘనముమీద లేదా ప్రేగులమీద వెన్నెముక వైపునకు నూరుసార్లు ఒత్తుము. ఇదే అగ్నిసారము.

బహిష్కృత ధౌతి

24 ......నడుముల లోతు నీటిలో నిలచి శక్తి నాడిని (పెద్ద ప్రేగులను) బయటికి లాగుము. నాడిని చేతితో కడుగుము. మురికి పూర్తిగా పోనంతవరకు జాగ్రత్తగా కడుగుచుండుము. పిదప దానిని మరల పొత్తి కడుపులోనికి తీసికొనుము.....

వీని వ్యతిక్రమ పద్ధతులను బస్తి యను పేరుతో గాని, 'యోగ ఎనిమా'లనిగాని యందురు. ఒక తొట్టిలో నాభిదఘ్నమైన నీటిలో గూర్చుండి గుదద్వారమున నీరు పైకి పీల్చుట జల బస్తి. దీనికి మరికొంత తర్వాతి దశలో సాధకుడు తన లింగ ద్వారమున ద్రవ పదార్థములను పైకిలాగుకొనుట నేర్చుకొనును (వజ్రోళిముద్ర). ఇది సాధించుటకు ముందుగా చాల శిక్షణ ముఖ్యముగా ఉడ్డీయాము, నౌళి—(పొత్తి కడుపున నిలువుగాను, అడ్డముగాను ఉన్న కండరములను విడి విడిగాచేసి స్వతంత్రముగా నిగ్రహించుట) అను సాధనలు, అశ్వినీ ముద్ర (పాయ్వగ్ర కండరములను, కొన్ని గుహ్య కండరములను స్వాధీనము చేసికొనుట) ఉండవలె ననుకొండి. ఈ పద్ధతులవలన సంకోచ వ్యాకోచములతో లయతో చలించు కండరముల క్రియను వ్యతిక్రమము చేయవచ్చును. జీర్ణకోశమునందును, మూత్రకోశమునందును పీల్పుడు లక్షణములను కల్పింపవచ్చును.

విశేషమేమనగా ఘేరండసంహితలోనూ, హఠయోగ ప్రదీపికలోనూ వేయి సంవత్సరమునాడు చెప్పిన ఆ పద్ధతులను అదే విధముగా ఈనాటికిని సాధన చేయించుచు, చేయుచునున్నారు. ఈ విధముగా శాంతాక్రుజ్ లోని ముందు చెప్పిన యోగ విద్యా సంస్థ వారు ప్రకటించిన "యోగా హైజీన్ సింప్లిఫైడ్" (బొంబాయి 1957) అను పుస్తకములో ఈ చెప్పిన పద్ధతులను సాధన చేయుటవలన "విజ్ఞాన శాస్త్రమునకు తెలిసిన ఏ ఆధునిక పద్ధతియు సాధింపలేని" ఫలితములకు దారితీయునని స్పష్టముగా చెప్పబడినది.

ప్రాణాయామము

యోగ సిద్ధాంతమున ప్రాణాయామము నాభి స్థానము నాక్రమించి యున్నది. ప్రాణమనగా, వాయువునకు సంబంధించిన భౌతికార్థమున, శ్వాసప్రశ్వాసములు. ప్రాణోన్నై(బ హ్మెలి' అను నిస్మృతార్థమున నిది గ్రీకు 'న్యుమా' (Pneuma) హిబ్రూర్వాక్ (Ruakh) అనివానితో పోల్చదగినది. పతంజలి ప్రాణాయామమును గూర్చి ఇంత మాత్రమే చెప్పినాడు :

(50) "బాహ్యాభ్యంతర స్తంభవృత్తిర్దేశకాల సంఖ్యాభి:[2] పరిదృష్టో దీర్ఘ సూక్ష్మ:'

51. బాహ్యాభ్యంతర విషయాక్షేపీ చతుర్థ:

52. తత:క్షీయతే ప్రకాశావరణమ్

53. ధారణాసు చ యోగ్యతా మనస:......"

ఈ విధముగా కాయికమైన ఆసనమువలెనే శ్వాస ప్రశ్వాసముల గతి విచ్ఛేదరూపమైన ప్రాణాయామము ప్రశాంత ధ్యానమునకు తగిన చిత్తవృత్తికి దోహదము చేసెడిది. హఠయోగ ప్రదీపిక వ్రాయవచ్చునాటికి ఇది సర్వ వ్యాధి రూపములకు నివారణోపాయమగుటయేకాక, అతిమానుష శక్తులను సంపాదించుట కొక మార్గమైనది.

ప్రదీపికలో శ్వాస ప్రకరణమునందలి తొలివాక్యములు గమనింపదగినవి : "శ్వాస కదలినచో మనస్సు గూడ కదలును. శ్వాస నిలిచినచో మనస్సు అచలమగును. యోగి శరీరము క్ర్ర వలె బిరుసెక్కును. అందుచేత శ్వాసను నియమింపవలెను."

"నిగ్రహించుట"అనగా ముఖ్యముగా సమాధిస్థితి ఏర్పడుటకు కావలసినంతసేపు దేహమున శ్వాసను బంధించుట. సాధనలో దీనికి మొదటి మెట్టు నాడులను—అనగా శరీరములోని ప్రాణశక్తులు నడిచెడి మార్గములను శుద్ధి చేయుట. దీనిని భస్త్రిక లేదా కుడి ముక్కుతో శ్వాసపీల్చి ఎడమ ముక్కుతో ఒక క్రమమున శ్వాస వదలుట ద్వారముననను, మరి ఇతర విధములను సాధింతురు. పూరక, కుంభక, రేచకములకు ప్రాచీనులు ఒప్పుకొన్న కాల నిష్పత్తి 1:4:2. ఉదాహరణకు వరుసగా 2 సెకండ్లు, 8 సెకండ్లు, 4 సెకండ్లు. కొన్ని నెలల ఈ ప్రాథమిక సాధన తర్వాత నాడులు శుద్ధము లగును. అప్పుడు తగిన ప్రాణాయామ సాధనలు మొదలు పెట్టవచ్చును.

ముందు చెప్పినట్లుగా వీని ముఖ్యప్రయోజనము వాయువును బంధించి శ్వాస ప్రశ్వాసముల గతి విచ్ఛేదము చేయుట. శరీర రంధ్రముల నన్నిటిని మూయుట కుపకరించు పలువిధములైన ముద్రలతో, బంధములతో దీనిని సాధింతురు. వీనికి కొన్ని ఉదాహరణలు :

జలంధరముద్ర: గొంతు అక్కళించి గడ్డమును అక్కిలి గుంటలోనికి గట్టిగా ఒత్తుచు, అదే సమయమున పొత్తి కడుపు అక్కలించి వాయువును లోనికీడ్చుకొనుట అను క్రియలు ఇందున్నవి. చూపులు, మనస్సు, భ్రూమధ్యమున నిలుపవలెను. ఇది మనస్సును మూర్ఛిల్లచేసి సుఖము నిచ్చును. ఏమనగా ఇట్లు మనస్సును ఆత్మతో కలుపుటవలన నిశ్చయముగా యోగానందము లభ్యమగుచున్నది.

మహా ముద్ర: మహాబంధములలో జలంధరముద్రయు పొత్తి కడుపులోని గుహాకండరములను వెన్నెముక వైపున కీడ్చుకొనుటయు, వాయ్వగ్రమును ముడుచుచు చిన్న ప్రేవుల లోనికి గాలి తీసుకొనుటయు చేయవలెను. ఎడమకాలి మడిమతో వాయువును, వాయ్వండ కోశముల మధ్య ప్రదేశమును ఒత్తి పట్టుటచే వాయువు బంధింపబడును. విశేషాసనములందు చాలవానిలో ఎడమ పాదము ఈ నిర్దిష్ట ప్రయోజనమునకే—అనగా గుహ్యాంగముల నొత్తిపట్టి వాయువును మూయుటకు—ఉపయోగింతురని నే నిచ్చట చెప్పవలసి యున్నది.

మహావేధ ఈ మునుపటి దానికి కొంచెము మారురూపము. కాని యోగి "తన రెండు చేతులను సమముగా నేలపై అన్చి తాను కొంచెము లేచి పిరుదులు మృదువుగా నేలకు సోకించి" అటు తర్వాత బంధించిన వాయువును అపాన మార్గమున వదలవలెను.

సాధనలలో ముఖ్యమైన వానిలో ఒకటి ఖేచరీ ముద్ర. ఇది లఘిమాసిద్ధిని ఇచ్చునని తలపబడుచున్నది. హఠయోగ ప్రదీపిక దీనిని సుదీర్ఘముగా వర్ణించినది. ఘేరండ సంహితలో సంగ్రహముగా ఉన్నది.

నాలుక స్నాయ్వధో భాగమునకోసి నాలుకను పూరక ఆడింపుము. దానిపై తాజా వెన్నరాచి ఇనుప సాధనముతో (పొడవు చేయుటకు) బయటికి లాగుము. దీనిని ఎడతెగక సాధన చేయుట వలన నాలుక పొడవగును. భ్రూమధ్యమును అందుకొనినప్పుడు ఖేచరి సాధింపబడినది. పిమ్మట (పొడవైన నాలుకతో) దానిని పైకిని వెనుకకును అంగిలి తాకినట్లుగా ఆడించి సాధన చేయగా చేయగా నోటిలోనికి వెలసిన నాసా రంధ్రములను అందుకొనును. ఈ రంధ్రమును నాలుకతో మూసి (ఇట్లు ఉచ్ఛ్వాసమును ఆపి) భ్రూమధ్యమున దృష్టి నిలుపుము. దీనిని ఖేచరి అందురు. ఈ సాధనవలన మూర్ఛగానీ, ఆకలిగానీ, దప్పిగానీ, అలసత్వముగాని ఉండకుండ పోవును. రోగము, క్షీణించుట, మృత్యువు కలుగవు. శరీరము దివ్యమగును.

ఈ క్రియను తరచుగా ముద్రలలో రాజావంటి దందురు. దీనిని చురుకుగా సాధనచేయువారిప్పటికిని ఉన్నారు. హఠ యోగములోని క్లిష్ట పద్ధతులు ఉపదేశింపబడిన యూరపియన్ల విషయమును గుదిగుచ్చి వ్రాసిన నివేదికలలో డాక్టర్ థియో బెర్నార్డ్[3] వ్రాసిన "హఠ యోగము స్వీయానుభవ నివేదిక"

---

2 ఈ ప్రకరణమున దేశమనగా సాధకుని పెదవుల నుండి ఎంతదూరమున అతని ప్రశాంతమైన శ్వాసకు ఈక కదలదో ఆ కనీసపు దూరము; 'కాల'మనగా కుంభకకాలము; సంఖ్య అనగా లయ.

3. లండన్ 1950. డాక్టర్ బెర్నార్డ్ ఇండియాలోను, టిబెట్‌లోను వివిధ గురువులవద్ద అధ్యయనము చేసెను. (టిబెట్టులో 1947 లో హతుడయ్యెను) అతడు వివిధములైన ఆసనములు వేయుచుండగా తీయించి అతని పుస్తకములో ప్రచురించిన ముప్పదియారు ఛాయా చిత్ర పటములు యోగముమీద బహుశ: ఉత్తమోత్తమమైన ఛాయా చిత్ర విషయ నివేదిక.

అనునది ఉత్తమోత్తమ మైనది. తాను ఖేచరీముద్ర నేర్చుకొనుటను అతిడిట్లు చెప్పినాడు :

"క్రమము మాత్రము అక్లిష్టమే.నాలుకను 'పిదుకుట'తో నే నారంభించితిని. నాలుకను శుద్ధిచేసి పిదప లినన్ టవల్‌తో దానిని పట్టుకొనుటద్వారమున నే నిది నడపితిని. దానిని సూటిగా బయటకులాగి తరువాత వచ్చినంతవరకు ఆ ప్రక్కనుండి ఈ ప్రక్కకు ఈ ప్రక్కనుండి ఆ ప్రక్కకు లాగితిని. ఈ పని పది నిముషములపాటు దినమునకు రెండుసార్లు ఆచరించితిని. రెండు వారముల తరువాత ముందరి పండ్లమీదుగా సాగివచ్చుటచే నాలుక సంబంధము వదలుచున్నదని గ్రహించితిని. ఈ క్రమమును చేయదలచిన ఒక రేజరు బ్లేడు ఉపయోగింప పాల్పడితిని. ప్రతిరోజును ఉదయము సంధిబంధముమీద సుకుమారముగా రక్తము కనుపించునంతవరకు బ్లేడు నడ్డముగా లాగితిని. నొప్పి లేదు. నాలుకను పిదుకుట నేను చాలించులోపలనే రక్తము స్రవించుట ఆగిపోయెను. మరునాడు ఉదయమునకు వ్రణము మానిపోవ నారంభించినది. పలుచని శరీరాణువులు ఏర్పడ నారంభించినవి. వానిని నేను రాచి వేసితిని. పిదప మునుపటి దిన క్రమమునే మరల చేసితిని.

నాలుకను సాగదీయుటకు తోడుగా నేను మరియొక సాధనను నేర్చుకొనియుంటిని. నాలుక గొంతులోనికి వచ్చునట్లు చేయుటకు మొదట అంగిటిని వదులు చేయుట అవసరము. మామూలు టీ స్పూన్ తీసుకొని దానికాడను కొక్కెము ఏర్పడుటకు కావలసినంతగా వంచుట చాల సుకరమైన మార్గము. దీనిని గొంతులో వెనుక వైపునకు జొనిపి అంగిలి అంచు అందుకొనునట్లు ముందునకు లాగుము. స్థిరమైన పట్టు దొరికిన తర్వాత అంగిలిని నోటి ముందు భాగమునకు మరల మరల లాగుము. కొంతకాలమునకు ఈ సన్నపొర మెత్తబడి కొంచె మించు మించుగా అంగిలితో పండ్లు తాకుట సాధ్యమగును. నేను రోజును నాలుకను సాగతీసి తర్వాత దీనిని పది నిముషములపాటు సాధన చేసితిని.

సాధనకు వినియోగించు కాల ప్రమాణముపై సిద్ధి ఆధారపడియుండును. నేను దినమునకు సరాసరి పది నిముషములు కృషిచేసి నాలుగు నెలల తర్వాత ఇది సాధింపగలిగితిని. భ్రూమధ్యమున ఉంచుటకు వీలుగా నాలుకను సాగదీయుటకు చాల ఏండ్లు పట్టును.4 కాని ఈ లక్ష్యమును వెంటనే సాధింప నవసరము లేదు. నాలుకను మ్రింగి శ్వాసనుకోరిన ముకుపుటము లోనికి మళ్ళించుటకో లేదా పూర్తిగా బంధించుటకో శక్తి సంపాదించిన చాలును. . . . .

మొదట మొదట నాలుకను గొంతులోనికి త్రోయుట కనువుగా వ్రేళ్ళ సహాయమును (గురువులు) ఒప్పుకొనిరి. కొంత కాలము తర్వాత అది అవసరములేకపోయెను. నాలుకను అంగిలి వెనుక పెట్టినంతనే లాలాజలము ఎడతెగక ప్రవాహసదృశముగా ఊరనారంభించెను. ఈ విధముగా నేను శారీరక ద్రవముల స్థితిని నిశ్చయింపవలసి యుండినది. మొదట ద్రవము మందముగా బరువుగా బంకమున్నువలె ఉండినది. తర్వాత తర్వాత పలుచగా తేటగా నున్నగా అయినది."

కపాలములోని నాసారంధ్రములను అడ్డగించుటవలన సహజ శ్వాస ప్రవృత్తిని నిషేధించినట్లు కనబడుచున్నదని డాక్టరు బెర్నార్డ్ మరియొకమాట చెప్పినాడు. అతడు నాలుగు నిముషములసేపు శ్వాసను బంధింపగల నేర్పు సాధించిన స్థితికి వచ్చి యుండెను. అతడు చేయగలిగిన దంతే. ఈ స్థితిలో అతడు ఖేచరీ ముద్ర నభ్యసించెను. దీనివలన అతనికి వరుసగా పది శ్వాస చక్రములతో ఐదు నిముషములపాటు శ్వాస పట్టగల శక్తి వచ్చెను. కాని "ఒక శ్వాసతో అంతకంటె ఎక్కువ కాలము శ్వాస బంధింపగలిగియుంటిని." ఏమైనను అతిమానుష శక్తులు సంపాదించుటకు కనీసము ఒకటిన్నర గంట కాలము శ్వాస ప్రశ్వాసములకు గతి విచ్ఛేదము ఉండవలెనని గ్రంథములు విధించుచున్నవి.

వీర్యము

ముద్రారాజమగు ఖేచరి శ్వాసను నియమించుటకేకాక, హిందువుల వైద్య శాస్త్రమునకు, యోగమును గూర్చిన సాంప్రదాయిక భావములకు సంబంధించిన ఒక ముఖ్య ప్రయోజనమునకు, ఉపకరించును. మనుష్యుని ప్రాణశక్తి అతని శుక్లమునందు సారభూతముగా ఉండుననియు, ఇది కపాలములోని ఒక రంధ్రమున కూడియుండుననియు వారి విశ్వాసము. శరీరములో ఇది చాల విలువైన పదార్థము. దీనిని బిందువనియు, సోమరసమనియు పలు విధములుగా నుడువుదురు. భౌతికార్థమునను, యోగసంబంధమైన అర్థమునను ఇది రక్తమునుండి వడబోసిన ప్రాణామృతము. నలుబది బిందువుల రక్తము నలుబది రోజుల తర్వాత ఒక్క శుక్ల బిందువుగా నగునని చెప్పుదురు. అచ్చమైన బిందువు దండిగా కూడియున్నచో ఆరోగ్యము, ఆయువు, అతిమానుష శక్తులు తప్పక కలుగును. యోగులకును, బ్రహ్మచారులకును చెప్పెడి శరీర లావణ్యమునకు ఇదియే కారణముగా భావింపబడుచున్నది. వ్యతికరముగా చూచినచో బిందు నష్టము భౌతికాధ్యాత్మిక నీరసత్వమే అగును. స్త్రీ పురుష సంయోగముననేకాక చెవులు ముక్కు, తక్కిన శరీర ద్వారములగుండా కూడ బిందు నష్టము ఏర్పడును. ఆ యా లింగములన్నిటిలో అశుద్ధ బిందు వుండును.

ముక్కుపుటములు, శ్వాసనాళము, గొంతుక్రోవి, ఖేచర ముద్ర ద్వారమున అడ్డగించి సాధకుడు వీర్యము అధఃకేంద్రములలోనికి జారుటను నివారించి నాలుకతో వెనుకకు పీల్చుకొనునని తలపబడుచున్నది. జలంధర ముద్ర కూడ ఈ ప్రయోజన

4. ఘేరండ సంహిత అనువదించిన శ్రీశ్ చంద్ర వసు 1894లో "స్నాయువును పూర్తిగా కోసివేయుటకు మూడునంవత్సరములకు పైగాపట్టును. ఈ విధముగా మా గురువు చేయుచుండగా నేను చూచితిని. ప్రతి సోమవారమును స్నాయువును అంగుళములో ద్వాదశాంశము లోతుగా కోసి కోసిన భాగమును అతుకు పడకుండునట్లు దానిపై ఉప్పు రాల్చెడివారు. పిదప నాలుకకు వెన్నరాచి బయటికి లాగెడివారు. దీనికిగా విశేషమైన ఇనుప సాధనములను ఉపయోగింతురు" అని వ్రాసెను.

మున కుపకరించునుగాని అంత ఫలకారి కాదని ఇచట చెప్పవలసి యున్నది. అందుచేతనే హఠయోగ ప్రదీపిక ఇట్లు చెప్పుచున్నది :

"అంగిటికి వెనుకనున్న రంధ్రమును నాలుకను పైకి మరలించి ఖేచరితో మూసివేసినచో ఆడుదానిని కౌగలించుకొన్నను బిందువు స్వస్థానము వీడజాలదు. కూర్చొని నాలుకను వెనుకకు మరలించి మనస్సు కేంద్రీకరించి యోగిసోమర సపానము చేసినచో నిస్సంశయముగా నతడు పదునైదు దినములలో మృత్యువును జయించును. అగ్నికాష్ఠముల అవినాభావములవలె కాంతివర్తి స్నేహముల సంబంధమువలె (కపాలములోని) సోమస్థానమున ఊరుచున్న అమృతముతో నిండిన శరీరమును ఆత్మ వీడదు..... అంగిటిలోని రంధ్రమునకు నాలుక తగిలించి......పైనుండి పడుచున్న ఆ అచ్ఛద్రవప్రవాహమును త్రాగెడివాడు....రోగ విముక్తుడై తామరకాడవలె మృదుశరీరుడగును. ఆ యోగి చిరకాలము జీవించును. మేరువునకు (వెన్నెము)కకు పైగా ఒక రంధ్రమున గుప్తముగా సోమరస మున్నది.....ఈ సారము శరీరమును విడుచుచు మానవులకు మృత్యుకారణ మగుచున్నది. అందుచేత దీని పతనమును ఆపవలెను. ఇది (ఖేచరీముద్ర) ఈప్రయోజనమునకు చాల మంచి సాధనము......"

ఇదే ప్రయోజనమున కుపకరించెడు మరింత తీవ్రమైన సాధనము ముందు నేను క్లుప్తముగా సూచించిన వజ్రోళి ముద్ర.

"యోగసిద్ధాంతములను పాటింపక స్వైరముగా తిరుగువాడైనను వజ్రోళిముద్రను ఆచరించినచో వాడు సిద్ధికి అర్హుడు. వాడు యోగి. దీనికి రెండు విషయములు కావలెను. సామాన్యులకు ఆ రెండును లభించుట దుర్లభము. (1) పాలు [5] మరియు (2) కోరినట్లు ప్రవర్తించెడి స్త్రీ. పురుషుడైనను, స్త్రీయైనను సంగమ సమయమున బిందుపతనమును లోని కీడ్చుకొనుట సాధన చేసినచో వజ్రోళి సాధనలో సిద్ధి కలుగును. ఒక గొట్టము ద్వారా పురుషాంగములోని మార్గమున గాలి నూదవలెను. పతిత బిందువును సాధనతో వెనుక కీడ్చుకొనవచ్చును. పతిత బిందువును వెనుకకు తీసుకొని భద్రపరచుకొనవచ్చును. తన బిందువును ఈ విధముగా రక్షించుకొని యోగి మృత్యువును జయించును. ఎట్లనగా, మృత్యువు బిందుపాతమువల్లనే వచ్చును. దానిని భద్రపరచినచో ఆయువు పెరుగును. బిందు రక్షణమువలన యోగి శరీరమునుండి మధుర పరిమళము వెడలును. శరీరములో బిందువు చక్కగా ప్రతిష్ఠింపబడి ఉన్నంతవరకు మృత్యుభయములేదు. పురుషుల బిందువు మనోనిగ్రహమునకు లోబడి యున్నది. బిందువు ప్రాణాధారము. అందుచేత సర్వ విధముల మనస్సును, బిందువును పరిరక్షింపవలెను."

ఈ అనూదితవాక్యములలో చెప్పబడిన గొట్టమును శిక్షణలోని మొదటి దశలో ఉపయోగింతురు. అనగా సాధకుడు మునుపు పురీష మార్గమున లాగుకొన నేర్చినట్లుగనే మూత్ర మార్గమున ద్రవపదార్థముల లోని కీడ్చుకొనుట నేర్చునంతవరకు దీని ఉపయోగము. ఆయుర్వేద వైద్య సంప్రదాయమున పెరిగిన హిందువులకు—దేశములోని అధిక సంఖ్యాకులకు ఇది వర్తించును.

ఈ పద్ధతి క్లిష్టమైనను పూర్తిగ తర్క సహముగానే కాన్పించును. ఇట్లు శాంతాక్రుజ్ లోని యోగ విద్యా సంస్థవారు ప్రకటించిన "హఠయోగ సింప్లిఫైడ్" అను గ్రంథములో గ్రంథకర్త స్త్రీ పురుష సంగమము దానంతట అది చెడ్డది కాదనియు, అందులో విధిగా ఏర్పడు వీర్య నష్టము మాత్రమే చెడ్డదనియు వివరించినాడు. కనుకనే వజ్రోళిముద్ర చాల మంచిదని చెప్పవలెను. మూత్రమార్గమున మొదట నీరు "పిమ్మట ఎక్కువ సాపేక్ష సాంద్రతగల ద్రవములను ఉదా:—పాలు, తేనె ఒక్కొక్కప్పుడు పాదరసము కూడ (చివరి దానిని మాత్రము నిపుణుడైన గురు సన్నిధానమున) పీల్చెడి సాధనకు సంబంధించిన వివిధ దశలను గురించి ఇట్లు తెలుపుచున్నాడు.

"కామోద్రేక సమయమున ద్రవించునప్పుడుగాని, రేత: పతనమునకు ముందుగాని కామ ద్రవాభిపాతమును విజయవంతముగా నిగ్రహించి దానిని మరల ద్రవ నాళముల ద్వారా వెనుకకు ఇంకించుటలోనే......వజ్రోళి పద్ధతిలోని ఉత్కృష్టత ఉన్నది. ద్రవము వెలికురికినచో యోగి మాధవదాసుడు చెప్పిన నివాత (వజ్రోళి పద్ధతిలో ఒక భాగము) స్థానసహాయమున యోగిలో చేరియుండు ఆ సారమును వెనుక కీడ్చుకొనవలెనని చెప్పబడినది···విజ్ఞానశాస్త్ర సిద్ధాంతమును సంగ్రహముగ ఇట్లు చెప్పవచ్చును. కేవలము నివృత్తి మార్గమున ఉండుటకంటే అవసరమైనప్పుడు సాధారణమైన కామ కలాపము నడపుటమేల్తరము, ఆరోగ్యకరము—ఏమనగా దీనివలన ప్రయాసము తగ్గి నియమములలో దమించుటలో యధార్థముగా వ్యయమగు శక్తికంటే ఎక్కువగానే శక్తి వృధాయగుట సంభవించును. కాని భౌతికముగ ఇంద్రియ నష్టము ఉండరాదనుట జ్ఞాపకముంచుకొనవలెను. స్రావము శరీరమునుండి తప్పించుకొన్నచో నిశ్చయముగ ఈ నష్టము తప్పనిసరి యగును. కనుకనే యోగికి తద్విధమైన నష్టముండదు....దీనికి విరుద్ధముగా అతడు మరి ఇంకేవిధముగా దొరకని క్రొత్తగా ఏర్పడిన ద్రవము నెక్కువగా ఇంకించుకొని ఆరోగ్యకరమైన ప్రవృత్తిచే చాల లాభపడును. ఈవిధముగ ఇది.......ఒక అత్యుత్తమమైన ఆరోగ్య లక్ష్యము. మరియు—ఈ వజ్రోళి పద్ధతిని అందరికి తెలిపి సాధనకు అందుబాటులోనికి తేగలిగినచో—ఇది సంతానమును అరికట్టి కుటుంబ నియంత్రణము చేయవలెనని ఈనాడు బహుళముగా చర్చించబడుచున్న ఆధునికుల ఉత్తమ సంతాన శాస్త్ర విషయమును పరిష్కరించివేయును......"

ఈ గ్రంథకర్త ప్రభుత్వమువారి సహాయ సంపత్తిని అనుభవించుచున్న విద్యా సంస్థకు ప్రధానాధికారి.

నిదానముగా యోచించెడు ఇంగ్లీషువారైనను ఇండియాలో చాల కాలము నివసించియున్నచో ఈ భావములకు లొంగిపోవుచున్నట్లు కనబడుచున్నది. ఇట్లు ఈ విషయముమీద సామాన్యులకొరకు క్రొత్తగా వచ్చిన పుస్తకమును[6] వ్రాసిన యర్నెస్ట్‌వుడ్ విద్యావేత్తగా బొంబాయి, మద్రాసు విశ్వ విద్యాలయము

5. పాలు కామవర్ధకమని హిందువుల నమ్మిక.

6. "యోగ" పెంగ్విన్‌బుక్స్ (1959)

లలో చాల కాలము ఉద్యోగము నిర్వహించియుండెను. ఆయన ఇట్లు వ్రాయుచున్నాడు :

"వీర్యము తనకు కాలసిన దానిని సర్వ శరీరమునుండి గ్రహించి శరీరములోని ప్రతి అంగమునుండియు కొంత భాగమును తర్వాతి తరము వారికి అందించుచున్నదనియు, ఈ ద్రవమును వ్యర్థము చేయుటగాని అధికముగా ఊరించుటగాని శరీరమంతటిని నీరస పరచుననియు, అట్లుగాక దీనిని భద్రపరచుట సర్వ శరీరమునకు మిక్కిలి లాభకరమనియు జ్ఞాపకముంచుకొనవలెను. శరీర క్రియలలో శరీరమునకు లాభకరముగ పని చేయక మరియొక దానికొరకో లేదా ఇతరుల కొరకో శరీరమునుండి శక్తిని గ్రహించెడి క్రియ ఇదొక్కటిగానే కనబడు చున్నది. అందుచేత దీనిని ఉపయోగింపనిచో శరీరమునకు ఆపదలేదు. పైగా శరీరమునకు లాభకరము. ఇంద్రియ నిగ్రహ బ్రహ్మచర్యములను మంచిదని చెప్పెడు యోగులందరి విశ్వాసము వెనుకనున్నది ఇదే."

భౌతికముగ వీర్యమునకు సంబంధించిన అర్థములో ఈ ఇంద్రియ నిగ్రహమునకు సంబంధించిన వ్యగ్రతయోగులకు మాత్రమే పరిమితముకాదనియు, ఇండియాలోని ప్రతి ప్రాంతమునందును ప్రతి సాంఘిక శ్రేణిలోను కన్పించునని తెలియగలము.

కుండలినీ శక్తి

మానవులలో వెన్నెముక క్రింది భాగమున చుట్ట చుట్టుకొన్న నాగమువలె నిద్రించుచున్న కుండలినీ శక్తిని మేల్కొలుపుటయే హఠయోగ చరమ లక్ష్యము. కుండలినీశక్తిని మేల్కొలిపినపుడు వెన్నెముకలోని సంపాదమార్గమున పలు విధములైన ద్వారకేంద్రముల ద్వారమున శిరస్సు చివరకు బలిమితో ఎక్కించి అచట ఆమె భర్త అయిన శివునితో సంయోగమును సిద్ధింపచేయవలెను. అటు తర్వాత ఆమె తన యధాస్థానమునకు నివర్తిల్లును. ఈ సంయోగము శాశ్వతమయినపుడే యోగి ముక్తుడై చరమ సమాధి ప్రవేశించును.

కుండలినీ శక్తిని మేల్కొలిపి నడిపించుటలో ఒక శారీరక దృష్టియు, సాంకేతిక దృష్టియు ఉన్నవి. మొదటిది మొరటుగా నుండి ఏమంత రుచికరముగనుండదు. రెండవది సుందరము, గంభీరము. ఈ రెండును హిందువుల మత సంబంధమైన కళలోనూ, ఆయుర్వేద వైద్య విద్యలోనూ వ్యాపించిఉన్న అనాది కామ భావ చిత్రములనుండి ఏర్పడినవి.

కుండలిని వెన్నెముక అడుగున గల ఆధారము మూడున్నర రెట్లుగా చుట్టుకొని నోటితో సుషుమ్నను మూసి పరుండియున్నది. సుషుమ్న వెన్నెముక మధ్యగా నున్న ఇరుకు దారి. కుండలినిని ఈ ద్వారముననె పైకి నెట్టవలెను.

ముందు వర్ణించిన వివిధములైన వాయుబంధములు ఆంత్ర సంబంధమైన వ్యాయామములు కలిపిన ఒకానొక విధముతో యోగులు కుండలినీ శక్తిని మేల్కొలుపుదురు. అలలు అలలుగా పాయ్వగ్రమును ముడిచి కదలించుచు చేసెడి అశ్వినీ ముద్ర చాలమందికి ముఖ్యము. చెవులను బొటనవ్రేళ్లతో, కండ్లను చూపుడు వ్రేళ్లతో, నాసా రంధ్రములను మధ్య వ్రేళ్లతో, పెదవులను మిగిలిన వ్రేళ్లతో, పాయువును తత్ ప్రాంతమును కాలి మడిమతో, ఇట్లు అన్ని రంధ్రములను మూసివేసెడి యోనిముద్ర మంచిదని చెప్పబడు మరియొక మార్గము. ఈ క్రియ ఏకాగ్రతతో మంత్రజప సహితముగా చేయుదురు. ఫలిత మేమనగా కుండలిని యూపిరాడక బుస కొట్టుచు మేల్కొని "దండతాడిత భుజంగమువలె నిటారుగా నగును." వెన్నెముకలోని ఇరుకుదారిని ప్రవేశింప జేయుటకు కొన్ని నిముషములపాటు భస్త్రిక యను శ్వాస పద్ధతి మంచిదని చెప్పుదురు. అటు తర్వాత పలు విధములుగా పొత్తికడుపు కండరములను అక్కళించి గంటన్నర సేపు మంత్రోచ్చారణము చేయుచు ఉండి కుండలినిని ఆ మార్గమున పైకెక్కింతురు.

కుండలిని మూడు ద్వారములను, ఆరు చక్రములను భేదించుకుని పోవలయును. ఈ షట్చక్రములు మానవ శరీరమును గూర్చిన హిందువుల భావనలో చాల ప్రాధాన్యము గలవి. మొదటిది వెన్నెముక క్రింది భాగమున ఉన్నది. రెండవది గుహ్యాంగముల వద్ద నున్నది. మూడవది నాభివద్ద నున్నది. నాల్గవది హృదయము వద్ద, ఐదవది కంఠ ప్రదేశమున, ఆరవది భ్రూమధ్యమున, ఏడవది శిరోగ్రమున. ఈ చివరిది ఒక ప్రత్యేక జాతి.

ప్రతి చక్రమునకు అనుబంధముగా భిన్నభిన్నదళ సంఖ్య గల పద్మ మున్నది. అధః కేంద్రములలోని] అత్యధికదళ సంఖ్య పదునారు. కాగా శిరోగ్రమున గల దానికి సహస్ర దళము లున్నవి.

కుండలిని ఒక కేంద్రము గుండ వెళ్లిన ప్రతి పర్యాయమును అంతకుముందు అధోముఖములుగా నుండిన ఆ చోటి పద్మదళములు పైకి తిరిగి యూర్ధ్వ ముఖము లగును. అప్పుడు ఆ పుష్పము "చల్ల" బడిన దందురు. దాని దృష్టి శరీరమునందలి హీనప్రవృత్తులనుండి భగవంతునకు ప్రాణ కుండలినితో సంయోగము జరుగు స్థానము వైపునకు మరలింపబడును. గుహ్య కండరముల వ్యాయామ సహాయముతో, ప్రాణాయామ సంబంధమైన మత్తు సహాయముతో జరిగెడి ఈ కుండలినీ కష్టయాత్ర కామాతురతను భస్మసాత్కృతము చేయుటకు ఏర్పడిన అనాది సంకేతములలో ఒకటి.

పద్మము మాత్రమే కాక ప్రతికేంద్రమునకును ఒక సాంకేతిక మృగము, రంగు తన శక్తితో కూడిన ఒక పురుషాధిదైవతము, దానికి సంబంధించిన ఒక మంత్రము ఉన్నవి. వెన్నెముక క్రింద గల ఆధారచక్రమునకు బ్రహ్మతోను, ఢాకినీ శక్తితోను సంబంధము గలదు. హరిద్ర వర్ణము చతుర్దళ పద్మము గజచిహ్నితము. లం అనునది బీజాక్షరము. మొదటి షట్ కేంద్రములలో పైన భ్రూమధ్యమున నున్న దానిని అజ్ఞాచక్ర మందురు. ఆజ్ఞ యనగా పనిగొనుట. శివుడు యిక్కడ వసియించును. శైవులు నొసటవ్రాసికొని ప్రదర్శించెడు లింగము ఇతని చిహ్నము. ఆజ్ఞాచక్రములోని ఇతని స్థానమును, లింగమును, బిందు సహి

తమైన చంద్రరేఖను ఆవరించిన ముక్కోణముగా వ్రాయుదురు. ఈ బిందువునకు అనేక సాంకేతికార్థము లున్నవి. చుక్కకు సంస్కృతమున బిందు వందురు. ఆ మాటకు చుక్క అనియే కాక వీర్య మనియు అర్థము. మరియు ఓం అను మంత్రములోని మకారమును అవిచ్ఛిన్నముగా వదలిన తంత్రివలె ప్రతిధ్వనింపజేసెడి మకారముమీది బిందు వనియు అర్థము.

ఇక్కడ సంకేతము లన్నియు ఒక్కటిగా గుమికూడినవి : బీజ లింగములు, భగవంతుడు, అనంతాకాశమును సూచించెడు చుక్క. కుండలినీ యాత్ర పునుక క్రింద నున్న సహస్రారకమల స్థానమైన సప్తమచక్రముతో ముగియును. ఆమెకు శివసంయోగసిద్ధి ఇచ్చటనే కలుగును. అటు తర్వాత ఆమె "కన్యగా కాక బాల వితంతువుగా" వెన్నెముక క్రింది తన ఆధార స్థానమునకు మరలివచ్చును. ఆమె తిరుగు ప్రయాణములో తత్తత్కేంద్రములందలి పద్మములు మరల అధోముఖములై ఆయాచోటులందలి దేవత లందరు తమ తమ శక్తులతో సంగమించి ప్రతి కేంద్రమునకును క్రొత్తగా ప్రాణశక్తి నిత్తురు.

ఏమైనను యోగి చరమ సమాధి చేరినపుడు కుండలిని శాశ్వతముగా అర్ధనారీశ్వరి రూపమున శివసంయోగము పొంది నిలుచును. ఈ అర్ధనారీశ్వర భావము హిందువుల శిల్పములో తరచుగా కన్పడును.

బిందువు భద్రపరుపబడియుండు గుంత ఎక్కడ నున్నదో చెప్పుట కష్టము. భ్రూచక్రమునకు ఎడమవైపు ఉన్నదని ఒకొక్కసారియు, పైన ఉన్నదని ఒకొక్కప్పుడును, వెన్నెముక అగ్రభాగమునకు సరిగా పైన నున్నదని కొన్ని సార్లును చెప్పుదురు.

స మా ధి

దుష్కరమై, డొంకతిరుగుడుగా నున్న యోగమార్గమునకు చరమలక్ష్యమైన సమాధిని గూర్చి ఇప్పుడు చర్చింతును. కాని సమాధి దశకు ముందటి దశలలో చివరగా కల్గునని చెప్పెడు ఒక లక్షణమును గూర్చి క్లుప్తముగా చెప్పవలసి యున్నది : "అంతరజ్యోతి" కనిపించుట, వివిధములైన నాదములు వినిపించుట. ఈ రెండవ దానిని గూర్చి శివసంహిత ఇట్లు చెప్పుచున్నది : "మొదటి నాదము మధుపాన మత్తమైన మధుకర ఝుంకారము వలె ఉండును. తర్వాతిది వేణునాదమువలె నుండును. ఆ పిమ్మట వీణానాదమువలె నుండును. దీనికిని పిమ్మట, ప్రపంచ తమోనాశనముచేయు యోగమును క్రమముగా అనుష్ఠించుటచే, చిరుగంటల శబ్దము విన్పించును. ఆటుతర్వాత మేఘ గర్జనల వంటి నాదములు ఉప్పతిల్లును. ఈ నాదముపై మనసును పూర్తిగా కేంద్రీకరించినపుడు భయము పోయి సమాధి కలుగును". ప్రదీపిక నాలుగు దశలుగా నడిచెడి మరియొక నాదక్రమమును చెప్పుచున్నది : "మొదట భూషణ నిక్వాణము వంటి కలి నాదములు, తర్వాత ఢంకా మ్రోతలు, మూడవది మరియొక విధమైన నగారా మ్రోత. కడపటిది వేణునాదము వంటి ఉత్తమ నాదము."

జ్యోతులు మరింత ఆసక్తి గొలువునవి. ఎందుకనగా వాని వర్ణనకును, క్రైస్తవయోగులు కండ్లు మిరుమిట్లు గొలుపుచు సమస్తమును ముంచివైచెడి ప్రకాశమని వర్ణించిన "గౌరకాంతి" కిని ఒక కొంత పోలిక ఉన్నది. బెర్నార్డ్ ఇట్లు గ్రంథస్థము చేసెను.

"రెండవ నెలలో జ్యోతులు కన్పించెను. ఆరంభమున కెలియడోస్కోప్‌లో చూచుటకును, దీనికిని భేదము లేదు. కాని యీ స్థితి త్వరలోనే గడచిపోయెను. ప్రకాశవంతమై దీప్తి గల ఏకవర్ణములే నిలిచెను. తర్వాత తరచుగా చెప్పుకొనబడు "గౌరకాంతి" వచ్చెను. ఈ లక్షణము ఆసక్తికరముగా నుండెను. ఒకొక్కప్పుడు కన్నులు చూడలేనట్లుగా అయ్యెడిది. ఏమైనను అది చాలకాలము ఉండెడిది కాదు. క్రమముగా పగటి వెలుగులో కన్నులు తెరుచుకొనియే ఈ గౌరకాంతిని చూడగల్గు శక్తి నా కేర్పడెను. మనస్సు పూర్తిగా తుడిచిపెట్టుకొని పోయినట్లును, ఈ మహా ప్రకాశమును తప్ప ఏదియు లేనట్లును భాసించెడిది."

ఎట్లయినను యోగమునకు సంబంధించిన ఈ వాయు బంధన, దృష్టి కేంద్రీకరణ, పద్ధతులను బట్టి ఈ జ్యోతులను,నాదములను సులభముగా శారీరమార్గమున వివరింప సాధ్యము కావచ్చును. తొమ్మిదేండ్ల వయస్సున నాకొక చిత్రమైన అనుభవము కలిగినది. ఒక చిన్న శస్త్ర చికిత్సకుగాను ఈథర్ వలన తెప్పింపబడిన నొప్పి తెలియని మత్తులోనికి పోవుటకు ముందు క్షణమున కనులు మిరుమిట్లు గొలిపెడు గౌరకాంతి కనిపించినది. దానితోపాటు వూపిరాడనితనము, భయము పోయినవి. ఇదేవిధముగా బ్రతికియుండగానే ఉరిత్రాడు త్రెంచి వేయుట వల్లను లేక అది తెగుట వలనను ఉరితీత తప్పిపోయి బ్రతికి బయటపడిన నేరస్థుల జుగుప్సావహమైన నివేదికలలోనూ రంగులు కనిపించుట—ముఖ్య వర్ణము ఆకుపచ్చ అయినను—సూచింపబడినది.

యోగానుభవములను ఎప్పుడును ఇటువంటి వాదముతో ఇది ఇంతే నని తేల్చివేయవలెనని నా అభిప్రాయము కాదనుకొనుడు. కాని ఇటువంటి అనుభవములను హఠయోగమునకు భిన్నమైన మరియొక మార్గమున వెదుకవలసి యుండునని నేను విశ్వసించుచున్నాను. ఆధారమునుండి శిరమునకు పద్మముల ద్వారమున కుండలినీ యాత్ర, జీవ ప్రకృతి నుండి ఆధ్యాత్మిక శక్తిగా మారుట—అది ఒక సొగసైన కట్టుకథ. కాని, ఒక సంకేతమును ఎప్పటికి వదలకుండుటని, మిథ్యా తర్కముతో దానిని రుజువుచేసి పంకిల పరచు కోరిక మానవుని మనస్సులోని ఒక లక్షణము. ఇట్లు హిందూదేశములోని యోగి తన నాలుక కపాల రంధ్రములోనికి బలవంతముగా దూర్చుట, తన బిందువు పానము చేయుట, పాయువును ముడుచుట, బ్రహ్మతో సంయోగమును సాధించుట అలవరించుకొన్నాడు.

అపరిష్కృతమైన యోగదర్శనము

యోగపరిశోధన

ప్రాచీన గురువులు మొదలుకొని అధునికులైన అనుష్ఠాతల దాక హఠయోగ విద్యా బోధకు లందరును మూడు ముఖ్య ప్రతిజ్ఞలు చేసినారు. శారీరక, మానసిక వ్యాధుల కిది జాయువనియు, భౌతిక, మానసికానామయము కల్గించు ననుట మొదటిది. శరీరమునందు సన్నిహితమై యున్న శక్తులను స్వాధీనము చేసుకొనుట ద్వారా సిద్ధులనెడు అతిమానుష శక్తుల సంపాదించిపెట్టుననుట రెండవది. ఆత్మ, పరమాత్మ సంయోగమునకు దారితీయు ననుట మూడవది. ఇట్లు స్థూలముగా జెప్పవలె నన్నచో యోగమునకు మూడు పార్శ్వము లున్నవి : వైద్య సంబంధమైనది, అద్భుత సంబంధమైనది, యోగసంబంధమైనది. ఒకటి మరియొకదానిలో కొంతవరకు అంతర్భవించుచు వచ్చుట వారింప సాధ్యము గాకున్నను ఒక్కొక్కపార్శ్వమును గూర్చి విడివిడిగా చర్చింతును.

నేను కనుగొనగలిగినంతవరకు కొంచె మించుమించు తీవ్రముగా యోగపరిశోధనము జరుపుచున్న కేంద్రములు సమకాలీన భారతదేశమున మూడున్నవి : బెంగుళూరులోని అలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్. ఇది కేంద్ర ప్రభుత్వమువారి యాజమాన్యమున పనిచేయుచున్నది. స్వామి కువలయానంద ప్రధానాధికారిగా నడుపబడుచున్న కైవల్య ధామ ఈశ్వరదాస్ చునీలాల్ యోగిక్ హెల్త్ సెంటర్. దీనిని కేంద్ర ప్రభుత్వము, బొంబాయి రాష్ట్ర ప్రభుత్వము పరిశోధన కేంద్రముగా గుర్తించినవి. బొంబాయి, శాంతా క్రుజ్‌లోని యోగ విద్యా సంస్థవారి యాజమాన్యమున శ్రీ యోగేంద్ర ప్రధానాధికారిగా నడుపుచున్న అకాడమీ అవ్ యోగ. దీనిని బొంబాయి రాష్ట్ర ప్రభుత్వమువారు గుర్తించినారు.

బెంగుళూరు సంస్థకు క్లినిక్ (రోగిశాల) లేదు. దానికి వైద్య దృష్టియు లేదు. తక్కిన రెండును సుహృద్భావము లేక ఒకదాని పద్ధతుల ప్రామాణికత నొకటి కాదనుటకే మొగ్గు చూపుచున్నవి.

కైవల్యధామ సంస్థ బొంబాయి వెస్టెండ్, మారీన్ డ్రైవ్‌లో ఒక ఆరోగ్య కేంద్రమును లోన్‌వాలాలో పూనా రోడ్డున ఒక పరిశోధన సంస్థను నిర్వహించుచున్నది. స్వామి కువలయానంద వీనిని బహు సమర్థతతో నడుపుచున్నారు. పొదవంటి తెల్లని శ్మశ్రువు, మిట్ట నొసలు, గడ్డికట్ట వంటి శిరోజములు, బుజాలమీదికి పాశములుగా వక్రములై వ్రేలాడుచున్న తెల్లని ప్రక్క వెంట్రుకలతో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌కు బ్రాహ్మణ ప్రతిరూపముగా కన్పట్టు ఆహ్లాదకరుడైన వృద్ధమూర్తి ఈయన. ఈయనను చూడగానె నాకు ఐన్‌స్టీన్ జ్ఞాపకము వచ్చినాడు. కారణ మేమనగా ఈయన విశాల రక్త నేత్రములలో అదే ప్రత్యేకమైన చూపున్నది. ఊహలు పోవుట, చకిత మగుట, స్వాభావికత అన్నియు ఒకే సారిగా కనిపించును. ఆయన పద్ధతి వినయమ్ముగా, అతిశయము చూపకుండ నున్నను, మృదువైన అధికారముద్రతో మనస్సును అకట్టును. ఈవిధమైన మిశ్రగుణము గాంధి మొదలుకొని ఎందరో భారతీయులలో నున్నది. అధునిక భౌతిక విజ్ఞానమునందును, జీవరసాయన శాస్త్రమందును ఆయనకు గల పాండిత్యమును గూర్చి నేను ప్రశంసించగా ఆయన స్పష్టమైన చిత్తశుద్ధితో "ప్రతిదానిని గురించియు నా కించుక తెలియును. ఏమియు తెలియదు" అనెను. మామూలుగా త్రుప్పు పట్టిన ఇనుప అల్లికము గల వరండాలతో ఇండో విక్టోరియన్ పద్ధతిగా కట్టబడిన ఇంటిలో ఉన్న ఈ ఆరోగ్య కేంద్రానికి అ యిల్లు, ఐరోపావారి అంతస్థులో మాసినట్లు కనిపించినను, భారతీయుల అంతస్థునకు ఒకమాదిరి బాగుగానే ఉన్నవి. ఈ సంస్థకు నలుగురు బోధకులు ఉన్నారు. ముగ్గురు మొగవారు, ఒక స్త్రీ. నేను చూచినప్పటికి నూటయేబది మంది పురుషులు ఇరవై మంది స్త్రీలు విద్యార్థులుగా లేదా రోగులుగా ఉన్నారు. విద్యార్థులు, రోగులు అన్న మాటలను ఇక్కడ కొంచెము ఇంచుమించు పర్యాయపదములుగా వాడుదురు. సరాసరి మూడు నెలలకు పైగా జరుగు కోర్సులో వీరు రోజునూ ఒక గంట పైగా ఇచ్చుటకు వత్తురు.

మధ్య వయస్కులైన నలుగు రైదుగురు పురుషులు సులభమైన ఆసనములను సాధన చేయుచుండగా నేను చూచితిని. అలసిపోయిన ఆఫీసు ఉద్యోగులకు కొంచెము చురుకు కలిగించుటకై పాశ్చాత్య దేశములలోని వ్యాయామ శాలలలో నేర్పించెడు దానికంటె ఇంచుక విపరీత పద్ధతిగా మాత్రమే నాకు కన్పట్టినది. చిత్తశుద్ధిగల స్వామి అధ్వర్యమున తనకు ఉన్నంత వసతిలో చేతనయినంత చేయుచున్న చిన్న సంస్థ అది. ముందు వర్ణించిన క్లిష్ట సాధనలు అచట ప్రవేశపెట్టబడలేదు. మంచము పట్టించెడి రోగములను గూర్చి చెప్పుచు స్వామి అట్టి వారందరికి యోగవైద్య సూత్రముల ప్రకారము విడివిడిగా చికిత్స చేయుదుమని వివరించెను. గణన ఫలములను ఆరోగ్య కేంద్రములవారు 1954—55 సంవత్సరములకు ప్రకటించిన వైద్య నివేదికలో అచ్చు వేసినారు. స్వామి నాకు అది ఇచ్చినారు. తర్వాతి నివేదికలు ప్రకటితములు కాలేదేమో ! నా కు దొరకలేదు. (ఆయన అటుతర్వాత లోనవాలా కొండలలోని పరిశోధన సంస్థను చూడ రమ్మని ఆహ్వానించినారు. దానిని గురించి తర్వాతి ప్రకరణములో.)

నేను తిరిగి వచ్చుచుండగా కేంద్రమునకు నా వెంట వచ్చిన భారతీయ స్నేహితుడు తన స్వంత కథను చెప్పినాడు. అతడు చాలాకాలముగా ఉబ్బసముతో బాధపడుచుండినాడు. స్వామి అతని వ్యాధిని—ముఖ్యముగా వివిధ భంగిమలలో వేసెడి శీర్షాసనములతో వానికి తగిన శ్వాసక్రమములతో బాగు చేసినారు. అతడు ఏ రకమైన ఉబ్బసముతో బాధపడెనో వ్యాధి ఎంతవరకు బాగయ్యెనో నాకు నిశ్చితముగా తెలియలేదు కాని బాధా నివారణము జరిగిన దనుటలో మాత్రము సందేహము లేదు. తర్వాత నాకీ కథ చెప్పినాయన ఇటలీ దేశమునకు పోయి ఉండి అచట "తెలివిమాలి ద్రాక్ష సారాయమును త్రాగుటకు అలవాటుపడి నాడు." దీనితో రోగము వెనుకకు తిరిగినది. అతడు తిరిగి వచ్చిన తరువాత—స్వామిగారు చెప్పిరో

లేక వైద్యులు ఎవరైన చెప్పిరో ఆ విషయము నాకు స్పష్టపడలేదు గాని ఇటలీలో ద్రాక్షసారాయము త్రాగుటవలన అతని కాలేయము దెబ్బ తినినదనియు, ఇకమీద యోగసాధన పరిశ్రమమును ఓర్వజాలదనియు చెప్పిరట. తర్వాత కొద్ది దినములకే ముసుపటివలెనే ఉబ్బసము ఏర్పడి వైద్యశాలలో ప్రాణవాయువు కొనుచూ చాల దినములు గడుపవలసి వచ్చినది. అతడు మనస్సు తెగువ చేసుకుని "ఇప్పు డింక సమయము మించిపోయినది" అన్నాడు. యోగ మిక అతనికి సహాయపడ జాలదు. సారాయములు లేని బొంబాయిలో ద్రాక్షసారాయము లేకుండ మే మిరువురము రెండు మారులు కలిసి భుజించితిమి. అతడు అంత ఎక్కువగా త్రాగుట కలవాటు పడలేదని నాకొకవిధమైన నిశ్చయభావము కలిగినది.

నే నింటికి తీసుకొనిపోయిన[7] నివేదిక ముఖపత్రము మీద ఆ కేంద్రము "ఆరోగ్యాభివృద్ధికి, ప్రాతరోగముల నివారించుటకు, కుల వర్గ వివక్షణ లేకుండ యౌగిక భైషజ్య పర్యవేక్షణలో యోగసాధనలు నేర్పు" నని వ్రాయబడి యున్నది. అచ్చట చికిత్స చేయబడు వ్యాధుల జాబితా చూడ పెద్దదిగనే ఉన్నవి:

మలబద్ధము, అజీర్ణము, మొలల వ్యాధి, నరముల బలహీనత, వీర్య సంబంధమైన బలహీనత, నపుంసకత్వము (పుట్టుకతో వచ్చిన దానికంటె ఇతరమైనది), సాధారణమగు బలహీనత, చాల కాలముగా ఉండి ఏదైన ఒక అంగము సరిగా పనిచేయనపుడు వచ్చెడి తలనొప్పులు, నిద్రలేమి, హృద్రోగము (క్రియాసంబంధమైన) ఎడతెగని పడిశము ప్రాతవడిన రొమ్ము పడిశము, ఉబ్బసము (కొన్ని రకాలు), నడుమునొప్పి, తుంటినొప్పి, ఇతర కీళ్ల వాతములు, అతిమూత్రము, క్రొవ్వు పెరుగుట, అధికమైన రక్తపుపోటు, గొడ్డుతనము (కొన్ని రకములు) తో సహా స్త్రీల వ్యాధులు, తెల్లచీర రోగము, బుతుస్రావమునకు సంబంధించిన మార్పులు, గర్భాశయము మణుగుట, చోటు తొలగుట వంటివి, మాటిమాటికి గర్భస్రావమగుట, అండాశయ సంబంధమైన లోపము, వగైరా వగైరా.

జరిగిన నివారణలు కూడ చూడ గొప్పవిగానే ఉన్నవి. చికిత్స చేసిన పురుష రోగులలో 84.65 శాతము "నివారితులు లేక మెరుగగుచున్నవారు" అని చెప్పబడినది. దానికి సరిగ స్త్రీ రోగులలోని శాతము 89.2. రోగులలో 12 1/2 శాతము చాలకాలముగా నున్న ఉబ్బసముతో బాధపడువారును, 13 శాతమునకు పైగా నరముల బలహీనముతో బాధపడువారును, దాదాపు 10 శాతము మెదడునరముల లోపము గలవారును అని తెలిసినపుడు పాశ్చాత్య దేశములలోని ఏ వైద్యశాల అయినా సగర్వముగా చెప్పుకొను దానికంటె ఈ చూపిన ఫలితములు చాల డాబుగనే ఉన్నవి. ఏమైనను ఇచ్చిన జాబితాలను నిశితముగా పరిశీలించినపుడు 1024 గురు స్త్రీ పురుష రోగులలో 470 మంది అనగా దాదాపు 50 శాతము "కొద్ది రోజులు మాత్రమే వచ్చుటచేత ఫలితములు తెలియలేదు" అను శీర్షిక క్రింద వచ్చినవారు.. "నివావారితులు లేక బాగుపడుచున్నవారు" అను శీర్షికకు సంబంధించిన శాతమును ఈ మిగిలిన 50 శాతము వారిని బట్టి గుణింపబడినదని తెలుసుకొంటిని. "నివారితులు లేక బాగుపడుచున్నవారు" అను దానికి అర్థము ఏమంత స్పష్టముగా తెలియదు. దాని ననుసరించి చేసినదాని సూచన కూడా లేదు. ఉబ్బస వ్యాధితో దుఃఖితుడైన నా స్నేహితుడు ప్రాణవాయువు గుడారములోనికి వచ్చునరికి అతని కేసును "నివారితులు లేదా బాగుపడుచున్నవారు" అనువారితో చేర్చి వ్రాయుదురేమో అని నా కొక సొంపనిభావము కలిగినది.

స్వామి పరిపూర్ణమైన చిత్తశుద్ధిని గాని, ఆయనకు తన పద్ధతియందున్న విశ్వాసమును గాని నేను సందేహించుట లేదు. ఇటువంటి లెక్కలు అంత ఎక్కువగా నమ్మకము పుట్టింపవని మాత్రమే చెప్ప వలతును. (నాకు తెలిసినంత వరకు) ఇండియాలో తీవ్రముగా గ్రహింపవలసిన కృషి గల యౌగిక వైద్యసంస్థ కైవల్యధామ ఆరోగ్య కేంద్రము ఒక్కటే గనుక యోగము సాధించిన వైద్య సంబంధమైన విజయాలు స్వానుభవ మాత్రమైన సాక్ష్యముపై ఆధారపడినట్టివి కావని తీర్మానించుకొనవలసి యున్నది.

దీనికి ప్రతిస్పర్థియైన సంస్థ బొంబాయి శివారు శాంతాక్రుజ్ లో నున్నది. ఒకమాదిరి బాగుగా నిర్వహించిన తోటతో అది యొక చిన్నదైన అధునాతన భవనము. కాని లోసల మారీన్ డ్రైవ్ ప్రాంతముకంటె ఇది మరింత మురికిగా నున్నది. "యోగ అకాడమి" కి ఒక "సాధనశాల", ఒక "ఉపన్యాస శాల" ఉన్నవని వివరణ పత్రము సగర్వముగా ప్రకటించుచున్నది. అయితే చిట్టచివర ఈ సాధనశాల ఒక్కొక్కసారి "ఎనిమిది మందికి" సౌకర్యము కల్పింపగలదనియు ఉపన్యాస శాలలో "పదునారుగురికి చోటు గలదనియు" చిన్న అచ్చులో వివరించి యున్నది. నిజమున కవి బేస్ వాటర్ రోడ్ ప్రాంతములోని "బెడ్ సిట్టర్" పరిమాణము గలవి. అంతమాత్రమే అహ్లాదకరమైనవి. ఏమైనను ఒక పాటి ఈ వైద్యశాల శుభ్రముగా నుండినది.

ఈ అకాడమీకి స్థాపకాధ్యక్షుడైన శ్రీ యోగేంద్ర తన ప్రతిస్పర్థి చదివిన గురువు కడనే చదివినాడు. కాని తక్కిన ప్రతి విషయములోను ఆయన కీయన సరిగా వ్యతిరేకము. స్వామి కువలయానంద నెరసిన జుట్టుతో మృదువుగా సాధువుగా ఉంటాడు. శ్రీ యోగేంద్ర జీవితచరిత్రను ఆయన భార్య వ్రాసినారు. (ఈమె అకాడమీకి కార్యదర్శిని.) దానిని క్లుప్తముగా నుట్టంకింపదగును.[8] ఈయన బొంబాయి రాష్ట్రములోని సూరత్‌లో ఒక బీద ఉపాధ్యాయునికి 1897 లో జన్మించెను. పేరు మణిభాయ్ హరిభాయ్ దేశాయ్. పదునెనిమిదేండ్ల వయసున ఇతనిని బొంబాయిలోని సెయింట్

7. కైవల్యధామ ఈశ్వరదాస్ చునిలాల్ యోగిక్ హెల్త్ సెంటర్—మెడికల్ రిపోర్ట్సు ఫార్ ది ఇయర్ 1954—55, కైవల్యధామ, బొంబాయి—2 వారిచే ప్రకటితము.

8. యోగ విద్యా సంస్థ, బొంబాయివారు ప్రకటించిన "ఇంటర్‌నేషనల్ జర్నల్ ఆన్ ది సైన్స్ ఆఫ్ యోగ" (ఏప్రిల్—సెప్టెంబర్ 1936.)

గ్జేవియర్ కళాశాలకు పంపినారు. ఒక సంవత్సరము తర్వాత ఒక ప్రసిద్ధ గురువు[9] బొంబాయికి వచ్చెను. యువకుడైన మణిభాయ్, అతని సహవాసి అంబాలాల్ ఆయనను చూడ బోయినారు.

మొదటి అంతస్థులో పెద్ద హాలులో స్వాములవారి యాశీస్సులు గ్రహించుటకు దాదాపు 200 మంది భక్తులు చేరియుండిరి. మెట్లమీద అడుగు పెట్టగానే ఏ కారణము లేకయే మణిభాయ్ ఉద్వేజితుడయ్యెను. అంబాలా లతని ననుసరించుచుండెను. వెంటనే మణిభాయ్ శిరస్సు ప్రేక్షకులకు గనుపించెను. స్వాములవా రతనిని జూచిరి. అతడు మెట్లెక్కకమునుపే స్వాములవా రతని నెదురుక్కొనబోయి "వచ్చినావా, సంవత్సరాల తరబడి నీ కొరక కాతురతతో నెదురు చూచుచుంటిని. నిన్ను చూచి నాకు బలము వచ్చినది. రమ్మ" అనెను. అంతకుమునుపు వా రొకరి నొకరు కలిసికొననే లేదని ఇట చెప్పవలసి యున్నది. మాన్యమూర్తియైన గురువు మణిభాయ్‌ని లేవనెత్తి కౌగలించుకొనుట చూచి భక్తు లాశ్చర్యపడిరి .... స్వాములవారు మెల్లగా నిశ్చిత స్వరముతో "ఇప్పు డిక నేమి ?" యని యొక చిన్న ప్రశ్న వేసెను. మణిభాయ్‌కి ఆయన యభిప్రాయము స్ఫురించి యర్థమైనది. "నేను మీ వెంట వత్తు" నని అత డొత్తి చెప్పెను. ఒకరి భావ మొకరి కర్థమైనట్లు వారు పరస్పరము చూచుకొనిరి. అంతయు పరమ నిశ్శబ్దముగ నుండెను. ఇద్దరును ఏదో ధ్యానమున బడిపోయిన ట్లగుపించిరి.

కనుక మణిభాయ్, తండ్రి యనుజ్ఞ గొన్న పిదప గురువు వెంట ఆయన ఆశ్రమమునకు బోయి మస్తమణి యను పేరు స్వీకరించెను. రెండు సంవత్సరము లక్కడ నుండి గురువునకు ప్రియశిష్యు డయ్యెను.

వస్తిలోను, వజ్రోళి యందును శిక్షణ నిచ్చుటకు పరమహంసజీ మణిని, మరియొక భక్తిపరుడైన విద్యార్థిని మాథెరన్ కొండలలోనికి తీసుకొని పోయినపుడు ప్రకృతిలోని నిరలంకృత సౌందర్య మా యువ రచయితను కవిత్వపు టూహలతో నుద్వేజితుని చేసెను.

తరువాతి సంవత్సర మాతడు అనేక కవితా సంపుటములు వ్రాసెను. ఠాకూరు గీతాంజలిని గుజరాతీ భాషలోని కనువదించెను. ఆటు తరువాత అతడు "లోని ఒక సంకీర్ణోదాత్తక్రమము మేల్కొనుట ననుభవించెను. అదియొక వారము రోజు లుండెను. అమెరికాకు పోయి యోగ సందేశమును వ్యాపింపజేయవలెనను నిశ్చయ భావముతో ఆ యనుభవము నుండి యాతడు బయటకు వచ్చెను." న్యూయార్కులో నున్న శిష్యునకు తర్వాతి కాలమున గురువుగారు వ్రాసిన ఉత్తరమును బట్టి ఆయన సంతోషముగ నంగీకరించిరని మన మెరుగ గలము. "అమెరికాలో నీ కృషికి నేను గర్వించుచున్నాను. స్వామి వివేకానందులు తన గురువులు పరమహంస రామకృష్ణులకు చేసిన పనియే నీవును నాకు చేయుచున్నావు .... తన గురువును చిరస్మరణీయునిగా జేయుటలో నీ వాతనిని యుదాహరణముగా గ్రహించి నడతువని నే నెరుగుదును."

రామకృష్ణ పరంపరాస్థాపకుని ప్రియ శిష్యుడైన స్వామి వివేకానందులు గత శతాబ్దపు మలుపున యునైటెడ్ స్టేట్స్‌లో ఉపన్యాసయాత్ర జరిపి యోగమును జనరంజకముగా వ్యాప్తికి దెచ్చిన మొదటి స్వామి.

ఏమైనను అమెరికాకు బయలుదేరుటకు ముందు మణికి ధనికుడైన శ్రీ దడేనాయను ఒక పోషకుడు లభించెను. బొంబాయి సమీపమున గల అతని "విల్లా" లోనే మణి తన తొలి "యోగ విద్యాసంస్థ" ను స్థాపించెను. ఇక్కడ ఇరువది రెండేండ్ల వయసుగల ఈ గురువు "గుండెజబ్బులు, లావెక్కుట, ఉబ్బసము, సామాన్యమైన నిస్సత్తువ, వస్తి గ్రంథి పెద్దదగుట, వాతరోగము, తల ఎముకలలో సగము పీడితమగుట మరి ఇతరములు" వివిధములైన రోగములను బాగుచేతునని వ్రాసుకొనెను.

1919 లో మణియు దడేనాగారును అమెరికాలో దిగి న్యూయార్కు నందు రివర్‌సైడ్ డ్రైవ్‌న 125 వ నెంబరు గృహమున వసతి చేసుకొనిరి.

"మొదటి మొదటి కేసులన్నియు బరువు తగ్గింపవలయునను వారివి .... డబ్బు ఉన్నంతవరకు అన్నియు సుఖముగానే నడిచినది. కాని 1920 జనవరి తొలి పక్షము దాటుసరికి డబ్బు విషయము చూచుచుండిన దడేనాగారివద్ద ఒకనాడు 5 సెంట్లు మాత్రమే మిగిలియుండెను ...... దడేనాగారు భవిష్యత్తును గూర్చి పూర్తిగా తికమక పడిరి. పరిస్థితి ఎంత తీవ్రముగా నున్నదో వివరించి చెప్పినప్పుడు స్థాపకులు చలించలేనే లేదు. దడేనాగారిని ఆ సమయమున తన ఆలోచనలనుండి మరలించుటకు అత్యవసరమైన టెలిఫోన్ కాల్ కాక మరేమి రావలెను."

ఆ పిలుపు దక్షిణాఫ్రికా వజ్రపు గనులలో ఉద్యోగిగా నున్న ఒక ఇంజనీరు వద్ద నుండి వచ్చినది. అతని భార్య శిరోవేదనతో పరుండియుండెను. స్వామియు దడేనాగారును వారికి సహాయపడ పరువెత్తిరి. ఫలితము చిన్న మాటలలో ఇట్లు వర్ణింప బడినది : "ఒక బ్లాంక్ చెక్ అందియ్యబడెను." మరుసటి సంవత్సరము బేర్ పర్వతములలోని టక్సీడోపార్కు సమీపమున మరియొక యోగ పాఠశాల తెరువబడెను. చికిత్స చేయబడు రోగములలో ఇప్పుడు తెలిసిన ప్రతిరోగమును ఉండెను. "ఫలితములు కోరినట్లుగా ఉండె" నని మనకు తెలియుచున్నది. ఏమైనను రెండు సంవత్సరముల తర్వాత పాఠశాల మూసివేయబడెను. మణి ఇండియాకు తిరిగి వచ్చి ఇచ్చట తన పేరును శ్రీ యోగేంద్రగా మార్చుకొనెను. తర్వాత కొన్నిసంవత్సరములు ఒక క్రొత్త పాఠశాల స్థాపించుకై కావలసిన డబ్బు ప్రోగుచేయ ప్రయత్నించుటలో నిష్ఫలముగా గడచెను. ఇవన్నియు ఫలించకపోగా శ్రీ యోగేంద్ర "యోకో బుక్ ఫాలిష్ అను క్రొత్త రసాయనిక పదార్థమును కని పెట్టెను. ఇది ఎండు పుచ్చి, బూజు పట్టుట, చిమ్మ పురుగు, చెదలు, మరి యితర వినాశకరములైన క్రిముల నుండి పుస్తకములను కాపాడుటకు పనికివచ్చునది. లండన్‌లోని

౯. మల్సార్‌కు చెందిన పరమహంస మాధవదాస్‌జీ

అక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ ప్రెస్‌వారు ఈ యోగాబుక్ షాలిష్‌కు హామీ ప్రాతిపదికమీద అంతర్జాతీయమైన సోల్ ఏజన్సీ అంగీకరించి తీసుకొనుటను బట్టి దీని అంతర్జాతీయ ఖ్యాతిని కొలువవచ్చును.''

1927 లో ఆయన కుమారి సీతాదేవిని వివాహమాడెను. ఆమె కిరువురు పుత్రులు కలిగిరి. వివిధములైన పత్రికలు, పాఠశాలలు, అకాడమీలు ''లట్వియా అరేబియా'' లలో బ్రాంచిలతో స్థాపించి విద్యార్థులకు మూడు నెలలలో ''బి. వై'' (యోగవిద్యలో పట్టము), నాల్గు సంవత్సరములలో ''వై. డి'' పట్టములను ఇత్తుమని ప్రకటన పత్రములను పంపించిరి. ''ఏమైనను ఒకానొక సమకాలీనుని ప్రయత్నములచే ప్రాణము వచ్చిన రాష్ట్ర) ప్రభుత్వమువారి పురస్సిద్ధాంతము ధర్మమా అని ఈ తలతంతు ప్రణాళిక రూపాందక పోయెను.'' ఆ సూచింపబడిన సమకాలికుడు స్వామి కువలయానంద. జీవితమంతయు పోరాడిన పిదవ 1958 లో శ్రీ యోగేంద్ర ఇప్పటి పాఠశాల బొంబాయి ప్రభుత్వము వారిచే గుర్తింపబడి కొద్దిపాటి సహాయ సంపత్తిని పొందుచున్నది.

సంగ్రహముగ భారతీయ యోగకేంద్రములలో రెండవదాని కథ యిది. ప్రభుత్వము గుర్తించినది గనుక పాఠశాలకు శిక్షణ కోరుచున్న ఏబదిమంది విద్యార్థుల నుండి దరఖాస్తులు వచ్చినవని శ్రీ యోగేంద్ర మాట. వీనిలో 26 అంగీకరింప బడినవి. కాని ఏడుగురు మాత్రమే 9 నెలల చదువు తరువాత తమ టీచర్స్ సర్టిఫికేటును పొందినారు. తక్కినవారు ఉత్తీర్ణులు కాలేకపోయిరో లేక విడిచిపెట్టిరో స్థాపకుల నుండి నేను నిశ్చయముగ తెలుసుకొనలేక పోయితిని. వైద్య సంబంధముగా వచ్చిన రోగులు 12 గురు అని ఆయన చెప్పినారు. ఈ సంఖ్య ఆశ్చర్యము గల్గించునంత, బహుశః ధైర్యము గల్గించునంత చిన్నదిగా నున్నది.

స్థాపకులతోను, ఆయనకు సహాయకుడుగా పని చేయుచున్న ఉద్రేక స్వభావుడైన యువకునితోను మాట్లాడుటలో ఒక ఆసక్తికరమైన యథార్థము బయట పడినది. పూర్వకాలపు హఠయోగాసనములను అసాధ్యములని వారు వదలివేసినారట. ప్రాచీనములైన ఆసనములు ''చాల కఠినములు, బాధాకరములు'' నని యోగేంద్ర వివరించిరి. వానిని ఆయన తన అభిప్రాయముల ననుసరించి మార్పు చేసినారు. ఆసనములు శరీరమునకు ప్రయాసకారులుగా ఉద్దేశింపబడలేదని యోగవాఙ్మయము హామీ నిచ్చుచుండగా, ఇది ఒక గమనింపదగిన ఒప్పుకోలైనది. అట్లే వివిధములైన శీర్షాసనములు ''మంచికంటె చెడునే ఎక్కువగా చేయు''నని శ్రీ యోగేంద్ర నొక్కి వక్కాణించిన అభిప్రాయము గూడ ఆసక్తికరమైనదే. శీర్షాసనములు హఠయోగమునకు ప్రాతిపదిక వంటివి. స్వామి కువలయానందుల పాఠశాలలో ఎక్కువగా సాధనచేయబడుచున్నవి. బహుశః యోగేంద్ర వానిని వ్యతిరేకించుటకు ఇది కొంత కారణము కావచ్చును. ఈయన ప్రాచీనులుచెప్పిన శ్వాసక్రమములోని లయను 1:4:2 వంటి చక్రక్రమమును మార్పుచేసి ''యోగేంద్ర రిథమ్'' అను తన పద్ధతిని ప్రవేశపెట్టినాడు. ప్రాణమనగా వాయువు కాదనియు ''ఈ రిథమ్ వలన పుట్టెడు జీవ భౌతిక శక్తి'' యనియు, ఇంకను ఇట్లే ఆయన చెప్పును.

వివిధములైన ఆసనములకు, అభ్యాసములకు ఉన్న వైద్య సంబంధమైన చికిత్సా గుణమును గూర్చిన ఇట్టి అభిప్రాయ భేదములను అతితీవ్రముగా చూడనక్కరలేదు. పాశ్చాత్య వైద్య విధానమున గూడ పరస్పర వ్యతిరేక ప్రస్థానము లుండనే యున్నవి గదా. అయితే ఎన్ని లోపములు, పురస్సిద్ధాంతములు, వైఫల్యములు ఉన్నను పాశ్చాత్య వైద్యవిధానము హఠయోగ ప్రదీపికాకారునికి సమకాలీనుడుగా జీవించియుండిన అవిసెన్నా కాలము నుండి నిత్యము అభివృద్ధి యగుచునే ఉన్నది. పరస్పరము ప్రభావము చూపుచున్న అరడజను విజ్ఞాన శాస్త్రము లిచ్చిన విస్తృతమగుచున్న స్వానుభవ, సిద్ధాంత రూపమగు సూక్ష్మదృష్టి యాధారముగ దాని విజయము లేర్పడినవి. గణన పద్ధతికి సరిపోవు పద్ధతిలో నియమితప్రయోగ పద్ధతుల నది వృద్ధి చేసుకొన్నది. అటువైపు యోగవైద్యము, ఆయుర్వేదవైద్యము వేయి సంవత్సరములకు పైగా మారక నిలచియున్నవి. విశ్వాసము కొండల గదలింప గలదు. బహుశః మూత్రకోశములోని రాళ్లను గూడ కదలింప వచ్చును. కాని సామాన్య జనులను దానిపై నాధారపడుడని సలహా చెప్పుట మాత్రము దైవద్రోహమగును. సూది మందులమీద హిందువుల నిషేధాచారముండుటవలన శ్వాసనాళికకు సంబంధించిన అంటువ్యాధితో బాధపడుచున్న తన భార్యకు గాంధి పెన్సిలిన్ ఇచ్చుట కంగీకరింపకపోయెను. ఇటువంటి కారణములచేతనే వినోబా భావే చచ్చి బ్రదికినవాడయ్యెను. ఇండియాలో ఆ విధమైన నిషేధము వలన జరుగు ఈ ప్రశాంత చిత్రవధ నేటికిని జరుగుచునే ఉన్నది.

సులభతరములైన యోగాభ్యాసములు ఆరోగ్యమునకు భంగకరములని ఋజువుచేయుట కష్టమైతే, పాశ్చాత్యుల వ్యాయామ శిక్షణ పద్ధతులకంటె ఎక్కువగా ఇవి ఆరోగ్యమునకు లాభకరములని రుజువు చేయుట మరింత కష్టతరము. ఎక్కువ గాలి, స్వయముగా మత్తు కలిగించుట లక్ష్యములుగాగల శ్వాసక్రియలు కనీసము అనిశ్చితములని చెప్పవలెను. ''అనుభవజ్ఞుడైన గురువు'' క్రింద శిక్షణ పొందుట అపాయములు రాకుండ హామీ ఇచ్చునను నమ్మకము విశ్వాసముతో కూడిన మరియొక పని. ఇంక ధ్యానమునకు ఉద్దేశించి కల్పించిన ఆసనములందమా, వేరు వేరు జాతులకు శరీరమును సుఖస్థితిలో నుంచుటకు మెడిమలమీద కూర్చుండుట మొదలుకొని పద్మాసనము వేసుకొని కూర్చుండు వరకును, ఒక మోచేతిమీద ఒరగుట మొదలుకొని బల్లమీద కాళ్ళువేసి కూర్చుండుట వరకును సాంప్రదాయికమైన వివిధ మార్గము లున్నవి. పద్మాసనము, దాని భేదములు భారతీయుల శరీర నిర్మాణమునకును, చిత్తవృత్తికిని సరిపోవునట్లు కన్పించుచున్నవి. పాశ్చాత్య సన్యాసికి ఏకాంతముగా తనతోటలో మెల్లిగా అటు నిటు తిరుగుటకంటె ఇవి అతని ధ్యానముద్రను సులభతరము చేయునని అనుకొనుటకు కారణము కనిపించదు. (సశేషః)

(''ఎన్‌కౌంటర్'' 83 వ సంచికనుండి)

సమర్పణము

శ్రీ బెళ్లూరి శ్రీనివాసమూర్తి

హృదయపాత్రికలోన
కొదలేక నిండించి
ఆనందమధురసము
ఆస్వాదయోగ్యముగ—
అర్పింతు
నా దేవ
అందుకోవయ్యా !

ప్రేమ తైలము పోసి
పెద్దగా సెగజోపి
గీతమే నీ ప్రోల
జ్యోతిగా వెలిగించి—
అర్పింతు
నీ కొఱకె
అందుకోవయ్యా !

తలపుతియ్యనివీణె
తంత్రులను గదలించి
లలిత లలితంబైన
కళలోన గరగించి—
అర్పింతు
నను నేనె
అందుకోవయ్యా!

నవకవిత్వమనోజ్ఞ
భవనవాసిని గాగ
వేయిభావన లొక్క-
విరిదండగా గ్రుచ్చి—
అర్పింతు
నీ సేవ
అందుకోవయ్యా !

ఆశ్చర్యచూడామణిలో రస మేది?

శ్రీ నీలకంఠశాస్త్రి కౌండిన్య

సరసహృదయులగు జనులకు లోకవ్యవహారము కంటె గావ్య వ్యవహారము వలననే యనిర్వచనీయమగు రసానుభూతి గల్గునను విషయము సర్వజనీనమగు సత్యము. అట్టి కావ్యములలో గూడ దృశ్య కావ్యములు సర్వజన రసానుభవమునకు హేతుభూతము లగుటచే గావ్య జగత్తునందు దృశ్య కావ్యములు ఇంద్రియములలో నయనములకు గల ప్రాధాన్యము నంద గల్గినవి.

భారతదేశమునందలి సహృదయులగు శాస్త్రకర్తలు కావ్యమునకు సంబంధించిన యొక నిబంధనమును ఏనాడో సంతరించినారు. ఇదియే నాట్యశాస్త్రము. దీనినే యాధారముగా జేసికొని యలంకార శాస్త్రమను నొక హృదయ రంజకమగు నొక శాస్త్రము వెలువడినది. ఇది రసికజనుల యనుభవమునే ప్రధానముగా గొని క్రమముగా విస్తరించినది. అలంకార శాస్త్రము కావ్యజగత్తున కంతకును సామాన్యముగా సంబంధించి యున్నను దనలో నాటక ప్రకరణము నొకదానిని గల్గియుండుటచే గావ్యములలో నాటక విశిష్టతను మన మూహింపవచ్చును. ఈ నాటక ప్రకరణమున అలంకార శాస్త్ర విధి ననుసరించి రూపకములలోని భేదములు, వానిలో నాటకమను రూపకము యొక్క విశిష్టత, దానికి వలసిన రస నాయకాంగ ప్రత్యంగాది సామగ్రియు జేర్కొనబడినది.

సంస్కృత వాఙ్మయమున "ఆశ్చర్య చూడామణి" యను నాటకము విశిష్టమగు స్థానము నాక్రమించినది. కర్త శక్తిభద్రుడు. కథ రామాయణమునకు సంబంధించినది. నాయకుడు శ్రీరాముడు. ఇయ్యది ఏడంకముల నాటకము. రామాయణములోని యరణ్యకాండ కథ ప్రారంభించి యుద్ధకాండము చివర వరకు గల కథ యిందు ప్రదర్శింపబడినది.

దశవిధములగు రూపకములలోను గొన్ని కొన్నింటి విషయమున గొన్ని కొన్ని విశయము లేర్పడుచుండును. ఎట్లనగా కొన్ని రూపకములు దశ విధములలో నే తరగతికి చెంది యుండుననియు, గొన్నింట ఏ రసము అంగిరసముగా నొప్పుచున్నదనియు, మరికొన్నింట నాయకు డిందు ఎవ్వడగుననియును. ఇట్టి విషయములందు మీమాంస నిర్ణయ సాధన మగుటచే దద్ద్వారమున విషయవిచార మవశ్యకర్తవ్య మగుచున్నది.

ప్రకృతము ఆశ్చర్య చూడామణియందలి రసము అద్భుత మని తట్టీకాకర్తలు, సంస్కృత వాఙ్మయ చరిత్ర పరిశోధకులును దెల్పియున్నారు. ఇట్టి వీరి యభిప్రాయమునకు ప్రాయశః తన్నాటక వ్యాఖ్యాతృవచనమే హేతువు కానొప్పును. వ్యాఖ్యాత తన గ్రంథమున—"వీరకార్యాద్భుత రస భూయిష్ఠత్వేన ఆశ్చర్యకరణాం చూడామణి రిత్యాశ్చర్య చూడామణి రితి సంజ్ఞా" అని వ్రాసియున్నాడు. కావున నీ విచార మత్యావశ్యక మగుటచే నియ్యది యుపక్రమింపబడినది.

ఇందలి రస నిర్ణయమును గూర్చి ఆశ్చర్య రసవాదు లిట్లు చెప్పుదురు :—కావ్యలోకమున అరుదుగా గన్పట్టు నద్భుత రసమును సర్వ సామాజికానుభూతి విషయమునుగా జేయుటకు శక్తిభద్రు డీ నాటకమును రచించెను. మూల గ్రంథమునుండి తాను గ్రహించిన కథలో స్వాభీష్టరసానుకూలముగ గొన్ని మార్పులను మనోహరముగ గల్పించెను. కావుననే యిద్దానికి ఆశ్చర్య రసమును గల్గించు చూడామణి ప్రధాన కథావస్తువునం దుత్తమసాధన మగుటచే "ఆశ్చర్య చూడామణి" యను నన్వర్థనామమును గవి కల్పించినాడు. హారమున దార మట్లు నాటకమునం దంతటను అనగా ప్రథమాంకము మొదలు సప్తమాంకమువరకును అద్భుత రసము క్రమాభివృద్ధి నంది సరసహృదయులగు, సామాజికులకు ఆస్వాదయోగ్యమై విలసిల్లుచున్నది. ఎట్లనగా—అద్భుతమునకు విస్మయము స్థాయిభావము. ఈ విస్మయమును నాటకారంభముననే లక్ష్మణునిలో సుందరతరుణీ రూపధారిణి యగు శూర్పణఖను జూచుటచే నంకురించినది. ఇట్టి యతిలోకలావణ్యవతి యగు యువతికి జన్మభూమి "ద్యౌర్ను వసుంధరా ను" అను సందేహము లక్ష్మణునివంటివానికే కలుగనట్టి విస్మయకారిణి యగు యువతి సౌందర్య దిదృక్ష సామాజికులకు గల్గునన్న విషయమున వింత లేదు. కావుననే వారల తృష్ణ తీర్చుటకు లక్ష్మణుడు "అతిమాత్రాయత లోచనస్య నతభ్రువః క్రమపయోధరస్య ఆశ్చర్యరత్నస్య విలాసయోనేః" అని శబ్దరూపప్రదర్శనమును గావించినాడు.

ఇక రెండవ యంకమున రాముడు "దూరమునందు సర్వమును విస్మయనీయముగానే వినబడును. నాకు శైలాయామములు నీలజలధరశ్యాములును నగు రాక్షసులు సంచరించు పంచవటిని సేవింప నాసక్తి గలదు. నిజముగా శైలాటవీసాగరములే విస్మయనీయ వస్తు విషయములు" అని దన హృదయగతమగు నాశ్చర్యరస బీజమును ప్రదర్శించినాడు. దీనికి దోడుగా జానకిగూడ వనమునం దనుభవించిన యాశ్చర్యములను దరువాత నంతఃపురజనులకు దెల్పి వారలకు గూడ నాశ్చర్యమును గలుగజేయుటకు నుత్సాహము తన కున్నట్లు దెల్పి దన యాశ్చర్యవృత్తిని గూడ భర్తతో పాటు తెలిపెను. అంత అరణ్యవాసిని యయినను సీత సౌంద

ర్యము అయోధ్యయందున్నట్లే కానవచ్చుటచే గూడ రాముని హృదయమున మరింత యాశ్చర్యము పెంపొందెను. ఇది యిట్లుండ లక్ష్మణుని నిరాకృతిచే నిజరూపమును ధరించిన శూర్పణఖాదర్శనమువలన రామునికి గల్గిన యాశ్చర్యముతో అద్భుతరసము క్రమముగా నభివృద్ధి గాంచినది.

ఇక మూడవ యంకము అద్భుతరస ప్రతిపాదనమున నాటకమున కంతకును హృదయము వంటిది. ఇందు రాముని యసుర సంహార కర్మచే బరితృప్తులగు ఋషులనుండి ఆశ్చర్య చూడామణి, సరత్నాద్భుతాంగుళీయకము, మర్మ రక్షకమగు కవచమును రామునికి లభించినవి. ఇందు మొదటి రెండు వస్తువులును శరీర సంబంధము కలిగినంత మాత్రాన మాయావుల మాయను సూచించునవి. అవ్వానిని గాంచి సీతా రాములు మిక్కిలి యచ్చెరువందిరి. సీతకు జూడామణి నలంక రించి రాముడు దా నంగుళీయకము నలంకరించుకొనినాడు. ఈ రత్నాభరణముల కాంతి విశేషముచేతనే ఆశ్చర్యపడు చున్న సమయముననే వనాంతరమునకు రూపపరివర్తన మును గావించు దీప్తితో నొప్పు మృగప్రవేశము. దానిని గాంచుటతోడనే యందరును మహాశ్చర్య రస నిమగ్నులైరి. వెంటనే సీత తన రసానుభూతిని "ఆర్యపుత్ర, అద్భుత దర్శన బహురసఃఖలు వననివాసః" అని తన స్థితినే గాక తమ మువ్వురస్థితిని గూడ బేర్కొనినది.

ఇది యిట్లుండ నీ యంకముననే రామాశ్రమమును బ్రవేశించిన రావణునికి సీతాలావణ్య విలోకనముచే అత్యాశ్చర్యము గల్గినది. "నేను జాల యతిలోకసౌందర్యవతులను గాంచి తిని గాని" "దృష్టం తాసు న రూప మీదృశ మహో చక్షు: చిరా సార్థకం" అని పరవశుడైనాడు రావణుడు.

జరుగవలసిన మోస మంతయు జరిగిపోయినది. రామ రూపధారియగు రావణుని రథముపై బోవుచున్న సీత, నేలపై సీతారూప ధారిణియగు శూర్పణఖతో, నున్న రాముని జూచి ఆశ్చర్యపడి "హం, ఆర్యపుత్ర: !" అన్నది. అట్లే రాముడు గూడ విమానగతయగు సీతను మాయారామునితో గూడ గన్నులార గాంచి "ఆకాశే సీతాయా ఇవ స్వర:" అని ఆశ్చర్య పడినాడు. వెంటనే యాతడు ఇది యంతయు మాయయే యని "సత్యం సీతా పరపురుష గోచరే న తిష్ఠతి. ధ్రువ మియం వంచనాసీతా మాయారామపార్శ్వే" అని తృప్తిపడగా, సీతగూడ దాను జూచిన భూగతుడైన రాముని మాయారామునిగానే దలచి "సత్యమే వైతత్ కుత ఆర్య పుత్రస్య స్త్రీ సంబంధః. యథా సాహం నభవామి, తథా ఆర్యపుత్రోపి సన భవతి" అని నిర్ణయించుకొని తృప్తిపడినది. బాణము తగిలి రామరూపముతో బడియున్న మారీచుని జూచి రాముడు రాక్షసమాయకు మరింత ఆశ్చర్యపడియే యుండునుగదా ! అట్లే మాయాసీతకు అశ్రుమార్జనము చేయబోగా నిజరూపమును దాల్చిన శూర్పణఖను జూచి యింతవరకు దన ధర్మపత్నిగా దలంపబడిన యంగన హఠా త్తుగా రాక్షసి యగుటకు రాముని హృదయగతి యెట్లుం డునో రామభావమునంది తద్గత సుఖదుఃఖముల ననుభవించు చున్న సామాజికుల రసానుభూతి యెంత ప్రగాఢముగా నుండునో వర్ణింప నెవ్వరితరము ? ఇట్లే యంకమున నద్భుత రసము పరిపూర్ణమై విశ్రాన్తి నందె ననుటలో నెట్టి సందేహమును గూడ లేదు.

చతుర్థాంకమున గూడ బ్రత్యక్షముగ నద్భుతరస మును అనుభూతము కాకపోయినను అంతదనుక దన ప్రియు డగు రామునిగా భావన సేయబడుచున్న వ్యక్తి హఠాత్తుగా విశంతి భుజములతోడి దశగ్రీవుడుగా గానవచ్చినపుడు అద్భుత రస సంశిష్టమగు భయానకమునే సీత యనుభవించి యుండు నని మనము చెప్పవచ్చును గదా !

పంచమాంకమున అద్భుతరసమునకు నెచటను దావు లేనట్లున్నను సకల జగద్భయంకరుడగు రావణుని శిరమును తృణము కంటెను లఘుతరముగ జూచి తన పాదముతో సీత నెట్టుటయే మిక్కిలి విస్మయనీయమగు సంఘటనము.

అంగుళీయకాంకమని ప్రసిద్ధిగాంచిన షష్ఠాంకము నందు అద్భుతరసము లేకున్నను అద్భుతాంగముగ రామభక్తి సీతచే బ్రదర్శింపబడియె. లేదా "మహోదధి నిరుద్ధమగు నీ లంకకు ఎట్లీ వానరకిశోరము రాగల్గినది ! రాక్షస శాంబరి గాదు గదా ! రక్కసు లెన్నడును శాఖామృగరూప మును దాల్ప నొల్లరు" అను జానకీ భావనాపరంపరయే యద్భుతరసాకీర్ణముగ నొప్పినదని చెప్పవచ్చును.

ఇక సప్తమాంకమున సీత యగ్నిప్రవేశమునను, సర్వ దేవర్షి పితరుల సందర్శనమునను సంపూర్ణముగ నద్భుత రసము వెల్లివిరిసినది.

ఇట్లు నాటకమునం దంతటను శాఖాపుష్ప పల్లవ ఫల ములతో మనోజ్ఞముగా నీ యద్భుత రసవల్లరి యల్లుకొని అంగిభావము నొందుచున్నది. ఇందుగన్పట్టు వీర శృంగార రౌద్రాదు లన్నియు బ్రధానమగు నీ యద్భుతమునకు నంగ ములుగానే పరిగణింపబడవలయును. ఇయ్యది సకలపక్ష సమ్మ తము. ఇట్టి యాశయముతోడనే కవి తన నాటకమును "ఆశ్చర్య చూడామణి" యను నామాంకితముగ జేసినాడు'—అని.

నాటక హృదయమును బరిశీలింపగా నీ యద్భుత రసవాదులు బాహిరముగ నాటకమును బరిశీలించి తమ వాద మును చెప్పినట్లే యగపడుచున్నది. లోకములో నేదేని యొక వాదమున దన కితర పక్ష సమ్మతిని బ్రమాణముగా గొనుట తన పక్షము హేతు యుక్త్యనుభవ ప్రమాణములచే సిద్ధిం చినచో దానిని దృఢపరచుటకే పనికివచ్చును గాని వస్తు సాధనమున కెంతమాత్ర ముపకరింపదు. "బాధే దృష్టే న్య సామ్యాత్ కిమ్, దృష్టే న్యదపి బాధ్యతాం" అను న్యాయముచే వస్తుసాధనమునకు బరపక్షసమ్మతి దృఢమగు సాధనము కాజాలదు. కావున ఒకానొక గ్రంథతత్త్వమును దెలిసికొన గోరునపుడు ఆ గ్రంథమునందలి యన్తరంగపరీక్ష సేసి యద్దాని తత్త్వమును మనము నిర్ణయింపవలయును.

ప్రకృతమున నాశ్చర్య చూడామణి నాటకలోకమున నొక మంచి నాటకముగనే యెన్నబడుచున్నది. ఇందలి నాయకుడు శ్రీరాముడు. నాయిక సీత. ప్రతి నాయకుడు రావణుడు. నాటకమున ప్రత్యక్షముగ గాని, పరోక్షముగ గాని తద్రసమూర్తియగు నాయక చరితము సర్వత్ర కానవచ్చుచుండును. అభిజ్ఞాన శాకుంతలాది నాటకములందు ఇట్లే కానవచ్చుచుండును. శృంగారరసమూర్తియగు దుష్యంతునికి సంబంధించియే తొలి యంకము మొదలు తుది యంకము వరకు గథ శృంగార రసభరితముగానే నడచినది. చతుర్థాంకమున దుష్యంతుడు మనకు గానరానప్పటికిని అందలి ప్రతి విషయమును బరోక్షముగ దుష్యంతునికి సంబంధించియే యున్నది. ప్రథమాంకమున శకుంతలాదర్శనముచే నాయకునియం దంకురించిన రీతి విభావాది సాధనసామగ్రిచే బరిపుష్టి నంది తృతీయాంకమున సంపూర్ణ సంభోగ శృంగార రసరూపమున విశ్రాంతి నందినది. తరువాత విప్రలంభరూపము నంది రసానుభవ యోగ్యమై ధార్మికఫల జనకమగుచు సర్వాంగ శోభితముగ విలసిల్లినది. ఇతర రసములను దన కంగముగ జేసికొన్నది.

ఇట్లే ఏ కావ్యమం దయినను దొలుత ప్రధాన రసము నాయకగతముగా నుద్భవించి క్రమాభివృద్ధి నంది సంపూర్ణమగు స్వస్వరూపముతో ఉత్తమ స్థితి నందవలయును. ఇదియే నాటకములలోని రసగతుల రీతులు. పైవారి వాదము ప్రకారము ఇందలి ప్రధాన రసము అద్భుతమనియే మన మంగీకరించినచో నాయకుడగు రామునికి ప్రథమాంకమున నద్భుత రసానుభూతి ఎచట నైనను గల్గినట్లు చెప్పవలయును. అట్లు చెప్పదగినంత రసానుభూతి ప్రథమాంకమున గానరాదు. కామరూపిణియగు శూర్పణఖా సౌందర్యమును గాంచి లక్ష్మణుడే యచ్చెరు వందినాడు. దానితో రాముని కెట్టి సంబంధము లేదు. రసరూపముగా గుర్తింపబడదగిన విస్మయము ఈ ప్రకరణమున రామునియందు గానరాదు. నాయకునియందు లేక నాయకేతరులయందు గానవచ్చు రసానుభూతి ప్రధాన రసాంకుర నిర్ణయమున కుపకరింపదు గదా ! ద్వితీయ తృతీయాంకములయందు రామునియందు గొంత యద్భుత రసానుభూతి గానవచ్చు చుండుట నిజమే. అందునను దృతీయాంకమునందు బుష్కలమగు నద్భుతరస స్ఫూర్తియే గానవచ్చుచున్నది. కాని చతుర్థ పంచమ షష్ఠాంకములయందు నాయకగతాద్భుతరసమునకు ప్రత్యక్షముగ గాని పరోక్షముగ గాని ప్రసక్తియే లేదు. రసస్ఫూర్తి యనునది నదీప్రవాహమువలె సంతత గమనము గల్గియుండవలయును గాని బదరీబాదరాయణ సంబంధముతో ప్రతిపాదింప బడగూడదు. కావున సప్తమాంకము తుది వరకును ఈ రసమునకు మరల ననుభూతియే గానరాదు. అనగా అద్భుతమునే మనము ప్రధాన రసముగా నంగీకరించినచో ద్వితీయాంకమున నాయకునియం దుద్భూతమై తృతీయాంకమున సంపూర్ణ వికాసముతో వెల్లువయై ప్రవహించిన యీ రసము దానితోడనే విచ్ఛిన్నప్రాయమైనట్లు చెప్పవలసి వచ్చును. చతుర్థ, పంచమ షష్ఠాంకములందును సప్తమాంకము తుది వరకును ఈ రసమునకు ప్రసక్తియే లేకపోవుటవలన నాటకము తుదిని మరల ప్రసక్తమగు రసస్థితిలో సామాజిక హృదయము లన్నియు నీరస స్థితిలోనే యుండగలవు. రసానుభవము స్మరణ రూపముతో నుండునేమో గాని అఖండిత మాత్ర మెన్నటికిని సిద్ధింపదు. ఇట్లు గ్రంథమునందు నధిక భాగమున నీ రసము సిద్ధింపనపుడు ఈ యద్భుతము సర్వానుస్యూతమై యొప్పుచున్నట్లు చెప్పుట కవకాశ మెట్లు గల్గును? రసము ప్రధాన నాయకగతమై విలసిల్లునపుడు దాని కితర పాత్రగతరసము దోహద మగునే కాని నాయకునియందే రపము శుష్కించిన సమయమున నయ్యది యేమి సేయగలదు ?

అదియునుగాక, రూపకములలో కెల్ల నాటక మను నది యుత్తమోత్తమ రూపకముగ నెన్నబడుచున్నది. కావుననే యద్దాని స్వరూపమును వలసిన లక్షణములను నిర్వచించునపుడు ఆలంకారికులు వీర శృంగారములలో నన్యతరమగు రసమే యందు ప్రాధాన్యము నొందియుండవలయునని నిర్వచించిరి. అట్టి నిర్వచనమునకు హేతు వెద్ది యనగా రసము లన్నియును దమతమ స్థాయి రూపముతో నుత్పన్నములయి వలసిన విభావాదులవలన రసస్థితి నందుచున్నను శృంగార వీరకరుణ శాంతము లనెడి యీ నాల్గు రసములకు మాత్రమే బీజవృక్ష న్యాయమున గ్రమాభివృద్ధి పొందుటకు నవకాశము గలదు గాని తక్కిన యే దింటికిని నట్టి యవకాశము లేదు. ఆ నాల్గింటిలోను గూడ శృంగార వీరరసముల కుండెడి క్రమ వికాసావకాశము కరుణ శాంతములకు లేదు. కావుననే రసములలో శృంగార వీరములు రసరాజములై నాటకమునందు స్థానమును సంపాదించుకొన గలిగినవి. ఇట్టి విషయమును మనము పరిశీలించినను అద్భుతమునకు నాటకముగా నొప్పు నీ గ్రంథమునందు ప్రాధాన్య ముండుటకు నవకాశము లేదు. కొంద రిట్టి దోషమును దప్పించుటకు ఈ నాటకమున వీరరస జన్యమగు నద్భుతము ప్రధాన రసమని వర్ణించి యున్నారు. అట్లు చెప్పినను ప్రాధాన్య మద్భుతమునకే గాని వీరమునకు గలుగజాలదు గదా ! ఇందలి యద్భుతమంతయు వీరరస జన్యమే గాక గొన్ని చోటులందు శృంగారాదీతర రస జన్యముగా గూడ గానవచ్చుచున్నది. "భక్షితేపి లశునే న రోగ శాంతిః" కావున నిట నద్భుతరసమునకు ప్రాధాన్యము లేదనియే చెప్పవలయును. శృంగారాది పద నిబంధన మాత్రముచే శృంగారాదిరసములు జనియింపనట్లు గ్రంథ నామ పరికీర్తనమాత్రముచే గ్రంథ గత రసనిర్ణయము చేయుట కవకాశము లేదు. ఇతర సామగ్రి పరిపూర్ణముగ నుండి ప్రబల ప్రతిబంధకములు లేనిచో నప్పుడు గ్రంథ నామము గూడ రప నిర్ణయమున నొక సహకారి కారణము కానొప్పును.

వస్తుతః నాటకగతినంతను సూక్ష్మముగ బరిశీలింప నీ నాటకమున వీరరసమే ప్రాధాన్యము వహించుచున్నదని చెప్పితీర వలయును. చతుర్విధములగు వీరములలో నియ్యది ధర్మవీరము

ప్రధానముగా గల్గి యొప్పుచున్నది. గ్రంథస్థ విషయమునుబట్టి చూచినచో నీ యాశయమే గ్రంథకర్త—హృదయగత మైనట్లు సుస్పష్టము కాగలదు.

ప్రథమాంకమున సీత తోడ రాముడు ప్రవేశించునపుడు తన ధార్మిక వృత్తి కనుకూలముగ సీతతో—"నగర నివాసముకంటె నా కీ యరణ్యవాసమే యెంత హాయిగా నున్నద"ని నిరూపించినాడు. తన రాజ్యములోని ప్రజాసామాన్యమేగాక సదా స్వసన్నిధాన వర్తియగు లక్ష్మణుడు సైతము కోసల సామ్రాజ్యమును బాలించుచు మహా సుఖముల నందదగిన యీ దంపతు లిట్టి వనవాస దుఃఖము ననుభవింపవలసి వచ్చెనుగదా యని పరిపరి విధముల జింతించుచుండ రాముని కీ వనవాసము మహా సౌఖ్య ప్రదముపలె దోచుచున్నది. యుక్తమే. ధార్మికులు దమ జీవిత మెట్టిదైనను అయ్యది ధర్మ్యమైనచో నద్దానియందే సౌఖ్యమును గాంతురు. కావుననే రాముడు ఉపశాన్తింపనట్టి లక్ష్మణుని కైకేయీ విషయ కేర్ష్యను జూచి "అహో సంతోష బాహ్యోనామధర్మైక రసం మనః"అని తనవిచారమును వెలిపుచ్చినాడు.ఇట్టి రాముని ధర్మవీరము బీజరూపమున నిందు నారబ్ధమైనది. తనతోడనే వచ్చుచున్న లక్ష్మణుని దుడుకైన యన్తఃకరణమును లెస్సగా రాముడు గుర్తెరిగినవాడు గావుననే మెల్లగా అతనిని గూడ ధర్మవృత్తునిగా జేయుటకు "లక్ష్మణా కైకేయి నెపముతో మన మీ యరణ్యమునకు వచ్చి యెట్టి యుత్తమ కార్యముల నొనరింపగల్గుచున్నారమో గంటివా! బ్రహ్మజ్ఞుల సందర్శన భాగ్యము నందితిమి. పుణ్యతీర్థముల గ్రుంకు లిడితిమి. ఇక్ష్వాకుల కుల వ్రతముగా దప్పక యాచరింపవలసిన యీ మునివృత్తిని మనము నెరవేర్చుకొనుచున్నారము గదా! అను మహానందమును బ్రదర్శించినాడు. లక్ష్మణు డింకను దన మార్గమునకు వచ్చినట్లగపడుటలేదు. మంచి చెడుగులను బాగుగా నెరుంగనివాడవు గదాయని "బాలుడా" యని సంబోధించి రాజ్యములోని మహానర్థమును —

"సాధారణీ నయువిదాం ధరణిః కలత్రం,
అస్త్రాణి మిత్ర మరయః సహజాః సుతాశ్చ,
పాపాత్ పరస్యతనం నరకేషు, లాభః
ద్వే చామరే చ సిత మాతపవారణంచ."

యని వివరించి చెప్పినాడు. రాముడు రాజపుత్రుడైయుండి రాజ్యపరిపాలనము తన ధర్మమైయున్నను, బ్రకృతము దాను దపస్విప్రతుడైయున్నందున రాజ్యపరిపాలనావకాశమునకుగూడ దన హృదయమున జోటీయలేదు. ఈ మహానుభావుడు ! ఇయ్యదియే రామునిలోగల విశిష్టత. లక్ష్మణుని మాట సాగలేదు. "కైకేయి నిమిత్తముగా రాజ్యము పోయినదని నాకు విచారము లేదుగాని అన్నయ్యా, పెద్దవాడు చేయవలసిన రాజ్యమును జిన్నవాడు చేయు టన్యాయమని నాకు గష్టముగా నున్నద"నినాడు లక్ష్మణుడు. "అట్లయినచో నేను దొలుత సర్వవిధాల గర్హ్యుడను. అన్ని విధాల బెద్దవారలగు పితృపాదులుండగా సిగ్గులేక రాజ్యపాలనమునకు దయారయితినే" అని పలికినాడు రాముడు. "అట్లుగాదు! జనకులు వయసుచే వృద్ధులుగావున జిన్నవాడవగు నీవు రాజ్యార్హుడవు గదా" అని లక్ష్మణు డనగా "అట్లయినచో నాకంటె గూడ భరతుడు చిన్నవాడుగదా! అతడు తప్పక రాజ్య పరిపాలనార్హుడే" అని కైకేయీ వృత్తమునే రాముడు సమర్థించినాడు. తుదకు దన వాదమును లక్ష్మణుడు సమర్థించుకోలేక "ఏది ఎట్లుగానిమ్ము. నాయనగారి మరణమునకు ఆమెయే కారణమ"ని పలుకగా "అయ్యో! ఆమె యెంతమాత్రము కారణము కాదు లక్ష్మణా!వనద్విపశంకయా రభస మిషు రున్ముక్తః కాలాదసూన్ అహర త్స్వయం" (అడవి యేనుగను భ్రాన్తిచే ఆనాడు విడుబడిన బాణమే కాలక్రమేణ స్వయముగా నాటని ప్రాణములను దీసెను) అని లక్ష్మణుని యుక్తినంతను నిరాకరించినాడు రామచంద్రుడు. ఇట్టి యాతని యుక్త్యుపత్తులలో గూడిన ధర్మ వీరమునకు ఏ సామాజికుడు తన్మయుడు కాజాలడు?

ఇక ద్వితీయాంకారంభముననే భయంకర రాక్షస సంసేవితమగు పంచవటి తనకు సేవింప గుతూహల మున్నట్లు పేర్కొని యిట్టి కోరిక నేటికి దీరినదని నాయకుడు ప్రియురాలితో బలికినాడు. అహా! ఎట్టి కోరిక రామునిది! లోకములో నెవ్వరైనను సుఖదములగు దేశములందు వసియింప నిష్టపడుదురే! ఇది కేవలము దానికి విపరీతమే! మనల దృష్టికట్లే కానబడును. రాముని దృష్టి వేరు. ఆతడు రాక్షసులను బారద్రోలి దండకనంతను తాపససంసేవ్యముగా నొనర్ప గుతూహలము గలవాడు. అయ్యది తన ధర్మమనియు గట్టిగా నమ్మినవాడు. ఇట్టి స్వధర్మమింతకాలమునకు నెరవేర్ప నవకాశము గల్గినదేయని యాతని సంతసము. దీనితో రామునికి దెలియకుండగనే రెండు పరీక్షలాతనికి గడచినవి. లక్ష్మణుని వాదమున అర్థపరీక్ష. ఈ పంచవటీవాసము తనక్షత్త్ర ధర్మ పరీక్ష. ఇక నవశిష్టమైనది కామ పరీక్ష. ఇందాతడుత్తీర్ణుడయ్యెనా, "పూర్ణ ధర్మవీర" బిరుదము నాతని కనుగ్రహింప సామాజికులందరు సిద్ధముగా నున్నారు.

అసామాన్య లావణ్యవతియగు సుందరి విజయమునందు దన్ను వలచి దనకొరకు వేచియున్నది. రాజులు నవనవప్రియులు గదా! ఆ సుందరి యవస్థగాంచి జాలినంది "ఏషా ఖలు తపస్వినీ ఆర్య పుత్రమధికృత్య ఉత్పన్నేన స్నేహేన అత్మనః గుణపక్షపాతం విభావయతి . . . నఖలు తావ దుపేక్షణీయః అస్యాః వ్యవసాయః" అని సీత గూడ దన యంగీకారమును సూచించినది. ఇక రాముని భాగ్యము వర్ణనాతీతము గదా! కాని రాముని దృష్టిలో నియ్యది కిల్బిషాపాదకము. "పెద్దలు నన్ను జిన్నవానినిగా జేసి కట్టబెట్టిన యీమెయే ధర్మపత్నియయి నా యక్షరపదప్రాప్తికి బ్రతిబంధకమగుచుండ నిన్ను గూడ నే నెక్కడ గట్టికొందును" అని రాము డాకుహనా సుందరికి సమాధానము చెప్పినాడు. అది వెడలిపోయిన వెనుక దానిని గూర్చి సీత జాలిగా మాటలాడ నాతడు "సుందరి, న సంసర్గ మర్హతి కుటుంబినాం అనర్గలః స్త్రీజనః" అని సీతకు ధర్మోపదేశము గావించినాడు.

ఇంతవరకు రాముడు దన ధర్మవీరమునే ప్రకటించి సమయము వచ్చినపుడు దాను యుద్ధవీరమునకు గూడ సిద్ధమే యని సర్వప్రాణి భయంకరురాలగు శూర్పణఖ నిజ రూపముతో

లక్ష్మణుని జంపుటకు గ్రహించు సమయమున నిట్లు పలుకు చున్నాడు—

> ''మునయో న వయం కృతాగసి
> త్యజ సంరంభ మిదం ధృతం ధనుః
> కరుణా విముఖాః శిలీముఖాః
> సతతం రాక్షసి రాక్ష సేషు నః''

ఇట్లే శూర్పణఖ లక్ష్మణుని నెత్తుకొని పోవుచున్నది. తా నతని రక్షింపదొందరతో వెడలుచున్నాడు. అట్టి స్థితిలో సీత నీవు పోవుచుండ నన్ను రక్షించునాథు డెవ్వడని స్వార్థపరురాలు కాగా వెంటనే రాముడు ''నీ కొరకు నే నిచటనుండ రాక్షసీ గృహీతుడగు లక్ష్మణుని రక్షించువాడెవ్వడ''ని పలికి ''అవిపన్న రక్షణ యత్నముకంటె విపన్న రక్షణము అవశ్య కర్తవ్యము''ను ధర్మమును బరిపాలించినాడు. శూర్పణఖా కుటుంబ వృత్తాంత మును సంపూర్ణముగా గ్రహించి పలికిన

> ''త్రిభువన రిపు రస్యాః రావణః పూర్వజశ్చేత్
> అసులభ ఇతి నూనం విశ్రమః కార్ముకస్య,
> రజనిచరనిబద్ధం ప్రాయశో వైర మేతత్
> భవతు భువన భూత్యై సర్వ రక్షో వధేన''

అను రాముని యుద్ధ వీరతా ప్రస్ఫొరకములగు పలుకులచేతను అందు సర్వ రక్షోవధ ద్వారా భువన భూతియే దాన పేక్షించు దండకారణ్య నివాసఫలమని సూచించుటచేతను ఇందలి వీర రసము సంపూర్ణమగు పరిపుష్టినందీ, సామాజికాస్వాదయోగ్యమై ''ఇక నేమి జరుగనున్నదో'' యను నుబలాటమును బారిషదులకు గలుగజేయుచున్నది. ఇయ్యదియే గదా నాటకమున ప్రధానముగ గలుగవలసిన యనుభూతి! ఇట్టి స్థితిలోనుండియు గూడ రాముడు దన వైదిక ధర్మమార్గమును వీడక తన తమ్మునికి సాయం కర్తవ్యమును —

> ఖడ్గం నిధేహి, శిథిలీ కురు కార్ముకజ్యాం
> అంగైరపాం విరజసా మనగాహనార్ద్రైః
> అన్తర్నియమ్య మరుతః పరివర్త్య మంత్రాన్
> సాయంతనం నియమ మద్య వయం చరామః''

అని యుపదేశించినాడు. ఏ దృష్టిలో నున్నవానికి జగమంతయు నట్లే కానవచ్చుట సహజము. కావుననే సాయం సంధ్యారాగము రాముని దృష్టిలో సూర్యుడు చక్రహస్తునిచే బరిమార్పబడిన నముచి రక్తకణములతో దిఙ్ముఖములను అరుణనులనుగా జేయుచున్న ట్లగపడినాడు. దీనిచే రాముని హృదయమున జిల్లా రని రాక్షసమారణదీక్షోత్సాహము స్పష్టముగా నభివ్యక్తమగు చున్నది.

ప్రథమాది ద్వితీయాంకాంతము నాయకుడగు రాముని యందలి వీరరసము ప్రధానముగ ధర్మరూపముననను గొన్ని చోటులందు యుద్ధరూపముననను అభివ్యక్తమగుచు సాక్షా ద్విభావితమగు నాయాయి విభావాది సామగ్రిచే బరిపూర్ణత నంది నది. నాయక గత వీరరస పరిపుష్టికి బ్రతి నాయకకృతవంచనా దులు గూడ నిమిత్తములగు చుండును. ప్రతినాయకుని యందు అట్టి వంచనాదులెంత యభివృద్ధినందునో నాయకుని యందు అంత వీరరస మున్నతస్థాయి నందగలదు. ప్రతిపక్ష కృత్యములను వర్ణించి తన్నిమిత్తముగ రామునియందు గల్గిన వీరరసపోషము గూడ నాస్వాద్యమే యగును. ఇట్టి ప్రతిపక్ష కృత్యములు రూపాంతర ధారణాది ప్రతారణోపాయములే యైనచో నయ్యవి ద్రష్టలగు భావుకులకు నుత్తమ రసానుభవ హేతువులగుచుండును. ఈ విధముగ రసపోషణము నొనర్చు టకే కవి తృతీయాంకము నారంభించి దీనియందు దాను బరి పూర్ణముగ గృతకృత్యుడైనాడు. ఈ యంకమును మాత్రమే పరిశీలించినచో నిజముగా శత్రు వంచనా జాతమగు నద్భుత రసము నకే వీరరస మంగభావమునందెనేమో యనునంతటి పూర్ణత్వము నిందు నద్భుత రసము అందుకో గల్గినది.

ద్వితీయాంకాంతమున రామునిచే జేయబడిన ''మాకు సంభవించిన యీ రక్కసులతోడి వైరము రాక్షస వధ ద్వారా భువనభూతికి నిమిత్తమగు గాక'' యను ప్రతిజ్ఞ ఫలారంభము నందుచున్నట్లు తృతీయాంకారంభమునందలి ''ఖరదూషణ సైన్యమును జనస్థానమునుండి యమస్థానమునకు బంపిన రామునిచే ఈవనభూములన్నియు మాకు స్వైర సంచారక్షమ ములుగా జేయబడినవ''ను ఋషి వాక్యముచే దెలియుచున్నది. మరియు ''ఖరదూషణ వధాదుద్ధృత కంటకం జనస్థాన మాసీత్! అతో యథాస్వం యుష్మాభి రాశ్రమపదాని సనాథీక్రి యన్తాం'' అని లక్ష్మణునిచే బ్రకటింపబడిన రామ శాసనమును బట్టియు, రాక్షస సంహారము ద్వారా శిష్టరక్షణ రూప ధర్మ సంస్థాపనము రాముడు దన కర్తవ్యముగానెంచి చేయుచున్నట్లు దెలియుచున్నది. ఇయ్యది నాయకగత వీర రసోత్కర్షము నవ నవోన్మేషముతో విజృంభించుచున్నదని చెప్పుటలో బ్రమాణ మగుచున్నది. తామెంత మోసగించి తమ కార్యములను నెరవేర్చు కొనదలంచినను దుది జయము మాత్రము రామునిదే యను నభిప్రాయమును మారీచునివంటి మహా మాయావి వెలిపుచ్చుట చేతను, మాయా పిశునములగు చూడామణ్యంగుళీయకములు తాపసానుగ్రహ లబ్ధములగుటచేతను ఎట్టి వంచనములు జరు గును, అయ్యవి యెట్లు బయల్పడును అను జిజ్ఞాస సామా జికుల హృదయములందు మితిమీరుచుండును. ఇట్టి స్థితియందే అత్యాశ్చర్య జనకమగు మృగముయొక్క ప్రవేశము, కుహనా సీతా రామ లక్ష్మణుల ప్రవేశము, తత్కృత వంచనమును గనుసరికి బారిషదులకు దామెచటనుంటిమో గూడ దెలియరానంతటి యాశ్చర్య రస నిమగ్నత, వంచనాపరులగు శూర్పణఖా రావణుల యందలి యీర్ష్య మున్నగునవి యేర్పచుచున్నవి. ఇట్టి స్థితిలో నున్న రామునికి దీనికి ఫలముగా రాక్షసులతోడి పరోక్ష వ్యవహార ములు పోయినవి. అతడు శూర్పణఖా రావణమారీచులు తమ్ము వంచించినందులకు సంపూర్ణమగు ప్రతీకారము అవిలం బితముగనే చేయదలచెను. రామునికి రాక్షసులతోడి విరోధము ప్రబలతరమై పోయినది. కాని ధార్మికుడగు నీతడు శూర్పణఖ దనచే జిక్కినను స్త్రీ యగుటచే దానికి నెట్టి హానియు జేయ కయే హృదయమున బ్రజ్వరిల్లుచున్న వీర రసానలముయొక్క యుగ్రత రాక్షసలోకమునంతను భస్మీపటలము చేయ నుద్యుక్తమైనది.

ఇట్లే మూడంకములయందును రాముని యుదాత్త కృతుల ద్వారా తద్గత వీరమును సుత్తమస్థితి పొందించి యిక నీని బలమునకై కవి నాలుగు అయిదు అంకములలో ప్రతి నాయకుడగు రావణుని నీచస్వభావమును ప్రకటింప నిశ్చయించి నాడు. మిథ్యాదాశరథి రూపమున సీతను వంచించి లంకకు నీసికొనిపోవుచు హృదయగత సీతామోహము నాపుకొనజాలక యేదో నెపముతో సీతను స్పృశించి సీతా శిరోగతమగు నద్భుత చూడామణి ప్రభావమున నీతడు రామరూపమును గోల్పోయి నాడు. అట్లయ్యు నిజ రూపమును దెలిసికొనజాలక 'నేను రాముడనే' యని పల్కుచున్న యీతని స్వరూపాజ్ఞాన కామాతురత్వములను గవి మనోహరముగ నిండగపరిచియున్నాడు. ఇట్లే పంచమాంకమునందును రావణుని సీతా విషయకమగు నధార్మిక కామము, లంకా ప్రళయమునకై యుత్తుంగతరంగ ములతో రామ మహోదధి పొంగి పొరలివచ్చుచున్నట్లు తన యమాత్యుడు సెప్పుచున్నను, వాని మాటలను సరకుగొనకపోవుట పరదారాస్థ కూడ నొక పరీవాదమేనా యను స్థితినందుట, స్వర్గము స్వభుజ బల సాధితమే యగుటచే దత్సాధనమగు ధర్మమును దానిని కవలంబింప నవసరములేదని పలుకుట, తన యందలి దోషములను బోగొట్టుకొనుటకు బదులు తన ప్రత్యర్థులయందలి దోషములను గీర్తించి వారలతో దన సామ్యమును ప్రతిపాదించుట, ధర్మార్థ సంచయముతో దనకు బనిలేక పోవుటచే గేవల కామము మాత్రము తన కవసరమగునట్లు వాదించుట, సీతాచరణ పతితుడుకాగా నామె పాద ప్రహారముతో దన శిరమును దొలగించినను, "దేవి తవ పాదే మే శరణ"మ్మని పరమ నీచస్థితినందుట, స్త్రీయని గూడ దలంపక యధర్మ బుద్ధితో సీతను జంప నుద్యుక్తుడగుట యీ మొదలగు అరాజయోగ్యములు అధర్మ్యములు దండ్యతా సంపాదకములును నగు తుచ్ఛ గుణములను రాముని యుత్తమతా నిరూపణమునకై ప్రతి నాయకునియం దీ ప్రకరణమున గనపరుపబడినవి.

ఇట్టి ప్రతి నాయకగతాధార్మిక గుణసంతాన ప్రకటనము రాముని పరాక్రమముచే భువన భూతికై జరుగబోవు రావణ వధకు పోద్బలకములుగుచున్నవి. కావున వీర రసమే యంగి రసమైనచో ప్రతి నాయక స్వభావమును స్పష పరచు నీ చతుర్థ పంచమాంకములు రెండును బరోక్షముగ నాయకగత వీర రస పోషణమునకు సాధకములే యగుచు నద్దానికి సన్నిహితత్వము నందుచున్నవి.

ఇక షష్ఠాంకము. త్రిలోక కంటకుడగు రావణుని వధ జరిగినగాని, రామగత వీరరసము భువనభూతి ప్రసాధకముగుచు బరిపుష్టి నంద లేదు. దానికై సీతాన్వేషణము, సీత పరిశుద్ధ చారిత్రజ్ఞానము నావశ్యకములు. కావున నవ్వానిజ్ఞానమునకై షష్ఠాంక మావశ్యకమగుచు నంగిరసమగు వీరమునకు సన్నిహితత్వమును గల్గియేయున్నదని చెప్పితీరవలయును.

ఇక సప్తమాంకమున సకల కథయు నుపసంహృతమై యున్నది. రాముడు దాను భువనభూతికొరకు ప్రతిజ్ఞ సేసిన దుష్కృత వినాశనము, తన్నిమిత్తముగానే జరుగు సాధు పరిత్రాణము, ఈ రెండింటివలననే గల్గు ధర్మ సంస్థాపనము అను నీ క్రియలు నిర్వహింపబడినట్లు స్వపరానుభూతులచే నిరాఘామైనది. కావుననే విద్యాధరులు "అద్య ఉద్ధృతకంటకం త్రైలోక్య మాసీత్, అద్య ఉచ్ఛ్వసితాని పతివ్రతానాం హృదయాని" అని చెప్పుకొనగల్గుచున్నారు. అధర్మ భూయిష్ఠమగు రావణరాజ్యమునందు గూడ ధార్మికవృత్తుడగు విభీషణుని ప్రతిష్ఠాపనము వలన ధర్మము నెలకొన్నది. "పౌలస్త్య భూమిషు పదం నిదధాతు ధర్మః" అను రాముని కోరిక నెరవేరుచున్నది. ఇక నెచటను నధర్మమునకు దాపులేదు. రాముడు కృతకృత్యుడై— "అద్యాహం సిద్ధార్థో విభీషణ ప్రతిష్ఠాపనాత్" అని తన తృప్తిని ప్రకటించినాడు. రాముని కృత్యముల నన్నింటిని దేవర్షి పితరులు అభినందింప వచ్చేసినారు. కావున నాటక ఫల మెయ్యది? నారదుడే తెల్పినాడు—"కార్ముకేణ శమితే తవాధునా రావణే త్రిభువనైక కంటకే" అని. అనగా దుష్కృత వినాశనము.

కావున రాముడు స్వగతమగు ధర్మ యుద్ధోభయ రూపమగు వీరముచే స్వప్రతిజ్ఞాతమగు తన యవతరణ ప్రయోజనమును అందగల్గినాడు. ఇట్టి వీర రసోద్భూతికి సర్వాంగ సుందరమై యుత్కటభావమునందిన యద్భుత రసము ఆలవాలమై యద్దానికి నంగ భావము నొందినది. వీరాద్భుత రసములకు జన్యజనకభావముండుట శాస్త్ర సమ్మతము, అనుభవ సిద్ధము గూడ గదా!

ఇక నీ నాటకమునందు బర్ణశాలయందలి సీతా రాముల శృంగారము, లక్ష్మణ వర్ణితమైన సీతా రాముల దుఃస్థితిచే గల్గిన కరుణరసము, నిజరూపమును దాల్చిన శూర్పణఖాభీమ రూప సందర్శనముచే కల్గిన భయానకము, శూర్పణఖా మారీచుల వంచనా సందర్భమున లక్ష్మణునికి గల్గిన రౌద్ర రసము ఋషిచే జేయబడిన ఆశ్రమ స్థితివర్ణనమువలన గల్గిన శాన్తరసము, రాక్షస సంహారమువలన ఆశ్రమ భూములందు గల్గిన స్థితిచే బీభత్సరసము గూడ నీ వీర రసమునకు అంగ భూతములుగానే యొప్పుచున్నవి. ప్రథమ, ద్వితీయాంకములందలి శూర్పణఖాగతమగు శృంగార రసాభాసము గూడ నిద్దానికి అంగభూతమై వీరరసోద్దీప్తికి హెచ్చు సహకారమును నెరపినది. ఇక ఆశ్చర్య భూతమగు చూడామణి దేనియందు గథా ప్రసాధకమాయెనో గ్రంథము "ఆశ్చర్య చూడామణి" అను ఉత్పత్తిచే ఈ పక్షమున నామ విరోధ మెంతమాత్రమును గానరాదు.

కావున నిట్లు గ్రంథమునకు నాటకత్వ సిద్ధికొరకును, అన్ని యంకములందును మణులలోని సూత్రమట్లు వీరరసమునకే అనుస్యూతత్వ ముపపన్నతమగుటచేతను నాటకములోని యన్ని అంకములందలి సంఘటనములును వీరరసోత్కర్షమునకే ప్రధాన సాధనములుగా నొప్పుచుండుటచే తతను సర్వ విధముల నీ నాటకములందు ప్రధాన రసము వీరమేగాని యద్భుత మెంత మాత్రము గాజాలదని నిశ్చయింపనొప్పను. అద్భుతాంగి రసత్వ పక్షము న చతుర్థపంచమ షష్ఠాంకముల పై యర్థ్య మటులుండ రావణ ప్రతినాయకత్వమున కించుకేనియు నవసరము గలుగదు. కావున సర్వథా యిందు వీరమే యంగిరసముగా నెన్నదగియున్నది.

అభిషేకః

శ్రీ దురిశేటి వెంకటరామాచార్యులు

[సచివ శేఖరుఁడగు శివదేవయ్య పలుకు
లచే వృద్ధగణపతి దేవులు కూతు నభిషే
కించిన ఘట్టము నా 'శిల్పశ్రీ' అను నము
ద్రిత సంస్కృత కావ్యము లోనిది.]

అథ స కాకతిరాజ పురన్దరః
సిత నిజాతపవారణతోఽభితః,
అతితరాం పృథివీం కమనీయయా
శిశిరచన్ద్రికయా హృతతాపయా.

హృత సపత్న మహీపతిమస్తక
స్ఫుర దుదగ్ర మహామణి తేజసా,
పటుపరాక్రమభాను మరీచినా
చిర మువాస భువం పరిపాలయన్.

బహుతిథే సమయే సతి గచ్ఛతి
ప్రియపినాకభుజో జరతోఽభవత్,
పలిత కేశ మముం శిథిలీభవత్
పటు నిజావయవం సచివోఽబ్రవీత్.

"అయి మహాన్ దుహితా తవ రుద్రమా
నిఖిల కాకతిరాజ్య రమేశ్వరీ,
భవితు మర్హతి శత్రుశిరస్సు యా
కృతవతీ చరణం కమలారుణమ్.

సమద శత్రు సముద్ధత వాహినీ
మథనకర్మణి, చణ్డికయా తయా,
పరిలసే న్నిజకాకతిభూ రియం
కలిత రుద్రమహాః పరిపాలితా.

సకలశిల్పకలాసు రహస్యవిత్
సఖలు సత్కృతి రద్య మహీయసా,
నిజ తపోమహసా హి పినాకినం
కరుణయా కురుతే భవతి ప్రభో!

మహిత సత్కృతి యన్త్రి నియన్త్రితో
ధృతరతిః కృతసన్నిధి రీశ్వరః,
అయి భవన్ దయయా పరిపాలితాం
స విదధాతు శివాం ధరణీం శివః.

చతురుపాయనుతా గురుదేవతా
గలితగర్వలవా చ కుశీలవా,
శరశరాసనపాణి రియం మహా
కటినిబద్ధ కృపాణ విభీషణా.

కఠినవర్మ సమున్నత బన్ధుర
స్ఫురదురఃఫలకా ఖలు రుద్రమా,
నిఖిల కాకతి రాజ్యరమా మిమా
మతితరాం బహుధా చ విధాస్యతే.

రథగజాశ్వపదాతి చతుర్విధ
ప్రబల సైన్యసమాకుల భీషణే,
రణముఖే హి విరోధి శిరోధిభి
స్సరుధిరైః పరిఖేలతి కన్దుకైః.

సకల మిత్రజనే ష్వభయంకరీం
నిఖిలశత్రుజనేషు భయంకరీమ్,
శివపరా మభిషేచయ రుద్రమాం
నిజధరాం ముదితాం కురు సత్ప్రజామ్."

ఇతి నిశమ్య వచ స్సచివస్య త
న్నృపతి రాప ముదం పరమాం తథా,
జనపదేషు పురేషు చ ఘోషణా
ధ్వని రభూ ద్దలయన్ విదిశో దిశః.

మహితపుణ్య సముద్ర నదీజలైః
శుభదినే మహతాం చ పురోధసామ్,
సపులకం తనుజా ధరణీభుజా
నిగమ మన్త్ర వచోభి రషిచ్యత.

సమధిగమ్య పితు ర్జగతో భరం
పృథుల మన్థ్రిమహీశ తనూభవా,
ఋతు మవాప్య ఘనచ్యుతకౌముదీ
విలసతి స్మ యథా నవశారదమ్.

పరిచితోఽపి హితోఽపి బిభాయ తాం
సమభిభాషితు మాప్తు మహో భృశమ్,
నికటవర్తి రిపా వపి కోమల
స్మితముఖం నవచన్దన శీతలామ్.

ప్రియహితా విమలా శిరదేవవా
గకలుషాం సఫలాం చ చకార తామ్,
మధుర మార్తిహరం చ యథౌషధం
స హి భిషక్ సహి మన్త్రకృదగ్రణీః.

పరిహార న్నఘలేశ మపి స్వయం
హితకరే నిజకర్మణి నోదయన్,

త్రికరణేషు సమేషు సుహృద్గణః
సుకృతభాజ మసేవత రుద్రమామ్.

దినదినక్రమ వర్ధన శీలతా
గరిమయా ద్రవిణం ప్రవిభాస్వరమ్,
నతమహీపతయో జనతా చ య
త్కర మదు ర్విధివ న్నిజకామ్యయా.

హరిహరశ్చ మురారి మహీపతి
ర్య దభివీక్ష్య నితాన్త మసూయయా,
కలుషితౌ చకితౌ చ తథాఽభవత్
నిఖిలరాష్ట్ర మనస్త సమృద్ధిమత్.

పరిఖయాఽఽతతయాఽతిగభీరయా
పరివృతై ర్వరణైః కిల సప్తభిః,
సమధిగమ్య రిపువ్రజ దుర్గతాం
త దభవ త్పటుదుర్గ మహో భృశమ్.

స్ఫుర దమోఘ శితాయుధ వర్మభృ
త్పటు సముద్ధత శాత్రవ దుస్సహామ్,
రథగజాశ్వపదాతి భయఙ్కరం
శివకరం త దభూత్ సబలం బలమ్.

ప్రకృతి రఞ్జన శత్రు విభఞ్జనే
జనుషి పూర్వ మదర్శి తయా ను కిమ్ ?
యది న సా త్వబలా కథ మాన్తరాం
బహి రుపప్లుతిమిత్థ మహో తరేత్ ?

బాలవ్యాకరణము : పుట్టుపూర్వోత్తరాలు

శ్రీ నిడదవోలు వేంకటరావు

బాలభ్యాసకులకు ప్రథమాచార్యుడు, పండితులకు భట్టాచార్యుడూ అయిన పరవస్తు చిన్నయసూరి శతాబ్ది వర్ధంతి మూలముగా సన్నిహితుడగుచున్నాడు. సాహితీసుగతుని సూక్తులతో 'భారతి' చిన్నయసూరికి స్వాగత మిచ్చినది.

నూట మూడేండ్ల క్రిందట నవతరించిన బాలవ్యాకరణము యావదాంధ్ర పండితలోకమున ప్రామాణిక ప్రతిష్ఠ బడసినది. గ్రాంధిక భాషా సౌధమునకు మూల స్తంభాయమానమైన బాల వ్యాకరణము, వ్యావహారిక భాషావాదుల తీవ్ర విమర్శనకు గురియైనది. నిర్నిద్ర దీక్షతో, నిశితదృష్టితో, పదునారేండ్ల పై కాలము పరిశ్రమించి, సూరి యీ వ్యాకృతిని నాంధ్ర విద్వల్లోకమునకు సమర్పించినాడు. బాలవ్యాకరణమునకు బహుళప్రచారమున వ్యాఖ్యలున్నవి. బృహత్ వ్యాఖ్య యున్నది. అయిన లాభమేమి ? ఒకటియు నూటిగో సూరి హృదయము నెరుకపరుపజాలినవి కావు. అవైని విపరీతార్థముల నిచ్చునవి. సూరి చేసిన రీతిని భాషా పరిశ్రమ చేసిన గాని మన మాతని కృతికి వ్యాఖ్యానించుట కధికారముగాని, యర్హత గాని లేదేమో ? 'దిక్ప్రదర్శనంబు . . . . దెలిపితి . . . మహాజన వ్యవహారానుసారంబుగా నెరుంగునది అనుసూరి వాక్యములలోని గంభీరార్థమును అవగాహనము చేసుకొనలేనంత కాలము మన పరిస్థితి యిట్లే యుండును. అది ముందు చర్చింతును. ప్రస్తుతము పుట్టుపూర్వోత్తరములను గూర్చి కొన్ని యంశములు మాత్రమే నివేదింతును.

బాలవ్యాకరణము : ముద్రణ వివరాలు [1]

పరవస్తు చిన్నయసూరిగారి బాలవ్యాకరణ మెప్పుడు తొలిసారి ముద్రితమైనది ? తరువాతి ముద్రణముల వివరము లేమి ? అను జిజ్ఞాస పండిత లోకమునకు గలిగినది. నాకు తెలిసినంతవరకు వివరము లివి :

బాలవ్యాకరణము మొట్టమొదట క్రీ. శ. 1858 లో ప్రకటితమైనది. ఆ ప్రథమ ముద్రణ గ్రంధ ముఖపత్రము నీ క్రింద నిచ్చుచున్నాను.

బాల వ్యాకరణము.

పరవస్తు చిన్నయసూరి ప్రణీతము

ఇది

1858 వ సం. డిసెంబరు మాసము చెన్నపురమందలి హిందూముద్రాక్షరశాల యందు జ్ఞా. సరవప్పసెట్టి చేత ముద్రింపబడియె.

Copy Right

Chinniah Soory reserves him self the right or Translation.

ఈ ముద్రణ కాలమునకు సూరి జీవించి యుండిరి. కాని తరువాతి ముద్రణ కాలమునకు వారు దివంగతులైరి.

సూరిగారు పరమపదించిన వెనుక ననేక పర్యాయములు బాలవ్యాకరణము ముద్రితమైనది.

1867 రెండవ మూడవ ముద్రణము.
1871 నాల్గవ ముద్రణము.
1876 ఆరవ ముద్రణము.
1882 ఏడవ ముద్రణము.
1887 ఎనిమిదవ ముద్రణము.
తరువాత ముద్రణములను నేను చూడలేదు.

1900 వ సంవత్సరము ముద్రితమైన బాలవ్యాకరణమున నది పదునేడవ ముద్రణము అని వ్రాయబడి యున్నది.

1908 ముద్రణ మెన్నవదియో తెలియలేదు. కాని ముఖపత్రమున నిట్లు కలదు.

Balavvyakaranam by.

Paravastu Chinnaya Suri The greatest

Pandit of the 19th Cenctury.

Published by

Paravastu Alemelamma daughter in law of the author.

1 9 0 8

1911— పై అలమేలమ్మగారి పేరుతో ప్రకటితమైనది. ఆవెనుక వావిళ్లవారు పెక్కుసారులు దీనిని ముద్రించిరి.

మహారాష్ట్ర దేశమున భండార్కారు మహాశయుని First Book, Second Book of Sanskrit గ్రంథముల వలె, చిన్నయసూరి బాలవ్యాకరణ ముద్రణము రాజకీయ శాసనముచే సురక్షితము కావలసి యుండెను. కాని యట్లు

---

1. ఆంధ్ర విశ్వకళా పరిష దాంధ్రభాషా పండితులు శ్రీ దువ్వూరి వేంకటరమణశాస్త్రిగా రీ విషయమును తెలుపగోరి నాకు వ్రాసిరి. ఇంకను మరికొందరు నన్నడిగిరి. నా 'చిన్నయసూరి' జీవితమున దీనిగూర్చి కొంత తెలిపితిని. ఇప్పు డందులేని విషయములు మాత్రమే తెలుపుచున్నాను.

జరుగలేదు. అట్లు గాకపోయిన విశ్వవిద్యాలయ పక్షమునన్నైన సాధికారమ్మైన సప్రమాణ ముద్రణము వెలువడలేదు. వ్యాకరణ గ్రంథములయందు మన కెంత యాదరాభిమానము లున్నవో వ్యక్తము చేయుట కీ యొక్క విషయము చాలును.

పై ముద్రణములలో నొక పట్టున యతిభ్రంశము కానవగుచున్నది. కారకపరిచ్ఛేదము—19 సూత్రము. "విశేష్యమునకు బోలె విశేషణంబునకు లింగ విభక్తి వచనంబులగు. ఉదా. నంద తనయుండు కృష్ణుండు నాకు దిక్కు— దేవకీ పుత్రుహరిని నుతింతు నెపుడు—శుభవిధాయుల రామ కృష్ణుల భజింతు—భువనవంద్యను రుక్మిణి బ్రస్తుతింతు—"

ఇట్లు వచనముగా ముద్రితమై యున్నను నిది తేట గీతి పద్యము.

నందతనయుండు కృష్ణుండు—నాకు దిక్కు
దేవకీపుత్రు హరిని నుతింతు నెపుడు
శుభవిధాయుల రామకృష్ణుల భజింతు
భువనవంద్యను రుక్మిణి బ్రస్తుతించు.

నాల్గవ పాదమున యతి తప్పినది—ప్రాత ముద్రణముల నిట్లే కలదు.

ఆంధ్ర వ్యాకరణ సంహితాసర్వస్వమున 1066 పుటలో (కారక పరిచ్ఛేదము — విషయము 259) భువనవంద్యను రుక్మిణి బ్రస్తుతింతు - అను యతి భ్రంశ పాఠమే గలదు.

సుంకరి రంగయ్యగారి వ్యాఖ్యలోను, దూసివారి పేటికా వ్యాఖ్యలోను "భువనవంద్యను రుక్మిణి బొగడుచుందు" అను సరియగు పాఠము గలదు.

బాలవ్యాకరణము - పద్యానువాదము

బాలవ్యాకరణమునకు పద్యానువాదము నొకదానిని యిప్పటికి రమారమి యెనుబదియేండ్ల క్రిందట ఓరుగంటి సోమశేఖరకవి రచియించి యున్నాడు. పద్యానువాద మనగా చిన్నయసూరి సూత్రములను పద్యరూపముగా రచియించి నాడు. అందుండి యొక పద్యము నిట నుదాహరించుచున్నాను.

సీ. ప్రథమ యుగంబు యొక్క పట్టీతరంబులై
పరగు విభక్తి క ప్రత్యయములు
నల్ల నుత్తమ పురుషైక వచనములు
దద్ధర్మభూత ప్రథమ పరుషము
లేక వచనములు బ్రాకటా శిరర్థ
కములో నడుత వర్ణకముల నంత
రార్థక శత్రు తు విధ్యర్థ చే దర్థకం
బులు దాను నేనులు వలె ప్రభృతులు.
గీ. థరద్రుత ప్రకృతికములై తనరు మరియు
మిగిలినవి యెల్ల గళలన మెఱియుచుండు
గ్రమముతోడ నుదాహరణముల నిడుచు
బాలు రెద మెచ్చ గామేశ పండితార్య !

పై పద్యము సంజ్ఞా పరిచ్ఛేదము 12 వ సూత్రమున కను వాదము. గ్రంథకర్త ఓరుగంటి సోమశేఖర కవి—క్రీ. శ. 1818—1903 కాలమున విలసిల్లెను. ఈతడు బహు గ్రంథకర్త. పై బాలవ్యాకరణ పద్యానువాదము గ్రంథకర్త క్రీ. శ. 1882 ప్రాంతమున రచియించినట్లు తెలియు చున్నది. కృతిపతి కామేశ పండితుడు—కేవలము పండితుడు గాదు. కలియుగ దానకర్ణుడని ప్రఖ్యాతిగాంచిన న్యాయవాది. క్రీ. శ. 1846—86 యీావదాస్య శిరోమణి కాలము. తెలుగువారిలో మొదటి బి. ఎల్. పట్టణము పొందిన మనీషి. విద్యావినోది పనప్పాకము అనంతాచార్యులవారి సహాధ్యాయి; ప్రాణమిత్రము. గ్రంథము ముద్రితము.

వ్యాఖ్యలు

చెన్నపురిలో చిన్నయసూరికి ప్రథమమునుండి ప్రోత్సాహకులగు శ్రీ ఆనరెబుల్ గాజుల లక్ష్మీనరసింహులు శ్రేష్ఠి గారు, చిన్నయసూరి గతించిన వెనుక, బాలవ్యాకరణమునకు వ్యాఖ్య వ్రాయింప దలపుగొని, సూరిగారితో పచ్చయప్ప కళా శాలలో నాంధ్ర పండితులుగా పనిచేసిన వింజమూరి కృష్ణ మాచార్యులవారి నా పనికై నియోగించిరి. కాని వారు సూరి వెనుక మరి నాలుగేండ్లకే అనగా తే 15—10—1866 లోనే కీర్తిశేషులైరి. వా రెంతవరకు వ్యాఖ్య రచించినది తెలియుట లేదు.

ఆవెనుక శబ్దరత్నాకర నిఘంటు గ్రంథకర్తలగు సీతా రామాచార్యులవారు, బాల వ్యాకరణమునకు వ్యాఖ్య వ్రాయు టకు బదులుగా త్రిలింగలక్షణ శేషము అను ప్రౌఢ వ్యాకరణ మును రచించిరి. సీతారామాచార్యులవారి జీవితకాలము నిఘంటు రచనమునందే నియుక్తమగుటచేత వా రీ వ్యాఖ్య తలపెట్టి యుండరు. వారు తే 27—3—1891 ని కీర్తిశేషులైరి.

క్రీ. శ. 1908 లో "బాలవ్యాకరణ గుప్తార్థ ప్రకాశిక" అను పేర 176 పుటల గ్రంథమును సుంకరి రంగయ్య గారు ప్రకటించిరి. ఇందు కారక పరిచ్ఛేదము చివర, సమాస పరిచ్ఛేదమునాది కొన్ని పంక్తులు గలవు. మూలసూత్ర ములు తప్ప తక్కిన లక్ష్యములు చిన్న యక్షరములతో నీయ బడినది.

క్రీ. శ. 1915 శ్రీ కల్లూరి వేంకటరామశాస్త్రులు వారు ప్రకటించిన గుప్తార్థ ప్రకాశిక పండితలోకమున ప్రఖ్యాతి బడసినది. వాక్య వ్యాఖ్యాన సార్వభౌములని వేదము వారిచే పొగడ్తగన్న వేంకటరామశాస్త్రిగారు, శ్రీ వఝ్ఝల చినసీతారామస్వామిశాస్త్రిగారి విమర్శనమునకు గురియైరి.

క్రీ. శ. 1937 లో కీర్తిశేషులు దూసి రామమూర్తి శాస్త్రిగారి పేటిక—వెలువడినది.

క్రీ. శ. 1949 లో ప్రశస్త విద్వాంసులు బులుసు వేంకటరమణయ్యగారు సూత్రార్థములను వివరించిరి.

క్రీ. శ. 1951 "ఆంధ్ర వ్యాకరణ సంహితా సర్వస్వము" అను గ్రంథమున బాలవ్యాకరణమునకు బ్రహ్మాండమైన వ్యాఖ్యాన మొకటి గలదు. ఆ వ్యాఖ్యా విషయము లీవరకే పత్రికా ముఖమున సువిమృష్టములగుట నిందు ప్రత్యేకముగ తెలుపబడలేదు. ఈ గ్రంథమున "ఒక్కచో సూరి, గ్రాంథికభాష నుద్ధరించినాడని కైవారము, నిరాధారములైన సూత్రములు రచించినాడని, కొన్ని చెప్ప మరచినాడని వేరొక్కచో నింద."

క్రీ. శ. 1960 లో సంహితా సర్వస్వకర్తలు వెలయించిన బాలవ్యాకరణోద్ద్యోతము. ఇది 'రణోద్ద్యోతము' గాని వ్యాకరణోద్ద్యోతము గాదు—బాలవ్యాకరణోద్ద్యోతమనలేగాదు—బాలవ్యాకరణ ఖద్యోతము.

బాలవ్యాకరణము క్రీ. శ. 1858 లో ముద్రితమైనను నది పండితైకవేద్య మగుటచే, బడులలో క్రింది తరగతులకు పఠనీయ గ్రంథముగా చేయుటకు ననువు కాలేదు. క్రీ. శ. 1857 లో బాలవ్యాకరణమున కన్న ముందు ముద్రితమైన శేషయ్యశాస్త్రి వ్యాకరణము, ఆవెనుక వచ్చిన వెంకయ్యవ్యాకరణము, పఠనీయములుగా నుండెడివి. క్రీ. శ. 1887 బాలవ్యాకరణము ఎనిమిదవ ముద్రణము నాటికి పై రెండును, పది పండ్రెండు ముద్రణము లందినవన్న పీని ప్రచారము తెలియగలదు. తరువాత వీరేశలింగముగారి సంగ్రహ వ్యాకరణమును ప్రచారమున నుండెను. బాలవ్యాకరణ ప్రచారము 1900 నుండి హెచ్చుగా నుండెనని చెప్ప వచ్చును. మొదటి వ్యాఖ్య 1900 తరువాతనే యగుట పై విషయము స్పష్టము చేయుచున్నది.

చిన్నయసూరి బాలవ్యాకరణమున తనకు ముందున్న వైయాకరణులను కొందఱిను వాచ్యముగను, కొందఱిను వ్యంగ్యముగను సూచించియున్నాడు.

I 1. సంస్కృతీయమునకు సంధి యగునని యథర్వణాచార్యులు చెప్పిరి. (సంధి 4 సూ.)

2. "అప్పు డిప్పు డెప్పు డను శబ్దములు నిత్యైకవచనాంతములు; వాగనుశాసనులు యదాతదాయని గ్రహించుట ప్రపంచార్థమని యెరుగునది" (సంధి 13 సూ.)

పైవారిలో నథర్వణాచార్యుడు వికృతి వివేకమును రచించినవాడు. వాగనుశాసనుడు 'ఆంధ్రశబ్ద చింతామణి' కర్త నన్నయభట్టు. వీ రిరువురిలో నన్నయను ప్రథమాచార్యుడుగాను, నథర్వణుని ద్వితీయాచార్యునిగను పేర్కొనుట సంప్రదాయమే యైనను నిచ్చట ప్రథముని ద్వితీయునిగాను, ద్వితీయుని ప్రథమునిగాను పేర్కొనుట విశేషమేమో ?

II 1. "అనుకృతిని నిడుదకుం గురుచ యగునని యొకండు పలికె నది నిరాకరంబు. దుర్బలస్యబలం రాజా యన వినవే." సంధి. 54 సూ.

ఈ "ఒకండు" అప్పకవీయమును రచించిన అప్పకవి. ఆతడు గ్రంథాదిని.

క. సాతతహేతి పరిజన
వ్రాతంబుగ శేషశయను వనరుహనయనున్
ఖ్యాతిగ "న హరే స్తు పర
స్త్రాత" యనుట దెలిసి కృతి మొదట దలచివేసెన్.
(పీఠిక 17 ప.)

అని అనుకృతిని హ్రస్వము ప్రయోగించెను. ఇట్లు మొదటనే గాక 5—98 లో నిట్లు ప్రయోగమునకు సూత్రమె చేసియున్నాడు.

సీ. అనుకరించెడుచోట నవ్యయాదుల కొన
గల బొట్టు గవకు దీర్ఘంబులకును
వచ్చు లోపము కేశవాయ తుభ్యం నమ
యనగ రామోఘ సంహర్త యనగ.

హ్రదులయు నీలుగు లోనగువాని తొలి హల్లునకు లోపంబు బహుళంబుగ నగు.

పూను పొదవుల కాదిలోపం బొకండు వచియించె నది యవిచార మూలకంబు. (ప్రకీర్ణ 10 సూ.)

ఇచ్చట 'ఒకండు' ను అప్పకవియే. చూడుడు. అప్పకవీయము.

తే. గీ. పూనె నెగసె బొదివె బొనరె బొందె నటన్న
పలుకులందు మొదల గలుగునట్టి
వ్యంజనంబు లడగి వానిపై స్వరములు
నిలుచు వలసినపుడు నీరజాక్ష. (2 ఆ. 75 ప.)

2. సమాన పదంబునందు సంయోగంబు పరంబగునప్పు డెల్లచో ఖండబిందువునకుం బూర్ణం బగు. అనటులు—అనట్లు . . . . ఏడులు—ఏండ్లు — కాడులు—కాండ్లు. ఏండ్లు—కాండ్లిత్యాదులందు డాకు 'ఖా' దేశంబు కొందరు వక్కాణించిరి. తెనుగున బిందుపూర్వక స్థిరంబు లేమింజేసి యది గ్రాహ్యంబు గాదు. (అచ్చిక. 15 సూ.)

'డాకు ఖా దేశంబు వక్కాణించినది' చిన్నయసూరికి ముందు పోర్టుసెంటు జార్జి కళాశాలలో ప్రధాన పండితుడైన రావిపాటి గురుమూర్తిశాస్త్రి ఈతడు రచించిన తెనుగు వ్యాకరణము క్రీ. శ. 1836 లో ననగా బాల వ్యాకరణమునకు నిరువది రెండేండ్లు ముందుగా నచ్చయినది.

ఆ తెనుగు వ్యాకరణము—విశేష్య ప్రకరణము 131 విషయమున డ డు వర్ణములకు పూర్వముగా బిందువు ఉంటే డ కారమునకు ళ కారము వికల్పముగా వచ్చును, ఉ—డు వర్ణములకు పూర్వము నందున్న అరసున్న విండుసున్న యవును. ఉదా— గుండు—గుండులు—గుండ్లు—గుంళ్లు, కాడి—కాడులు—కాండ్లు— కాంళ్లు. ఇట్లే 133 విషయమున పెండ్లిండ్లు—పెంళ్లింళ్లు" అని రెండేసి రూపములు వచ్చునని తెలుప బడినది.

ఈ గురుమూర్తిశాస్త్రి వ్యాకరణమును చిన్నయసూరి రాజధాని హైస్కూలు (ఇదియే తరువాత రాజధాని కళాశాలగా మారినది) లో పాఠము చెప్పియున్నాడు.[2]

ఈ వ్యాకరణము క్రీ. శ. 1951 లో వావిళ్లవారిచే నా పీఠికతో ముద్రితము. ఇందు క్రియాప్రకరణమున నున్నంత విపులముగా సంస్కృతాంధ్ర క్రియారూప నిష్పత్తి మఱి యే వ్యాకరణ గ్రంథమునను లేదు. 74 పుటలలో వ్యావహారిక రూపములతో కూడ, వివరణ పట్టికలతో నున్న యీ ప్రకరణము బాలవ్యాకరణమున క్రియా పరిచ్ఛేదమునకు మూలమైనది.

బాలవ్యాకరణము క్రియా పరిచ్ఛేదము సూత్రము 6 వ. "లిఖభుజ రుచ కృశంబులకు గుణంబు లేదు. లిఖించు—భుజించు, రుచించు, కృశించు—కుచ ధాతువునకు గుణంబు లేదని యొకండు వక్కాణించె. నది గ్రాహ్యంబుగాదు. గుణము లేకుండ, సంపూర్వక కుచధాతువునకు ప్రయోగము. సంకుసాల నృసింహకవి రచిత కవికర్ణరసాయనమునం దున్నది.

ఎ. గీ. సుందరత్వమునకు జోటిచ్చి తా సంకు
చించెనన గడు గృశించె నడుము (1.56)

సూరి పేర్కొనకపోయినను బాలవ్యాకరణమున నీ క్రింది విషయములు, సూరికి ముందున్న వైయాకరణులనుండి గ్రహించెనని స్పష్టముగా నిరూపింపవచ్చును.

త్రివర్ణకార్థంబునం దెడి యెడు వన్నియలగు (క్రియా. 44 సూ.) ఇందు[3] వర్ణకములు అనుటకు "వన్నియలు" అని వాడబడినది. మొదటినుండి యన్ని ముద్రణ ప్రతులయందిట్లే యుండుటచేత, సూరి "వన్నియలు" అని వాడెననుట స్పష్టము.

వర్ణకములకు వన్నియలు—వన్నెలు—అని వాడుక చేసినది వేదము పట్టాభిరామశాస్త్రిగారు. వీరి కాలము (క్రీ. శ. 1770—1820) వీరు ఫోర్టు సెంటు జార్జి కళాశాలయందు ప్రథమమునుండి అనగా 1812 నుండి 1820 వరకును తెలుగు పండితులు. వీరు నన్నయభట్టీయమని చెప్పబడు ఆంధ్రశబ్ద చింతామణికి "పట్టాభిరామ పండితీయము" అను వ్యాఖ్యయు, "సంగ్రహ వ్యాకరణము" అను సూత్రాంధ్ర వ్యాకరణమును, "పట్టాభిరామ పండితీయము" అను నన్నయభట్టీయ పద్యానువాదమును నన్నింటికన్న మిన్నగ నేడు చిన్నయసూరి రచనగా ప్రకటితమై ప్రచారమున నున్న "ఆంధ్ర ధాతుమాల" ను రచించిరి. వీరు క్రీ. శ 1820 లో చనిపోవుటచేత పై గ్రంథము లన్నియు నంతకు ముందున్నవనుట నిర్వివాదము. ప్రస్తుతమునకు కావలసినది వన్నియలు. "పట్టాభిరామ పండితీయము" అను పద్య వ్యాకరణమున వర్ణకమునకు వన్నియలని ప్రయుక్తమైనది. చూడుడు:

"శా. ఆద్య ప్రాకృతసిద్ధ నామములపై
యావన్నెలం ద్రోసి యా
స్వాద్యంబైన తెలుంగు వన్నియలురా. (23 పద్యము.)
సీ. డు ము వులు నా వర్ణకములు మొదటి వన్నియలు."
(107 పద్యము)

ఇట్లు బహువచనమునందే కాక యేకవచనమున, వన్నియ (115 ప), వన్నె (115) అని కూడ నందు[4] ప్రయుక్తమై యున్నది.

ఈ సూత్రముననే కాక, మరియొక పట్టున, లక్ష్య లక్షణముల సూరి యథామాతృకముగా పట్టాభిరామ పండితీయము ననుసరించి యున్నాడు.

—(సశేషం.)

---

2. Report of the High School of the Madras University. (1840—1857) P. 90.

3. ఆంధ్ర సాహిత్య పరిషత్ప్రకటితము. ఈ గ్రంథము చిన్నయసూరి కృతము కాదని, పట్టాభిరామశాస్త్రి గారి రచనమని సప్రమాణముగ నా "చిన్నయసూరి జీవితము" న నిరూపించితిని. చూడుడు పుటలు.

4. ఈ పట్టాభిరామ పండితీయమును మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము ది. 1246 సంఖ్య బ్రౌను దొరవారి సేకరణల నుండి ప్రతి వ్రాయించి వావిళ్ల వారు క్రీ. శ. 1951 లో ముద్రించిరి.

కేయూరబాహు చరిత్రము

శ్రీ బులుసు వేంకటరమణయ్య

తెలుగులో వెలసిన ప్రాచీన పద్యకృతులలో కేయూర బాహుచరిత్ర ఒకటి. దీనిని రచించిన మంచనకవి ఆశ్వాసాంత గద్యలలో "ఇది సకలసుకవిజన విధేయ మంచన నామధేయప్రణీతంబైన కేయూరబాహు చరిత్రంబు నందు—" అని మాత్రమే చెప్పెను గాని, తన రచన కావ్యమని కాని, ప్రబంధమని కాని చెప్పలేదు. కాని, ఇది ప్రబంధముగానే చెప్పబడుచున్నది.

ఈ గ్రంథమును కవి తనమిత్రుడును, వెలనాటి పృథ్వీశ్వరుని మంత్రి యగు కేతనకు మనుమడును అగు నండూరి గుండమంత్రికి కృతి యొసగెను. కావున ఇతడు క్రీ. శ. 1300 ప్రాంతమున ఉండి యుండునని యూహింప వచ్చునని శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు వ్రాయుచున్నారు. ఇటీవల వెలువడిన తెలుగు విజ్ఞాన సర్వస్వము 'తెలుగు సంస్కృతి' సంపుటములో ఈ మంచనకవి యుదంతమే కానరాదు.

కేయూరబాహు చరిత్రము నాల్గాశ్వాసముల గ్రంథము. కళింగదేశములోని త్రిపురీనగరమును పాలించు కేయూర బాహువను రాజు వృత్తాంత మిందు వర్ణింపబడినది. ఈ కథ చాలా చమత్కారమైనది. ఇది, సంస్కృతములో రాజశేఖర మహాకవి రచించిన విద్ధశాలభంజిక అను నాటికను అనుసరించి వ్రాయబడినది. తెలుగుభాషలో మొదటినుండియు అనువాదములే కూర్పబడు చున్నను దృశ్యకావ్యము ననుసరించి వ్రాయబడిన పద్యకృతులలో ఇదియే మొదటిదని చెప్పవలెను. నంది మల్లయ్య, ఘంట సింగయ్యలు వ్రాసిన ప్రబోధచంద్రోదయము, పిల్లలమర్రి పినవీరభద్రకవి వ్రాసిన శృంగారశాకుంతలమును దీని తర్వాతివే! మంచన కవి కృతి విద్ధశాలభంజికను అనుసరించి వ్రాయబడినను, ఆ విషయమును కవి పేర్కొనలేదు.

కృతిపతి యగు గుండన మంత్రి :

"క. స్థాయి రసము శృంగారం
బై యలవడఁ గథలు నీతులై యెడనెడ రా
గేయూరబాహు చరితము
సేయుము నీ వాంధ్ర భాష శిల్పము మెరయన్."

అని తన్ను కోరినట్లు మంచన కవి చెప్పినాడు. కాని, తానే గ్రంథమునుండి ఆ కథను గ్రహించినదియు చెప్పలేదు. చెప్పకున్నను, కథ రాజశేఖర కవి మూలము నుండియే గ్రహింపబడినదని గ్రంథద్వయమును పరికించినవారికి తెలియకపోదు.

కేయూరబాహు చరిత్రలోని కథాంశ మిది—

త్రిపురీ నగరము రాజధానిగా కళింగ దేశమును కేయూరబాహు వను రాజు పాలించు చుండెను. అతని రాణి రత్నసుందరి. చంద్రగుప్తునికి చాణక్యుని వలెను, వత్సరాజునకు యుగంధరుని (యౌగంధరాయణుడని అభిప్రాయమేమో!) వలెను, ఆ రాజునకు భాగురాయణుడను సచివోత్తముం డుండి, రాజ్యకార్యములను సామర్థ్యముతో నెరవేర్చు చుండగా, కేయూరబాహుడు సుఖలాలసుడై రాత్రిం దివములు రత్నసుందరితోనే వినోదించుచు కాలము గడుపు చుండెను. తన ప్రభువు మనస్సును మళ్లించి అతనిని రాజ్య కార్యోన్ముఖునిగా చేయుటకు తగిన యుపాయమును భాగురాయణుడు ఆలోచించుచుండెను.

ఆ సమయమున లాటదేశమునకు చండవర్మ ప్రభువు. అతని భార్య సుధామాదేవి. ఆ దంపతులకు లేకలేక ఒక ఆడు బిడ్డ కలిగినది. వంశాంకురమగు మగశిశువు కలుగనందుకు ఆ రాజు మిక్కిలి విచారించెను. అంతేకాక రాజ్యమునకు ఉత్తరాధికారి లేనందున ఇరుగు పొరుగు రాజులకును, ప్రజలకును కూడ చులకదనము, తన్మూలమున చిక్కులు ఏర్పడును. మహారాష్ట్రాధిపతి యగు పరిఘబాహుడు లాటదేశ ముపై పడుటకు సమయమును ప్రతీక్షించుచున్నాడు. ఈ విషయములను ఆలోచించి చండవర్మ తన పుత్రిక యగు మృగాంకావళికి పురుషవేషము వేయించి, మృగాంక వర్మ అను పేరు పెట్టి ఈ యంశము ప్రజలకు తెలియ కుండునట్లు తగిన జాగ్రత వహించెను. ఈ రహస్యము రాజునకు, రాణికి, దాదికిని తప్ప ఇతరులకు తెలియదు. ఒకప్పు డొక ముని మృగాంకావళిని చూచి "ఈమెను వరించినవాడు చక్రవర్తి అగు" నని రహస్యముగా రాజునకు తెలిపెను.

ఈ లాటదేశ వృత్తాంతమును ధీమంతుడగు మతిమంతుడను చారుడు భాగురాయణునికి తెలిపెను. భాగురాయణుడు కుశాగ్రబుద్ధియును, తనకు మేనల్లుడును అగు సోమదత్తునకు ఈ వృత్తాంతమును తెలిపి, అతని ఆలోచనను వినగోరెను. "మృగాంకావళిని వివాహ మాడినవాడు సార్వభౌము డగునని కదా ముని చెప్పెను. ఆమెను తెచ్చి ఎట్లయిన మన ప్రభువులకు వివాహము చేయుట మేలు. ప్రభువు

ప్రస్తుతము రత్నసుందరీ వ్యామోహమున ఉన్నాడు. ఈ వివాహమున ఆ వ్యామోహము తగ్గి మన రాజు రాజ్య వ్యవహారము లందు పాల్గొనుటకు అవకాశము కలదు" అని సోమదత్తుడు అనెను.

సుధామదేవి రత్నసుందరి తల్లికి తోబుట్టువు. కావున ప్రస్తుతము క్లిష్ట పరిస్థితులలో ఉన్న లాటదేశపురాజు తన పుత్రికను సురక్షితస్థలములో ఉంచుటయే శ్రేయమని తలచి, భాగురాయణుడు కోరినట్లు పురుషవేషమున నున్న యా బాలికను త్రిపురీ నగరికి పంపెను. భాగురాయణుడు ఆ బాలికను తన యింటనే ఉంచి, లాటదేశాధిపతి తన కుమారుని పంపెననియు, అతడు తన యింట సురక్షితముగా ఉన్నాడనియు రాణికి తెలియజేసెను.

తాను తలచినకార్యమును సాధించుటకై భాగురాయణుడు మహారాణి చెలికత్తెలలో ఒకతె అగు కళావతిని లొంగదీసికొనెను. అంతేకాక మహారాజు శయనించుటకు సుషిర కుడ్య స్తంభయంత్రనిర్మితమగు మందిరమును కట్టించెను. సమయమును చూచి ఆ మందిరమున మృగాంకావళిని ప్రవేశపెట్టవలెనని అతని సంకల్పము.

మేఖల అనునది మహారాణికి ప్రియసఖి. ఆమెకును రాజుగారి వేడుక చెలికాడు చారాయణునకును కలహము సంభవించెను. భాగురాయణుని ప్రోత్సాహమున కళావతి వా రిద్దరికిని మైత్రి కలిగించెను. మేఖలను అవమానించుటకు తగిన ఉపాయమును కళావతి చూపినందుననే చారాయణుడు మేఖలతోడి స్నేహమునకు సమ్మతించెను. ఇట్లు మైత్రి నటించి, ఒక దానికి మగవేషమును వేయించి, దానితో మేఖలకు వివాహము చేయించెను. పెండ్లి జరిగిన తర్వాత గాని మేఖల కీ మోసము తెలియలేదు. తర్వాత అది దుఃఖించి, తన అవమానమును గూర్చి రాణికి తెలిపెను. రత్నసుందరికి చారాయణునిపై విపరీతపు కోపము కలిగెను. అతనికి ఇట్టి మోసము చేయు తెలివితేటలు లేవనియు, దీని కంతకును రాజే కారణమనియు ఊహించి ఆమె అలిగి రాజు వద్దకు పోవుటయే మానెను. ఈ యంశమును కళావతి భాగురాయణునకు తెలిపెను. ప్రభువు కొంతకాలము రత్న సుందరీదేవికి దూరముగా ఉండవలెనని కోరుచున్న మంత్రి కిది ఎంతో ఆనందమును కూర్చెను. ఈ సమయమునందే రాజు కంట మృగాంకావళి పడునట్లు చేయవలెనని అతని సంకల్పము.

తర్వాత భాగురాయణుడు అనుకొన్నట్లే జరిగెను. ఆ మృగాంకావళి రాజు శయన మందిరమున స్వప్నావస్థలో వలె ఒకసారి కేయూరబాహువునకు కనబడి తన మెడలోని ముక్తాహారము నాతని కంఠమునందు వేసి కుడ్యములో ప్రవేశించెను. రాజునకు ఆమె యెడల మోహ మధిక మయ్యెను. మృగాంకావళియును అతనియెడ గల గాఢానురాగమున విరహమునకు గురి అయ్యెను.

పిదప కళావతి భాగురాయణుని ప్రోత్సాహమున రాణి వద్దకు పోయెను. రాణి యింకను అలుకతోనే ఉండెను. కళావతి రాణితో యిట్లు పలికెను— "అమ్మా ! మన మేఖలను మోసగించిన విదూషకుని పట్ల వారు మోసము చేయ వలెను గదా ! దీనికి కారణము ప్రభువులే కావున—ఆయనకును ఆశ్చర్యము కలుగునట్లు వినోదముగ ఒక కపట నాటకమును ఆడింతము. నా మనవిని చిత్తగింపుడు. మన భాగురాయణుని ఇంటిలో మృగాంకవర్మ ఉన్నాడు కదా ! అతనికి ఆడువేషము వేయించి "మృగాంకావళి" అని పేరు పెట్టుదము. స్త్రీ వేషము వేసికొన్నచో మృగాంకవర్మ లోకోత్తర సౌందర్యము కల్గి వెలయును. "ఈమె నాకు సోదరి, మృగాంకవర్మ చెల్లెలు. తగిన వరున కిచ్చి వివాహము చేయవలెనని కోరుచు, మా పినతల్లి నా వద్దకు పంపినది. ఈమెను వివాహమాడిన భాగ్యశాలి చక్రవర్తి యగునని ఒక మహాముని చెప్పెను. ఈ బాలికను మీరు వివాహ మాడవలెనని నా కోరిక. మీ రీ బాలికను పెండ్లాడి చక్రవర్తు లగుదురు. అపుడు సార్వభౌముని అగ్రమహిషిగా నగు భాగ్యము నాకును లభించును" అని ఆ వేషధారిని గూర్చి మీరు ప్రభువులకు మనవి చేసినయెడల, మీయెడల గల నమ్మిక కొలది ఆయన తప్పక ఈ వివాహమునకు సమ్మతించును. నడుమ ఎట్టి అంతరాయములు కలుగకుండ దీనిని వేవేగమే జరిగింపవలెను. వివాహానంతరము మోసము బయటపడును. దీనివలన చారాయణుడు తలఎత్తుకొనకుండ చేయవచ్చును. ప్రభువులకు బెదరు కలిగించినట్లును అగును."

కళావతి మాటలు రత్నసుందరికి నచ్చినవి. ఈ రీతినే జరిపినయెడల తన భర్త చేసిన మోసమునకు సమాధానమిచ్చినట్లు అగునని ఆమె మనస్సులో మిక్కిలి సంతోషించి ఈ కార్యమును నిర్వహించు బాధ్యతను కళావతికే విడిచిపెట్టెను. మృగాంకావళి యెడ గాఢానురాగము కల రాజు రత్నసుందరి కోరిక మేరకు మృగాంకావళిని వివాహ మాడుటకు సమ్మతించెను. పిదప వివాహపు తంతు సక్రమముగా జరిగెను.

తర్వాత భాగురాయణుడు లేఖాహస్తుడగు ఒక సేవకుని వెంట బెట్టుకొని రత్నసుందరి యున్న మందిరమునకు వచ్చి, ఆమె యనుమతిని సేవకునితో కూడ లోన ప్రవేశించెను. ఆ లేఖ లాటదేశాధిపతి చండవర్మదేవి యగు సుధామదేవి రత్నసుందరికి వ్రాసినది, అందిట్లున్నది— "అమ్మాయీ ! రత్నసుందరీ ! నీకు ఒక చిట్టి తమ్ముడు కలిగెనని తెలుపుటకు సంతస మగుచున్నది. ఇంతవరకును మీ యింట నున్న మృగాంకవర్మ నీకు చెల్లెలు కాని, తమ్ముడు కాడు. మాకు మగబిడ్డలు లేనందున పుత్రికయగు మృగాంకావళికి పురుష వేషము వేసి మృగాంకవర్మ అను పేర

పుత్రుని పలెనే చూచుకొనుచున్నాము. ఆ నీ చెల్లెలిని వివాహమైన పురుషుడు చక్రవర్తి అగును! కావున నీవు మృగాంకావళిని తగిన వరున కిచ్చి పెండ్లి చేయవలెనని మా కోరిక.''

ఈ జాబు చదువుకొనిన రత్నసుందరి వెలవెలపోయెను. ఆమెకు మూర్ఛ వచ్చుచున్నట్లుండెను. కాని, ఆమె ధైర్యము తెచ్చుకొని ఎట్లో నిలిచెను. అక్కడివా రందరు మిక్కిలి ఆశ్చర్యపడిరి. 'తా నొకటి తలచిన దైవ మొకటి తలచె' ననియు, విధికృతమును తప్పింప వశము కాదనియు తలచి, ఆమె ''మృగాంకావళిని ఇదివరకే తగిన వరునకు ఇచ్చి వివాహము చేయించితి'' నని చిరునవ్వులో సమాధాన మొసగెను. పిదప కేయూరబాహుడు రత్నసుందరీ మృగాంకావళులతో వినోదముగా కాలము గడపుచు, ప్రజారంజకముగ రాజ్యమును పాలింపసాగెను.

ఈ ప్రధాన కథకు అనుబంధములుగా ఆయా సందర్భముల కనుకూలముగా ఇరువదిరెండు నీతి కథలు ఈ గ్రంథములో కూర్చబడినవి. వానిలో ద్వితీయాశ్వాసమున ఏడు కథలును, తృతీయాశ్వాసమున పండ్రెండు కథలును, చతుర్థాశ్వాసములో మూడును కలవు. వానిలో చాలవరకును పంచతంత్ర, హితోపదేశముల లోనివే!

మూల ప్రశస్తి

కేయూరబాహుచరిత్రకు మూలమగు విద్ధశాలభంజికను రచించిన రాజశేఖర కవి క్రీ. శ. 880—920 నడుమ నుండెను. అది నాల్గంకములు కల నాటిక. ఇందలి కథ మహారాజాధిరాజగు శ్రీహర్షుడు రచించిన రత్నావళీ నాటికను అనుసరించినదే! అందు శ్రీహర్షుడు తన్ను గూర్చి ''శ్రీహర్షో నిపుణః కవిః'' అని చెప్పినట్లు రాజశేఖరుడును ఇందు ''తద్ భ్రాతః శృణు రాజశేఖరకవేః సూక్తీః సుధా నన్దినీః'' తన్ను గూర్చి చెప్పినాడు.

దీనిలోని చక్కని శ్లోకములు అలంకారికులచే తమ గ్రంథములందు ఉదాహరణములుగా స్వీకరింపబడినవి. అట్టి వానిలో అప్పయ దీక్షితులు తమ కువలయానందములో ఉదహరించిన

''దృశా దగ్ధం మనసిజం
జీవయన్తి దృశైవయాః,
విరూపాక్షస్య జయినీ
స్తాః స్తువే వామలోచనాః.'' (అం. 1 ప 2)

అనునది ఒకటి.

''రుదతు—రుదతు—కిమస్యా మౌక్తికాని గళిష్యన్తి (పుట 72)''(ఏడవనీ—ఆమె కళ్లనుండి ముత్యాలు రాలవులే) అనునట్టి చక్కని జాతీయములు కూడ ఇందు కలవు. ఇది తెలుగువారి సామెతకు చాలా సన్నిహితమైనది.

విద్ధశాలభంజికను కలకత్తాలో శ్రీ జీవానంద విద్యాసాగరులు స్వరచితమగు లఘుటీకతో కూడ ప్రకటించిరి. 1883 వ సంవత్సరంలో సరస్వతీ ముద్రాలయములో ముద్రించబడిన ప్రతి మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారములో ఉన్నది. తర్వాత ఇది ముద్రించ బడినట్లు కానరాదు. పయి ముద్రిత ప్రతి అయినను చాల అరుదుగా లభించవలసినదే! ఈ మూలమును పరిశీలింపగా, విద్ధశాలభంజికలోని కథకును, కేయూరబాహు చరిత్రములోని కథకును కొన్ని భేదములు కానవచ్చుచున్నవి.

విద్ధశాలభంజికలోని కథయు, మంచన కథయు ఇంచుమించుగ సమానముగనే ఉన్నవి. నడుమ వచ్చిన కథలను మాత్రము మంచన, కృతిపతియగు గుండన మంత్రి కోరికపయి చేర్చెనే కాని, మూలమున లేవు. చారాయణుడు మేఖలను మోసగింపగా, దానికి ప్రతిగా రాణి, కేయూరబాహు మహారాజును మోసగింప జూచినట్లు మంచన కవి కథలో ఉన్నది. ఆమె యత్నము తుదకు వ్యర్థమైపోయినది కాని ఫలింపనేలేదు. ఇక చారాయణుని మోసగించు యత్నమే కానరాదు! మూలములో మాత్రము రత్నసుందరి ప్రోత్సాహమున మేఖల చారాయణుని మోసగించిన వృత్తాంతము గలదు. శశశృంగునియొక్కయు, మృగతృష్ణ యొక్కయు కుమార్తె అగు అంబరమాలను చారాయణున కిచ్చి ద్వితీయ వివాహము చేయుటకు నిశ్చయించితిమని ఒప్పించి, రాణి ఒక చేటునకు స్త్రీ వేషము వేయించి పెండ్లి తంతు నడపెను. ఇట్లు చేసి, చారాయణుడు చేసిన మోసమునకు తిరుగు చేసెను. అంతతో కూడ ఆమె సంతుష్టి చెందలేదు. ఆమె రాజునే మోసగించ దలచెను. చారాయణుని రెండవ పెండ్లి వృత్తాంతము కథకు మెరుగు పెట్టుచున్నది. ఈ యంశమును మంచనకవి ఏల విడిచెనో తెలియదు.

మూలములోని నాయకుని పేరు విద్యాధర మల్లుడు. రాజధాని ఉజ్జయిని నగరము. మంచన నాయకుని పేరిని, రాజ్యమును, రాజధానిని కూడ మార్చెను. చండవర్మ త్రిలింగ దేశమునకు ప్రభు వనియు, అతని భార్య హారలత అనియు, ఆ రాజు రత్నసుందరికి మేనమామ అనియు, మృగాంకావళి చెలికత్తె పేరు విచక్షణ అనియు మూలములో ఉన్నది.

తెలుగు దేశమునకు ''త్రిలింగ'' దేశమను పేరు ప్రసిద్ధము కదా! ఈ పేరీ దేశమునకు ఎప్పుడు వచ్చినదియు ఇదమిత్థమని తెలియకున్నది. కాని క్రీ. శ. పదునాల్గవ శతాబ్దిలో ఓరుగంటి రాజ్య పాలకుడగు ద్వితీయ ప్రతాపరుద్రుని ఆస్థాన విద్వత్కవి విద్యానాథ పండితుడు 'త్రిలింగదేశము' గా

తెలుగు దేశమును పేర్కొనెను. 'అంతకుపూర్వ మీ దేశమునకు త్రిలింగమను పేరు ఉండినట్లు వాఙ్మయములో గాని, శాసనములలో గాని ఎందును కానరాదు' అని విజ్ఞాన సర్వస్వము—తెలుగు సంస్కృతి సంపుటము (ప్రకాశకులు—తెలుగుభాషాసమితి, యూనివర్శిటీ భవనములు, మద్రాసు—5) లో కానవచ్చుచున్నది. కాని క్రీ. శ. తొమ్మిదవ శతాబ్ది చరమభాగము నాటికే త్రిలింగదేశము ప్రసిద్ధమయి ఉండినట్లు విద్ధశాలభంజిక వలన స్పష్టమగుచునే ఉన్నది. మంచన కవి తన కేయూరబాహు చరిత్రమునందు, చండవర్మ త్రిలింగ దేశమునకు ప్రభువని చెప్పుటను మాని లాట దేశమునకు అధిపతి అని ఏల చెప్పెనో, త్రిలింగ ప్రస్తావనను ఏల విడిచిపెట్టెనో యూహింపరాకున్నది.కళింగదేశము యొక్క ఇరుగు పొరుగు దేశములలోనిదే త్రిలింగము! అందువలననే ఆ రెండు దేశముల పాలకులకును బాంధవ్యము కలుగుట సులభము. కాని, కళింగ దేశీయులకు లాటదేశీయులతోడి బంధుత్వము సుదూరము. పై విషయములను అన్నింటిని పరికించినచో విద్ధశాల భంజికలోని కథాసరిణియే సమంజసమయి ఉన్నట్లు చెప్ప వలసియున్నది.

ముద్రిత ప్రతులు

ఈ కేయూరబాహు చరిత్రమును తొలిసారిగా 1902-వ సంవత్సరమున సరస్వతీ పత్రికాధిపతులగు శ్రీ పోలవరం జమీందారుగారు శతావధానులు శ్రీ తిరుపతి వేంకటకవులచే పరిష్కరింపజేసి ప్రకటించిరి. ఈ నడుమ శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు ప్రకటించువరకును దీనికి ద్వితీయ ముద్రణ భాగ్యము పొందు అవకాశము లేకపోయినది. తొలి ముద్రణపు ప్రతు లయినను ఎక్కడనో కొన్ని గ్రంథాలయములలో తప్ప, చూచుటకు కూడ లభ్యము కావు. సుప్రసిద్ధమగు చెన్నపురి ప్రాచ్య లిఖిత పుస్తకభాండాగారమునకు పోయి మూడు నాలుగు సారులు ప్రయత్నింపగా "ఆ పుస్తకము నెవ్వరో చదువుటకు తీసికొనిపోయిరి" అనియే—పోయినపుడెల్ల సమాధానము వచ్చుచున్నది. నూతన ముద్రణము వెలువడిన పిదపనే ఈ గ్రంథమును చూచు అవకాశము కలిగినది. ఇందులకై ఆంధ్రు లందరును శ్రీ కోదండరామయ్యగారికి కృతజ్ఞులయి ఉండవలసి యున్నది. శ్రీ కోదండరామయ్యగారు దీని 'పీఠిక' లో గ్రంథ ప్రాశస్త్యమును గురించియు, గ్రంథ విషయమును, కవిని గురించియు సంగ్రహముగా తెలిపియున్నారు. "తిక్కన కించుక తరువాతివాడగు నీ ప్రాచీన కవీశ్వరుని మేలి గ్రంథము లభింపక పోవుట మిక్కిలి శోచనీయమని భావించి యెట్లో దీని యచ్చు ప్రతి నొకదానిని సంపాదించి నిర్దుష్టముగా జక్కని పాఠములతో బరిష్కరించి యిట్లు ప్రకటించుచుంటిని. పూర్వ ముద్రణములోని పెక్కు దోషము లిందు సవరింపబడినవి" అని శ్రీ కోదండరామయ్యగారు చెప్పిన విషయమును బట్టి ఏ తద్గ్రంథప్రకటనమున ఆయనకు గల ఆసక్తి వెల్లడి యగుచున్నది.

సుపరిష్కృతమైన ఈ నూతన ముద్రణము అన్ని విధముల మేలయి ఉన్నది. కాని కొన్ని పద్యములలో సమన్వయము సరిపడకున్నది. ఈ యంశమును పరిష్కర్తలే 'ఇంకను కొన్ని పద్యములర్థము కుదురక చిక్కు గొలుపుచు సంస్కారాపేక్షములై నిలిచిపోయినవి కలవు' అని తెలిపి యున్నారు. సుప్రసిద్ధ విద్వత్కవివతంసులు, కీర్తికాయులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు సాధు పాఠములతో దీనికి చక్కని ప్రతిని ముద్రణమునకై తయారుచేసి ఉంచిరని వినికిడి. దానిని వారి కుమారులు ముద్రించిన ఎంతో మేలగును.

విశేషములు

ముద్రిత ప్రతిని బట్టి చూచిన సంస్కరణాపేక్షము లగు భాగములు కొన్ని స్థూల దృష్టికే కానవచ్చుచున్నవి. ఇందు ప్రథమాశ్వాసము చివరను, ద్వితీయాశ్వాసము చివరను కృతిపతిని ప్రశంసించు మూడేసి పద్యములు ద్వితీయా విభక్త్యంతములుగా ఉన్నవి. అట్లే ద్వితీయ, తృతీయాశ్వాసముల తొలి పద్యములును ద్వితీయాంతములుగా ఉన్నవి. తక్కిన పద్యములతో వీనికి సమన్వయము కుదురకున్నది. ఇట్లే తృతీయాశ్వాసము చివరి మూడు పద్యములు, చతుర్థాశ్వాసములోని తొలిపద్యము ప్రథమాంతములుగా ఉన్నవి. వానికిని తక్కిన వానితో అన్వయము కుదురదు. ఇట్టి యెడల

"పురుషతను సుమేరున్ పోలమాంబా కుమారున్" అను దానిని "పురుషతను సుమేరూ! పోలమాంబా కుమారా!" అనియు,

"యశ, స్తారకితదశాశు గుండ దండాధీశున్" అనుదానిని

"యశ, స్తారకితదాశాశ! గుండదండాధీశా!" అని యును సవరించుకొనవలసియున్నది. ఇట్లే ప్రథమాంతములుగా ఉన్న వానిని సంబోధనప్రథమాంతములుగా మార్చుకొనవలెను. అప్పుడే సమన్వయము కుదురును.

చతుర్థాశ్వాసములో 7-వ సంఖ్య గల సీసపద్యపు మూడవ పాదమును

"ఈ వాక్కు తెఱచి యే మేనియు బలికిన
మృదుభాష లెట్టివై మెరయు నొక్కొ!"

అను దానికి బదులుగా

"ఈ వాయి తెఱచి యేమేనియుఁ బలికిన
మృదుభాష లెట్టివై మెఱయు నొక్కొ."

అని 'వాక్కు' ను 'వాయి' గా మార్చుకొనవలసి యున్నది.

అందే 26-వ పద్యమున (సీస పద్యపు వెత్తు గీతి)
'వెలరు వాఱుచు గృహదీపవితతి యొప్పె
విరులపై నళులు గోరంట విరుల దొరయ (?)
నలినములు కుముదముల నవ్వ నలుదెసలను (?)
జాల బెరయంగు బ్రత్యూష వేళయయ్యె.'

అని ఛందోభంగమును సూచించు ప్రశ్నార్థక చిహ్నములతో కూడ ముద్రించబడి ఉన్నది. చిన్న మార్పులతో ఆ దోషములను నివారింపవచ్చు.

" . . . .
విరులపై నళి గోరంట విరుల దొరయ
నళినములు కలువల నవ్వ నలుదెసలను
. . . ."

అని సవరించినయెడల మేలగునని తోచుచున్నది. మూడవ పాదములో 'కలువల' అనుటకు బదులు 'కుముదము' అని మార్చినను—దానివి జాత్యేక వచనముగా గ్రహించినను నిర్బాధక మగును.

నిఘంటువునకు ఎక్కని పదములును కొన్ని ఇందు గలవు. వడ్రంగి సాధనముగా వాడుకలో ఉన్న 'తొరపడము' ఇందు 'తొరటము' గా 'తొరటము గతి సరటమంత దురదుర దూరెన్ అని' (పు 21) ఉన్నది. ఇది నిఘంటువులలో లేదు. చీనా దేశమునకు పర్యాయ పదముగా ఇందు 'చీనపుదీవి' తో (పు 39) పాటు 'చినము' (ఈ, తనిపొత్తున జినమునకై—పుట 41) అనియు వాడబడినది. ఇది నిఘంటువులలో లేదు. 'పీనుగు' అనుటకు బదులు 'పినుగు' (పుట 48) అని కలదు.

బమ్మెర పోతనామాత్యుని పద్యముగా ప్రసిద్ధమైన 'బాలరసాలసాల' పద్యము కొలది మార్పులతో ఈ గ్రంథములో క్రింది విధముగా ఉన్నది.

ఉ. "బాలరసాల పుష్ప నవపల్లవ కోమల కావ్యకన్యకన్
కూళలకిచ్చి యప్పడుపు గూడు భుజించుట కంటె
సత్కవుల్
హాళికులైననేమి ?మతి యంతకు నాయతి లేనినాడు కౌ
ద్దాలికులైన నేమి నిజదారసుతోదర పోషణార్థమై"

ఈ గ్రంథమును బట్టి చూచినయెడల పయిపద్యము పోతన వ్రాసినది కాని, మంచన రచించినది కానీ కాదనియు, మంచనకు పూర్వమే ప్రసిద్ధముగా ఉండిన దీనిని మంచన తన గ్రంథమున ఉదాహరించెననియు చెప్పవలసియున్నది. సంస్కృతకవులు 'కావ్యాలాపాంశ్చ వర్జయేత్' అను ఆర్యోక్తిని అసత్కావ్యపరముగా గ్రహించినట్లు పయి పద్యము కూడ అనర్హుల విషయమై చెప్పబడినట్లు మంచన గ్రహించెను.

చక్కని నీతికథలతో కూడి రసవంతమైన యీ పద్యకావ్యము ప్రాచీనములగు నుడికారములకును, రసవంతమగు శైలికిని నిధానము; అందరికిని పఠనీయము.

పావులూరి గణితము: త్రైరాశికము

శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య

(గత సంచిక తరువాయి)

గీ॥ 52 యోజనార్ధస్య భాగంబు 53 నొక్కనాఁట
నరిగి యోజనాష్టత్రయాంశకంబు
మగుడ మూఁడరదినముల మత్తగజము
తత్ప్రక్కృతియోజనము లేఁగె దానిఁజెపుము.

౧/౨ ౧/౪; ౧; ౧/౨ ౩/౮; ౬౨౫; నిజ ౪/౫; ౬; ౨/౫ లబ్ధవరుషాలు ౮ మాసాలు దినాలు ౧౩ ముహూర్తాలు ౨ ఘడియ ౧.

గీ॥ 54 పంచమస్యార్ధ యోజనభాగ మర్ధ
హీన మగు నాలుదినముల నేఁగు నొక్క
దానవరి క్రోశపంచకద్వయము లీల
వచ్చు మూఁడరదినముల వనమునందు
నరుగఁగలయోజనములు క్రోశార్ధ మూన
మైన శతసంఖ్య దీనికి నైనకాల
మెంతనిజముగఁ ద్రైరాశి యెఱుఁగుదేని.

౧/౫ ౧/౨; ౬-౧/౨ (౫ ౧/౨); ౨/౫ ౩ ౧/౨; ౧౦౦-౧/౨ (౯౯౧/౨) నిజము ౮/౩౩; ౦౧౧౧౭౯౯; లబ్ధ వరుషాలు ౧౦ మాసములు ౮ దినాలు ౫ ముహూర్తాలు ౫ ఘడియ ౧ భాగ ౧/౪.

గీ॥ 55 వివరమునఁజొచ్చి 56 (నడ ప్రేళ్ళర్ధి?)
సప్తపంచభాగార్ధ వాసరమునం ద్రి
57 పదయుతం బైనయంగుళద్వయము పెరుఁగుఁ
బాదదినమునం దోఁక యేర్పడఁగ నిట్లు
పుడమి నొకకృష్ణ సర్పంబు నిడుపు మూర
లెన్న ముప్పదిరెండిది యెన్ని నాళ్ళఁ
జొచ్చు నాబొక్కలోనికిఁ జోద్యముగను
గాలపరిమాణ మదియెంత గణితకుశల!!

౭౧/౨; ౫/౭ ౧/౨ (౫/౧౪); ౨ ౩/౪; ౧/౪; ౩౨ నిజము ౧౧; ౧; ౧౫; ౩౬ లబ్ధమాసాలు ౨ దినాలు ౧౬ ముహూర్తాలు ౧౯ భాగ ?

గీ॥ 58అహి యొకండు చతుర్దశ హస్త దీర్ఘ
మై చతుర్భాగ యుక్త పంచాంగుళములు
చొచ్చు మూఁడరదినముల వచ్చు నంగు
ళార్ధ (భాగార్ధ) మొకనాఁట నతిశయముగ.

౧౪ ; ౫ ౧/౪ ; ౩ ౧/౨ ; ౧/౪ నిజము ౫/౪ ; ౧౬౭౩ ; లబ్ధవర్షాలు ౧ మాసాలు ౫ దినాలు ౨౭ ముహూర్తాలు ౧౮.

---

52. దీనికి మూలములేదు.

53. పాదంబు (పాఠాం)—క్రింది వివరమునుబట్టి యీ పాఠమే పరిగ్రాహ్యము.

54. చూడుఁడు—మూలము ౨౭ శ్లోకము.

"గర్ధేభో మదలుబ్ధ షట్పదపదప్రోద్భిన్న గణ్డస్థలః
సార్ధం యోజనపఞ్చమం వ్రజతి యష్షడ్భిర్దలోనైర్దినైః,
ప్రత్యాయాతిదినైస్త్రిభిశ్చ సదలైః క్రోశద్విపఞ్చాంశకం
బ్రూహి క్రోశదలోనయోజన శతం కాలేన కేనా ప్నుయాత్". లబ్ధఫలము ౧౦ సంవత్సరములు ౨౮౫ ౩/౧౬ దినము లని మూలము.

55. చూడుఁడు—మూలము ౩౧ శ్లోకము.

"ద్వాత్రింశ ద్ధస్తదీర్ఘః
ప్రవిశతి వివరే పఞ్చభిస్సప్తమార్ధైః
కృష్ణాహీన్ద్రో దినస్యా
సురవపురజితః సార్ధసప్తాఙ్గులాని,
పాదేనాహ్నో ఙ్గులే ద్వే
త్రిచరణసహితే వర్ధతే తస్య పుచ్ఛం
రన్ధ్రం కాలేన కేన
ప్రవిశతి గణకోత్తంస! మే బ్రూహి సోయం.
ఇష్టఫలము ౭౬ ౪/౫ దినములని మూలము.

56. 'సార్ధసప్తాఙ్గులాని' యనుట కిట తెలిఁగిం పుండవలెను. 'యేడర వేళ్ళ నర్ధి' యని సవరించుకొనఁదగును.

57. నందుదళయుతం (పాఠాం) మూలమున 'త్రిచరణసహితే' యనుట కనుగుణముగా ఇది యిట్లు సవరింపఁబడినది.

58. దీనికి మూలములేదు.

గీ॥ 59పాదయుతం బైన యొకమాడ పడయుఁ బంచ
మాంశయుత మగు దివసత్రయంబు నందుఁ
60జరణభాగ తదష్టాంశ స్వర్ణ మర్ధ
హీన మగు పంచదినముల దాన మిచ్చు
నట్టివిధమున మతియొక్క శెట్టికాఁడు
పరఁగ ధనదాన 61మీ నిల్వ పసిఁడి దక్క
హస్తగతమైన నిష్కంబు లరువదింటి
కెంత గాలంబు వచ్చు మా కెఱుఁగఁ జెపుమ.

౧ ౧/౪ ; ౩ ౧/౫ ; ౧/౩౨ ; ౫—౧/౨ (౪ ౧/౨) ; ౬౦ నిజము ౨/౬ ; ౧/౪ ; ౧ ; ౬౦ లబ్ధమాసాలు ౬ దినాలు ౨ ముహూర్తాలు ౨౫ ఘడియ ౧ భాగ ౩/౫.

గీ॥ 62స్వర్ణ శతముఁ బాతిక నరకు విల్చినం?
గదియ నవమాంశ యుత కనకద్వయంబు
పడయు నేకార్థమున ... బుడమి నొక్క
శెట్టి విక్రయక్రయములు సేసి యంత
నలుబదెనిమిది యగుపాలు వెలయ నూన
మైన మాడలు రెండు సపాద్ధ దినము
నందుఁ బ్రియ మగు నిప్పాట నొంద మూల్య
మెన్ని దినములఁ బడయు మా కెఱుఁగఁ జెపుమ.

౨౫ ౧/౨; ౨ ౧/౯; ౩/౨; ౯/౪; ౫/౮; ౧౦౦ ౧/౪ నిజము ౯/౮; ౧; ౪౦౦; ౧౧/౪౦; లబ్ధమాసాలు ౨ దినాలు ౨౭ ముహూర్తాలు ౨౬ భాగ ౧/౩.

గీ॥ 63కొలని లోపలఁ దామరమొలక యర్ధ
యుత దినమున రెండర వ్రేళ్లు నొనరఁ బెరుఁగు
మగుడ మూఁడర దినముల దిగుచుఁ బాద
సహిత పంచాంగుళములు కచ్ఛపము క్రింద
జలము శోషించు నొకదివసమునఁ బంచ
మాంశయుత మగు నంగుళ మాతపమునఁ

గొలనిలోఁతును రెండు మూరలు (౪) నందు (వ్రేళ్లు?) నెన్ని దినంబుల వెడలు మొలక.

౧ ౧/౨; ౨ ౧/౨; ౩ ౧/౨; ౫౧/౪; ౧; ౧ ౧/౫; ౧౦౧; లబ్ధమాసాలు ౨ దినాలు ౧౩ ముహూర్తాలు ౨౬ భాగ ౩/౪.

ఇది త్రైరాశిక గణితంబునందు గతి నివృత్తి వ్యవహారము సమాప్తము.

గద్య

ఇది శ్రీ శంకరపదకమల మధుకరాయ మాన మల్లికార్జున ప్రణీతం బైన దశగణిత ప్రోక్తంబునందుఁ జతుర్థ త్రైరాశిక గణితము సమాప్తము.

వ॥ 64 ఏకాదశ రాశి కొలకున్ను వొక్కటే సూత్రం—

ఉ॥ ఎంచఁగ నిచ్చరాసులు గు
ణించవి ద్రవ్యము చేతఁ బెంచుచున్
మించు ప్రమాణరాసు లెల
మిన్ గుణియించవి వానిక్రిందుగా
నుంచుచుఁ బ్రౌఢిఁ బాల్గొనిన
నొప్పగ వచ్చును బంచరాశికం
బంచిత సప్తరాశిక న
వైక దశాదిక రాసు లిమ్మహిన్.

59- చూడుఁడు - మూలము ౨౬ శ్లోకము.

"సపాదహేమ త్రిదినైః స్వపఞ్చమై
ర్నరోఽర్జయన్ వ్యేతి సువర్ణతుర్యకమ్,
నిజాష్టమం పఞ్చదినై ర్దలోనితైః
సకేన కాలేన లభేత సప్తతిం."

మూలమున డెబ్బది (సప్తతి) నిష్కము లని యుండఁగా తెలుఁగున అరువది నిష్కము లని కలదు.

60. చరణభాగ నష్ట దస్వర్ణ మర్ధ (?)—వ్రాఁత ప్రతి.

61. మీ విల్వ ? మిచ్చినఁ బసిఁడి అని సవరింపఁదగు.

62. దీనికి మూలము లేదు.

63. చూడుఁడు — మూలము ౨౭, ౨౯, ౩౦ శ్లోకములు.

"వాపీ పయఃప్రపూర్ణా
దశదణ్డ సముచ్ఛ్రితాబ్జ మిహ జాతమ్,
అఙ్గులయుగళం సదళం
ప్రవర్ధతే సార్ధదివసేన.
నిస్సరతి యన్త్రతోఽమ్భః
సార్ధేనాహ్నాఙ్గులే సవింశే ద్వే
శుష్యతి దినేన సలిలం
సపఞ్చమాఙ్గులక మిన కిరణైః.
కూర్మో నాల మధస్తాత్
సపాద పఞ్చాఙ్గులాని చాకృషతి,
సార్ధైః త్రిదినైః పద్మం
తోయసమం కేన కాలేన."

"నిస్సరతి యన్త్రతోఽమ్భః" యనుదళమున కాంధ్రీకరణము లేదు. పదిదండముల లోఁతని మూలము. ఇష్టఫలము — ౩౫౨ ౯/౪౧ దినములని మూలము.

64. ఈ సూత్ర మితర త్రైరాశిక గణితపాఠముల లోను గలదు. ఇది మల్లన రచితముగాఁ దోఁపదు. అందుచేతనే గద్యకుఁ బిదప లేఖకు డెవఁడో యితర గణితములలోని యీ పద్యము నట వ్రాసికొని యుండును.

వీరమాత

శ్రీ చిటిప్రోలు కృష్ణమూర్తి

[స్వాతంత్ర్యం పొందగోరిన చోళరాజు పార్థివన్‌కూ, పల్లవ చక్రవర్తికి జరిగిన సంగ్రామానికి ఒకానొక వృద్ధమాత తన ఏకైక పుత్రిణ్ణి పంపుతుంది. కొడుకును పంపి స్వయంగా యుద్ధరంగం చూడాలని బయలుదేరుతుంది. మార్గమధ్యంలో ఎదురైన వాళ్ళను తన కొడుకును గురించి అడుగుతుంది. "శత్రు సైన్యాని చూడగానే నీ కొడుకు కాలికి బుద్ధిచెప్పాడు. భయపడి పోతూండగా శత్రు వీరుడి బాణం తగిలి నేల గూలాడు." అని సమాధానం లభిస్తుంది. కాని, తన కొడుకు అలా పిఱికిపందవలె పాఱిపోయాడంటే నమ్మలేకపోయింది ఆ వీరమాత. యుద్ధరంగానికి వెళ్లి చూస్తుంది. రొమ్మున గాఢంగా గ్రుచ్చికొన్న బాణాలతో పడివున్న వీరపుత్రుణ్ణి చూచి ఆ మాతృహృదయం ఆనందపులకిత మవుతుంది.]

ఎవరా వచ్చెడివా? రాహవరంగమునుండియేన యరుదెంచుట? శా
త్రవ వీరసంచయము నసుపవనము కలసినది విశ్వపవనమునందున్?

మన స్వాతంత్ర్యపతాక యాకసమునం భాసించుటం జూచి సైఁ
పని దుర్మార్గుల దుష్టనేత్రముల డుల్పన్ నిర్భరోత్సాహియై
చనియెన్ నాకొమరుండు, వాని సమరస్థానంబునం గంటిరా?
కనినన్ దెల్పుఁడి తద్విరోధిదళనాఖండ ప్రతాపోన్నతుల్.

అని యిట్లాత్మజు వీరవిక్రమ కథావ్యాఖ్యాన మాలింప నిం
తనఁగా రాని కుతూహలమ్మువడు నా యమ్మన్ విలోకించి యా
జన సందోహమునం దొకండు దరహాసం బేదియో నెమ్మొగం
బునఁ జిత్రంబుగ నొల్కఁగా బలుకునేర్పుల్ గుల్కఁగా వాకొనెన్.

"చూడకేమి తల్లి! చూచియున్నామందు నీ కుమారు శూరలోకవిభుని
అరయవలెనె కాని యభివర్ణనము సేయరాదు సుమ్ము తత్పరాక్రమమ్ము.

వాని దోర్బల మేమైనఁ గాని పిక్కఁబలము మాత్ర మనన్య సంప్రాప్త మమ్మ!
శత్రువీరులు సైత మాశ్చర్య మంది వినుతిసేయుట చెవులార వింటి మమ్మ!

ఆయెద బల్మికల్మి యవురా! రిపుసైన్యముఁ గాంచినంతనే
పాయనికంప మెత్తె నిలువంబడఁజాలక పాఱిపోవుచో
నే యరివీరుఁడో కరుణ యించుక లేక శరమ్ము వేయ హా
హా యని యార్చి నేలఁబడి ప్రాణములన్ విడనాడె నక్కటా!"

అని యిట్లాతని నోట వెల్వడిన వ్యాఖ్యానమ్ము నాలించినం
తన చిత్తమ్మున నొక్క క్రూరవిషదిగ్ధంబైన శస్త్రమ్ముఁ గ్రు
మ్మిన చందమ్మున నొచ్చి యాజనని గంభీరమ్ముగా నిల్చి యొ
క్కనిమేషమ్ము చలించు గుండియలఁ జిక్కంబట్టి ధైర్యమ్మునన్.

"నమ్మఁగరాని దీ పలుకు నమ్మఁగరానిది, నా వరాల గ
ర్భమ్మునఁ బుట్టి నాదు చనుఁబాలను ద్రావినబిడ్డ శౌర్యధై
ర్యమ్ము లెసంగ శాత్రవుల నంటెడి పోటరిగాక శత్రుసై
న్యమ్ములఁ గాంచినంతన భయంపడి పాఱెడి భీరు వెట్లగున్?

నాకుమారుని యుద్ధరంగమ్ము నందుఁ జూడలేదయ్య మీరసల్ చూడలేదు
పాఱిపోయెడి పంద నెవ్వనినో చూచి నా సుతుండని భ్రమపడినారు గాని.

పగతుర నిశితాంబకములు తగులవు నా సుతున కెపుడుఁ దగులవటంచున్
దగవేది పలుకఁ, గాసీ తగిలిన వక్షంబునంద తగులు నటందున్.

శూరలోకవిభుఁడు నీ కుమారుఁడంచు నాడియున్నాడవో పరిహాసమునకు
నా కుమారుఁడు శూరలోకైకవిభుఁడె నీదు వచనంబు నిక్కమై నిలిచితీరు.

రణరంగమ్మును జేరఁబోయి తనివాఱన్ శత్రుసంతాన మా
రణహోమం బొనరించు నా కొడుకుఁగుఱ్ఱం గందు, నీ వ్యర్థ భా
షణ మింకేల?" యటంచు సాగిచనె—విశ్వంబెల్ల నగ్గింపదో
అణుమాత్ర మ్ముడివోని తత్సమహితంబౌ నాత్మవిశ్వాసమున్.

పరమ బీభత్సముగ నున్న ప్రధనభూమి గుట్టవడియున్న పీన్గు లొక్కొకటి గాఁగఁ
బట్టి కదిలించి పొరలించి కట్టకడకుఁ గనియె నొక్కటఁ దన కుమారుని శవమ్ము.

కఱకు టమ్ములు నాల్గువక్షమున నాటి గాయములు రెండు ఫాలభాగమునఁదగిలి
అమర వర్త్మంబు దెస నీక్షణములు నిల్పి ఉర్విఁ బడియుండె నమ్మహాయోధమాళి.

వార్ధక్యభారాన వంగిపోయిన మేను కైలాసశిఖరంబు కరణి నిక్కె
దృష్టిదోషంబు చెందిన నేత్రములలోన నొక్కక్రొత్త వెల్గేదియో రహించె
విస్ఫుటంబుగ మాట వెడలఁజాలని నోట గీతమాలిక యేదో ప్రోత పెట్టె
బధిరత్వమున కాటపట్టైన చెవిదోయి కాకర్ణనము గల్గినట్టు లయ్యె

సమధికానందబాష్పముల్ జాలు వాఱె సార్థకంబయ్యె నేడు నాజన్మమనుచు
హస్తయుగళంబు మోడ్చి జోహారుచేసె విశ్వనాథున కా వృద్ధ వీరమాత.

అనంతుని మధురానుభూతి

శ్రీ డి. గోపాలకృష్ణ

అపూర్వతా మాధుర్య గుణంబులు రెండును ఏకస్థమై యుండు కవిత్వము ఒక విధముగ విశిష్టస్థాన మలంకరించును. వీనికి ఉత్తరోత్తర ప్రాధాన్య మున్నను, ఇం దేది కొఱవడినను కవిత్వము అంతగా రాణింపదు. ఏతత్సమ్మేళనశక్తి నవనవోన్మేష బుద్ధికి తార్కాణము.

అర్వాచీనాంధ్ర కవులలో అనంతామాత్యుఁడు మధుర కవితకు పేరెన్నిక గాంచినవాఁడు. అల్పాక్షరముల ననల్పార్థ సమన్వితమై, అడుగడుగున స్వతంత్రత యుట్టిపడు నీతని కవిత కాళిదాసకవితాధోరణిని స్మరింపజేయును.

కాళిదాస మహాకవి తనకు పూర్వమందున్న కవి సమయముల నెల్ల నతిక్రమించి నూతన సృష్టియొనర్చి సహృదయుల మెప్పువడయు నేర్పరి. ఈ విషయమున అంతటి యున్నతస్థానము నందుకొన్నను, లేకున్నను అనంతామాత్యునకును ఇట్టి నైజము మాత్రము కలదు. పరిణామ భేదమున్నను, జాతి సామ్యము కల దనుట.

అనంతామాత్యకృత మగు భోజరాజీయమునందలి పుష్పగంధి వృత్తాంతము ఆంధ్రకవులను తీర్చిదిద్దు ప్రబంధధోరణిలో నడచినది. యౌవనవతియు, కన్యయు నగు పుష్పగంధి వదన సౌందర్యవర్ణనము అద్భుతానందావహము.

ఆలోలాక్షి లలాట వక్త్రి సదృశ
త్వాకాంక్షఁ జంద్రుండు దా
బాలత్వంబు వహించి చూచియు నొగిన్
బ్రౌఢత్వముం బొందియున్
బోలం జాలక జాలిపొంది వగలన్
బొల్పేది లోఁ గుందెఁ గా
కాలోకింపఁ దదీయ బింబము కురం
గాకారముం గూరునే?

లలనా లలాట వక్త్రములకు బాలేందు ప్రౌఢేందులు కవి సమయసిద్ధ సాదృశ్యంబులు. అట్టి సాదృశ్యంబు నూతగా గొని అనంతు డిట్టె యూహాగాన మొనర్చి నాఁడు. పుష్పగంధి వదనసౌందర్యమును తిలకించిన లోకము చంద్రుని రామణీయకము మాట తలపెట్టకుండెను. అంతట చంద్రుఁడు తన ఉపమానాధికారము పోవునను భయమున తరుగుచు, పెరుగుచు, ఆమె లలాటమునకేనియు, ముఖమండలమునకేనియు సరిపోలుటకు నిరంతరకృషి గావించుచుండెను. కాని, ఆనాటికిని, ఈనాటికిని, మఱేనాటికైనను అతని తపస్సు ఫలించు జాడ కానరాదయ్యెను. పుష్పగంధి మోహనత్వము అనంతుని దివ్యకావ్యమందు అమరత్వము వహించి శాశ్వతముగా చంద్రుని త్రోసి రాజనుచున్నది. మరియు పూర్వ కవులు చంద్రునియందలి కళంకమును ఒక్కొక్కరు ఒక్కొక్క విధముగా నూహించుచు వచ్చిరి. అనంతుఁడును తన కనువగు నొక హేతువు కల్పించెను. విఫలమనోరథుండైన చంద్రుడు వెచ్చ నూర్పుగా తదీయ బింబము మలినత్వమునకు ఆకరమయ్యెనట. అనఁగా చంద్రుఁడు ప్రయత్నించి పుష్పగంధిని సరిపోలక పోవుటయే కాక తనకు పూర్వమున్న సొగసు కూడ పోగొట్టుకొనె నన్నమాట. ప్రాచీన కవిసమయములతో గ్రంథము నంతయు నింపక ఏతత్కవిచంద్రుఁడు ప్రకృతి సత్యములను ప్రకృతోపయోగకరముగా వ్యాఖ్యానింపగల స్వతంత్రుఁడు.

కవికులతిలకుఁడు తన కుమారసంభవ కావ్యమందు పార్వతీ కన్యావదన హారిత్వమును వర్ణించుచు పురాణకవి సమయముల నతిక్రమించును.

చంద్రం గతా పద్మగుణాన్న భుఙ్క్తే,
పద్మాశ్రితా చాంద్రమసీ మభిఖ్యాం,
ఉమాముఖంతు ప్రతిపద్య లోలా
ద్విసంశ్రయాం ప్రీతి మవాప లక్ష్మీః.

చంద్రుఁడు ముఖ్యముగా బహుళపక్ష రాత్రులందును, పద్మము పగటివేళయు ఆనందము నియ్యగలవు. మరియు చంద్రునిలోని కాంతి విశేషాదులు పద్మమందుగాని, పద్మమందలి సౌరభాదికము చంద్రుని యందుగాని లభింపవు. ఇట్లు ప్రకృతిలో గుణ సామగ్ర్యస్థితి కానరాదయ్యెను. అట్టియెడ సౌందర్యలక్ష్మి నిరంతరము పూర్ణచంద్ర సువికసితారవింద

గుణంబులన్నియు నేకస్థముగా నున్న పార్వతీ వదనమును తన నివాసస్థానము చేసికొని, ఆనాటి నుండియు తన చంచల భావమును గూడ విడనాడెను. ఆమె పుట్టినిల్లగు పద్మంబునేని, తోబుట్టువగు చంద్రునేని తలపెట్టదాయెను.

మహాకవులు ప్రేమమయులు. వారు సౌందర్య లహరీ నిమజ్జనం బొనర్చునపుడు ఇట్టి రసతరంగములు వెలువడుచుండును. అనంతామాత్యుని చమత్కృతి యందు ఇంత పరిణతి లేకున్నను, ఉభయులకును సామాన్య కవిసమయముల నతిక్రమించు సామ్యము మాత్రము కలదు.

పుర వీథులలో మహారాజులు పయనించు నపుడు వారిని ప్రమదా జనంబులు ప్రముదావహంబుగా గాంచియు తృప్తి చనకయుందురని పురాణసిద్ధమగు వర్ణనలు కానవచ్చును. కాళిదాసుని రఘువంశమందు ఇందుమతీ సహితముగా నూరేగు అజమహారాజును చూడ వేడుకపడిన యువతీజన విభ్రమ విలాస సంపదలు పలు విధముల వర్ణింపఁబడినవి. అందు మేలుబంతి వంటి శ్లోకము నుదాహరింతును.

తా రాఘవం దృష్టిభి రాపిబన్త్యో,
నార్యో న జగ్ముర్విషయాంతరాణి,
తథాహి శేషేంద్రియ వృత్తి రాసాం,
సర్వాత్మనా చక్షు రివ ప్రవిష్టా.

అజ మహారాజ సౌందర్య వైభవ మాధుర్యమును సంతృప్తి చనక తమ దృష్టితో గ్రోలెడు నారీజనము అన్య విషయముల మాట తలపెట్టలేదు. వారి యితరేంద్రియవ్యాపారమంతయు దృగింద్రియ సంనివిష్టమయినది. ఇట్టి దృశ్యములను ఇంకను రసవత్తర మొనర్పవలె నన్నచో అయ్యది అనంతుని సజీవ కవిత్వమునకు సాధ్యమగును. భోజ మహారాజు పురప్రవేశ మొనర్చునపుడు పురజనులు కాకతాళీయ న్యాయముగా వివిధానందంబు లనుభవింతురు.

ఈతఁడు రూప సంపద ను
పేంద్ర తనూజునిఁ బోలు నంచుఁ బ్ర
ఖ్యాతిగఁ జెప్పఁగా నితనిఁ
గాంచుట మేలని వచ్చెఁ గాక యీ
రీతి వధూటు లెందుఁ గల
రేయని చూపఱు పిచ్చలింపఁగా
నాతుక యొర్తు భోజ నర
నాయకుఁ జూడఁగ వచ్చెఁ జెచ్చెరన్.

ఇచట మహోత్సవంబుగా భోజుని గాంచు పురజనులు ఇతోధికానంద కరముగా లోకోత్తర సౌందర్యవతిని దైవవశత వీక్షించి ధన్యులయిరి. 'స్త్రీరీతి నామాపి మధుర'మ్మనునట్లు స్త్రీ ప్రసక్తి వలననే సహృదయులకు రస ముట్టిపడుచున్నను, రాజవీథి పరమార్థము నొందవలె నన్నచో ఈ వివరము లవసరమగును. యువతీజనము ముఖ్యముగా రాజ దర్శనమందే లగ్నమయి యుందురు గాక! యువక బృందము మాత్రము ముఖ్యముగా వివిధ యువతీబృంద సందర్శనంబు వలననే విహ్వలులై రన్నచో కాదనగలవా రెవరు ?

అనంతామాత్యుని చక్షుః ప్రీత్యాది వర్ణనంబులు పునర్నవత్వ సంధానకంబులు. పుష్పగంధని గాంచిన రత్నమండనుఁడను నాయకుని స్థితి పురుషులను ఉవ్విళు లూరించును.

వచ్చి యతండు చూచెఁ జెలు
వంబుల ప్రోఁక విలాస లక్ష్మికిం
జొచ్చిన యిల్లు సౌఖ్యముల
చోటు వికాసము తానకంబు క
న్నిచ్చల యుక్కుపట్టు కుసు
మేషు వికారము జన్మభూమి నా
నచ్చగు పుష్పగంధిఁ జప
లాయత నేత్రఁ బయోరుహాననన్.

ఇది అక్షర లక్షల విలువసేయు కవిత్వము. కన్యకను ఎట్లయినను వర్ణింపవచ్చును. కాని పురుషార్థపరముగా ఆమెను గౌరవించవలె నన్నచో అయ్యది పరిణత కవులకే సాధ్యమగును. నాస్తి భార్యాసమం సుఖమ్మనునట్లు, పుష్పగంధిని వరించిన రత్నమండనుఁడు ఆమెను 'సౌఖ్యముల చోటు'గా నిర్ణయించుకొనుట విషతుల్యంబగు నిహలోక జీవితమును మగుడ అమృతప్రాయ మొనర్చునను నమ్మక మున్నప్పుడే కదా! ఇంతకును రత్నమండనునితో తాదాత్మ్య మొందిన అనంతామాత్యుని దివ్యభావముమాట మఱవరాదు. ఆంధ్ర కవిత్వమంతయు ఒక యెత్తు, అనంతామాత్యుని వంటివారి కవిత వేరొక యెత్తు అని చెప్పవచ్చును.

రఘువంశమందు అజమహారాజు ఇందుమతీదేవి పాణిగ్రహణం బొనర్చుటను కాళిదాసుం డిట్లు వర్ణించెను :

ఆసీ ద్వరః కంటకితప్రకోష్ఠ
స్స్విన్నాంగుళి స్సంవవృతే కుమారీ,

వృత్తిస్తయోః పాణి సమాగమేన
సమం విభక్తేవ మనోభవస్య.

నాయకుని గగుర్పాటుచేతను, నాయిక చెమర్పుట వలనను పరస్పరానురాగము ధ్వనించినది.

తిక్కన విరాటపర్వమందు ఉత్తరాభిమన్యుల వివాహసందర్భమున ఇంచుమించుగ ఇటువంటి భావమే కనబడును.

చిత్తమున గాఢరాగంబుచేతఁ జూపు,
తెలుఁగు దోఁపఁ గెంపారెడు తీఁగబోఁడి
మృదులపాణిఁ గుమారుండు మెలపుమై గ్ర
హించె బల్లవాలంబి మత్తేభలీల.

ఇఁక అనంతుని రత్నమండనుఁడు పుష్పగంధిని చేపట్టునపుడు ఎట్లు మురిసిపోవునో పరికింపుడు.

అతనుని గెల్తు నీ సతి స
హాస్థితి గల్గిన నంచు నో పురా
కృత సుకృతోపభోగతతి
కిం గుదు రీసతి యంచునో యనా
గత ఘనదుర్దశం దలఁగఁ
గా వెర వీసతి గాంచు నంచునో
యతఁ డిటు చేసెనాఁగఁ దర
ళేక్షణ హస్తముఁబట్టెఁ బ్రీతితోన్.

దుష్యంతుఁడు శకుంతలను గాంచి, అఖండం పుణ్యానాం ఫలమివ చ తద్రూప మనఘమ్మని దైన్యపడినపుడు కాళిదాసుని సౌందర్యారాధనము హృదయనైర్మల్యపూర్వకమని తోఁచును. అట్టి పరిణతియే యీ పద్యమందును గాననగును.

శివభక్తి తత్పరుఁడగు బ్రాహ్మణుడొకఁడు అర్ధనారీశ్వరునకు మ్రొక్కునపుడు మన మధురకవి దాంపత్య పరాకాష్ఠ నిట్లు నిర్ణయించుచున్నాఁడు.

బొందులు వేఱుగాని తల
పోయఁగఁ బ్రాణము లేకమం ద్రిలం
గొందఱు లేఁతమాటలవి
కూరిమి పట్టున నంచుఁ బ్రాణముల్
బొందులు నేకమై రనఁగఁ
బొల్పగు శంకరునిన్ భవాని న
స్పందిత భక్తిమైఁ గదిసి
బ్రాహ్మణ పుంగవుఁ డానతాత్ముఁడై.

ఆది దంపతులు ఆదర్శ దాంపత్యమును గూర్చి ఈవిధముగా లోకమునకు బోధించుట సమంజసమే కదా?

మఱియు జాతి మత స్వర్గ నరక భేదము లెవ్వియు దివ్య దాంపత్యజీవిత సౌఖ్యమునకు అడ్డురానేర వనుచు అనంతుఁడు సంసారమునే ద్వంద్వాతీత మొనర్చుచున్నాఁడు. శాపవశమున మాలతనము నొందిన వంజరుఁడను మహారాజుతో అతని ప్రేమించియున్న రాజపుత్రి యిట్లనుచున్నది.

నరకంబైనను నాకమైన మది నా
నందంబు గావింపదే
పురుషుం డింతియుఁ దాను గూడి చనినన్
భూమీశ, చండాల దు
స్తరభావం బది నీకు నాకు సమమై
సంధిల్లెఁ బ్రారబ్ధముల్
పరిభోగం బధికంబులౌ తెఱఁగవే
పౌరాణిక ప్రోక్తమై.

ఇట్టి కవిత్వము సార్వకాలిక సర్వజనీనమై తనరారుట కెట్టి సందియమును లేదు.

భోజరాజీయమునందు ఉద్యానవర్ణన సందర్భమున అమృతోపమానమగు భావము గోచరమగును. పుష్పగంధి వృత్తాంతమందు పుష్పగంధి చెలి యొకతె వేరొక నెచ్చెలికత్తెతో ఏమనుచున్నదో ఆలకింపుడు.

"తరళాక్షి చూచితె తరళాక్షిరోచులు, చల్లకపూవదీ చంపకంబు" సీసభాగమంతయు ఈ విధమగు కవిసమయములతో నిండియున్నను, ఎత్తుగీతియందు మాత్రము పైయెత్తు కనిపించును.

కౌన సతులయందుఁ గల సౌఖ్య మెఱుఁగని,
వరుఁడు మ్రాఁకు గాక ధరణిమీఁద
నబల యివ్వి మ్రాఁకు లనవచ్చునే యని,
చెలికిఁజూపి చెప్పె చెలువ యొకర్తు.

ఈ మాటలు వనిత చేతనే పలికించిన అనంతామాత్యుని మహిళా మానసిక తత్వవేత్తృత్వము వేనోళ్ల గొనియాడదగినది. కోరి సుఖపెట్టు స్వభావము యువతులకు గలదన్నచో అంతకంటె యువజనమునకు కావలసిన దేమున్నది? ప్రకృతికిని మానవ జీవితమునకును సమన్వయము కుదుర్చుట ఉత్తమకవితా లక్షణము. ఈ సందర్భము అందులకు ఉత్తమోదాహృతి.

మఱియు ఈ కవి విరాగులను సరాగుల నొనర్చు గడు సరిదై తోఁచును.

ఈ కావ్యమందలి సూర్యాస్తమయ వర్ణనము ఉదాత్తభావ భరితము. లోకబాంధవుని హృదయ ప్రవృత్తిని అనంతుఁ డూహించినట్లు మఱెవ్వరు నెఱుఁగ రనుకొందును.

వేఁగి చకోరదంపతులఁ
బ్రేల్చిన కల్మషపంక మిందులో
దోఁగినఁగాని పాయదని
తోయజ బాంధవుఁ డిట్లు చేసెనో
నాఁగ ప్రశాంతి నొందె కిర
ణంబులు వేఁడిమి దక్కి శైత్యముల్
గాఁగ రథాంగముల్ బెదరఁ
గా నపరాంబుధిఁ జొచ్చెఁ జెచ్చెరన్.

చకోర విరహమునకు పశ్చాత్తాపమునొంది అస్తంగతుఁ డగు సూర్యుఁడు, రథాంగ విరహము తలపెట్టి కాఁబోలును ఉదయాద్రి నొందుచున్నాఁడు. సూర్యుని యంతటివాఁడును కాలచక్ర వశవర్తియై, ప్రేమికులకు సానుభూతిని మాత్రము చూపగలఁడు.

జక్కన విక్రమార్కచరిత్రయందును సూర్యాస్తమయము ఉత్ప్రేక్షింపబడినది. కాని ఆ భావము మిక్కిలి పేలవము గానుండును.

పగలెల్లను దమ నేఁచిన
పగ లెల్లఁ దలంచి యిరుల పవుజులు దనపైఁ
దెగి యెత్తివచ్చునని రవి
మిగ బెగడినభంగి నపరవనధి నణంగెన్.

ఇందు ఇరులపవుజులకు గూడ భయపడునంతటి అల్పుడుగా లోకసాక్షి భావింపబడినాఁడు. ప్రతిపద్యముఁ జోద్యముగాఁ గృతి సెప్పెదనని విఱ్ఱవీఁగినవానికి చిన్నబిడ్డల పెడతొక్కు బల్కులవోలె ముద్దు లొలికించు నైపుణము ఎటనుండి వచ్చును ?

అనంతుని వసంతవర్ణనము ప్రకృతి దేవతారాధన పరము.

జరయుడిపి మాకుఁ గ్రమ్మఱఁ
దరుణత్వం బొసఁగు మనుచు ధరణీదేవిన్
బోరిఁబోరిఁ బూజించిన క్రియఁ
దరమిడి కారాకు రాల్చెఁ దరుచయ మెల్లన్.

సామాన్య వస్తువులందును పరమార్థమును గాంచగల మహత్త్వ మితనియందు గలదు. తిక్కన విరాటపర్వమందు శమీతరు చక్రవర్తిని, "జాఁగిన శాఖలాశా చక్రముల కొలందులు బారవెట్టంగఁ బొలుచుదాని" అని కొనియాడగా, అనంతామాత్యుండు ఒకానొక న్యగ్రోధమును,

"దిక్పాల పురముల తెరువేల నడుగ నీ
శాఖి శాఖల వెంటఁ జనఁగఁ రాదె"

అని గౌరవించెను. కాని ఎచ్చట జూచినను ఇతనియందు అపూర్వభావ కల్పనము ఊట లూరుచుండును. అతఁడా మఱ్ఱిచెట్టుతో తుదకుఁ జంబూద్వీపమునే తిరస్కరించును.

ఇట్టి మఱ్ఱియుండ నీ ద్వీపమును వట
ద్వీప మనక యేమి తెలిసి యొక్క
తొంటి పెద్ద లెల్లఁ దొడఁగి జంబూద్వీప
మనిరి నాఁగ నొప్పె నక్కజంబు.

వేయేల, యితనికవిత అప్రయత్నలబ్ధమని మిన్నకుందును.

ఒకానొక తరుణ మూషకను తనయందు మనసు లేని మూషక యోషకై ప్రయత్నించి దానికి బాధాకారణం బయ్యెనని వర్ణించునెపమున అనంతామాత్యుఁడు కవితావనితా తత్త్వంబుల విప్పిచెప్పును.

భువి నట్ల కాదె యువతియుఁ
గవితయు సహజ ప్రసంగతి నొందనిచో
దివిరి కడు బల్మిచేసిన
నవి సరసత యుడిగి విరసమయి చనుటరుదే.

కవితా వనిత అనంతుని వరించి వచ్చెనని వేర చెప్ప నక్కఱలేదు. వనితాలోకముగుఱించి ఇతఁడొసంగిన దివ్య సందేశంబును సహృదయులు గ్రహింతురుగాక !

అనంతుని భావములు, అల్లన విచ్చు చెంగలువలందు రజంబను కప్పురంబుపైఁజల్లఁగఁజల్లనై వలచు సౌరభముల్ వెదఁజల్లు భావములు.

కలగూరగంప

కాట్రేడు - కాటమరాజు

శ్రీ ఆరుద్ర

కాట్రేనికి కాటమరాజుకీ ఏమిటి సంబంధం? ఆయుధోపజీవులైన వేటగాళ్ళు ఆరాధించే ప్రాచీన దైవం, కాట్రేడు, క్రమంగా కాటమరాజుకి తన స్థానాన్ని ఇచ్చినట్టు కావ్యాలవల్ల తెలుస్తోంది. అల్లసాని పెద్దనగారు తెలుగు వేటని అతివిపులంగా వర్ణించారు. వేట ముగిసినపిదప, చంపిన జంతువుల మాంసం కాట్రేనికి వేటగాళ్ళు నైవేద్యం పెట్టాలి. మనుచరిత్రలోని ఈ వచనం చూడండి.

"...అప్పిశిత ఖండంబులు గనగనని నిప్పులం జమురు చిప్పిలం గాల్చిన కమ్మకఱకుట్లం జట్రాతిపయిఁ గాట్రేనికిం గుసుపుపెట్టి, పిదప బాళ్లెంబడిం బంచుకొని తారు నుపయోగించి తద్దేవతా ప్రీతికై తలలుఁ దోఁకలు డొక్కలు నచటి విటపి విటపంబుల వ్రేలంగట్టి శిశిరమధుర సలిలమ్ములు ద్రావి వాగురికులు విశ్రమింప..."

[మను-4-60

అల్లసాని పెద్దనతరువాత వేటని అంత విపులంగానూ వర్ణించిన చరిగొండ ధర్మన్న మాత్రం ఈ సంప్రదాయాన్ని చెప్పనే లేదు. వేట చాలించాక రాజు "తన్నుఁగూర్చి వచ్చిన సామంత వీరభటవారంబులకు మృగ మాంసంబులు దొరహత్తుగా" ఇవ్వడం ఒక్కటే చెప్పాడుగాని చిత్రభారత రచయిత కాట్రేని ఊసు ఎత్తలేదు.

అయితే తంజావూరు పాలించిన విజయరాఘవ నాయకుని ఆస్థానకవి కోనేటి దీక్షితచంద్రుడు తన 'విజయరాఘవ కల్యాణం'లో ఈ సంప్రదాయాన్ని వర్ణించాడు. చూడండి:

"ఈ చందంబున నానా మృగబృందంబులఁ గొందలమంద జేయుచు...నఱుమాడి పేరువాడియందఱు న వ్విభుముందఱ గుంపుగూడి సొంపు మీఱి తమ్మాంస ఖండంబుల గఱకుట్లుగా వండి, కాట్రేని ముందఱనుంచి యందఱు భుజియించి, గఱునఁ ద్రేంచుచు బొజ్జలు నిమురుచుఁ దమ సామిలీలలు చాలఁబాడి రట యెటువలెను?

మాట॥ వోరె వోరె నాకు సుమాళం వస్తావుండది కాటమరాజు పదాలు పాడెద యినరా.

మఱొకడు : అయితే పాడుకోరా.

కాంభోజి॥ అట॥ దరువు॥

కుంభములో పుట్టినట్టి
కుంభకరుని కొడుకవై
కుంభమల్లా తింటివి గదరా,
ఓ కాటమరాజ
కూరవార వెతకవు గదరా."

దీనివల్ల మనకు ఒక విషయం కచ్చితంగా తెలుస్తోంది. వేటాడిన తరువాత వాగురికులు, వండిన మాంసాన్ని కాట్రేనికి నైవేద్యం పెట్టి, వంతులు ప్రకారం పంచుకొని భుజించి తమ సామి లీలలు పాడుకొనేవారు. ఆదిలో భక్తిశ్రద్ధలతో పాడే పాటలకి కోనేటి దీక్షితచంద్రుడు 'పారడీ' చేసినట్టుంది. తమ సామిలీలలో మొట్టమొదట కాటమరాజు పదాలనే వేటగాళ్ళ చేత దీక్షితచంద్రుడు పాడించాడు. తరువాత కంబము రాయడిపదాలు, కూనలమ్మ పదాలు, ధర్మరాజుపదాలు ఆటవికులు పాడినట్టు 'విజయరాఘవ కల్యాణం' వల్ల తెలుస్తోంది. అందువల్ల కాట్రేడు క్రమంగా కాటమరాజుకి తన స్థానం ఇచ్చేసినట్లు ఊహించవచ్చును.

ఒక్క వేట సంప్రదాయంవల్లనే కాక ఈ సంగతి ఇతర సంప్రదాయాలవల్ల కూడా తెలుస్తుంది. తెలుగు బాలింతలు కాట్రేడు చీరలు కడుతారు. ఈ కాట్రేడు కూడా కాటమరాజే! సంతాన ప్రాప్తికి కాటమరాజు కథ చెప్పించుకొని వినడం పరిపాటి. హంసవింశతిలో 'మాలు గాంచఁగ లేక యాసుదతి గుంది' కాటమరాజు కథానులాపముల్ విని 'అత్యంత భక్తిప్రియ పూర్వకం

బుగా కొలిచెం గాటమ రాజులకౌ నతులు చేయూర్చెక్ మహోర్విర్ల కుం...సుతోత్పత్తికై చెలియాలాగున సల్ప దైవము కృపన్ సిద్ధించె దద్వాంఛయున్' అని అయ్యల రాజు నారాయణామాత్యుడు తెలుగు సంప్రదాయన్ని తెలియచేశాడు.

పేరులో సామ్య ముంటే చాలు, ప్రాచీన దైవాల స్థానంలో ప్రజలు జానపద వీరులను నిలుపు కొంటారు!

'కర్ణాట భాష' అంటే?

శ్రీ బులుసు వేంకటరమణయ్య

శ్రీనాథుని "నాకవిత్వమ్ము నిజము కర్ణాటభాష" అనే పద్యపాదాన్ని విమర్శిస్తూ 1961 ఫిబ్రవరి నెల భారతి సంచికలో శ్రీ శ్రీపాద గోపాలకృష్ణ మూర్తిగారు కర్ణాట పదానికి—చిలిపితనం, కలహం, అల్లరి—అనే అర్థాలు చెబుతూ "నాభాష సంస్కృతమూ కాదు; ఆంధ్రమూ కాదు, రెండూ చేర్చి చేసిన అల్లరి (కర్ణాటక) భాష" అని కవి అభిప్రాయమని వెల్లడించారు. కర్ణాటపదానికి వారు చెప్పిన అర్థాలు వస్తున్నది వాస్తవమే; కాని సందర్భాన్ని బట్టి చూస్తే శ్రీనాథుడు కోపంతో తనది కర్ణాటభాష అని చెప్పినట్లు తోస్తుంది.

కొండవీటి రెడ్డిరాజ్యం పతనం అయాక కవి సార్వభౌముడు రాజమహేంద్రవరం రెడ్డిరాజులను ఆశ్రయించాడు. ఇదివరకే శ్రీనాథుని కీర్తిప్రతిష్ఠలు విని, అతనిరాకతో తమకేమయినా ప్రమాదం కలుగ వచ్చునని భావించి, అసూయాపరులైన అక్కడి విద్వత్కవులు 'శ్రీనాథునికవిత్వం సంస్కృతమూ కాదు, తెలుగూ కాదు' అని విమర్శించ ప్రారంభించారు. అతనికి అక్కడ గౌరవం లేకుండా చెయ్యడమే వారి సంకల్పం! కాని, శ్రీనాథుడు బెదరలేదు. అక్కడికి వచ్చిన తర్వాత వ్రాసిన ప్రథమ గ్రంథమైన భీమ ఖండంలో కుకవినిందాసందర్భంలో, పై విషయాన్నే మనస్సులో వుంచుకుని ఇలా అన్నాడు—

గీ. "బోధ మల్పంబు, గర్వ మభ్యున్నతంబు,
శాంతి నిష్పచ్చరంబు, మచ్చరము ఘనము,
కూపమండూకములఁబోలెఁ గొంచె మెఱిఁగి
పండితమ్మన్యులైన వైతండికులకు.

గీ. నికటముననుండి ప్రసతి కటు నిష్ఠురముగ
నవవికౌకులు బిట్టు పెద్దఱచినప్పు
డుడిగి రాయంచ యూరకయుంట లెస్స,
సైఁపరాకున్న నెందేని జనుట యొప్పు.

గీ. ప్రౌఢిఁబలికింప సంస్కృతభాషయండ్రు,
పలుకు నుడికారమున నాంధ్రభాషయండ్రు,
ఎవ్వరేమన్న నండ్రుగాకేల కొఱత
నాకవిత్వమ్ము నిజము కర్ణాటభాష."

శ్రీనాథుడు ప్రౌఢకవిత్వం చెబితే "ఇతనికి సంస్కృతమే కాని తేటతెలుగుతనం తెలియదు" అని ఆక్షేపణ! నుడికారముసొంపు వెలయగా తెలుగులో కైతసాగిస్తే 'ఇతనికి తెలుగే కాని సంస్కృతం తెలియ' దని ఆక్షేపణ! అందువల్ల విసుగుకొని, చీకాకుపడుతూ శ్రీనాథుడు 'నాది సంస్కృతమూ కాదు, తెలుగూ కాదు; కర్ణాటకం' అని తన్ను విమర్శించినవారిని ఆక్షేపిస్తూ కోపంతో పై పద్యాలను చెప్పినట్లు స్పష్ట మవుతుంది.

ఇంకొ మరొక విశేషం! కర్ణాటపదంవల్ల ఇక్కడ ఒకధ్వని వ్యక్తమవుతూ వున్నది. అది ఏమంటే—"ఓ మూర్ఖులారా! మీరనుకున్నట్టు నాభాష సంస్కృతమే కానీయండి; లేదా అచ్చతెలుగే కానీయండి. ఏమైతే నేమి? అది కర్ణ+అట (కర్ణాట)=చెవి సమీపంలో సంచరించే—శ్రవణానందకరంగా వుండే భాష. అందరికీ ఆహ్లాదాన్ని కూర్చే భాష" అని.

ఇంతేకాకుండా మరొక అర్థం కూడా స్ఫురిస్తుంది. "నా భాషలో సంస్కృత పద్ధతులూ, అచ్చతెలుగుపద్ధతులూ ఉన్నాయని మాత్రమే మీరనుకుంటున్నారు. కర్ణాటపదాలుకూడా లేక పోలేదు" అని కవిసార్వభౌముడు విమర్శకుల అసమర్థతను ఎత్తిపొడిచినట్లు అర్థమవుతుంది. ఆ కర్ణాట పదాలూ, సంప్రదాయాలూ అతని కవిత్వంలో వున్నట్లు శ్రీ వేదం వెంకటరాయశాస్త్రిగారు, శ్రీ అక్కిరాజు ఉమాకాంతంగారు, శ్రీ కుందూరి ఈశ్వరదత్తుగారు మొదలైనవారు వివరించి వున్నారు.

ఈ విషయాల నన్నింటినీ నేను తారణ సంవత్సర కార్తికమాస (నవంబరు 1944) భారతిలో వివరించి ఉన్నాను. అది చాలా ఏళ్ళక్రిందట ప్రకటించడంవల్ల చాలామందికి తెలియకపోవచ్చును. కాన, ఇప్పుడు సమయం వచ్చింది కాబట్టి వ్రాయవలసి వచ్చింది.

పోతన 'స్వప్న' చర్చ

మద్దులపల్లి వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి

పోతన భాగవతమును వ్రాసిన విషయములో సత్యాన్వేషణ మించుక చేయుదము. ఆయన శ్రీరామచంద్రుడు తనకు సాక్షాత్కరించి భాగవతమును వ్రాయు మనగా వ్రాసినవాడు, కాని కలలో గనబడి చెప్పగా వ్రాసినవాడు గా డనుట నగ్నసత్యము. ఇందులకు మన యభూత కల్పన లేమి యక్కరలేదు, ఆయనయే కంఠోక్తిగా జెప్పికొన్నాడు గనుక.

పోతన తన భాగవత రచనకు కారణము తన గ్రంథములోనే స్పష్టముగ నిట్లు చెప్పికొనియున్నాడు.

"వ. మదీయ పూర్వపుణ్య సహస్ర సంచిత తపః ఫలంబున శ్రీమన్నారాయణ కథా ప్రపంచవిరచనా కుతూహలుండనై యొక్క రాకానిశాకాలంబున సోమోపరాగంబు రాకం గని సజ్జనానుమతంబున నభ్రంకషశుభ్రసముత్తుంగభంగ యగు గంగకుం జని క్రుంకు లిడి వెడలి మహనీయ మంజుల పులిన తలంబున మహేశ్వరధ్యానంబు సేయుచు గించి దున్మీలిత లోచనుండనై యున్నయెడ. (పీఠిక) 15

సీ. మెఱుగు చెంగటనున్న మేఘంబు కైవడి
 నువిద చెంగట నుండ నొప్పువాడు
చంద్రమండల సుధా సారంబు పోలిక
 ముఖమున జిరునవ్వు మొలచువాడు
వల్లీయుత తమాల వసుమతీజము భంగి
 బలువిల్లు మూపున బరగువాడు
నీలనగాగ్ర సన్నిహిత భానుని భంగి
 ఘన కిరీటము దల గలుగువాడు

ఆ. పుండరీకయుగము బోలు కన్నులవాడు
వెడద యురమువాడు విపుల భద్ర
మూర్తివాడు రాజముఖ్యు డొక్కరుడు నా
కన్నుగవకు నెదుర గానబడియె. 16

వ. ఏను నా రాజశేఖరుం దేరి చూచి భాషింప యత్నంబు సేయునెడ నతడు దా రామభద్రుండ మన్నామాంకితంబుగా శ్రీ మహాభాగవతంబు దెనుంగు సేయుము నీకు భవ బంధంబులు దెగునని యానతిచ్చి తిరోహితుం డయిన సమున్మీలిత నయనుండనై వెరగుపడి చిత్తంబున. 17

కం. పలికెడిది భాగవత మట !
పలికించు విభుండు రామభద్రుం డట ! నే
బలికిన భవహర మగునట !
పలికెద వేరొండు గాథ పలుకగనేలా ?"

అని వ్రాసికొని యున్నాడు. ఆయన కంఠోక్తిగా జెప్పుకొనియున్న యీ భాగములో ఇది యంత స్వప్నములో జరిగిన దనుకొనుట కేమైన నాస్పద మున్నదా ? ఈ సంఘటన జరిగిన దంత యెక్కడ ? గంగాపులినతలమున. ఏ తరుణమున ? చంద్రగ్రహణ పుణ్యకాలమున. గ్రహణ పుణ్యకాలమున కర్మఠులు నిద్రపోవు నవకాశ ముండునా? నిద్రపోవుటకే యైనచో గంగా పులినతలమునకే పోవలయునా ? గంగలో స్పర్శస్నానము చేసి పావన పులినతలమున గూర్చుండి ధ్యానము చేయుచు కించి దున్మీలితనయనుడై యున్న యెడ నెదుట ప్రత్యక్షముగ రాముడు సీతతో గన్నుగవకు గనబడినట్లుగా పోతన చెప్పుకొనియున్న సందర్భములో స్వప్నమున కవకాశ మెక్కడిది ?

ఇట్లుండగా శ్రీ వీరేశలింగము పంతులుగారు కవుల చరిత్రలో (రెండవకూర్పు 553 వ పుట.) 'బమ్మెర పోతనామాత్యుడు తాను భాగవతంబు రచింప బూనుటకు కారణమును నా గ్రంథములోనే యీ క్రింది వాక్యములలో దెలిపియున్నాడు.' అని వ్రాసి మదీయ పూర్వజన్మ .... అన్నది మొదలు వెరగుపడి చిత్తంబున .... అన్నంతవరకే గాక (554 వ పుట) 'మరలి కొన్ని దినంబుల కేకశిలా నగరమునకు జేరి భాగవత రచనకుం జనుదెంచి యందు గురువృద్ధ బంధు జనానుజ్ఞాతుండనై' (భాగవత పీఠిక 23) అన్నంతవరకు నుదాహరించి యావల నిట్లు వ్రాసియున్నారు.

'ఇతడు మొదటినుండియు శైవుడయి యుండియు నొక చంద్రగహణ సమయమునందు గంగా స్నానమునకు బోయినప్పు డక్కడ నాకస్మికముగా స్వప్నమున రామభద్రుండు ప్రత్యక్షమయి తన్నామాంకితముగా శ్రీ మహాభాగవతమును దెలుగు చేయుమని యానతిచ్చుటచేత భాగవతరచనమునకు బూనెను' అని వ్రాసియున్నారు. మరియు 564 వ పుటలో 'శ్రీరామమూర్తి భాగవతమును తెనిగింపవలసినదని చెప్పినట్లు స్వప్నము రాగా నితడు శ్రీ రామాంకితముగా భాగవతపురాణమును తెనిగించెను' అని వ్రాసియున్నారు. ఇక్కడ స్వప్నప్రసక్తి కవకాశ మెక్కడ నున్నదో బోధపడదు. ఇంటివాడు పాడిగేదె యనగా బయటివాడు వట్టి గేదె యన్నట్లే ఆయె గదా !

ఇందువలన గలిగిన యనర్థ మెంతవర కాపాదించినదో చూడుడు. ఒక సుప్రసిద్ధ పండితు డొక యుపవాచకములో పోతనను గురించి వ్రాయుచు 'భాగవత రచన' యను శీర్షిక క్రింద 'ఒక దినమున బోతన నిదురించుచున్న సమయమున 'మెరుగు చెంగట నున్న మేఘంబు కైవడి నువిద చెంగట నుండ నొప్పువాడు .... రాజ ముఖ్యు డొక్కరుడు స్వప్నమున సాక్షాత్కరించి భాగవత మనువదించి తన కంకిత మీయవలసినదిగా నాజ్ఞాపించినాడు' (మధుర కవులు 24 వ పుట) అని వ్రాసియున్నారు. వీరి కాధార మా కవుల చరిత్రములోని వ్రాత తప్ప మరి యే మున్నది ?

ఇంకను దీని పరిణామ మెంతవఱకు వచ్చినదో చిత్తగింపుడు. 1958 స్కూల్ ఫైనల్ పాఠ్యభాగములో 'నాకథ' యను పాఠ మొకటి వేయబడినది. అది గోదావరి తన కథ చెప్పుకొనినట్లుగా వ్రాయబడినది. రచయిత్రి శ్రీమతి గరిమెళ్ల గురులక్ష్మమ్మదేవిగారు. ఆ పాఠములో మారాకు హత్తించి వ్రాయబడిన దిట్లు—

"గ్రహణవేళ గృతావగాహుడై పోతనామాత్యుడు నా తీరమున జెట్టునీడ శయనించి భాగవతావతరణమును గూర్చి కల గనుట యే నెరుగుదును." (89 వ పుట) అని.

గ్రహణ పుణ్యకాలమున తనలో స్నానముచేసి తన పులిన తలముననే ధ్యానము చేసికొనుచున్న పోతనకు శ్రీరామ చంద్రుని సాక్షాత్కరింప జేసిన (గంగ) గోదావరి, గ్రహణ వేళను స్నానము చేయించి గట్టున జెట్టు నీడలో పండ బెట్టి నిద్రపుచ్చి కల వచ్చునట్లు చేయుట కే మాధారమో !

ఈ యభూతకల్పన యింతటితోనే అగిన దనుకొన రాదు. పలవలు, చిలువలతో యంత యనర్థమునకు దారి తీసినదో చూడుడు.

1959 మార్చి (ఎస్. ఎస్. ఎల్. సి. స్టాండర్డ్) పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షాపత్రము ట్రాన్స్లేషనున కియ్యబడిన దానిలో పోతనను గురించి యిట్లున్నది.

"…. పోతన ప్రతిదినము ఆ దేవాలయమున కేగి స్వామిని సేవించుచుండెడివాడు. ఒక నాటి రాత్రి స్వామి అతని స్వప్నమున సాక్షాత్కరించి భాగవత రచనకు అతనిని పురికొల్పె ననియు, ఆ మఱునాటి నుండియే అతడు భాగవతరచనలో నిమగ్నుడయ్యె ననియు జెప్పుదురు" అని.

ఈ యభూతసృష్టికిని, ఈ యనర్థపరంపరకును అంతులేక పోయెగదా ! సత్యబద్ధమైన దానికిని ఇట్టి యుప కల్పనలా ? ఏదో యొక మార్పు చేసిన నది గుణావహ మైనచో నాటకాదులలో వలె, సంతోషింతము గాక. ఉన్న సత్యమున కన్న లేని యుపకల్పన అపకర్షక మైనపు డేమనుకొనవలె ?

ఇక బాగుపడున దెట్లు ?

గతానుగతికో లోకః న లోక పారమార్థికః !

రాయల్ అకాడమీ ఆఫ్ డ్రమెటిక్ ఆర్ట్

"నాటకంలో వేషం వేద్దామా ? ఇంకా యేదైనా పని నేర్చుకుందామా ? అని అనుమానంగా ఉంటే నాటకాలలో చేరడానికి యత్నించకు" అని లండన్‌లోని "రాయల్ అకాడమీ ఆఫ్ డ్రమెటిక్ ఆర్ట్" ప్రధానాధ్యాపకుడు శ్రీ జాన్ ఫెర్నాల్డ్ చెప్పే సలహా. 1904 లో యేర్పడినది ఈ సంస్థ. "ఇక యేమనీ చెయ్యలే ననుకుంటే, కొన్ని సంవత్సరాలపాటు యమయాతనలకూ, నిరుత్సాహానికీ సిద్ధంగా ఉంటే నటుడు కావాలనే లక్ష్యాన్ని సాధించే కృషి చెయ్యి" అని కూడా ఆయన సలహా.

ఈ సంస్థలో శిక్షణపొందే అవకాశం లభించడం కష్టం. ఏటేటా 800 దరఖాస్తులు వస్తూంటాయి. వాటి లోంచి—80 మంది - అభ్యర్థులను ఎంచుకుంటారు. ఇటీవలిసంవత్సరాలలో శిక్షణపాటవం చాలా ఎక్కువైనది.

శిక్షణ పొందదలిచే అభ్యర్థులకోసం న్యూయార్క్, కేప్ టౌన్, సిడ్నీ, ఒంటారియాలలో స్వర పరీక్షలు జరుపుతారు. శిక్షణ రెండు సంవత్సరాలు. నాలుగు నెలలకూ పౌ 52—షి 10 లు రుసుము. ప్రత్యేక ప్రావీణ్యంగల నిజంగా అవసర ముండే విద్యార్థులకు ఉపకార వేతనాలు లభిస్తవి. చాలా చిన్నతనంలో శిక్షణకు చేరడం మంచిదికాదని శ్రీ ఫెర్నాల్డ్ అభిప్రాయం. 17 సంవత్సరాల వయస్సు తగినది. శరీరపుష్టి బాగా ఉండాలి. చూపు బాగుండాలి. పొట్టివారుగా ఉండరాదు. మరీ పొడుగ్గా ఉండరాదు. బాలికలలో పొడవు ఓ పెద్ద సమస్య.

నాటకరంగంలో యువతులను ఎదుర్కొనే మరో సమస్య—చాలా నాటకాలలో ఆడవేషాలు ఎక్కువ ఉండవు. ఎనిమిది మగవేషాలుంటే మూడు ఆడవేషా లుంటయ్.

బాగా పరిణతిపొందిన రచయితలు మాత్రమే నిజంగా మంచి నాటకాలను వ్రాయగలరంటారు శ్రీ ఫెర్నాల్డ్, మధ్యరకం నటుడికైనా నాటకంలో వేషం దొరుకుతుంది. మహిళలకు ఆ అవకాశం ఉండదు. చాలా సామర్థ్యం ఉండాలి. నాటకరంగ నిర్వహణ, ఫిలిమ్ విషయాలూ, రేడియో టెలివిజన్‌లలో నటించడం కూడా నేర్పుతారు ఈ అకాడమీలో.

రాయల్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్

ఏటేటా 10,000 సమకాలీన కళాకారుల తైల వర్ణచిత్రాలూ, శిల్పాలూ, నీటిరంగు చిత్రాలూ ఇంకా రకరకాల బొమ్మలూ వస్తూంటయ్ పికడిలీ—లండన్‌లోని బర్లింగ్టన్ భవనంలోని రాయల్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ ప్రధాన కార్యాలయానికి. ప్రదర్శన మే నుంచి ఆగస్టు రెండోవారందాకా జరుగుతుంది. బ్రిటన్‌లోని సమకాలీన చిత్రకళ సంగతి సందర్భాలు తెలుసుకోడానికి అది మంచి అవకాశం. 1,500 కళాఖండాలను ప్రదర్శించేందుకు సరిపోయే స్థలం ఉన్నది. బొమ్మలన్నీ అమ్మకానికేనని కాదు కానీ ఆరేడువందల కళాఖండాలు అమ్మకమవుతాయి. ఇట్లా అమ్మిపెట్టినందుకు కమీషనేమీ తీసుకోదు అకాడమీ. 1959 లో 674 కళాఖండాలు పౌ 46,000 లకు అమ్మకమైనవి. సొమ్ము అంతా ఆయా కళాకారులకే ఇచ్చేశారు.

మూడవ జార్జిరాజుకాలంలో - 1768 లో కొంత మంది కళాకారులు ప్రారంభించారు. ఈ అకాడమీని. అకాడమీ ఆర్థికంగా స్వయంపోషకమయ్యేవరకూ మూడవజార్జి కొంత ఆర్థికసహాయం చేశాడు—చాలా సంవత్సరాలు. మొదటి అధ్యక్షుడు సర్ జోషువా రైనాల్డ్స్. ఆయన శిలా విగ్రహం అకాడమీప్రాంగణంలో చూడవచ్చు. పాల్‌మాల్‌లో ఒక వేలంవర్తకుని ఆవరణలో మొదటి కార్యాలయం.

ఆ తరువాత కొన్ని సంవత్సరాలకు 1771లో వాటర్లూ బ్రిడ్జివద్ద సోమర్‌సెట్ భవనంలోకి అకాడమీ ప్రధానకార్యాలయం మారినది. అది పురాతన భవనమైనందున పడగొట్టి పెద్దభవనం నిర్మించి అకాడమీ కార్యాలయాన్నీ, కొన్ని ప్రభుత్వకార్యాలయాలనూ ఏర్పాటు చేశారు. 1836 దాకా అక్కడ ఉన్నది అకాడమీ. టర్నర్, వంటి ప్రముఖ కళాకారులు అకాడమీ ఆ భవనంలో ఉండగా ఆ శిక్షణ పొందారు. 1837 లో ట్రెఫాల్గర్ స్క్వేర్‌కూ, ఆ తరువాత 1869 లో బర్లింగ్టన్ భవనానికి మారినది అకాడమీ.

—(బ్రిటిష్ ఇన్‌ఫర్‌మేషన్)

గ్రంథ విమర్శనము

వికాసభారతము

ఆదిమ పర్వము—కర్త శ్రీ గొట్టిపాటి— సుబ్బరాయలు, డెమ్మీ క్రౌను సైజు 12+120 పుటలు. మూల్యం మూడు రూపాయలు. ప్రతులు దొరకుచోటు : కృష్ణా బుక్ స్టాల్, అనంతపురం.

ఆదిమ కాలం నుంచీ యిప్పటిదాకా భారత దేశం యొక్కయు, భారతీయులయొక్కయు చరిత్రను 'వికాసభారతం' అనే పేరుతో ఆదిమ పర్వం మున్నగు పర్వాల్లో మహాభారతం వలె రచించాలని రచయిత సంకల్పం. అందులో మొదటి సంపుటం 'ఆదిమపర్వం' ప్రకటింపబడినది. "ఆదిమ ప్రజ జీవితము, ఆర్యులిటకు నరుగుదెంచి, పరిస్థితులన్వయించుకొనుచు మెల్లగ మెల్లిగా కుదురుకొనెను దాక" ఇందులోని చరిత్ర వున్నది.

"ఆదిమ దశనుండి అణుయుగందాక వివరాల జోలికి వెళ్ళకుండా విశిష్టతలను, జారవిడువకుండా జ్ఞాపకాలకనువుగా కావ్యం వ్రాయవలెననే సంకల్పం" ఈ కవికి "రాజకీయాల ప్రమేయం తగ్గించుకొని సాహిత్య సేవలో జీవితం ధన్యం చేసుకోవలసిదిగా దాదాపు రెండేళ్ళక్రితం......పూజ్యులు శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు సలహా యిచ్చిననాడు కలిగింది." ఆ సలహాను అనుసరించే యీ గ్రంథ రచనకు ఆయన పూనుకున్నట్లు కానవస్తుంది.

అసలు గ్రంథానికి ముందు 'అర్పణము, కృతజ్ఞత, ఉన్మీలనము, ఉద్భాసితము, తెలుగు వెలుగు' అనే శీర్షికలు వున్నవి. 'అర్పణము'లో దీని కృతిపతి, ఆంధ్రప్రదేశం ప్రధానామాత్యులు శ్రీ సంజీవయ్యగారి ప్రశస్తి వుంది. 'కృతజ్ఞత'లో గ్రంథాన్ని అచ్చు వేయించిన ద్రవ్యదాతలు శ్రీ రామలింగప్ప నాగప్ప శాంతప్పల ప్రశంస వున్నది. 'ఉన్మీలనము'లో గ్రంథ రచనోద్దేశము, గ్రంథవిషయము, అందులోని పర్వాల వివరణము కలవు. 'ఉద్భాసితము'లో కవి యొక్క స్వీయచరిత్ర సంగ్రహంగా ఇయ్యబడినది. 'తెలుగు వెలుగు'లో ప్రాచీనాంధ్ర కవుల యొక్కయు, ఇప్పటివారిలో కవి అభిమానానికి పాత్రులయిన వారి యొక్కయు ప్రశంస వున్నది. తర్వాత గ్రంథం ప్రారంభమవుతుంది.

'ఆదిమ ప్రజజీవితము, ఆర్యులిటకు నరుగుదెంచి పరిస్థితులన్వయించుకొనుచు మెల్లగ మెల్లిగా కుదురుకొనెను దాక—ఆదిమ పర్వమై దనరు' అని యీ గ్రంథంలోని విషయాన్ని గురించి రచయితయే చెప్పినారు. కవి తాను, ఆదికాలంలోకి పోయి, ఆయా సంఘటనలను ప్రత్యక్షంగా చూచినట్లు చమత్కారంగా కూర్చినారు. ఇందులోని విషయాలు చాలా వరకు ఊహల మీద ఆధారపడినవే. వాటి యథార్థ స్థితిని నిర్ణయించడం సులభం కాదు. ఆర్యుల ఆదిమ నివాసాన్ని గురించి చాలా కాలం నుంచి వాదవివాదాలున్నవి. ఆదిమ నివాసం భారతభూమే అని ఇప్పుడు చాలామంది సకారణంగా నిరూపించారు. ఇందులో మాత్రం పై ప్రాంతాల నుంచి వచ్చినట్లు కవి అభిప్రాయం స్పష్టంగా ఉన్నది. నన్నయకంటె నన్నెచోడుడే ప్రాచీనుడని ఇతని భావం! దీన్ని విమర్శకులలో అధిక సంఖ్యాకులలో అధిక సంఖ్యాకులు అంగీకరించడం లేదు. కవి తనకు తోచినట్లు వ్రాసినారని అనుకోవలసి వున్నది.

కవిత్వాన్ని గురించి తెలుపుతూ — 'కల్పనలు, వర్ణనలు లేకపోతే కవిత్వం యెట్లాఅవుతుంది? అనువనే వారితో నేనేకీభవించలేను" అని తన అభిప్రాయాన్ని రచయిత వివరించారు. కవనం చెప్పడమంటేనే వర్ణించడం! అది లేనిదే కవిత్వం కాదు. వర్ణనలేకుండా ఉన్నది ఉన్నట్లు చెప్పిన యెడల ఛందోబద్ధమైన రచన మాత్రం కాగలదు. కావ్యం కాదు. అట్టి రచన కంటె యథార్థస్థితిని చక్కగా చెప్పుతూ వచనం వ్రాస్తేనే మేలు.

ఇందులోని రచన తేటగీతులలోను, ఆటవెలదులలోను, అక్కడక్కడ గేయాలలోను జరిగింది. గ్రాంథిక భాషలో వ్రాయాలనే కవి అభిప్రాయమేమో! కాని వ్యాకరణవిరుద్ధాలు, వ్యావహారికాలు అయిన పదాలు ధారాళంగా వాడబడినవి, వాడుక భాషను ఆమోదించేవారు కూడా ఉపయోగించని పదాలూ ఉన్నవి. కళలుగా వుండవలసిన చాలా పదాలు ద్రుతాంతాలుగా ఉన్నవి.

సామర్థ్యము (సమర్థము — అనుటకు) మెల్లిమెల్లిగా—బానిసత్వమ్ము, భారత బాటసారి, ఒద్దికలు లేక నేమియు నోరగడనుచు, తాంజాగు రాకజవులు, పెరవారి యుద్ధృతములు, సూక్తములు గంతతాబట్టు సూరి, పురహితుడు (పురోహితుడు అనుటకు) మున్నగునవి పై వాటికి ఉదాహరణాలు కావచ్చును. 42-వ పుటలోనూ, 104వ పుటలోనూ వున్న పద్యాలు కొన్ని అసభ్యంగా ఉన్నవి. అవి అశ్లీలదోషజుష్టాలు. ఎంతో వ్రీడాకరాలు! సభ్యతకు సుదూరమైనవి, వాటిని విడిచి పుస్తకం అచ్చువేసినా బాగుండేది.

పయివాటితోపాటు అచ్చుతప్పులు కూడా చాలా ఉన్నవి. పుస్తకాన్ని సర్వాంగ సుందరంగా తయారు చెయ్యగోరిన రచయిత ముద్రణ విషయంలో ఎంతో శ్రద్ధ తీసికోవలసినది. గ్రంథంచివరలో

'పాఠకులపైన నాకింతపాటి నమ్మ
కమ్ము విలసిల్ల బట్టియే రొమ్ము బలము
కుదిరి గ్రంథమ్ము వ్రాసెదు కుతుకమబ్బ
కడమ పర్వాలు ప్రకటించు కొంత మీరె'

అని, తన గ్రంథాన్ని ప్రజలు తప్పక ఆమోదిస్తారనే నమ్మకాన్ని వెలిబుచ్చారు. ఆమోదించేవారు ఉండవచ్చును. అయినా కడమ పర్వాలను ప్రకటించేటప్పుడయినా, అవి అందరి ఆమోదానికి పాత్రము లయేటట్లు, అసభ్య విషయాలకు, అపప్రయోగాలకు దూరంగా వుండేటట్లు చూచుకోవడం మంచిది.

శ్రీ ఈశ్వర సత్యనారాయణ శర్మగారి రచనలు

1. దేవపూజా రహస్యము 1-12-0, 2. సౌందర్యలహరి 0-12-0, 3. భీమేశ్వరనుతి 0-8-0, 4. దేవీసూక్త పరమార్థము 0-12-0, 5. శ్రీ సత్యనారాయణశర్మ సాధనము 1-8-0, 6. శాస్త్ర సాధనము 0-8-0, 7. మహాసౌరమంత్రపాఠము 0-12-0, 8 అమ్మతో ముచ్చటలు 1, 2 భా. లు. 1-8-0. సాంప్రదాయ రహస్యములను, మర్మములు విడిచి విప్పి చెప్పిన శ్రీ శర్మగారి గ్రంథములెల్లరు చదువతగినవి.

సాధన గ్రంథమండలి తెనాలి.

హిందీ ఔర్ తెలుగు — ఏక్ తులనాత్మక్ అధ్యయన్

హిందీ. లేఖకులు: శ్రీ సుందరరెడ్డి, అధ్యాపకులు, ఆంధ్రవిశ్వవిద్యాలయము, క్రౌను 14 + 184 పుటలు. వెల: నాలుగు రూపాయలు. ప్రకాశకులు: చంద్రికా ప్రకాశన్, వాల్తేర్ —ఆంధ్ర.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక హిందీ భాషకు ప్రాముఖ్యం హెచ్చి, క్రమంగా హిందీయే భారతదేశ భాషగా నిశ్చితమైనది. యావద్భారతదేశంలోని వివిధ ప్రాంతాలవారు తమ ప్రాంతీయభాషతోపాటు హిందీని నేర్చుకుంటూ, అందులోనూ ప్రావీణ్యాన్ని సంపాదిస్తున్నారు. ఈవిధంగా హిందీ భాషా సాహిత్యాలు బహుళంగా వ్యాపించడానికి చక్కని అవకాశం ఏర్పడింది. అలా అని, ప్రాంతీయభాషలను ప్రభుత్వం చిన్నచూపుతో చూడలేదు. కేంద్ర, ప్రాంతీయ సాహిత్య అకాడమీల మూలంగానూ, తదితర విధంగానూ వాటి అభివృద్ధికి దోహదం యిస్తూనే వున్నారు. అంతే కాకుండా ప్రాంతీయ భాషల్లోని ఉత్తమ రచనలను హిందీలోకి అనువాదం చేయించి అన్నిప్రాంతాలవారికీ, ప్రధాన భాషలు అన్నింటిలోనూ వుండే వైశిష్ట్యాన్నీ, ప్రత్యేకతనూ హిందీమూలంగా అందించడానికి యత్నిస్తూవున్నారు. ఇతరులు కూడా ఈ విషయంలో సానుభూతిని చూపుతున్నారు. అట్టివారిలో శ్రీ సుందరరెడ్డిగారొకరు. వీరు హిందీభాషలో పరిపూర్ణ పాండిత్యమూ, రచనా పాటవమూ కలవారు. వీరి ఉత్తమ రచనలలో ఈ గ్రంథం ఒకటి.

ఈ గ్రంథంలో ఆంధ్ర వాఙ్మయంయొక్క వివిధ విభాగాలయొక్క సంగ్రహ చరిత్రా హిందీ వాఙ్మయంయొక్క వివిధవిభాగాల సంగ్రహచరిత్రా ఒకదానితో ఇంకొకదానిని పోలుస్తూ, వాఙ్మయ ద్వయానికీ పరస్పరం వుండే సామ్యమూ, భేదమూ వివరించబడినవి. ప్రాచీన కవులతోపాటు ఆధునికుల రచనలను కూడా ఉదాహరిస్తూ, వారి వారి ప్రత్యేకత తెలుపబడినది. దీనివల్ల తెలుగు

వాఙ్మయా సంగ్రహ చరిత్రా, విశిష్టతా తదితరులకు సులభంగా తెలుసుకోడానికి వీలు ఏర్పడి నది. హిందీలో కొంచెపాటి ప్రవేశంవున్న తెలుగు వారు హిందీ వాఙ్మయాన్ని గురించి తెలుసుకునే అవ కాశం కూర్చబడినది. దీనిమీద అభిప్రాయం యిచ్చిన కేంద్ర విద్యామంత్రి శ్రీ శ్రీమాలి అభిప్రాయపడి నట్లు దీనిని తెలుగులోకి తర్జుమా చేస్తే హిందీ వాఙ్మ యాన్ని గురించి ఆంధ్రులందరూ తెలుసుకునే అవ కాశంకూడా ఏర్పడగలదు. ఆ ప్రయత్నానికి శ్రీ సుందర రెడ్డిగారు పూనుకుంటారని విశ్వాసం!

ఈ పుస్తకంలో 30 శీర్షికలలో పెక్కు అంశాలు దృష్టిలో ఉంచుకుని హిందీ తెలుగు వాఙ్మయాలు పరి శీలించబడినవి. అజ్ఞాతయుగంనుండి అతినవీనకాలం వరకూవున్న వాఙ్మయరీతులు ఇందు చూపబడినందువల్ల ఇది సంగ్రహరూపమయినా సమగ్రమనే చెప్పవలసి వున్నది.

శ్రీ రెడ్డిగారు ఎంతో జాగ్రత్తతో వాఙ్మయ ద్వయాన్నీ పరిశీలిస్తూ రచన సాగించారు. అయినా అక్కడక్కడ కొన్ని అంశాలు పునఃపరిశీలన చెయ్యా వలసినవిగా ఉన్నవి. వాటిలో కొన్ని ఇక్కడ ఇవ్వ బడుతున్నవి.

(1) నన్నెచోడుని కాలం వివాదాస్పదంగా వున్నదనీ, ఇప్పటివరకూ ప్రామాణికంగా ఏ నిర్ణయమూ లేదనీ 11 వ పుటలో వున్నది. కాని, నన్నెచోడుని కుమారసంభం 12 వ శతాబ్దిలోనిదని 85 వ పుటలో వ్రాయబడినది.

(2) పండితారాధ్యుడు 'శివతత్త్వ పురాణము'ను రచించినట్లు 19 వ పుటలో ఉన్నది. ఆయన రచించినది శివతత్త్వసారము; శివతత్త్వ పురాణము కాదు.

(3) రాయలసభలోని అష్టదిగ్గజాలను పేర్కొనే టప్పుడు మాదయ్యగారి మల్లన ప్రస్తావన లేదు. అతనికి బదులు ఘంటసాల నృసింహాకవి స్వీకరింపబడినాడు. అయ్యలరాజు — రామభద్రకవి 'రామచంద్రకవి' గా చెప్పబడినాడు. (పుట 57)

(4) శ్రీ కృష్ణశాస్త్రిగారిని గురించి వ్రాస్తూ, వారి 'ఊర్వశి' 'ప్రవాసము' 'కృష్ణపక్షము' చాలా ప్రసిద్ధమైనవని 76 వ పుటలో ఉన్నది. ఊర్వశి, ప్రవాసం వేర్వేరు గ్రంథాలు కావు. 'ప్రవాసము-ఊర్వశి' అనేది ఒకే గ్రంథం.

(5) ఆ పుటలోనే శ్రీ శివశంకరశాస్త్రిగారు 'పద్మావతి', 'చరణచారణ చక్రవర్తి' అనే గ్రంథాలను వ్రాసినట్లున్నది. అది సరికాదు. 'పద్మావతీ చరణ చారణ చక్రవర్తి' అనేది ఒకే గ్రంథం.

(6) వీరేశలింగంపంతులుగారు నీతిచంద్రికలోని విగ్రహమును, సంధుమునూ, ప్రకరణమునూ పూర్తి చేశారని 113 వ పుటలో ఉన్నది. నీతిచంద్రికలోని భాగం 'సంధి' కాని 'సంధుం' కాదు. 'ప్రకరణం' అందులోని భాగం కాదు.

(7) శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు సవరల కోసం సవరలిపి అనే కొత్త లిపిని కల్పించారని 132 వ పుటలో ఉన్నది. శ్రీ పంతులుగారు సవర భాషకు వాచకములూ, నిఘంటువులూ వ్రాశారు. ఆ భాషలో గొప్ప పరిశ్రమ చేశారు. కాని లిపిని నిర్మించినట్లు ఇంతవరకూ తెలియదు. శ్రీ రెడ్డిగారు పై రీతిని ఎలా వ్రాశారో?

(8) శ్రీ కొమర్రాజు లక్ష్మణరావుగారు 'హిందూ మహమ్మదీయ యుగము'ను వ్రాసినట్లు 139-వ పుటలో ఉన్నది. శ్రీ లక్ష్మణరావుగారు 'హిందూ మహాయుగము, మహమ్మదీయ మహాయుగము' అనే రెండు పెద్ద చరిత్ర గ్రంథాలు వ్రాశారు. 'హిందు మహమ్మదీయ యుగము' అనే గ్రంథం వ్రాయలేదు.

ఈ పై విషయాలనుబట్టి శ్రీ సుందరరెడ్డిగారు కొన్ని గ్రంథాలు చూడకుండానే వాటిని గురించి వ్రాసినట్లు అపోహ కలుగవచ్చు. అట్టి అపోహకు అవ కాశం లేకుండా రెండవముద్రణలో వీటిని సరిచేసుకో వలసి వున్నది.

"బాల వ్యాకరణములోని శ్రీ పరవస్తు చిన్నయసూరి గారి ప్రమాదములెల్ల తొలగించి వ్రాసినది. I బాల వ్యాకరణోద్ద్యోతము వెల ఆరు రూపాయలు, II ద్రావిడ భాషాసామ్యములు. వెల రెండురూపాయల మేబది నయాపైసలు. వలయువారు: వఝల చినసీతారామ స్వామిశాస్త్రి, కోడుగంటివారివీధి, విజయనగరం.

సరిక్రొత్త సాంకేతికశాస్త్ర గ్రంథములు
వ్యవసాయము-ఇంజనీరింగు-వైద్యము, మరియు వివిధ విషయములపై గ్రంథములుగలవు. కేటలాగుఉచితము ఇంగ్లీషులో వ్రాయండి.
N.K. Paul & Sons, P.B. 12202 Calcutta-5

ఇంతవరకూ ఎవరూ చేయని కృషిచేసి, తెలుగు వాఙ్మయాన్ని గురించి ఇతరులకు ఈ గ్రంథం మూలంగా పరిచయం చేసిన రెడ్డిగారికి ఆంధ్రులు అందరూ కృతజ్ఞత చూపవలసివున్నది.

శబరి

(హిందీ)

శ్రీ బాలశౌరి రెడ్డి విరచితము. క్రౌను 144 పుటలు. వెల రెండు రూపాయలు. ప్రకాశకులు: శిక్షా భారతి, నెం. 1. రామకిశోర్ రోడ్, ఢిల్లీ.

రామాయణంలో వచ్చే శబరి పాత్రను ఆధారం చేసుకుని, అప్పటి పరిస్థితులను అనుసరించి వ్రాయబడిన నవల యిది. శ్రీ రెడ్డిగారు ఎంతో ఆలోచించి, అప్పటి కాలపరిస్థితులనూ, సంఘ పరిస్థితులనూ, వ్యక్తుల వివిధ ప్రవృత్తులనూ, విశ్వాసాలనూ, సంఘపు కట్టుబాట్లనూ రచయిత యిందులో చక్కగా చిత్రించారు. శబరి బలపరాక్రమాలూ, నిష్కల్మష హృదయమూ, మతంగ మహాముని సమదృష్టీ, రాహులుపు దౌర్జనమూ, శతభిషుని పరోపకారబుద్ధీ, చక్కగా ఇందులో పోషించబడినవి. తారక మంత్రోపదేశం పొంది, అచంచల భక్తిమూలంగా చివరకు శబరి ముక్తిపొందిన ఘట్టం కూడా మనోహరంగా కూర్చబడినది. పురాణ కాలంలోని ఒక పాత్రను తీసుకుని, పాత్రానుగుణ సన్నివేశాలతో నవలను—హృదయంగమంగా కూర్చే నేర్పు శ్రీ రెడ్డిగారి కున్నదని ఈ పుస్తకమే వెల్లడించ గలదు. వీరు ఈ విధంగానే మరికొన్ని రచనలు సాగిస్తే వాఙ్మయానికి ఎంతో సేవ చేసినట్లవుతుంది.

బోసు భారతము

పద్యకావ్యము. రచయిత శ్రీ అయితం-కాళీ వరప్రసాదరావుగారు, శ్రీ లలితా సాహిత్యనిలయము, సూళ్లూరుపేట, నెల్లూరుజిల్లా. డెమ్మీ సైజు 8+18+430 పుటలు, క్యాలికో బైండు. వెల తొమ్మిది రూపాయలు. ప్రతులు కావలసినవారు గ్రంథకర్తకు వ్రాయవలెను.

ఇందు రెండువేల ఒకవంద పద్యాలు పరిమితిగల అయిదు ఖండాల్లో సుప్రసిద్ధ రాజకీయ వేత్త, మేధాశాలి, భారత స్వాతంత్ర్య సిద్ధికై విదేశములందును కృషిచేసిన మహా నాయకుడు-అగు నేతాజీ శ్రీ సుభాష్ చంద్రబోసు జీవితచరిత్ర, ఆదినుండియు, అతని బెర్లిను నగర గమనం వరకూ వుండే కథాంశం వివరించబడినది, ఇది పూర్వకథ. ఉత్తర భారతకథలో కూడా అయిదు ఖండాలు ఉండగలవనీ, అవి కూడా వ్రాసేతలపు (1953 సం. నాటికి) కలదనీ గ్రంథకర్తయే ఈ గ్రంథం చివర- "బోసు భారతమునన్ ప్రాక్ పంచ ఖండాళి వ్రా-సితి, మానోత్తర ఖండ పంచకకృతిన్ శిష్ట శ్రీవః పేయసన్నుత భావార్థ సుగంధ గంధిలము మాన్యుల్ మెచ్చ వ్రాకుత్తు" అని తెలిపియున్నారు. అందులో బెర్లినులో బోసు ప్రణయఘట్టం మొదలు కొని విమాన ప్రమాదానికి గురియై ఆయన అసువులు విడిచేవరకూ వివరించబడునట్లు గ్రంథకర్త యిచ్చిన సంగ్రహ కథాభాగం వల్లనే వ్యక్తమవుతున్నది.

శ్రీ కాళీవర ప్రసాదరావుగారు సుప్రసిద్ధ విద్వత్కవులు; అనుభవజ్ఞులు, తీరికగల సమయాల్లో వాఙ్మయ సేవ చేస్తూ, తమ జీవితాన్ని ధన్యం చేసుకుంటున్న సహృదయులు. వీరు తమ మిత్రులూ, గూడూరు మునిసిపల్ కౌన్సిలు చెయిర్మనూ అయిన శ్రీ పసుపులేటి సిద్ధయ్య నాయుడిగారి కోరిక మేరకు ఈ గ్రంథాన్ని రచించి శ్రీ నాయుడుగారి తలిదండ్రులకు అంకితం ఇచ్చారు. కవి సార్వభౌములూ, మహామహోపాధ్యాయులూ, ప్రభుత్వాస్థాన కవులూ అయిన శ్రీ. శ్రీ. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి విపులమైన పీఠిక దీనికి ఉన్నది. అందులో శ్రీ శాస్త్రిగారు శ్రీ కాళీవర ప్రసాదరావు గారి పాండిత్యమునూ, కవిత్వమునూ, బోసు భారతాన్నీ ప్రశంసించి యున్నారు. అట్టి పెద్దల ప్రశస్తిని పొంది, ఉత్తమపురుషుని చరిత్రను తెల్పే యీ గ్రంథం ఈకాలపు రచనలలో ఉత్తమ శ్రేణికి చెందడంలో వింత లేదు. ఇందలి రచన సామాన్యులకు కూడా అర్థమయ్యే శైలిలో సరళంగా సాగినది. పుస్తకం చక్కగా ముద్రించబడినా, అచ్చు తప్పులు అధికంగా దొర్లాయి. అర్ధానుస్వారాలూ ఘధలూ ఎన్నో చోట్ల తారుమారయాయి. రచన తొందరగా జరిగిన కారణాన

జోస్యపురం పద్యకావ్యములు

1. గోముఖవ్యాఘ్రరావుగారు, 2. కామోపాలంభనము, 3. కలగూరగంప. గంభీరమగు కామోపాలంభనము అలంకారశాస్త్రసమ్మతమగు విపుల పీఠికతో సుబోధము చేయబడినది. క్రౌను 1/8 సైజు 100 పేజీలు.

వెల రు 50 న॥ పై॥ జోస్యో. జోస్యపురం.

అంబాజీపేట O. P- (తూర్పు గోదావరి.)

కొన్ని చోట్లు అక్కడక్కడ కొన్ని తప్పులు కానవస్తున్నవి. విమర్శనార్థం పంపిన ప్రతిలో రావుగారే చాలా చోట్ల దిద్ది పంపారు. దిద్దనివి కూడా "వానిసత్యవిముక్తి" (376) 'పలికెను నిటులన్ (395), 'రష్యా మహీశరాయబారులను' (406), 'తత్సఖ్యత' (408) మున్నగునవి కానవస్తువి. పీఠికా కర్త "ఇది మృదుశైలితో నలరారుచున్నదని చెప్పజాలను కాని, శైలి ప్రౌఢమనియే చెప్పవలసి వచ్చుచున్నది. కవి పీఠికలో చెప్పినట్లు ప్రమాద ఫలితము లింకు కొన్నియున్నవి. వానిని ద్వితీయ ముద్రణమునందు సులభముగా సవరించుకొన వచ్చును" అని వ్రాసిన మాటల నిక్కడ స్మరింపనగును. సహృదయులగు రచయిత ద్వితీయ ముద్రణములో ఇట్టి వానిని సవరించుకొన గలరని మా విశ్వాసము.

అందరికి అర్థమయేటట్లు ఇట్టి కావ్యాన్ని-నాయకుని జీవిత చరిత్రను వ్రాసినందుకు శ్రీ రావుగారు అభినంద నీయులు! వీరు ఇంతవరకూ సుబాను బాబు ఉత్తర భారతాన్ని వ్రాయకపోతే - దాన్ని కూడా పూర్తి చేసి, ప్రకటించగరలని ఆశిస్తున్నాం.

అటకే ఆంసూ

(హిందీ)

శ్రీ బాలశౌరి రెడ్డిగారి అనువాదం. క్రౌను 8+140 పుటలు, గట్టి బైండు. వెల రూ 2=50. ప్రకాశకులు-కళానికేతన్, పాట్నా-4.

దేశంలోని వివిధ ప్రాంతాలలోని జనుల అభిరుచులూ, అలవాటులూ విభిన్నంగా ఉండడం సహజం. తెలుగులో ప్రారంభంలో కథలూ, నవలలూ అనువాదాలుగానే వుండడంవల్ల వాటిలో తెలుగువారి హృదయమూ, ప్రత్యేకతా వ్యక్తం కాకుండానే ఉండేవి. కాని యీ మధ్య రమారమీ ముప్ఫయి ఏళ్లనుంచీ తెలుగు కథకులు స్వతంత్ర రచనలు సాగిస్తున్నారు. అలాటి కథలలో ఉత్తమములూ వెలువడినవి. అట్టి కథలలో ఉత్తమ రచయితలకు చెందిన పన్నెండు హిందీలోకి శ్రీ బాలశౌరి రెడ్డిగారిచే తర్జుమా చెయ్యబడి యీ గ్రంథం రూపాన ప్రకటించబడినది. తెలుగువారి కథానికా పద్ధతులను ఇతర ప్రాంతాలవారు తెలుసుకో డానికి ఈ కథానికా సంగ్రహం ఎంతో ఉపయోగిస్తుంది.

ప్రసిద్ధ రచయితలుగా పేరుపొందిన శ్రీ రామారావు, శ్రీ గోపీచందు, శ్రీ కుటుంబరావు, శ్రీ రామచంద్ర, శ్రీ సభా, శ్రీ శ్రీ వాత్సవ, శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, శ్రీ మునిమాణిక్యం, విద్వాన్ విశ్వం, శ్రీ పద్మరాజు, శ్రీ భరద్వాజ, శ్రీ కే. సత్యనారాయణ గార్లు వ్రాసిన కథలకు చక్కని అనువాదాలు ఇందులో ఉన్నవి. అన్నీ వేరువేరు పరిస్థితులకు సంబంధించిన సంఘటలను మనోహరంగా చిత్రిస్తూ ఉన్నవి.

ఈవిధంగా ఆంధ్ర రచయితలను ఇతరులకు పరిచయం చేస్తున్న శ్రీ బాలశౌరి రెడ్డిగారి ప్రయత్నం స్తవనీయమైనది.

ఉమర్ ఖయ్యామ్ రుబాయీలు

'చలం' అనువాదం. క్రౌను 112 పుటలు. వెల రూ 2=25. ప్రకాశకులు: బుక్ సెంటర్, విశాఖపట్నం—1.

ఉమర్ ఖయ్యాం ప్రపంచ ప్రసిద్ధిని పొందిన పారశీక మహాకవి. జీవితమునకు సుఖానుభవమే పరమ లక్ష్యమనే సిద్ధాంతాన్ని అనుసరించి, ప్రణయినీ, పానశాలలు ప్రధానంగా ఈయన ఎంతో హృదయంగమంగా 'రుబాయీలు' అనే గీతాలను రచించెను. అవి ప్రపంచంలోని నాగరక భాషలన్నింటిలోకీ తర్జుమా చెయ్యబడినవి. తెలుగులో వీటికి పద్యరూపంగా ఎన్నో అనువాదాలు ఆంగ్లానువాదాన్ని అనుసరించీ, అసలు పారశీకపు రుబాయీలను అనుసరించీ కూడా తయారై ప్రకటించబడినవి. సుప్రసిద్ధ రచయితలు శ్రీ చలంగారు యిప్పుడు ఆ రుబాయీలలో కొన్నిటిని వచన పద్య రూపంగా ఇంగ్లీషునుంచి భాషాంతరీకరించి ప్రకటిస్తున్నారు. ఈ రుబాయీలతోపాటు అనుబంధంగా వజీర్ రహ్మాన్ సేకరించిన వాటి అనువాదాలూ ఇయ్యబడినవి.

ఇందులో పుటకు ఒక్క రుబాయీ చొప్పున అచ్చువెయ్యబడింది. ప్రతిపుటలోనూ నాలుగింటికి తక్కువా, పదింటికి ఎక్కువా కాని పంక్తుల్లో ఆ రుబాయీల భావం చక్కగా వివరించబడినది. అను

'నివాళి'
అధిశాస్త్రవిక గేయ సంపుటి
"యజ్ఞశ్రీ" రచించినది
మద్దూరి నరసింహశాస్త్రి, కొల్లూరు P. O.,
గుంటూరు Dt. ప్రచురించినది. వెల ఒక రూపాయి

వాదాంతరాలవల్ల అర్థం కాని భావాలు ఈ అనువాదం వల్ల సులభంగా అర్థం అవుతున్నాయి. ఈ పద్ధతి మెచ్చుకోదగినదే.

ఇంగ్లీషు తెలిసిన వారు ఆ భాషలో అనూదిత ములైన రుబాయీలనే చదువుకోవచ్చునీ, ఆ భాష తెలి యని వారి కోసం తన ప్రయత్నమనీ శ్రీ చలంగారు

"ఇంగ్లీషు తెలియని మిత్రుడు
మఃడువ జగ్గారావుగారి
అభిలాష తీర్చడానికి
తెనిగించాను యీ రుబాయీలని.

తెలుగు లోకంలో ఇంకో
జగ్గారావుని యోచించుకోలేను.
కాని ఉన్నారేమోనని, ఈ అచ్చు."

అని మొదటనే తెలియజేశారు. ఇంగ్లీషు తెలి సిన వారికి కూడా, ఆంగ్లానువాదంకంటే ఇదే సులభం గానూ, సుబోధంగానూ వుండునని నా నమ్మిక.

ఎస్. కె.

ద్రావిడభాషా సామ్యములు

శ్రీ వజ్ఝల-చినసీతారామస్వామి శాస్త్రి విరచితము. డెమ్మి 26+182 పుటలు. వెల రు. 2—50. శ్రీమతి కాకరపర్తి వేంకటసీతమ్మ గారిచే ప్రకాశితము. ప్రతులకు విజయనగరం, కోడుగంటివారి వీథిలో ఉన్న గ్రంథకర్తకు వ్రాయవలెను.

'ఆద్య ప్రకృతిః ప్రకృతి శ్చాద్యే, ఏషా తయో ర్భవే ద్వికృతిః' అనే ఆంధ్రశబ్దచింతామణి వచనాన్ని అనుసరించి తెలుగు భాష సంస్కృతంనుండి ఏర్పడినదనే అభిప్రాయం ఇంచు మించుగా ఇరవయ్యోశతాబ్ది ప్రథమపాదంవరకూ వ్యాపించి ఉండినది. కాని కాల్డువెల్ పండితుడు వ్రాసిన గ్రంథాన్ని చూచినతర్వాత భాషా శాస్త్రంలో క్రొత్త గవేషణలు ప్రారంభమై తెలుగు సంస్కృతజన్యం కాదనీ, అరవం, కన్నడం, మళయాళం మున్నగు ద్రావిడ భాషల వలెనే—వాటితోపాటు మూలద్రావిడభాషనుంచి ఏర్పడినదే అని చాలామంది పరిశోధకులు నిర్ణయించి, తమ అభిప్రాయ ములను విశదపరుస్తూ కొన్నిగ్రంథాలను కూడ రచించారు. ఏ తద్గ్రంథరచయితా, శ్రీ కోరాడ - రామకృష్ణయ్యగారూ, శ్రీ గంటి-జోగి సోమయాజులుగారూ ఈ పద్ధతికి చెందినవారు. డాక్టరు చిలుకూరి నారాయణరావుగారు మాత్రం ఈ పక్షానికి చెందక తెలుగు సంస్కృతభాషా జన్యమే అని వివరించారు. కాని చాలామంది భాషాశాస్త్రజ్ఞులు కాల్డువెల్లు పండితుని సిద్ధాంతాన్నే అంగీకరించారు.

తెలుగుభాష సోదరద్రావిడభాషలవలెనే మూల ద్రావిడ భాష నుండే ఏర్పడినదని చెప్పేటప్పుడు—సోదర భాషలకూ దీనికీ ఉండే సన్నిహిత సంబంధాలనూ, సామ్యా లనూ చూపవలసి ఉంటుంది. ఆవిధంగా పరస్పర సంబంధ, సామ్యాలు చూపడానికే శ్రీ శాస్త్రిగారు ఈ గ్రంథాన్ని రచించారు.

శ్రీ చినసీతారామస్వామిశాస్త్రిగారు విజయనగరం సంస్కృత కళాశాలలోనూ, మద్రాసు విశ్వవిద్యాలయంలోనూ, ఆంధ్రవిశ్వవిద్యాలయ కళాశాలలోనూ అధ్యాపకులుగానూ, పరిశోధక పండితులుగనూ ఉండి పెక్కుమంది విద్వాంసులనూ, విమర్శకులనూ తయారుచేసిన ప్రతిభావంతులు. ఏభై ఏండ్లకు పైగా ఆంధ్రవాఙ్మయ సేవను చేసిన—ఇంకా విరామం లేకుండా చేస్తున్న భాషా వాఙ్మయ సేవా దీక్షాపరులు! చింతా మణి విషయ పరిశోధనం, వైయాకరణ పారిజాతం, ఆంధ్ర వ్యాకరణ సంహితా సర్వస్వం, ద్రావిడభాషా పరిశీలనం హరి శ్చంద్రోపాఖ్యాన, వసుచరిత్ర విమర్శనములు, బాలవ్యాకరణో ద్ద్యోతం మొదలైన ఉత్తమగ్రంథాలను వ్రాసి, ఆంధ్రుల మన్ననలను పొంది, ఆంధ్రవిశ్వకళాపరిషత్తువారివలన 'కళాప్రపూర్ణ' బిరుదాన్ని పొందిన మహా విద్వాంసులు! అట్టి విద్వాంసులు కాల్డువెల్లు సిద్ధాంతాలను స్థూలంగా సమ్మ తించడమూ, ద్రావిడ భాషల పరస్పర సామ్యాన్ని విశదీకరిస్తూ గ్రంథాన్ని రచించడమూ ప్రశంసనీయం!

చాలా భాషలను పోల్చి, వానిలోని విషయాలను గురించి గ్రంథం వ్రాసేవారు సామాన్యంగా ఆంగ్లభాషలోని గ్రంథాల పైనే ఆధారపడి ఉంటారు. ఎందుచేతనంటే—ఒక వ్యక్తికి బహుభాషలతో పరిచయం ఉండవచ్చును గాని, అన్నింటి లోనూ పాండిత్యం ఉండడం అరుదు. అంతేకాకుండా శ్రీశాస్త్రిగారు తమ సిద్ధాంతాలకోసం, తమకు ఎక్కువ పరి చయంలేని ఆంగ్ల గ్రంథాలపైని ఆధారపడి ఉండరు. అందు వల్ల వీరు తాము మద్రాసు విశ్వవిద్యాలయం రిసెర్చి ఇన్స్టి ట్యూటులో పనిచేస్తూ ఉన్నప్పుడు అక్కడి తమిళ శాఖలో పరిశోధకులూ, బహుభాషావేత్తలూ అయిన శ్రీ వే. వేంకట రాజులురెడ్డిగారి సహకారంవల్ల మిగిలిన ద్రావిడభాషల తత్వాన్ని తెలుసుకుని, ఆమీదనే ఇట్టి గ్రంథాన్ని రచించ డానికి సంకల్పించారు. శ్రీ రెడ్డిగారియందు తమకు ఉండే గౌరవాన్ని పురస్కరించుకుని, కృతజ్ఞతాసూచకంగా ఈ గ్రంథాన్ని ఆయనకే అంకితం చేశారు. దీనివల్ల శ్రీ శాస్త్రి గారి విశాలహృదయమూ వ్యక్తమవుతున్నది.

తెలుగుభాష సంస్కృతభాషాజన్యం కాదనే వారిలో సాధారణంగా అందరూ కాల్డువెల్లు సిద్ధాంతాలకు అనుకూలం గానే ఉంటారు. కాని శ్రీ శాస్త్రిగారు చాలా విషయాలలో కాల్డువెల్లుతో ఏకీభవించరు. వీరి 'ద్రావిడభాషా పరిశీలనము' అనే పెద్ద గ్రంథంలో ఆ విషయాలను చూడవచ్చును. ఇతరు

అను గతానుగతికంగా అనుసరించకుండా తమ స్వతంత్రాభిప్రాయాలను వెల్లడించడంలో శ్రీ శాస్త్రిగారు వెనుదీయరు. ఈ గ్రంథంలో ఆ విమర్శన జోలికి పోకుండా వ్యాకరణాన్ని ముఖ్యంగా గ్రహించి, శ్రీ శాస్త్రిగారు సంజ్ఞ, సంధి, నామ, క్రియా, తద్ధితాది ప్రకరణాలలో ద్రావిడభాషల లక్షణాలను విపులంగా వివరించారు. భాషాశాస్త్ర పరిశోధకులకూ, ద్రావిడ భాషాలక్షణజిజ్ఞాసువులకూ ఈ గ్రంథం చాలా ఉపయోగకరమైనది.

అలసిన గుండెలు

కథల సంపుటి. రచయిత శ్రీ రాచమల్లు రామచంద్రారెడ్డి, క్రౌను 160 పుటలు. వెల : రెండు రూపాయలు. ప్రకాశకులు : విద్యోదయ పబ్లికేషన్సు, కడప.

ఇందులో 'అలసిన గుండెలు' మొదలైన పన్నెండు కథలు వివిధ సంఘటనలకు సంబంధించినవి ఉన్నాయి. ఇవన్నీ ఇదివరలో పత్రికలలో ప్రకటించినవే ! రచయిత వాటిని అన్నింటినీ చేర్చి యీ పుస్తకం రూపంలో ప్రకటించారు.

ప్రపంచంలో మానవుల ఆలోచనలను అతిక్రమించిన సంఘటనలూ, వాటివల్ల వ్యక్తమయే స్వభావాలూ వీటిలో చిత్రింపబడినవి. రచన ఎక్కువగా ఆకర్షించక పోయినా, నిరాఘాటంగానే సాగిందని చెప్పవచ్చును. దీనిని ఆంధ్రలోకానికి పరిచయం చేస్తూ సుప్రసిద్ధ కథకులు శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారు "కథకుడికి ఉండవలసిన శక్తులన్నీ ఈ కథకుడిలో నాకు బలంగా కనిపించాయి. సూటీ, రచయితకు సహజమూ అయిన భాష; ఒక్క వ్యర్థపదం లేదు. ఈ రచయితకు ఒక్క వాక్యంతో పాత్రకు రూపకల్పన చేసే అరుదైన శక్తి ఉన్నది—" అని మెచ్చుకున్నారు. దీన్నిబట్టి యీ కథలు ఎలా ఉన్నదీ, ఎలా పాఠకులను ఆకర్షించేదీ వ్యక్తమవుతూ ఉన్నది.

వెల్లువలో పూచికపుల్లలు

నవల. కర్త శ్రీ భాస్కరభట్ల—కృష్ణారావు, క్రౌను సైజు. పీచుకాగితం 8+223 పుటలు. వెల : మూడు రూపాయలు. ప్రకాశకులు : ఆధునిక గ్రంథమండలి, హైదరాబాదు. ముద్రణ : అజంతా ప్రింటర్సు, సికింద్రాబాదు; ప్రతులు లభించుచోటు : ఆంధ్ర బుక్‌హౌస్, సుల్తాన్‌బజార్, హైదరాబాద్.

హైదరాబాదులోని ఒక ధనికకుటుంబపరిస్థితులు ప్రధానేతివృత్తంగా రచించబడిన సాంఘిక నవల యిది. మధుసూదనరావు అనే ఎం. ఏ. విద్యార్థి నళినీ, కుసుమలు ఉండే ఒక సంపన్న గృహంలో కిశోర్ అనే బాలుడికి ట్యూటరుగా ప్రవేశించి, ఆ కుటుంబం ఆదరాభిమానాలకు పాత్రుడై మొదట కుసుమని గాఢంగా ప్రేమించి, ఆమెతో ప్రేమకలాపాలు నడిపి, వివాహం చేసుకోవడానికి మాట యిచ్చి, చివరకు తన హృదయ దౌర్బల్యంవల్ల నళినిని వివాహం చేసుకోవడం, దానివలన కుసుమ మతిభ్రమా, రెండవ కాన్పు సమయంలో నళిని మరణించడమూ ఇందులో ప్రధానంగా వర్ణించబడినవి. వెల్లువలో పూచికపుల్లలు కొట్టుకొని పోయే విధంగా దుర్బలాలయిన మానవజీవితాలు ఆయా పరిస్థితులకు లోనయి, వాటి వేగానికి చిక్కి అంతూ, పంతూ లేని స్థితికి రావడం ఇందులో చిత్రించబడినది.

యువతీ విద్యవల్ల ఏర్పడే సాంఘిక పరిస్థితులూ, స్వతంత్రప్రవృత్తీ, స్వేచ్ఛా విహారాలూ, వర్ణాంతర వివాహాలూ రచయిత ఆశయాలలో ప్రాధాన్యం వహించినట్లు తోస్తుంది. మధు మనోదౌర్బల్యం, కుసుమ ధీరతా, నళిని వ్యవహార నైపుణ్యం, రామచంద్రయ్య స్వార్థపరతా, అయేషా రెహానాల అమాయకహృదయం ఇందులో హృదయంగమంగా చూపబడినవి.

శ్రీ కృష్ణారావుగారు ఉన్నతవిద్యను అభ్యసించి, వివిధ ప్రాంతాలనూ, వివిధ మానవ తత్వాలనూ అవగాహన చేసుకున్నవారు. ఇదివరకే ఎన్నో కథలూ, యుగసంధి వంటి నవలలనూ వ్రాసి పేరుపొందిన రచయితలు. వీరి రచన ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. ఆశయాల సంగతి ఎలా ఉన్నా, ఈ పుస్తకం చదవడం ప్రారంభించాక, ముగించాలనే కుతూహలం ప్రతి పాఠకుడికీ కలుగుతుందని చెప్పవచ్చును.

బు. వెం. ర.

వార్తలు

దేశోద్ధారకుని పుణ్య వర్ధంతి

హైదరాబాద్‌లో ఆంధ్రసారస్వత పరిషత్తు ఆవరణలో మార్చి 28 వ తేదీన దేశోద్ధారక శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి 23 వ పుణ్య వర్ధంతి జరిగినది.

ఈ సమావేశానికి శ్రీ మల్లిపూడి పళ్ళంరాజుగారు అధ్యక్షత వహించారు. ముఖ్యమంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య, హైకోర్టు న్యాయమూర్తి శ్రీ మైదవోలు శేషాచలపతి, ప్రతిపక్ష నాయకులు శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య, మంత్రి శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు, శ్రీ శ్రీవిడిలింగరాజు, డాక్టరు దివాకర్ల వెంకటావధాని శ్రీ పాటిబండ గోపాలకృష్ణయ్య ప్రభృతులు దేశోద్ధారకులు ఆంధ్రజాతి సర్వతోముఖ వికాసానికి చేసిన పుణ్యసేవనుగూర్చి విపులంగా ప్రసంగించారు. శ్రీ నూకల రామచంద్రారెడ్డి డాక్టరు బి. నాగేశ్వరరావు, శ్రీ గడియారం వెంకటశేషశాస్త్రి, శ్రీ ముక్కపాటి నరసింహశాస్త్రి మొదలయిన ప్రముఖులీ సమావేశానికి విచ్చేశారు.

అంగోలాలో 50 వేల పోర్చుగీసు సైన్యం

అంగోలాలో పోర్చుగీసు ప్రభుత్వం 50 వేల మంది సైనికులను కేంద్రీకరించినట్లు తెలుస్తున్నది. అంగోలాలో జాతీయోద్యమాన్ని అణగించి వేయడానికి సాలజార్ ప్రభుత్వం సమస్త చర్యలు తీసుకొంటున్నదని దీనివల్ల వ్యక్తమవుతున్నదని పరిశీలకులు భావిస్తున్నారు.

మదనపల్లికి మునిసిపాలిటీ

మదనపల్లితో మరో అయిదుగ్రామాలు, నీరుగట్టుపల్లి, గొల్లపల్లి, సుగాలపల్లి, నక్కలవాండ్లదిన్నె, మాదియోపల్లి కలిపి మునిసిపాలిటిగా ఏర్పాటు చెయ్యాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం 1961 ఏప్రెలు 1 వ తేదీనుంచి అమలులోకి రాగలదు. కొత్తగా ఏర్పడే పురపాలక సంఘంలో 16 గురు సభ్యులుంటారు.

భట్నగర్ స్మారక బహుమానం

మార్చి 24 వ తేదీన భారత ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ జాతీయ భౌతికశాస్త్ర పరిశోధనసంస్థ పరిశోధనశాఖ డైరెక్టరు డాక్టర్ కె. యస్. కృష్ణన్‌కు, శాంతిస్వరూప్ భట్నగర్ స్మారక బహుమానం ప్రసాదించారు. ఈ బహుమతి విలువ పదివేల రూపాయలు. ఘనస్థితికి సంబంధించిన భౌతికశాస్త్ర రంగంలో గత అయిదు సంవత్సరాలనుంచి ఆయన చేసిన ఘన కృషి అభినందిస్తూ ఈ బహుమతి ప్రదానం చేశారు.

భూదాన మహోత్సవం

భూదానమహోద్యమానికి దేశంలో వివిధ ప్రాంతాలనించి 44 లక్షల ఎకరాల సేకరణ జరిగినదని అఖిల భారత సర్వసేవాసంఘం అధ్యక్షులు శ్రీ వల్లభస్వామి నేడిక్కడ వెల్లడించారు.

ఈ భూమిలో భూములు లేనివారికి 12 లక్షల ఎకరాల భూమి పంచిపెట్టారనీ, మిగిలినది క్రమక్రమంగా పంచిపెట్టబడగలదనీ శ్రీ స్వామి అన్నారు.

రాయబారి శ్రీ బంకర్‌కు ఢిల్లీలో వీడ్కోలు

మార్చి 21 వ తేదీన, భారతదేశంలో గత నాలుగు సంవత్సరాలనించి అమెరికా రాయబారిగా పనిచేసిన శ్రీ ఎల్స్‌వర్త్ బంకరుకు వారి సతీమణికివిమానాశ్రయంలో వీడ్కోలు జరిగినది. అనాడే ఆయన ప్రత్యేక విమానంలో స్వదేశానికి బయలుదేరి వెడుతున్నారు. మార్గమధ్యంలో శ్రీ బంకర్ బొంబాయి నగరంలో ఆగుతున్నారు.

ఆర్థికమంత్రి శ్రీ మొరార్జీదేశాయి, సహాయ రక్షణమంత్రి శ్రీ సూరత్‌సింగ్, జనరల్ తిమ్మయ్య, ప్రముఖాధికారులు విమానాశ్రయంలో సముచిత మర్యాదలతో వీడ్కోలు ఇచ్చారు.

శ్రీ బంకర్ బొంబాయిలో రెండు రోజులు గడుపుతారు. అక్కడ వారు భారతదేశంలో తమ అనుభవాలను గురించి ప్రసంగించారు. విమానంలో అడుగు పెట్టేముందు శ్రీ బంకర్ దంపతులను పలువురు పూలమాలికలతో ముంచెత్తారు.

Printed & Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patri ka Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor : S. Sambhu Prasad.

భారతి

ప్రకటన రేట్లు

కవరు పేజీలు		కాజువల్ రేట్లు	కాంట్రాక్టు రేట్లు
4 వ కవరు పేజి			
2 రంగులు	...	రు. 125/-	రు. 100/-
ఒకేరంగు	...	రు. 100/-	రు. 90/-
2 లేక 3 కవరు పేజి	...		
ఒకే (నలుపు) రంగు	...	90/-	75/-
లోపలి పేజీలు	...		
పూర్తి పేజి	...	70/-	60/-
అర్ధ పేజి	...	35/-	30/-
పావు పేజి	...	20/-	15/-

ప్రత్యేక స్థానములకు 25% అదనం.

నం॥ నకు వరుసగా 12 ప్రకటనలు చేయువారికి కాంట్రాక్టు రేట్లు వర్తించును.

* కవులు, కళాకారులు, రచయితలు మొదలైన వారి ప్రకటనలు
ఒక కాలం ఇంచికి తేపకు రు. 2/- చొప్పున ప్రకటించబడును.

చందా వివరములు

సంవత్సర చందా	...	రు. 12-00
6 మాసముల చందా	...	రు. 6-00
విడి ప్రతి		రు. 1-00

Abid Road, Hyderabad. A.P.

మేనేజరు, భారతి,
మద్రాసు-1.